

www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి



గురువారం | 11-1-2018 | పేజీలు: 20 + 16 | వెల: రూ.5.00 | సంపుటి: 14 సంచిక: 181 | శ్రీహేవళంబినామ సంవత్సరం, దక్షిణాయనం, హేమంతరుతువు, పుష్యమాసం, బహుళపక్షం; తిథి: దశమి రా. 7.11 తదుపరి ఏకాదశి; నక్షత్రం: విశాఖ పూర్తి; వర్జ్యం: ఉ. 11.11-12.57; దుర్ముహూర్తం: ఉ. 10.33-11.17, మ. 2.58-3.42; అమృతఘడియలు: రా. 9.46-11.32; రాహుకాలం: మ. 1.30-3.00; సూర్యోదయం: 6.52; సూర్యాస్తమయం: 5.55 | నిజామాబాద్ సిటీ*

Nizamabad | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Anantapur | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Kakinada | Khammam | Kadapa | Ongole | Nallagonda | Bangalore and Chennai



12

తిరుమల వెంకన్న ఏం దేవుడు?

తన హుండీనే తాను కాపాడుకోలేడు
ఇక భక్తులనేం కాపాడతాడు?
ఆయన కోటీశ్వరులకే దేవుడు
అన్ని శక్తులుంటే భద్రత ఎందుకు?
మతాలన్నీ మనుషులను విడదీసేవే!
డీఎంకే ఎంపీ కనిమొళి వ్యాఖ్యలు

ఆధార్ స్థానంలో 'వర్చువల్ ఐడీ'

సిమ్ లేదా కేవైసీలకు ఇదిస్తే చాలు
పేరు, చిరునామా, ఫొటోనే కనిపిస్తాయి
మార్చి 1 నుంచి ఐడీ పొందొచ్చు
జూన్ 1 నుంచి అంతా ఆమోదించాలి
ఒప్పుకోని సంస్థలపై చర్యలు: యూఐడీఏఐ

14

'బినామీ'గా ఉండకూడదు

ఆ లావాదేవీలకు దూరంగా ఉండండి
దొరికిపోతే ఏడేళ్ల జైలు శిక్ష!
ఆస్తి విలువలో 25 శాతం జరిమానా
ఆదాయ పన్ను శాఖ హెచ్చరిక

మీ చార్జీలకో దండం!

డిస్కమ్‌లకు 'ఓపెన్ యాక్సెస్' గండం
బయటి కొనుగోళ్లకే పరిశ్రమలు మొగ్గు
రాత్రిళ్లు చౌకగా అందుబాటులో కరెంటు
డిస్కమ్‌లకు మిగిలేది చౌక వాడకమే
భవిష్యత్తులో మరిన్ని చీకట్లు తప్పవా!

కరెంటు లెక్కలు 3
8



కాళేశ్వరం ప్రాజెక్టు పనులను పరిశీలిస్తున్న కేంద్ర జలవనరుల సంఘం అధికారులు

కాళేశ్వరం.. అద్భుతం

ఇలాంటి ప్రాజెక్టు మేం చూడలేదు
దేశ చరిత్రలోనే విభిన్నమైనది
ప్రపంచ స్థాయి ప్రాజెక్టు ఇది
సమీకృత బహుళార్థ సాధక నిర్మాణం దీని విశిష్టత
పనులు జోరుగా సాగుతున్నాయి
గడువులోగానే పూర్తవుతుంది
కొనియాడిన కేంద్ర జలసంఘం

హైదరాబాద్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): కాళేశ్వరం ప్రాజెక్టు ఇంజనీరింగ్ అద్భుతమని కేంద్ర జలసంఘం సభ్యుల బృందం కొనియాడింది. ఈ ప్రాజెక్టు దేశ చరిత్రలోనే విభిన్నమైనదని ప్రశంసించింది. ఇరిగేషన్ ప్రాజెక్టుల నిర్మాణంలో జాతీయ, అంతర్జాతీయ ప్రమాణాలకు ఈ ప్రాజెక్టు ఏ మాత్రం తీసిపోదని కితాబునిచ్చింది. కేంద్ర జల సంఘం(సీడబ్ల్యూసీ) ప్రాజెక్టుల అప్రయిజల్ విభాగం చీఫ్ ఇంజనీర్ సీకేఎల్ దాస్ ఆధ్వర్యంలో హైడ్రాలజీ డైరెక్టర్ ఎన్ఎన్ రాయ్, ప్రాజెక్టు అప్రయిజల్ డైరెక్టర్ ముఖర్జీ, కాస్ట్

మిగతా 8వ పేజీలో...

మళ్లీ మాఫీ!

ఈసారి 2 లక్షలు?.. కేసీఆర్ యోచన



పెట్టుబడి సాయంపై మంత్రివర్గ ఉపసంఘం సమావేశంలో మంత్రులు పోచారం, తుమ్మల, ఈటల, హరీశ్, మహేందర్‌రెడ్డి, జగదీశ్‌రెడ్డి

ఏకమొత్తంగా అమలు.. మేనిఫెస్టోలో హామీ
ఉద్యోగులకూ బొనాంజా.. పీఆర్‌సీలో భారీ పెంపు
సీపీఎస్ రద్దుకు డిమాండ్.. ముఖ్యులతో సీఎం

హైదరాబాద్, జనవరి 10(ఆంధ్రజ్యోతి): టీఆర్ఎస్ మళ్లీ అధికారంలోకి వస్తుందని పూర్తి విశ్వాసంతో ఉన్న ముఖ్యమంత్రి కేసీఆర్ వచ్చే టర్మ్‌లో మరోసారి రైతు రుణమాఫీ చేయాలని యోచిస్తున్నారు. మాఫీ మొత్తాన్ని రూ.2 లక్షలకు పెంచాలని భావిస్తున్నారు. వ్యవసాయ పెట్టుబడి పథకం, రైతు సమన్వయ సమితుల ద్వారా పంట ఉత్పత్తులకు గిట్టుబాటు ధర కల్పించడం, గరిష్ఠంగా రూ.2 లక్షల వరకు రుణమాఫీ చేయడం ద్వారా రాష్ట్రంలోని రైతుల కష్టాలు తీర్చాలని ఆయన భావిస్తున్నారు. తన మనోగతాన్ని సీఎం కేసీఆర్ పలువురు సీనియర్ మంత్రులు, టీఆర్ఎస్ ముఖ్యుల ముందు ఉంచారు. వారి ఆలోచనలనూ ఆహ్వానించారు. 2014 సాధారణ ఎన్నికల

మిగతా 3వ పేజీలో...

పెట్టుబడి సాయం చెక్కు రూపంలోనే

మంత్రివర్గ ఉపసంఘం నిర్ణయం
చెక్కుల వెనుక ఆధార్ నెంబర్ ముద్రణ
పార్టీ నేతలతో పంపిణీ చేయించే యోచన
దున్నని భూములకు సాయమెందుకు?
రియల్ భూములపై కొందరి అభ్యంతరం
అందరికీ ఇవ్వాలన్నది కేసీఆర్ ఆలోచన
నగదు కొరతపై ఈటల నేతృత్వంలో ఢిల్లీకి

3

పంచాయతీల్లో ఎన్నారైలు

పట్టణాల్లో స్థిరపడ్డ ఊరివాళ్లకు కూడా కో-ఆప్షన్ సభ్యులుగా అవకాశం
'పంచాయతీ'కి హాజరైతే పారితోషికం
అనుమతి లేని లేఅవుట్లకు రిజిస్ట్రేషన్ లేదు
నిర్మాణ అనుమతులకు మండల కమిటీలు
హెచ్ఎండీఏ అనుమతిస్తే పంచాయతీ వారం రోజుల్లో అనుమతి ఇవ్వాల్సిందే
పరిశ్రమలకు పంచాయతీ అనుమతి అక్కర్లేదు
కొత్త పంచాయతీరాజ్ చట్టంపై సుదీర్ఘ చర్చ

హైదరాబాద్, జనవరి 10(ఆంధ్రజ్యోతి): కొత్త పంచాయతీరాజ్ చట్టంతో రాష్ట్ర పాలనలో విప్లవాత్మక మార్పులు తేవాలని భావిస్తున్న ప్రభుత్వం చట్టం రూపురేఖలపై తీవ్ర కసరత్తు చేస్తోంది. అందులో భాగంగా గ్రామీణాభివృద్ధి మంత్రి జూపల్లి కృష్ణారావు అధ్యక్షతన మంత్రివర్గ ఉపసంఘం బుధవారం సమావేశమై ఎనిమిది గంటల పాటు సుదీర్ఘంగా చర్చించింది. మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పోచారం శ్రీనివాస్‌రెడ్డి, ఈటల రాజేందర్,

మిగతా 3వ పేజీలో...



ఎయిరిండియాలోకి ప్రైవేటు

49 శాతం దాకా విదేశీ పెట్టుబడికి ఓకే

'సింగిల్' రిటైల్, నిర్మాణంలో నూరు శాతం.. విద్యుత్తు ఎక్స్ఛేంజీలోనూ విదేశీ

దావోస్ పర్యటనకు ముందు మోదీ కేబినెట్ భారీ సంస్కరణలు

ప్రధాని నరేంద్ర మోదీ పది రోజుల్లో దావోస్‌లో పెట్టుబడుల సదస్సుకు హాజరవుతున్నారు. ఆ తర్వాత మరో పది రోజులకు పూర్తి స్థాయి చివరి బడ్జెట్‌ను ప్రవేశపెట్టనున్నారు. ఈ నేపథ్యంలో.. అధికారంలోకి వచ్చిన మూడున్నరేళ్లలో అత్యంత భారీ సంస్కరణలకు మోదీ నాంది పలికారు. విదేశీ పెట్టుబడులకు గేట్లు బార్లా తెరిచారు. బుధవారం మోదీ నేతృత్వంలో కేబినెట్ సమావేశమైంది. ఎయిరిండియాలో 49 శాతం వాటాను విదేశీ కంపెనీలకు అప్పగించేందుకు నిర్ణయించింది. సింగిల్ బ్రాండ్ రిటైల్, నిర్మాణ రంగాల్లో వంద శాతం విదేశీ పెట్టుబడులకు అనుమతిస్తూ సంచలనాత్మక నిర్ణయం తీసుకుంది. విద్యుత్ ఎక్స్ఛేంజీల్లో కూడా విదేశీ సంస్థలను అనుమతించారు.

సీట్ల పెంపుపై కదలిక!

కేంద్ర కేబినెట్ నోట్ కూడా సిద్ధం
ఈ వారంలోనే ఢిల్లీలో రాజకీయ భేటీ
ఈసీ, హోం అధికారుల మంతనాలు
2001 జనాభా లెక్కల్నే పరిగణనలోకి
6 నెలల్లో ప్రక్రియ పూర్తయ్యే అవకాశం
మోదీతో బాబు భేటీ తర్వాత స్పష్టత
నిర్ణయం జరగ్గానే బిల్లు పార్లమెంటుకు
ఏర్పాట్లు చేయాలని హోం శాఖకు ప్రధానమంత్రి కార్యాలయం ఆదేశం?

3







అంగట్లో అమ్మాయి

ఏజెన్సీలో మళ్లీ మానవ అక్రమ రవాణా



మళ్లీ పేట్రేగుతున్న యూపీ, రాజస్థాన్ ముఠాలు
ఇటీవల వెలుగు చూస్తున్న వరుస ఘటనలు
14 ఏళ్ల బాలిక అపహరణ ఘటనతో కలకలం
షాపింగ్ పేరుతో హైదరాబాద్‌కు.. నిర్బంధం
రహస్యంగా తల్లిదండ్రులకు బాలిక ఫోన్
అక్కడే మరో 13మంది బాలికలున్నట్టు వెల్లడి!

ఆసిఫాబాద్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): ఏజెన్సీ ప్రాంతాల్లో గిరిజనుల్లో మళ్లీ అదే గుబులు!! ముక్కుపచ్చలారని తమ ఆడబిడ్డలకు ఎప్పుడేం ప్రమాదం ముంచుకొస్తుందోననే కలవరపాటు.. ఆందోళనతో బిక్కుబిక్కుమంటూ గడుపుతున్నారు! కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లాలోని ఏజెన్సీ ప్రాంతాల్లో మానవ అక్రమ రవాణా ముఠాలు మళ్లీ పెట్రేగిపోతున్నాయి. రెండేళ్లుగా స్తబ్దుగా ఉన్న ఈ ముఠాలు మళ్లీ అక్కడ బాలికల వేట ప్రారంభించాయి. తాజాగా ఆసిఫాబాద్ జిల్లా కేంద్రానికి చెందిన 14 ఏళ్ల బాలికను కొందరు షాపింగ్ పేరుతో మాయమాటలు చెప్పి అపహరించిన ఘటన స్థానికంగా తీవ్ర కలకలం సృష్టించింది. బాలికను అపహరించింది ఓ మహిళే! స్థానికంగా పూలమ్ముకొని జీవించే బాధితురాలి తల్లితో పరిచయం పెంచుకున్న ఆమె.. ఈ నెల 6న షాపింగ్ పేరుతో బాలికను తీసుకెళ్లి అపహరించింది. అయితే, తన దగ్గరున్న సెల్‌ఫోన్ నుంచి తల్లిదండ్రులతో ఆ బాలిక మాట్లాడడంతో ఈ ఉదంతం వెలుగు చూసింది. సెల్‌ఫోన్ సిగ్నల్ ఆధారంగా హైదరాబాద్‌లోని లక్డీకాపూల్ నుంచి ఫోన్ చేసినట్లు తెలిసింది. తనతోపాటు మరో 13మంది బాలికలు ఉన్నట్టు బాధితురాలు చెప్పడంతో ఆసిఫాబాద్ పోలీసులు అప్రమత్తమయ్యారు. సీఐ బాలాజీ వరప్రసాద్ ఆదేశాల మేరకు స్థానిక ఎస్సై చంద్రశేఖర్ హైదరాబాద్‌కు వెళ్లారు. బాలిక అపహరణ పరిణామంతో ఇక్కడి ప్రజలు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. పదేళ్ల క్రితం దాకా యూపీ, రాజస్థాన్‌కు చెందిన ముఠాలు ఈ ప్రాంతంలో సృష్టించిన ఆగడాలు

మిగతా 2వ పేజీలో...







విజేతలు ఓడినవేళ



పరంజ్యోతి Paramjyothi

భారత యుద్ధంలో విజేతలైన పాండవులు కురుక్షేత్రంలో అంపశయ్య మీద ఉన్న భీష్మ పితామహుని దర్శించారు. భీష్ముడు ధర్మరాజుకి వివిధ ధర్మాలు బోధించి..'నాయనా. నా కర్తవ్యం కూడా ముగిసింది. ఇక నేను తృప్తిగా ఈ లోకం విడిచి వెళ్తా. నా చివరి కోరిక తీరుస్తావా మనవడా?' అన్నాడు. 'ఎంత మాట తాతా, తప్పక తీరుస్తా' అన్నాడు ధర్మరాజు. అప్పుడు భీష్ముడు.. ఇంతకు ముందు ఏ శవమూ దహించని చోట తన దహన సంస్కారం జరిపించాలని కోరాడు. ధర్మరాజు సరేనన్నాడు. భీష్ముని కళ్లు శాశ్వతంగా మూతబడినై. అనంతరం.. అన్నగారి ఆదేశానుసారం నల్లురు సోదరులూ నాల్గు దిక్కులా వెతికినా శవ దహనం జరగని చోటు దొరకలేదు. ఈ క్రమంలో ధర్మరాజుకి ఒక పండు ముసలి రైతు కనిపించగా ఆశగా, ఆతృతగా అడిగాడు. దానికా రైతు.. 'నా ఎరికలో.. అదుగో ఆ కన్పించే ఎత్తైన గుట్టమీద ఇంతవరకు అలాంటిది జరగలేదు' అన్నాడు. ధర్మరాజు ఎగిరి గంతేశాడు. దహనానికి ఏర్పాట్లు జరిగినై. తల కొరివి పెట్టడమే తరువాయి. ఆ సమయంలో.. 'ఈ గుట్ట మీద వంద మంది భీష్ములు, మూడు వందల మంది పాండవులు, వెయ్యిమంది ద్రోణులు, ఇక లెక్కకు మించి కర్ణులు దహించబడ్డారు' అంటూ ఆకాశవాణి వినిపించింది. దీంతో పాండవులు ఉలిక్కిపడ్డారు. అయ్యో! తాతయ్య కడసారి కోరిక తీర్చలేకపోయాం గదా- అని నీరుగారిపోయారు. అంతలోనే ధర్మరాజు గంభీరంగా నవ్వుతూ.. 'తాతగారు మహా మనీషి. ఆయన మేధ అసాధారణం. ఆయన భావం మనమే గ్రహించలేకపోయాం. అర్జునా! మనందరికీ ఏదో ఒక గర్వం. నీకు సవ్యసాచివని గర్వం. భీమునికి భుజబలగర్వం. నకులునికి సౌందర్య గర్వం. సహదేవునికి శాస్త్ర, విద్యా గర్వం. ధార్మికుడినని నాకు గర్వం. ఇక భారత యుద్ధంలో గెల్చామనే వ్యర్థ గర్వం సరేసరి' అన్నాడు. 'ఆహా! మన లాంటి వారు కాదు కాదు, మనకన్నా గొప్పవారెందరో ఇక్కడ (ఈ భూమ్మీద) అంతరించారు' అన్నాడు భీముడు. 'ఆ సత్యాన్ని ఎంత విలక్షణంగా బోధించాడు తాతయ్య' అన్నాడు నకులుడు. అలా.. విజేతలైన పాండవులు పితామహుని చేతిలో ఓడినా తమ గర్వాన్ని పోగొట్టిన ఆ ఓటమిలో ఎంతో ఆనందం, తృప్తి, మనశ్శాంతి పొందారు.

- తంగిరాల రాజేంద్ర ప్రసాద శర్మ



జైల్లో గజల్స్!



ఖైదీలకు గజల్ శ్రీనివాస్ ప్రదర్శన

సైదాబాద్ / హైదరాబాద్, జనవరి10 (ఆంధ్రజ్యోతి): లైంగిక వేధింపుల కేసులో చంచల్‌గూడ జైలులో రిమాండ్‌లో ఉన్న గజల్ శ్రీనివాస్ ఖైదీలకు గజల్స్ వినిపిస్తున్నారు. శనివారం జైల్లో జరిగిన యోగా శిక్షణాశిబిరం ప్రారంభోత్సవంలో గజల్స్ పాడి అందర్నీ ఆకట్టుకున్నారు. జైలుకు వచ్చిన మొదటి రెండు రోజులపాటు భోజనం చేయకుండా ఉన్న ఆయన క్రమేణా జైలు భోజనాన్ని తీసుకుంటున్నట్లు సమాచారం. తన బ్యారక్‌లో ఉన్న ఖైదీలతోనూ కలుపుగోలుగా ఉంటున్నట్లు తెలిసింది. జైలుకు వచ్చినప్పటి నుంచి అతడి సతీమణి, కుమార్తె ములాఖత్‌కు రాలేదని జైలు అధికారులు తెలిపారు. అతడి తరఫు న్యాయవాది, బంధువులు మాత్రమే వచ్చి కలిసిపోయారు.

శ్రీవారి భక్తులకు తీపి కబురు

» సిఫారసు లేకుండా 10 అదనపు లడ్డూలు

తిరుమల, జనవరి 10(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి భక్తులకు ఇప్పటి వరకూ రెండు లడ్డూలు మాత్రమే ఇస్తుండగా ఇకపై అదనంగా 10 లడ్డూల వరకు ఇవ్వనున్నారు. భక్తులకు కోరినన్ని లడ్డూలు అందజేయాలన్న లక్ష్యంతో ఇటీవల లడ్డూల తయారీని పెంచడంతో దాదాపు 7లక్షల లడ్డూలు నిల్వ ఏర్పడ్డాయి. దీంతో మంగళవారం నుంచి ఎటువంటి సిఫారసు లేకుండా భక్తుడు కోరితే 6 లడ్డూల వరకు ఇస్తున్నారు. అయితే బుధవారం కూడా కోటా మిగిలే పరిస్థితి రావడంతో జేఈవో శ్రీనివాసరాజు సీనియర్ అధికారులతో చర్చించి భక్తుడు కోరితే 10 లడ్డూల వరకు ఇవ్వాలని సంబంధిత విభాగాన్ని ఆదేశించారు. దీంతో బుధవారం మధ్యాహ్నం నుంచి రూ.50 చొప్పున భక్తులకు 10 లడ్డూల వరకు జారీచేశారు. ఇకమీదట కూడా భక్తులకు ఎటువంటి సిఫారసు లేకుండా ఒక్కొక్కరికి 10 లడ్డూలు అందించనున్నారు. కాగా, శ్రీవారి ఆలయంలో గత నెల 18న దివ్యప్రబంధ అధ్యయనోత్సవాలు గురువారం ముగియనున్నాయి. మరోవైపు కనుమ పర్వదినాన్ని పురస్కరించుకుని తిరుమలలో ఈ నెల 16వ తేదీన పార్వేట ఉత్సవం కన్నుల పండువగా జరుగనుంది. అదేరోజు సాయంత్రం గోదా పరిణయోత్సవం నిర్వహిస్తారు.

అంగట్లో అమ్మాయి!

(మొదటిపేజీ తరువాయి...)

అన్నీఇన్నీ కావు. అక్కడ బాలికలకు కొరత ఉండడంతో పెళ్లిళ్ల పేరుతో ఇక్కడ తిష్ఠ వేశారు. పేద గిరిజన బాలికలను వంచించి అపహరించడమో.. స్థానికులతో కుమ్మక్కై కొనుగోలు చేయడమో చేసి ఎన్నో కుటుంబాల్లో తీరని ఆవేదన మిగిల్చారు. మానవ అక్రమ రవాణాతో ఈ ముఠాలు సృష్టించిన ఆగడాల వల్ల బాలికల్లో చాలామంది ఆచూకీ ఇప్పటికీ లభించలేదు. అయితే, బాధితులను వీరు సెక్స్ బానిసలుగా ఉపయోగించుకున్నట్టు అప్పట్లో పోలీసుల దర్యాప్తులో తేలింది.ఈ ముఠాల దందాపై పోలీసులు ఉక్కుపాదం మోపడంతో కొంత కాలంపాటు వారి కార్యకలాపాలకు అడ్డుకట్టపడింది. గత రెండేళ్లుగా ఈ ముఠాలు ఇక్కడ తమ కార్యకలాపాలను కొనసాగిస్తున్నట్టు భావిస్తున్నారు. బాలికల అక్రమ రవాణా కోసం వీరు స్థానిక మహిళల సాయాన్నే తీసుకుంటున్నట్టు తెలుస్తోంది. ఈ క్రమంలోనే ఇటీవల కెరమెరి ప్రాంతానికి చెందిన ఓ గిరిజన యువతిని, మరో బాలికను రాజస్థాన్‌కు తరలిస్తుండగా పోలీసులకు పక్కా సమాచారం అందింది. మహారాష్ట్రలోని చంద్రాపూర్ వద్ద ఓ హోటల్‌లో బాలికలను పోలీసులు గుర్తించారు. ముఠా సభ్యులను అదుపులోకి తీసుకుని జైలుకు తరలించారు. గతంలో కెరమెరి ప్రాంతంలోనే పలువురు యువతులను యూపీ, రాజస్థాన్, మధ్యప్రదేశ్ ముఠాలు కొనుగోలు చేసి తీసుకెళ్లినట్లు వార్తలొచ్చాయి. తాజాగా ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోనే ఈ తరహా ఘటన చోటుచేసుకోవడంతో పోలీసులు ఖంగుతిన్నారు. కాగా ఈ ఘటన నేపథ్యంలో పోలీసుల తీరుపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. జిల్లా ఎస్పీ కార్యాలయానికి కూతవేటు దూరంలో నివాసం ఉండే మాయలేడిపై ఇరుగుపొరుగు అనుమానం వ్యక్తం చేసినా.. పోలీసులు పట్టించుకోలేదని విమర్శిస్తున్నారు. మరోవైపు బాలిక అపహరణ ఘటనపై పోలీసులను సంప్రదించగా, కేసు దర్యాప్తులో ఉందని వివరాలు ఒకట్రెండు రోజుల్లో తెలియజేస్తామని చెప్పారు.

కేసులో పలు అనుమానాలు

"బాలిక కిడ్నాప్ కేసులో పలు అనుమానాలు ఉన్నాయి. బాలిక వద్ద రెండు సిమ్‌కార్డులు ఉన్నట్టు తెలుస్తోంది. ఘటనపై వివరాలు తెలుసుకునేందుకు మేం ప్రయత్నించినా.. బాలిక స్పష్టంగా మాట్లాడడం లేదు. తనతో పాటు మరో 13 మంది బాలికలను బంధించినట్టుగా బాధితురాలు చెబుతున్న విషయంలోనూ వాస్తవం లేదేమోనని అనుమానిస్తున్నాం. త్వరలో పూర్తివివరాలు తెలుస్తాయి"

- బాలాజీ వరప్రసాద్, ఆసిఫాబాద్ సీఐ

కబ్జా చెరలో ప్రభుత్వ ఐటీఐ స్థలం

» 20 కోట్ల విలువ చేసే భూమి అన్యాక్రాంతం

» మంచిర్యాలలో ఆక్రమణకు గురైన 5 ఎకరాలు

మంచిర్యాల, జనవరి 10, (ఆంధ్రజ్యోతి): ఐటీఐ భవనం స్థలం.. కబ్జా కోరల్లో చిక్కుకుంది. మంచిర్యాల జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఐటీఐకి చెందిన సుమారు రూ.20 కోట్ల విలువ గల ఐదెకరాల భూమిని కబ్జారాయుళ్లు ఆక్రమించారు. స్థానికంగా ప్రైవేటు భవనంలో కొనసాగుతున్న ప్రభుత్వ ఐటీఐని 1991లో ప్రభుత్వ భవనంలోకి మార్చారు. అప్పుడు సర్వే నంబర్ 269, 270లో దీనికి 18 ఎకరాల 13 గుంటల స్థలం ఉండేది. అయితే ఇందులో 3.19 ఎకరాల స్థలాన్ని 145 మంది బలహీనవర్గాల వారికి అధికారికంగా కేటాయించారు. అయితే ఇదే అదనుగా ఆక్రమణలకు తెరలేచింది. అలా సుమారు నాలుగెకరాలు కరిగిపోయి 14 ఎకరాలు మిగిలింది. అది కూడా ప్రస్తుతం కబ్జా పాలవుతోంది. 14 ఎకరాల్లో 5 ఎకరాలు కబ్జాకు గురైంది. కాగా, ఇటీవల ఐటీఐ స్థలంలో కలెక్టరేట్ నిర్మాణం కోసం పరిశీలన జరిపారు. దీంతో ఆక్రమణదారుల నుంచి స్థలాన్ని స్వాధీనపర్చుకొని కలెక్టరేట్ నిర్మిస్తే బాగుంటుందనే ప్రతిపాదన వచ్చింది. కానీ, ఏం జరిగిందో ఏమో ఆ ప్రతిపాదన అటకెక్కింది. అయితే ఆక్రమణకు గురైన స్థలాన్ని ఖాళీ చేయించడం కోసం లీగల్‌గా ప్రయత్నం చేస్తున్నామని, ఈ నెల 22న కోర్టులో విచారణ ఐటీఐ ప్రిన్సిపాల్ లక్ష్మయ్య తెలిపారు.



ఐటీఐ స్థలంలో నిర్మిస్తున్న ఇల్లు

అంతిమయాత్రకు అవస్థలు

» బురదలో కిలోమీటర్ నడిచాకే.. శవాలకు దహన సంస్కారాలు

» శాలిగౌరారం మండల కేంద్రంలో దుస్థితి

శాలిగౌరారం, జనవరి 10: 'గ్రామాలే దేశ ప్రగతికి పట్టుగొమ్మలు.. గ్రామ స్వరాజ్యమే దేశ స్వరాజ్యం..' అనే మహాత్ముని మాటలను పాలకులు నీటి రాతలుగా మారుస్తున్నారు. స్వాతంత్ర్యం సిద్ధించి ఏడు దశాబ్దాలు పూర్తయినా.. నేటికీ గ్రామాలు మౌలిక సదుపాయాలకు నోచుకోవడం లేదు. కొన్ని ఊళ్లలో శ్మశాన వాటికలు లేకపోవడంతో.. ప్రజలు దహన సంస్కారాల సమయంలో నానా అవస్థలు పడుతున్నారు. నల్లగొండ జిల్లా శాలిగౌరారం మండల కేంద్రానికి చెందిన రైతు సుల్తాన్ ఎల్లయ్య (52) మంగళవారం రాత్రి మృతిచెందారు. ఇక్కడ శ్మశాన వాటికలు లేకపోవడంతో.. ప్రజలు తమ సొంత భూములు, పొలాల్లోనే అంత్యక్రియలు నిర్వహించాల్సిన దుస్థితి. ఎల్లయ్యకు అర ఎకరం పొలం ఉండగా.. ఇటీవలే దుక్కిదున్ని నాట్లు వేశారు. దీంతో గత్యంతరం లేని పరిస్థితుల్లో ఎల్లయ్య కూతురు కవిత చిత్తడి పొలంలోనే తండ్రికి తలకొరివి పెట్టారు. కిలోమీటరు మేర బురద పొలాల్లో పాడెను మోసుకుంటూ తీసుకెళ్లాల్సి వచ్చింది. పల్లెటూళ్లను అభివృద్ధి చేస్తున్నామని సర్కారు చెబుతున్నా.. ఆచరణలో ఆ జాడ కనిపించడం లేదనడానికి ఈ సంఘటనే నిదర్శనం.



పొలం మధ్యలోంచి ఎల్లయ్యను పాడెపై తీసుకెళ్తున్న దృశ్యం

వసతి గృహానికి ప్రహరీ నిర్మిస్తాం

జిల్లా గిరిజన సంక్షేమ అధికారి మంగ్తానాయక్

భువనగిరి ఎస్సీ వసతి గృహం సందర్శన

[ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్]

యాదాద్రి, జనవరి 10 (ఆంధ్రజ్యోతి) : యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రంలోని గిరిజన బాలుర హాస్టల్ విద్యార్థుల దుస్థితిపై 'ఆంధ్రజ్యోతి'లో బుధవారం ప్రచురితమైన 'పందుల మధ్య భోజనం' అన్న ఫొటో కథనానికి కలెక్టర్ స్పందించారు. ఈ మేరకు హాస్టల్ స్థితిగతులపై వెంటనే నివేదిక ఇవ్వాలని జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి మంగ్తానాయక్‌ను ఆదేశించారు. దీంతో ఆమె బుధవారం హాస్టల్‌ను సందర్శించారు. హాస్టల్ చుట్టూ ప్రహరీ నిర్మిస్తామని చెప్పారు. మునిసిపల్ అధికారులు హాస్టల్ భవనం వద్ద మురుగునీరు నిల్వ కాకుండా తాత్కాలిక చర్యలను చేపట్టారు.



భువనగిరిలోని గిరిజన బాలుర హాస్టల్‌ను సందర్శించిన జిల్లా గిరిజన సంక్షేమ అధికారి మంగ్తానాయక్



తాండూరు మండలం చెంగోల్ అంగన్‌వాడీ కేంద్రంలో తగ్గిన చిన్నారుల హాజరు శాతం

అర్ధాకలితో గర్భిణులు, బాలింతలు, చిన్నారులు

» అంగన్‌వాడీలకు నెలరోజులుగా అందని బియ్యం

» తాండూరు ఐసీడీఎస్ పరిధిలోని కేంద్రాల్లో దుస్థితి

తాండూరు రూరల్, జనవరి 10: వికారాబాద్ జిల్లా ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని 279 అంగన్‌వాడీ కేంద్రాలకు నెల రోజులుగా బియ్యం, మంచినూనె సరఫరా కాకపోవడంతో గర్భిణులు, బాలింతలు, చిన్నారులు అర్ధాకలితో అలమటిస్తున్నారు. దీంతో హాజరు శాతం భారీగా తగ్గిపోయింది. వివరాలు ఇలా ఉన్నాయి.. తాండూరు ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని బషీరాబాద్, యాలాల, పెద్దేముల్, తాండూరు మండలాల్లో 279 అంగన్‌వాడీ కేంద్రాలున్నాయి. ఈ కేంద్రాల్లో ఏడాదిలోపు 2,349 మంది చిన్నారులు, 1 - 3 ఏళ్లలోపు 7,276 మంది చిన్నారులు, 3 - 6 ఏళ్ల లోపు 6,400 మంది, బాలింతలు, గర్భిణులు 2,300 మందికి ఈ కేంద్రాల ద్వారా పౌష్టికాహారాన్ని అందిస్తున్నారు. అయితే నెల రోజులుగా అంగన్‌వాడీ కేంద్రాలకు బియ్యం, మంచినూనె సరఫరా నిలిచిపోయాయి. దీంతో కేంద్రాల కు వచ్చే చిన్నారులు, గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారం అందడం లేదు. చిన్నారులకు బాలామృతం, స్నాక్స్ వంటివి అందజేస్తూ కాలం వెళ్లదీస్తున్నారు. కొన్ని కేంద్రాల్లో అంగన్‌వాడీ టీచర్లు సమీపంలోని పాఠశాలల నుంచి బియ్యం అరువుకు తీసుకుని ఆహారం అందిస్తున్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో పౌష్టికాహారం సమయానికి అందకుండా పోవడంతో కేంద్రాలకు వచ్చే చిన్నారుల సంఖ్య రోజురోజుకు గణనీయంగా తగ్గిపోయింది. అంతేగాక నెల రోజులుగా కేంద్రాలకు పాలు కూడా సరఫరా కాకపోవడంతో కేంద్రాల్లో చిన్నారులు ఇబ్బందులు తప్పడం లేదు. ఈ విషయమై తాండూరు సీడీపీవో వెంకటలక్ష్మిని ఆంధ్రజ్యోతి వివరణ కోరగా ఆన్‌లైన్ సమస్యలు, రేషన్ డీలర్ల ధర్నాలు, ఆధార్ అనుసంధానం వంటి సమస్యలు నెలకొనడంతో సరుకులు సరఫరాలో ఆలస్యమవుతోందన్నారు. త్వరలోనే సరుకులు అందనున్నాయని తెలిపారు.

15నే సంక్రాంతి పండుగ

హైదరాబాద్ సిటీ, జనవరి 10, (ఆంధ్రజ్యోతి): ఈ నెల 15వ తేదీనే సంక్రాంతి పండుగ అని తెలంగాణ విద్వత్సభ స్పష్టం చేసింది. 14వ తేదీ రాత్రి 7:15 గంటలకు సూర్యుడు మకర రాశిలో ప్రవేశిస్తాడని, అందుకే.. మరుసటి రోజు సంక్రాంతి పండుగ జరుపుకోవాలని విద్వత్సభ ప్రతినిధులు స్పష్టం చేశారు. ఈ విషయాన్ని ఏడాది క్రితమే వంద మంది పంచాగకర్తలు నిర్ధారించారని వివరించారు. గురువారమే(11వ తేదీ) సంక్రాంతి అని ప్రచారం చేయడం అర్థరహితమని విద్వత్సభ అధికార ప్రతినిధి వెంకటరమణ శర్మ విమర్శించారు. ఈ నెల 14న భోగి, 15న సంక్రాంతి, 16న కనుమ అని శృంగేరీ పీఠాధిపతి, తిరుమల తిరుపతి దేవస్థానం సిద్ధాంతులు ఆమోదించారని చెప్పారు. ఆ ప్రకారమే తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాలు పండుగ సెలవు ప్రకటించాయన్నారు. బుధవారం విద్వత్సభ కార్యనిర్వాహక సభ్యులు ప్రభుత్వ సలహాదారు కేవీ రమణాచారిని కలిసి సంక్రాంతి పండుగ తేదీపై ప్రజల్లో నెలకొన్న గందరగోళం తొలగించాలని కోరారు. స్పందించిన ఆయన.. సంక్రాంతి పండుగ 15వ తేదీగా ప్రభుత్వం గుర్తించిందని స్పష్టం చేశారు.



రమణాచారికి విజ్ఞాపన పత్రం అందజేస్తున్న విద్వత్సభ ప్రతినిధులు

పేద పిల్లలు.. పెద్ద స్నాచర్లు

జల్సాల కిక్‌లో ఆ బీటెక్ బాబులు.. కూలీ, గని కార్మికుడు, హెడ్‌కానిస్టేబుల్ కొడుకులు

» తల్లిదండ్రుల ఆకాంక్షలు గాలికి

» గంజాయి, మద్యం వ్యసనాలకు అలవాటు

» ముఠాగా ఏర్పడి చోరీలు, చైన్‌స్నాచింగ్‌లు

హైదరాబాద్ సిటీ, జనవరి 10(ఆంధ్రజ్యోతి): అతడు రోజువారీ కూలీ! పనిచేసిన రోజే ఐదువేళ్లు నోట్లోకి.. పనిలేని రోజు మాత్రం పస్తులే!! తన ఈ బతుకు కుమారుడికి రావొద్దనే ఉద్దేశంతో అతడిని బాగా చదివించాలనుకున్నాడా తండ్రి. తొందర్లోనే కొడుకు చేతికొస్తాడనే ఆశతో ఇంజనీరింగ్ చదువు కోసం పట్నం పంపాడు. "పైలం.. బాగా సదువుకోవాలె బిడ్డా" అని సుద్దులు చెప్పాడు. అయితే, అవి కొడుకు చెవికెక్కలేదు. చెడు స్నేహాలకు మరిగి దారి తప్పాడు. కాలేజీ మానేసి గంజాయి, మద్యానికి బానిసయ్యాడు. పరీక్షలు తప్పాడు. తన జల్సాలు తీర్చుకునేందుకు ముఠాను ఏర్పాటు చేసుకొని దొంగతనాలు, చైన్ స్నాచింగ్‌లు చేశాడు. పోలీసులకు చిక్కి ఊచలు లెక్కపెడుతున్నాడు. ఆ విద్యార్థి.. జయశంకర్ భూపాలపల్లి జిల్లా హనుమాన్‌కు చెందిన సూరజ్!!

ఇటీవల చోరీలు, చైన్ స్నాచింగ్‌కు పాల్పడుతూ పోలీసులకు పట్టుబడిన ముఠాలో సూరజ్ కీలక నిందితుడు. అతడితో పాటు ముఠాలోని మిగతా ముగ్గురిలో ఇద్దరూ బీటెక్ విద్యార్థులే!! చిత్రం ఏమిటంటే.. సూరజ్ మాదిరి అందరూ పేద కుటుంబాల నుంచి వచ్చారు. వీరంతా తమ తల్లిదండ్రుల ఆకాంక్షలు.. కుటుంబాల దయనీయ పరిస్థితులను విస్మరించి చెడు అలవాట్లకు బానిసలయ్యారు. చదువును పూర్తిగా అటకెక్కించారు. చైన్ స్నాచింగ్‌లు చేసి, వచ్చిన డబ్బుతో ఎంజాయ్ చేయాలనే ఉద్దేశంతో ఓ ముఠాగా ఏర్పడ్డారు. ఇతర స్నేహితుల వద్ద బైక్ అడిగి తీసుకునేవారు. ఉదయం, సాయంత్రం వేళల్లో వివిధ కాలనీల్లో తిరుగుతూ... ఒంటరిగా వెళ్లే మహిళలు, వృద్ధులను లక్ష్యంగా చేసుకొని చైన్ స్నాచింగ్‌లు చేసేవారు. ఆ బంగారు ఆభరణాలు అమ్మేసి జల్సాలు చేసేవారు. ఈ విధంగా మొత్తం 18 దొంగతనాలకు పాల్పడ్డారు. పోలీసులు వారి నుంచి 540 గ్రాముల ఆభరణాలు, 4 ద్విచక్ర వాహనాలు సహా మొత్తం 17 లక్షల విలువైన సొత్తును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు సూరజ్‌తో పాటు అతడి స్నేహితులు పవన్‌కుమార్, రోహిత్ కుమార్, మహ్మద్ ఓవైసీలను పోలీసులు అరెస్టు చేశారు. వీరిలో సూరజ్, పవన్ చిన్నప్పటి నుంచి స్నేహితులు. పవన్ తండ్రి సింగరేణి బొగ్గుగనిలో కార్మికుడు. రోహిత్ కుమార్. తండ్రి ఖమ్మంలో హెడ్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్నాడు. మహ్మద్ ఓవైసీ అహ్మద్‌ది హైదరాబాద్‌లోని పూల్‌బాగ్. ఇతడు వ్యసనాలకు బానిసై పాలిటెక్నిక్‌ను మధ్యలోనే వదిలేశాడు. తండ్రి ఫంక్షన్ హాళ్లలో డెకరేషన్‌లు చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. కొడుకు సంగతి తెలిసి కుమిలిపోయాడు.

పిల్లలపై తల్లిదండ్రులు కన్నేసి ఉంచాలి



నగరంలో చదువుతున్న పిల్లలపై తల్లిదండ్రులు ఓ కన్నేసి ఉంచాలి. కాలేజీకి ఫోన్ చేసి వారి గురించి ఎప్పటికప్పుడు తెలుసుకోవాలి. అనుమానం వస్తే.. నగరానికి వచ్చి వారి చేస్తున్న పనులను కనిపెట్టాలి. ఈ మధ్య కొంతమంది అమ్మాయిలు సిగరెట్లు, పబ్బులు, గంజాయి అంటూ చెడు వ్యసనాలకు అలవాటు పడుతున్నారు. అందుకే, అమ్మాయిల తల్లిదండ్రులు కూడా అప్రమత్తంగా ఉండాలి

-పృథ్వీధర్ రావు, ఏసీపీ ఎల్బీనగర్

లోకం తీరు

ఉష్ణోగ్రతలు

కేంద్రం	కనిష్ఠం	గరిష్ఠం
ఆదిలాబాద్	6.7	29.0
రామగుండం	12.8	29.8
వరంగల్	14.5	28.5
హైదరాబాద్	14.8	29.7
ఖమ్మం	18.0	32.0

ఈశాన్యం మరో'సారీ'

విశాఖపట్నం, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): ఈశాన్య రుతుపవనాలు ఈసారీ నిరాశపర్చాయి. ఈనెల 15వ తేదీతో సీజన్ ముగించుకుని టాటా చెప్పబోతున్నాయి. వాస్తవానికి తమిళనాడు, కోస్తా, రాయలసీమ, కర్ణాటక, కేరళ రాష్ట్రాల్లో సంవృద్ధిగా వర్షాలు కురిసేందుకు ఈశాన్య రుతుపవనాలు దోహదం చేస్తాయి. అయితే ఈ ఏడాది రుతుపవనాల జాడేలేదు. సీజన్‌లో సాధారణ వర్షపాతం నమోదవుతుందన్న వాతావరణ శాఖ అంచనాలు తప్పాయి. పశ్చిమ పసిఫిక్ సముద్రంలో తటస్థ పరిస్థితులు, లానినా ప్రభావంతో వర్షాలు తగ్గాయని వాతావరణ నిపుణుడొకరు వ్యాఖ్యానించారు.

సెక్షన్ 377ను రద్దు చేయాలి



స్వలింగ సంపర్కాన్ని నేరంగా పరిగణించే భారత శిక్షా స్మృతిలోని సెక్షన్ 377ను రద్దు చేయాలి. 2013లో సుప్రీం ఇచ్చిన తీర్పును పునః పరిశీలించాలి. థియేటర్లలో జాతీయగీతాలాపన విషయంలో సుప్రీం తీర్పు సమర్థనీయం. మానవతా దృక్పథంతో నేరస్థుల మరణశిక్ష రద్దు ప్రతిపాదనలు సరికాదు.

- భారత మాజీ సోలిసిటర్ జనరల్ సంతోష్ హెగ్డే

జనగణమన వినబడితే నిలబడతా



నేను ఇతరుల గురించి మాట్లాడదలచుకోలేదు. కానీ ఎక్కడ జాతీయ గీతం వినబడినా నేను మాత్రం ఆటోమేటిక్‌గా లేచి నిలబడతా. పాలు, బియ్యంపై ఉన్న పన్ను మాదిరే శానిటరీ నాప్కిన్లపై పన్ను విధించారు. ఏది ఉత్తమమో కాదో ప్రభుత్వానికి తెలుసు.

-కాజోల్, బాలీవుడ్ నటి

నేటి పెట్రో ధరలు (లీ.)

పెట్రోల్	డీజిల్
పాత ధర రూ.74.78	పాత ధర 66.07
కొత్త ధర రూ.74.82	కొత్త ధర 66.28
పెరుగుదల : 4 పైసలు	పెరుగుదల : 21 పైసలు



హెచ్‌ఐవీ నియంత్రణకు వారానికో మాత్ర

బోస్టన్, జనవరి 10: హెచ్‌ఐవీ వ్యాధిగ్రస్తులు రోజూ క్రమం తప్పకుండా మందులు వాడితేనే వారి ఆయుష్షు పెరుగుతుంది. లేదంటే రోగనిరోధక శక్తి పడిపోయి వారి ప్రాణాలకే ప్రమాదం ఏర్పడుతుంది. అయితే, వారి చికిత్సను సులభతరం చేస్తూ కొత్త మాత్ర(క్యాప్సుల్)ను కనుగొన్నారు అమెరికాలోని మసాచుసెట్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(ఎంఐటీ)కి చెందిన పరిశోధకులు. ఈ మాత్రను ఒక్కసారి వేసుకుంటే వారానికి సరిపడా రోగనిరోధక శక్తిని అందిస్తుందని తెలిపారు. ఇది కేవలం చికిత్సను సులభతరం చేయడమే కాకుండా, హెచ్‌ఐవీ వల్ల వచ్చే ఇన్‌ఫెక్షన్ రిస్క్‌ను కూడా తగ్గిస్తుందని చెబుతున్నారు.

ఎక్కువ నిద్రతో.. ఆరోగ్యకరమైన డైట్



లండన్, జనవరి 10: కంటి నిండా కునుకు ఉంటే రోజంతా ఆరోగ్యంగా ఉత్సాహంగా ఉండొచ్చని అంటుంటారు. అయితే రాత్రిపూట ఎక్కువసేపు నిద్రపోవడం వల్ల షుగర్ లెవల్స్ ఎక్కువగా ఉండే ఆహారం తీసుకోవడం తగ్గి.. ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లు అబ్బుతాయని చెబుతున్నారు యూకేలోని కింగ్స్ కాలేజీ లండన్ పరిశోధకులు. దీని ద్వారా ఊబకాయం, హృద్రోగాలు వచ్చే ప్రమాదం తగ్గుతుందంటున్నారు. 42మంది నిద్ర సమయాల్లో మార్పులు చేసి పరిశోధకులు ఈ విషయాన్ని కనుగొన్నారు.

ఎందుకీ సమావేశాలు?

- రైల్వేలో పెండింగ్ ప్రాజెక్టులు పూర్తయ్యేదెప్పుడు!
- ప్రతిపాదనలు పంపినా పట్టించుకోవడంలేదు
- దక్షిణమధ్య రైల్వే జీఎంతో సమావేశంలో ఎంపీలు

హైదరాబాద్/సికింద్రాబాద్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): దక్షిణమధ్య రైల్వేలో దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న పనులను పూర్తి చేయాలంటూ తాము ఎన్నిసార్లు ప్రతిపాదనలు పంపించినా పట్టించుకోవడంలేదని రాష్ట్ర ఎంపీలు ఆవేదన వ్యక్తం చేశారు. అలాంటప్పుడు బోర్డు సమావేశాలు నిర్వహించడమెందుకు? వాటికి తాము హాజరు కావడమెందుకని ప్రశ్నించారు. త్వరలో 2018-19 బడ్జెట్ తెరపైకి రానున్న నేపథ్యంలో దక్షిణమధ్య రైల్వే జనరల్ మేనేజర్ వినోద్‌కుమార్ యాదవ్ బుధవారం సికింద్రాబాద్‌లోని రైల్ నిలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు ఎంపీలు మాట్లాడుతూ.. నిత్యం 230 రైళ్లు, లక్షా 70వేల మంది ప్రయాణికుల రాకపోకలతో కిటకిటలాడే సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌పై ఒత్తిడి తగ్గించాలని, ఇతర స్టేషన్లను అభివృద్ధి చేయాలని కేంద్ర మాజీ మంత్రి బండారు దత్తాత్రేయ కోరారు. పాలమూరుకు కొత్త రైల్వే లైన్ నిర్మిస్తే అక్కడినుంచి వలసలు తగ్గుతాయని నాగర్‌కర్నూల్ ఎంపీ నంది ఎల్లయ్య అన్నారు. కాగా రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ప్రారంభించిన మెట్రో రైలును సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ వరకు అనుసంధానం చేయాలని మల్కాజిగిరి ఎంపీ మల్లారెడ్డి కోరారు. ఎంఎంటీఎస్‌ను వికారాబాద్ వరకు పొడిగించాలని చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. హైదరాబాద్-కాజీపేట మధ్య ఇంటర్‌సిటీ రైలును నడపాలని భువనగిరి ఎంపీ బూర నర్సయ్యగౌడ్ కోరారు. ఎంఎంటీఎస్ రెండో దశను ఈ ఏడాదే పూర్తి చేస్తామని దక్షిణమధ్య రైల్వే జీఎం వినోద్‌కుమార్ యాదవ్ అన్నారు. సమావేశంలో ఇతర ఎంపీలు కె.కేశవరావు, జి.నగేష్, బి.వినోద్‌కుమార్, సీతారాంనాయక్, జితేందర్ రెడ్డి, గుత్తా సుఖేందర్‌రెడ్డి, కొత్త ప్రభాకరెరెడ్డి, బాల్క సుమన్, బీబీ నాయక్, బీబీ పాటిల్, రాపోలు ఆనందభాస్కర్, గరికపాటి మోహన్‌రావు పాల్గొన్నారు.

పునర్విభజనపై కదలిక!

కేంద్ర కేబినెట్ నోట్ కూడా సిద్ధం.. ఈ వారంలోనే ఢిల్లీలో రాజకీయ భేటీ


అమరావతి, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): రెండు తెలుగు రాష్ట్రాల్లో శాసనసభ నియోజకవర్గాల పునర్విభజనపై కేంద్ర ప్రభుత్వంలో కదలిక కనిపిస్తోంది. దీనిపై ఉన్నత స్థాయి అధికారులు ఇప్పటికే కేబినెట్ నోట్ తయారుచేసి సిద్ధంగా ఉంచారు. కేంద్ర హోం శాఖ కూడా కొంత కసరత్తు చేపట్టింది. ప్రధానమంత్రి స్థాయిలో రాజకీయ నిర్ణయం జరిగితే రాబోయే పార్లమెంటు సమావే శాల్లో దీనికి సంబంధించిన బిల్లును ప్రవేశపెట్టే అవకాశం ఉందని సమాచారం. ప్రధాని మోదీతో త్వరలో ముఖ్యమంత్రి చంద్రబాబు సమావేశమయ్యే అవకాశం ఉన్నందున ఆ తర్వాత దీనిపై స్పష్టత రావచ్చని అంటున్నారు. రాజకీయ సుస్థిరత కోసం విభజన తర్వాత రెండు తెలుగు రాష్ట్రాల్లో అసెంబ్లీ సీట్లు పెంచాలని విభజన చట్టంలో పేర్కొన్నారు. ఇది అమలైతే ప్రతి పార్లమెంటు స్థానానికి రెండు చొప్పున అసెంబ్లీ సీట్లు పెరుగుతాయి. ఈ లెక్కన నవ్యాంధ్ర శాసనసభలో 50 స్థానాలు (మొత్తం 225), తెలంగాణ అసెంబ్లీలో 34 సీట్లు (మొత్తం 153) పెరుగుతాయి. విభజన చట్టంలో ఉన్నా మోదీ ప్రభుత్వం ఇన్నాళ్లుగా పట్టించుకోలేదు. మిత్రపక్షమైన తెలుగుదేశం పార్టీ నుంచి బాగా ఒత్తిడి పెరగడంతో ఇటీవల కేంద్రంలో కదలిక వచ్చింది. సీట్లు పెంచడానికి ముందుగా కేంద్ర మంత్రివర్గ సమావేశంలో తీర్మానం చేసి ఆపై పార్లమెంటులో బిల్లు పెట్టి ఆమోదించాలి. మంత్రివర్గ సమావేశం ముందు ఉంచేందుకు అధికారుల స్థాయిలో కేబినెట్ నోట్ సిద్ధమైపోయింది. బిల్లుకు సంబంధించి అవసరమైన ఏర్పాట్లు చేసుకోవాలని ప్రధాని కార్యాలయం నుంచి హోం శాఖకు మౌఖిక ఆదేశాలు అందాయి. దీనిని దృష్టిలో ఉంచుకుని హోం శాఖ కేంద్ర ఎన్నికల కమిషన్(ఈసీ)కు ఒక లేఖ రాసింది. 2001, 2011 జనాభా లెక్కల్లో దేనిని పరిగణనలోకి తీసుకుని నియోజకవర్గాల పునర్విభజన చేయాలో తెలియజేయాలని అందులో కోరారు. దేశమంతా 2001 జనాభా లెక్కల ఆధారంగానే పునర్విభజన జరిగినందువల్ల ఆ లెక్కలను ఈసారి కూడా పరిగణనలోకి తీసుకుంటే మంచిదని ఈసీ సూచించింది. కానీ పార్లమెంటులో తెలుగు రాష్ట్రాల విభజన చట్టాన్ని ఆమోదించే నాటికి 2011 జనాభా లెక్కలు కూడా వచ్చినందున పాత లెక్కలు పరిగణనలోకి తీసుకోవడం సరైందా కాదా అన్న అనుమానం హోం శాఖ అధికారులకు వచ్చింది. అయితే ఈ అంశం కేబినెట్ ముందుకు వచ్చినప్పుడు చూద్దామని భావించారు. ఎన్నికల కమిషన్ అధికారులకు, హోం శాఖ అధికారులకు అనధికారికంగా చర్చలు కూడా జరిగాయి. నాలుగు నెలల నుంచి ఆరు నెలల సమయంలో పునర్విభజన కసరత్తు పూర్తి చేయగలమని ఈసీ అధికారులు చెప్పినట్లు ప్రచారం జరుగుతోంది. అంతర్గత కసరత్తు జరిగినా రాజకీయ నిర్ణయం తీసుకుంటేనే పునర్విభజన అంశం కేంద్ర మంత్రివర్గం ముందుకొస్తుందని ఉన్నత స్థాయి రాజకీయ వర్గాలు స్పష్టం చేస్తున్నాయి. ఈ రాజకీయ నిర్ణయాన్ని ప్రధాని మోదీ తీసుకోవలసి ఉంది. ఆయన అంగీకారం తెలిపితే వచ్చే బడ్జెట్ సమావేశాలు ప్రారంభమయ్యేలోపే మంత్రివర్గ సమావేశంలో తీర్మానం చేసి.. ఆనక పార్లమెంటు ముందు ఉంచి ఆమోదం తీసుకుంటారు. చంద్రబాబు కొద్ది రోజుల్లో ప్రధానితో భేటీ కానున్నారు. ఆ సందర్భంలో ఈ అంశంపై స్పష్టత వచ్చే అవకాశం ఉందని చెబుతున్నారు.

తెరపైకి జార్ఖండ్ సీట్ల పెంపు..

తెలుగు రాష్ట్రాల సీట్ల పెంపుపై ఓ వైపు తర్జనభర్జన జరుగుతుండగా.. ఇటీవల జార్ఖండ్ అసెంబ్లీ స్థానాల పెంపు వ్యవహారం కూడా కేంద్రం ముందుకొచ్చింది. అక్కడ రాజకీయ సుస్థిరత కోసం అసెంబ్లీ స్థానాలు పెంచాలని బీజేపీ రాష్ట్ర నేతలు కేంద్రంపై బాగా ఒత్తిడి తెస్తున్నారు. తెలుగు రాష్ట్రాలతోపాటు జార్ఖండ్‌లో కూడా సీట్లు పెంచాలని కేంద్రం భావిస్తే కేబినెట్ నోట్‌ను మళ్లీ మార్చాల్సి వస్తుంది. దీనితోపాటు పార్లమెంటులో పెట్టే బిల్లును కూడా మరో రూపంలో తీసుకురావలసి ఉంటుంది. 'కేంద్రంలో కొంత కదలిక అయితే ఉంది. ఈ వారంలో దీనికి సంబంధించి ఢిల్లీలో రాజకీయ సమావేశం కూడా జరుగనుంది. అంతిమంగా ప్రధాని స్థాయిలో జరిగే నిర్ణయమే కీలకం. దానికోసం ఎదురుచూస్తున్నాం' అని టీడీపీ కీలక నేత ఒకరు వెల్లడించారు.

కేటీపీఎస్-7లో జనరేటర్ ఏర్పాటు

- 940 ఎంవీఏ సామర్థ్యంతో బీహెచ్ఈఎల్ తయారీ
- విద్యుత్ సౌధ నుంచి ఆన్‌లైన్‌లో జెన్‌కో సీఎండీ పర్యవేక్షణ
- మార్చికల్లా సూపర్ క్రిటికల్ ప్రాజెక్టు పూర్తి: ప్రభాకర్‌రావు



హైదరాబాద్/పాల్వంచ, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచలో చేపడుతున్న తొలి సూపర్ క్రిటికల్ ప్రాజెక్టు వచ్చే మార్చికల్లా పూర్తి కావాలని అధికారులను జెన్‌కో సీఎండీ దేవులపల్లి ప్రభాకర్‌రావు ఆదేశించారు. తెలంగాణ రాష్ట్రం వచ్చాక తొలి సూపర్ క్రిటికల్ ప్రాజెక్టుగా కేటీపీఎస్ స్టేజ్-7లో భాగంగా 800 మెగావాట్ల సామర్థ్యంతో దీనిని ఏర్పాటు చేస్తున్నారు. ప్లాంటు నిర్మాణంలో అతి ముఖ్యమైన 940 ఎంవీఏ సామర్థ్యం కలిగిన జనరేటర్‌ను బుధవారం విజయవంతంగా అమర్చారు. ఈ పనులను విద్యుత్ సౌధ నుంచి జెన్‌కో సీఎండీ ఆన్‌లైన్‌లో పర్యవేక్షించారు. ఆయనకు క్షేత్రస్థాయి నుంచి డైరెక్టర్ రాధాకృష్ణ వివరించారు. మెకానికల్ పవర్‌ను ఎలక్ట్రానిక్ పవర్‌గా మార్చడానికి ఈ జనరేటర్‌ను వినియోగిస్తారు. ఇతరత్రా పనులన్నీ పక్కాగా చేపట్టాలని ప్రభాకర్‌రావు స్పష్టం చేశారు.



సచివాలయంలో బీసీ సంక్షేమంపై వెబ్‌సైట్‌ను ప్రారంభిస్తున్న మంత్రి జోగు

బీసీ, ఎంబీసీల స్వయం ఉపాధికి సంక్రాంతి తర్వాత

రాయితీ రుణాలు

- రూ.2లక్షల వరకు బ్యాంకు లింకేజీ లేకుండా మంజూరు
- త్వరలో సీఎం వద్దకు ఎంబీసీ కులాల జాబితా: జోగు రామన్న
- బీసీ సహకార సమాఖ్యల నమోదు వెబ్‌సైట్ ప్రారంభం

హైదరాబాద్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): బీసీలు, ఎంబీసీల స్వయం ఉపాధి పథకాలకు సంబంధించి సంక్రాంతి పండగ తర్వాత సబ్సిడీ రుణాలు మంజూరు చేయనున్నట్లు బీసీ సంక్షేమ శాఖ మంత్రి జోగు రామన్న తెలిపారు. యూనిట్‌కు రూ.2 లక్షల వరకు బ్యాంకు లింకేజీ లేకుండా ప్రభుత్వమే రుణం మొత్తాన్ని మంజూరు చేస్తుందన్నారు. రూ.10 లక్షల యూనిట్ విలువ ఉన్న యూనిట్లకు గరిష్ఠంగా రూ.5 లక్షల సబ్సిడీ ఇవ్వనున్నట్లు, మిగిలిన దాంట్లో లబ్ధిదారు వాటా కాకుండా మిగతా మొత్తం బ్యాంకు రుణం ఇస్తుందని, అందుకు ప్రభుత్వమే బ్యాంకు గ్యారంటీ ఇస్తుందని తెలిపారు. ఎంబీసీ కులాల జాబితా ఇంకా ప్రభుత్వం ప్రకటించలేదని, సుమారు 90 కులాలతో రూపొందించిన జాబితాను సీఎం కేసీఆర్‌కు పంపుతామని చెప్పారు. ఇక బీసీ కులాల సహకార సంఘాలు రిజిస్ట్రేషన్ చేసుకునేందుకు కొత్త వెబ్‌సైట్‌ను బుధవారం సచివాలయంలో మంత్రి తన చాంబర్‌లో ఆవిష్కరించారు.

దరఖాస్తు విధానమిదీ..

- ప్రతి సంఘంలో కనిష్ఠంగా 11 మంది, గరిష్ఠంగా 15 మంది సభ్యులు ఉండాలి. 21 ఏళ్లు నిండిన ప్రతి వ్యక్తి సభ్యుడిగా చేరవచ్చు.
- స్థానికంగా ఉన్న మీ సేవా కేంద్రాల్లో ప్రతిపాదిత సంఘంతో సభ్యుల ఫొటోలను వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. http://tsbcwd.cgg.gov.in వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.

చెక్కుల రూపంలో ఇద్దాం

పెట్టుబడి సాయంపై ఉపసంఘం నిర్ణయం



హైదరాబాద్, జనవరి 10(ఆంధ్రజ్యోతి): ఎకరాకు రూ.4 వేల చొప్పున ఇచ్చే పెట్టుబడి సాయాన్ని ఎకౌంట్ పేయీ చెక్కుల రూపంలో చెల్లించనున్నారు. రాష్ట్రవ్యాప్తంగా రైతులతో సంప్రదింపుల అనంతరం మెజార్టీ అభిప్రాయాల ఆధారంగా ఈ నిర్ణయం తీసుకున్నారు. చెక్కులు రైతులకే అందేలా చెక్కుల వెనుక రైతుల ఆధార్ నెంబర్లు ముద్రిస్తారు. వ్యవసాయ మంత్రి పోచారం శ్రీనివాస్‌రెడ్డి నేతృత్వంలోని మంత్రివర్గ ఉపసంఘం ఈ మేరకు నిర్ణయం తీసుకుంది. బుధవారం ఉపసంఘం సమావేశంలో పోచారం, హరీశ్‌రావు, ఈటల రాజేందర్, తుమ్మల నాగేశ్వర్‌రావు, జగదీష్‌రెడ్డి, పట్నం మహేందర్‌రెడ్డి, టెస్కాబ్ చైర్మన్ రవీందర్‌రావు, అధికారులు పాల్గొన్నారు. 624 గ్రామాల్లో 62,377 మంది రైతుల అభిప్రాయాలను వ్యవసాయ శాఖ మంగళవారం సేకరించింది. 31.8 శాతం మంది చెక్కులకు, 27.55 శాతం మంది ఖాతాల్లో జమకు, 26.59 శాతం మంది నేరుగా నగదు పంపిణీకి మొగ్గు చూపారు. ఈ వివరాలను వ్యవసాయ శాఖ బుధవారం ఉపసంఘం ముందు ఉంచింది. మెజార్టీ జిల్లాల రైతులు చెక్కులకు మొగ్గు చూపిన నేపథ్యంలో ఉపసంఘం కూడా ఇదే సిఫార్సు చేస్తోంది. మారుమూల ప్రాంత గ్రామాల్లో నగదు పంపిణీ చేపట్టాలని హరీశ్‌రావు సూచించగా, అవినీతికి ఆస్కారం ఉంటుందనే అభిప్రాయం వ్యక్తమైంది. కేవలం ఐదు శాతం రైతుల ఖాతాలు మాత్రమే ఎన్‌పీఏలుగా ఉన్నట్లు బ్యాంకర్లు తెలిపారు. మంత్రివర్గ ఉపసంఘం కోరిన విధంగా పాత బకాయిల కింద జమ చేసుకోబోమంటూ రాతపూర్వకంగా హామీ ఇవ్వలేమని స్పష్టం చేశారు. అయితే ఉదారంగా వ్యవహరిస్తామన్నారు. ఖాతాల్లో వేసినా ఒకే నెలలో రూ. 5,685 కోట్ల వరకూ పంపిణీ చేయాల్సి ఉన్నందున రైతులు విత్‌డ్రాయల్స్‌కు వస్తే నగదుకు కొరత ఏర్పడే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. రిజర్వ్ బ్యాంకు నుంచి కొత్త కరెన్సీ సరఫరా బాగా తగ్గిందని తెలిపారు. చెక్కులు వేయగానే విత్‌డ్రాయల్స్‌కు సరిపడా నగదును సరఫరా చేయాలని జైట్లీని, ఆర్బీఐ అధికారులను కలిసి కోరాలని ఉపసంఘం నిర్ణయించింది. 17, 18 తేదీల్లో ఈటల నాయకత్వంలో ఢిల్లీకి వెళ్లాలని నిర్ణయించారు. వీలైనంత మేరకు నగదు నిల్వలను ఏర్పాటు చేసుకోవాలని బ్యాంకులకు సూచించారు. అకౌంట్ పేయీ చెక్కులను రైతులకు పంపిణీ చేస్తే, వాటిని వాటిని నగదు రూపంలో మార్చుకోవడానికి మధ్య కొంత సమయం దొరుకుతుందని, ఆ మధ్య కాలంలో నగదు రొటేషన్‌కు అవకాశం చిక్కుతుందన్న అభిప్రాయాలు వచ్చాయి. చెక్కులు ఇస్తే పాత బకాయి లేని ఖాతాలో వేసుకొనే వెసులుబాటు ఉంటుంది. పోస్టాఫీసు అకౌంట్లలోనూ నగదుగా మార్చుకునే అవకాశం ఉంది. వంద చెల్లించి తక్షణమే పోస్టల్ ఖాతా తెరుచుకోవచ్చు.

దున్నని భూములకు ఎందుకు?

రాష్ట్రంలోని 1.42 కోట్ల ఎకరాల పట్టా భూముల్లో వ్యవసాయం చేయని భూములు ఉన్నాయని, వాటిని పథకం నుంచి తీసేయాలని పలువురు మంత్రులు సూచించారు. పదెకరాల లోపు రైతులే 97.28 శాతం మంది ఉన్నారని, 25 ఎకరాల పైబడి భూమి ఉన్న రైతులు ఒక శాతం లోపు ఉన్నారని అధికారులు తెలిపారు. పెట్టుబడి సాయం ఇస్తే పడావు భూముల్లోనూ ఏదో ఒక పంటను సాగు చేయడమో, చెట్లను పెంచడమో చేస్తారన్నారు. స్థితిమంతులు, మంత్రులు పెట్టుబడి సాయాన్ని వదులుకోవాలని కేసీఆర్ పిలుపునివ్వాలని అభిప్రాయాలు వ్యక్తమయ్యాయి.

అక్టోబరు కల్లా అంచనా సాధ్యం కాదు

ఖరీఫ్ సరే... రబీ సాగు విస్తీర్ణం ఎంత? ముందుగానే నిర్ణయించడం ఎలా? పెట్టుబడి సాయం వితరణ ఏ నెలలో చేపట్టాలి? అనే ప్రశ్నలు అధికారులను వేధిస్తున్నాయి. గత పదేళ్ల సగటు చూస్తే సుమారు 40 లక్షల ఎకరాల్లో మాత్రమే రబీ సాగు జరుగుతోంది. ఖరీఫ్ వర్షాలను బట్టి రబీ సాగు విస్తీర్ణంలో ఏటేటా ఊహించని మార్పు ఉంటోంది. అయితే, ఐదు వేల ఎకరాలకు ఒక వ్యవసాయ విస్తీర్ణాధికారిని నియమించినందున కాస్త ప్రణాళికతో వ్యవహరిస్తే లెక్కలు తీయడం సాధ్యమేనంటున్నారు. అయితే, సీఎం చెప్పినట్లుగా అక్టోబరు నెలలోనే చెక్కుల పంపిణీ చేపట్టాలంటే మాత్రం కచ్చితమైన అంచనా దొరకదంటున్నారు.

డబ్బులు వచ్చేది డౌటే

జూన్‌లో రైతుల అవసరాలకు సరిపడా నగదును తెప్పించుకోవడం కష్టమేనంటున్నారు. ఆర్‌బీఐ కరెన్సీని పంపించడం కుదరకపోవచ్చని ఆర్థిక శాఖ అధికారులు చెబుతున్నారు. 70 వేల కోట్ల రూపాయల క్యాష్ రాష్ట్రంలో చెలామణిలో ఉందని, దాంతోనే సరిపుచ్చుకోవాలని కేంద్రం సూచించే అవకాశాలున్నాయని అంటున్నారు. దేశ జనాభా 120 కోట్లతో పోలిస్తే రాష్ట్ర జనాభా 3.50 కోట్లకు రూ.70 వేల కోట్ల చెలామణి రెట్టింపు స్థాయిలో ఉన్నట్లు భావించాల్సి వస్తుందని అంటున్నారు. చెక్కులను ప్రజాప్రతినిధుల ద్వారానే పంపిణీ చేయనున్నారు. దేశంలోనే మొట్టమొదటిసారిగా ప్రవేశపెడుతున్న పథకాన్ని రాజకీయంగా సద్వినియోగం చేసుకోవాలని ప్రభుత్వం యోచిస్తోంది.

మళ్లీ మాఫీ!

(మొదటి పేజీ తరువాయి)

సందర్భంగా టీఆర్ఎస్ అధ్యక్షుడి హోదాలో రైతు రుణ మాఫీ లక్ష రూపాయలు చేస్తామంటూ ఇచ్చిన హామీని సీఎంగా కేసీఆర్ నిలబెట్టుకున్నారు. రైతులకు లక్ష రూపాయల వరకు ఉన్న వ్యవసాయ రుణాలన్నింటినీ మాఫీ చేశారు. రూ.16 వేల కోట్ల భారాన్ని భరించారు. 34 లక్షలకు పైగా రైతులు ప్రయోజనం పొందారు. నాలుగు విడతల్లో మాఫీ చేయటం కొంత విమర్శలకు గురైంది. వచ్చేసారి విడతల వారీగా కాకుండా ఒకేసారి మాఫీ చేయాలని సీఎం కేసీఆర్ యోచిస్తున్నట్లు టీఆర్ఎస్ ముఖ్యులు చెబుతున్నారు. లోక్‌సభ, అసెంబ్లీ సాధారణ ఎన్నికలు 2019 ఏప్రిల్-మేలో జరగాల్సి ఉంది. ఆలోగానే నిర్ణయం తీసుకొని టీఆర్ఎస్ ఎన్నికల ప్రణాళికలో రైతుల వ్యవసాయ రుణం రూ.2 లక్షల వరకు మాఫీ అనే అంశాన్ని పొందుపర్చే అవకాశం ఉన్నట్లు సమాచారం.



ఉద్యోగులకు 'పీఆర్సీ' బొనాంజా

టీఆర్ఎస్ ప్రభుత్వం మొదటి నుంచి ఉద్యోగులతో స్నేహపూర్వక సంబంధాలను కోరుకుంటుండటం, సార్వత్రిక ఎన్నికలకు గడువు సమీపిస్తుండటం వెరసి ఈసారి పీఆర్సీ (పే రివిజన్ కమిషన్) ద్వారా వారికి భారీ నజరానాలు అందించటానికి సీఎం కేసీఆర్ సుముఖంగా ఉన్నట్లు తెలిసింది. జూన్ 2, 2014 నుంచి అమల్లోకి వచ్చిన 10వ పీఆర్సీ గడువు ఈ ఏడాది జూన్ 30న తీరుతోంది. వాస్తవానికి పీఆర్సీ కాలపరిమితి ఐదేళ్లు. కానీ జూలై 1, 2013 నుంచి అమల్లోకి రావాల్సిన 10వ పీఆర్సీ రాష్ట్ర విభజన సమస్యల కారణంగా దాదాపు ఏడాది ఆలస్యంగా అమల్లోకి వచ్చింది. దీంతో ఆ ఏడాది సమయం పీఆర్‌సీ ప్రయోజనాలను కోల్పోయామనే భావన ఉద్యోగుల్లో ఉంది. ఇక 11వ పీఆర్సీ జూలై 1, 2018 నుంచి అమల్లోకి రావాల్సి ఉంది. ఇప్పటికే ఉద్యోగ సంఘాల నేతలు సీఎం కేసీఆర్‌ను కలిసి పే రివిజన్ కమిషనర్‌ను నియమించాలని అభ్యర్థించారు. కమిషనర్‌ను నియమించటంతోపాటు, గడువు కంటే ముందే నివేదిక తెప్పించుకోవాలని, జూలై 1, 2018 నుంచి 11వ పీఆర్సీ అమల్లోకి వచ్చే విధంగా చూడాలని కోరారు. 10వ పీఆర్సీలో ఇంటీరియమ్ రిలీఫ్ (ఐఆర్) 29 శాతం, ఫిట్‌మెంట్ 43 శాతం ఇచ్చారు. తాజా ధరల సూచీ ప్రకారం ఫిట్‌మెంట్ 65 శాతం, దానికి అనుగుణంగా 35 నుంచి 40 శాతం వరకు ఐఆర్ ఇవ్వాలని ఇప్పటికే ఉద్యోగులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. లోగడ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు ఏడాది కాలం పాటు పీఆర్సీ ప్రయోజనాలను నష్టపోయి ఉండటం, సాధారణ ఎన్నికల ముందు ఇదే చివరి పీఆర్సీ కావటంతో ఉద్యోగులకు ఫిట్‌మెంట్, ఐఆర్ విషయంలో కొంత ఉదారంగా ఉండాలని సీఎం కేసీఆర్ సూత్రప్రాయంగా నిర్ణయించినట్లు తెలుస్తోంది. దీంతో ఉద్యోగులకు ఈసారి 11వ పీఆర్సీ ద్వారా వారి అంచనాలకు తగినట్లుగానే ఫిట్‌మెంట్, ఐఆర్ ఉండబోతున్నాయనే సంకేతాలు అధికార టీఆర్ఎస్ పార్టీ శిబిరం నుంచి వెలువడుతున్నాయి.

సీపీఎస్ రద్దుకే మొగ్గు!

రాష్ట్రంలో కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం(సీపీఎస్) రద్దుకే టీఆర్ఎస్ ప్రభుత్వం మొగ్గు చూపుతోందని సమాచారం. ఈమేరకు కేంద్రానికి లేఖ రాయటానికి సిద్ధమవుతోందని తెలిసింది. కాంగ్రెస్ హయాంలో సీపీఎస్ అమల్లోకి వచ్చింది. తెలంగాణలో సీపీఎస్ పరిధిలోకి వచ్చే దాదాపు 1.25 లక్షల మంది ఉద్యోగులు దానిని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. రాష్ట్రంలో ప్రధాన ప్రతిపక్షం కాంగ్రెస్ కూడా సీపీఎస్ విధానాన్ని తప్పుపడుతోంది. అయితే పెద్ద సంఖ్యలో ఉన్న ఉద్యోగుల ఆందోళనను పరిగణనలోకి తీసుకొని, రాష్ట్రంలో సీపీఎస్ రద్దు దిశగా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు తెలుస్తోంది. అసెంబ్లీ సమావేశాలు ఎప్పుడు జరిగినప్పటికీ, దీనిపై సభలో చర్చించి, కాంగ్రెస్ వైఖరిని ఎండగట్టి, సీపీఎస్ రద్దు కోరుతూ తీర్మానం చేసి, కేంద్రానికి పంపించాలని అధికార టీఆర్ఎస్ భావిస్తోంది.

పంచాయతీల్లో ఎన్నారైలు!

(మొదటి పేజీ తరువాయి)

జగదీశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు. అనుమతి లేని లేఅవుట్లలో ప్లాట్ల రిజిస్ట్రేషన్లను నిలిపివేస్తే ఎలా ఉంటుందన్న అంశంపై సమావేశానికి ప్రత్యేకంగా హాజరైన ఉప ముఖ్యమంత్రి మహమూద్ ఆలీతో కమిటీ చర్చించింది. ఎలాంటి అనుమతులూ లేకుండానే లేఅవుట్లు చేస్తూ, విచ్చలవిడిగా రిజిస్ట్రేషన్లు చేస్తున్నారని, దీనివల్ల సామాన్యులు ఇబ్బందులు పడాల్సి వస్తోందని అన్నారు. లేఅవుట్‌కు అనుమతి ఉంటేనే ప్లాట్లకు రిజిస్ట్రేషన్లు జరిగేలా చర్యలు తీసుకుంటే సముచితంగా ఉంటుందన్న అభిప్రాయం వ్యక్తమైంది. పంచాయతీల్లో సమావేశాల్లో పాల్గొనే సభ్యులకు పారితోషికంగా సిట్టింగ్ ఫీజు ఇవ్వాలనే ప్రతిపాదన వచ్చింది. ప్రత్యేక పరిస్థితుల్లో మినహా వరుసగా మూడుసార్లు పాలకవర్గ సమావేశాలకు డుమ్మా కొట్టిన సభ్యులపై అనర్హత వేటు వేయడంపై చర్చించారు. పంచాయతీల్లో కో ఆప్షన్ సభ్యులను నియమించే అంశాన్ని ఇప్పటికే పరిశీలిస్తున్న ఉపసంఘం... ఎన్ఆర్ఐలకు, గ్రామంలోలేని వారికి కూడా అవకాశం ఇస్తే ఎలా ఉంటుందన్న దిశగా చర్చించింది. పంచాయతీ జనాభా ప్రాతిపదికన ఇద్దరు లేదా ముగ్గురిని నామినేట్ చేసుకునే అవకాశాలపై చర్చించారు. గ్రామానికి చెందిన ఎన్ఆర్ఐలు, గ్రామ మహిళా సమాఖ్య అధ్యక్షురాలు, నిపుణులకు అవకాశం కల్పించిన పక్షంలో గ్రామాభివృద్ధికి సహకరించినట్లుగా ఉంటుందని మంత్రులు అభిప్రాయపడ్డారు. 200 గజాలలోపు విస్తీర్ణంలో నిర్మించే జీ ప్లస్-2 భవనాలకు సంబంధించిన అనుమతులను పంచాయతీల్లోనే ఇస్తున్నారు.

అంతకన్నా ఎక్కువ విస్తీర్ణంలో భవనాలకు ఎంపీడీఓ, తహసీల్దార్, ఈవోపీఆర్డీ, పంచాయతీరాజ్ ఏఈల నేతృత్వంలో కమిటీలను ఏర్పాటు చేసి అనుమతించే విషయంపై చర్చ జరిగింది. భవన నిర్మాణాలకు హెచ్‌ఎండీఏ అనుమతించిన వారం రోజులలోపే పంచాయతీలు క్లియరెన్స్ ఇవ్వాలని, లేనిపక్షంలో అనుమతించినట్లుగానే భావించాల్సి ఉండేలా చట్టంలో పొందుపరచాలన్న అంశంపై మంత్రులు చర్చించారు. పరిశ్రమల ఏర్పాటుకు సంబంధించి పంచాయతీల నుంచి అనుమతులు తీసుకోవాల్సిన అవసరం లేకుండా చట్టంలో మార్పులు చేసే దిశగా చర్చ జరిగింది. ఇక సర్పంచులకు విస్తృతావకాశాలను కల్పించే దిశగా కొత్త చట్టంలో ఏర్పాట్లు చేయాలని భావించారు. ప్రజల కోసం ప్రత్యేకంగా హక్కుల జాబితాను చట్టంలో పొందుపరచాలని మంత్రివర్గం యోచిస్తోంది. డంప్ యార్డులు, వైకుంఠధామాలు, పారిశుధ్యం వంటి అంశాలను ప్రజల హక్కులుగా చట్టంలో ఏర్పాటు చేయాలన్న దిశగా ఉపసంఘం చర్చించింది. గురువారం కూడా ఉపసంఘం మరోమారు సమావేశం కానుంది.

న్యాయం జరిగేనా?

ఇందిరాగాంధీ హత్య అనంతరం సాగిన సిక్కుల ఊచకోత ఘటనలపై సుప్రీంకోర్టు బుధవారం తీసుకున్న నిర్ణయం విశేషమైనది. గతంలో దర్యాప్తు సక్రమంగా జరగని 186హత్యోదంతాలపై తిరిగి తన పర్యవేక్షణలో దర్యాప్తు చేయించాలని సుప్రీంకోర్టు నిర్ణయించుకుంది. రిటైర్డ్ హైకోర్టు న్యాయమూర్తి పర్యవేక్షణలో, మరో ఇద్దరు ఐపీఎస్ అధికారులతో ఏర్పడబోయే ప్రత్యేక దర్యాప్తు బృందం ఈ కేసులను తిరగదోడుతుంది. దాదాపు మూడున్నర దశాబ్దాల క్రితం నాటి వ్యవహారంలో సుప్రీంకోర్టు తీసుకున్న ఈ నిర్ణయం సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో కాంగ్రెస్‌కు ఇబ్బందికరమైనదే.

ఊచకోత బాధితులకు న్యాయం చేయడం కంటే, రాజకీయం చేయడమే ప్రధానమైపోయింది కనుక, ఈ వ్యవహారం ఇంతకాలం ముగింపునకు రాకపోవడంలో విశేషమేమీ లేదు. అధికారంలోకి కొత్తగా వచ్చిన నరేంద్రమోదీ ఢిల్లీ ఎన్నికల సందర్భంగా సిక్కులకు న్యాయం చేస్తానని ప్రమాణం చేశారు. ఇందిర హత్యకు ప్రతిగా కాంగ్రెస్ నాయకులు రోడ్లమీదకు వచ్చి ఊచకోతలను స్వయంగా పర్యవేక్షించారన్న విమర్శలున్న నేపథ్యంలో, ఈ అంశాన్ని తిరగదోడడం ద్వారా రాజకీయంగా లబ్ధిపొందవచ్చునని ఆయన ఆలోచన. కాంగ్రెస్ హయాంలో ఢిల్లీ పోలీసులు, సీబీఐ ఎటువంటి ఆధారాలూ లేవని మూసివేసిన కేసులు మోదీ ప్రభుత్వం ఏర్పాటు చేసిన సిట్ చేతిలోకి వచ్చాయి. 293 కేసులను గాలించిన ఈ బృందం 199 కేసులను ప్రాథమిక దశలోనూ, మరో 42 కేసులను దర్యాప్తు కాస్తంత సాగించిన తరువాత మూసివేసింది. అత్యధిక కేసులను ఆదిలోనే ముగించేయడానికి ప్రధాన కారణం సాక్షులూ, నిందితులూ జీవించిలేకపోవడమే. మోదీ ప్రభుత్వం ఏర్పాటు చేసిన సిట్ కూడా గతంలో మాదిరిగానే సరైన ఆధారాల్లేవంటూ ఇలా కేసులు మూసివేయడంపై ఖిన్నులైన సిఖ్ గురుద్వారా ప్రబంధక్ కమిటీ సభ్యుడు గుర్లాద్ సింగ్ కెహ్లాన్ ప్రజాప్రయోజన వ్యాజ్యంతో సుప్రీంకోర్టును ఆశ్రయించారు. దీనితో సుప్రీంకోర్టు ఇద్దరు రిటైర్డ్ సుప్రీంకోర్టు న్యాయమూర్తులను సిట్ చేపట్టిన కేసులను పునఃపరిశీలించవలసిందిగా నియమించింది.

గత ఏడాది సెప్టెంబరులో పని ప్రారంభించిన వీరిద్దరూ సీల్డు కవర్‌లో తమ అభిప్రాయాన్ని న్యాయస్థానానికి నివేదించారు. 293 కేసుల్లో 186 కేసులు సరైన విచారణ జరగకుండానే మూతపడినట్టుగా ఈ మాజీ న్యాయమూర్తులు నిర్ధారించారు. వారి నివేదిక మేరకు ఈ కేసులపై మరొక దర్యాప్తు బృందాన్ని ఏర్పరచి, తానే పర్యవేక్షించాలని సుప్రీంకోర్టు బుధవారం నిర్ణయించుకుంది. ఒక మాజీ న్యాయమూర్తి ఆధ్వర్యంలోని కమిటీ ఇలా నిజనిర్ధారణ, దర్యాప్తు, ప్రాసిక్యూషన్ బాధ్యతలు చేపట్టడం విశేషమే.

కాంగ్రెస్ నాయకులే స్వయంగా దురాగతానికి పాల్పడ్డారని విమర్శలున్న నేపథ్యంలో, ఆ పార్టీ ఏలుబడిలో సాగిన దర్యాప్తులు తమకు న్యాయం చేయలేదని బాధితులు భావించడం సహజం. కానీ సంఘటన జరిగిన ముప్పయ్యేళ్ళ తరువాత మోదీ ప్రభుత్వం ఏర్పాటు చేసిన సిట్ కూడా, దీర్ఘకాలం ఈ కేసులను కిందామీదా పరీక్షించి, అదనంగా మరో 42 కేసులను మూసివేయాలని నిర్ధారించడం విశేషం. కేవలం పన్నెండు కేసుల్లోనే ఇది ఆరోపణలు నమోదు చేసింది. కాంగ్రెస్ సహా అన్ని పార్టీలూ, సిక్కు సంస్థలు, సంఘాలు సుప్రీంకోర్టు నిర్ణయాన్ని స్వాగతించాయి. ఉపరితలంలో మెచ్చుకున్నప్పటికీ, మరొకమారు గతాన్ని తవ్వితీయాలన్న సుప్రీం నిర్ణయం కాంగ్రెస్‌కు సమస్యాత్మకమైనదే. అంతిమంగా కొత్త సిట్ ఏం తేలుస్తుందన్నది అటుంచితే, సుప్రీంకోర్టు కారణంగా మరొకమారు కాంగ్రెస్ సిక్కు వ్యతిరేక పార్టీ అన్న వాదన తెరమీదకు వస్తుంది. దర్యాప్తు సాగుతున్నంత కాలం చర్చల్లో కాంగ్రెస్ రాక్షసత్వం మీద విమర్శలు వెల్లువెత్తుతాయి. సిక్కుల ఊచకోత ఆధునిక భారత దేశ చరిత్రలో అత్యంత విషాదకర ఘటన. ఇందిరహత్యకు ప్రతీకారంగా అప్పటి కాంగ్రెస్ నాయకులు కొందరు మూకలను వెంటేసుకొని మూడు రోజుల పాటు దేశరాజధానిలో ఊచకోతలు సాగించారన్నది విమర్శ. ఢిల్లీలోనే కాక, దాని పొరుగు రాష్ట్రాల్లోనూ, సిక్కులున్న మిగతారాష్ట్రాల్లోనూ ఈ మారణకాండ సాగింది. ఢిల్లీలో రెండువేల మంది, దేశం మొత్తంమీద 2,800 మంది మరణించారని అధికారిక లెక్కలు చెబుతున్నప్పటికీ, అనధికారిక అంచనాలు రెండుమూడు రెట్లున్నాయి. దాడుల కారణంగా 20వేల మంది సిక్కులు ఢిల్లీ వదిలి పారిపోయారు. ఈ దారుణాన్ని దర్యాప్తు చేసిన నానావతి కమిషన్ కాంగ్రెస్ నాయకుడు జగదీష్ టైట్లర్ పాత్రను నిర్ధారించింది కానీ, ఆయన దానిని తప్పుడు గుర్తింపుగా కొట్టిపారేశారు. సీబీఐ ఆయనమీద కేసులు మూసివేసింది. సిక్కుల ఊచకోతకు ప్రధాన కారకులన్న ఆరోపణలు ఎదుర్కొన్నవారిలో సజ్జన్‌కుమార్ కూడా ఒకరు. ఈ ఊచకోతలపై గత మూడుదశాబ్దాల కాలంలో డజనుకుపైగా కమిషన్లు, కమిటీలు ఏర్పడినా న్యాయం జరగలేదన్న సిక్కుల బాధను తీర్చలేకపోయాయి. ఇప్పుడు, 186 ఉదంతాల్లో అన్యాయం జరిగిందని నిర్ధారించుకొని, స్వయం పర్యవేక్షణలో కొత్త సిట్ ఏర్పాటుకు దిగిన సుప్రీంకోర్టు ఎంతమందికి న్యాయం చేకూర్చ గలదో చూడాలి.

ఎలక్ట్రో హోమియోలో 'మేటి'!

'ఫాదర్ ఆఫ్ ద ఎలక్ట్రో హోమియోపతి'గా పిలువబడే కౌంట్ సీజర్ మేటి (సి.సి.మేటి) జనవరి 11, 1865న ఇటలీలోని బొలాగ్న పట్టణంలో జన్మించారు. సి.సి.మేటి మానవ శరీర శాస్త్రం, అవయవ నిర్మాణ శాస్త్రం, భౌతిక శాస్త్రం, వృక్ష శాస్త్రాల్లో ఎన్నో పరిశోధనలు చేసి కొత్త విషయాలను కనుగొన్నారు. ఆయన పెంపుడు కుక్క తనకైన గాయాన్ని తన తోటలోని ఒక మొక్క ఆకులు తిని మాన్పుకోవడం గమనించి ఎలక్ట్రో మోమియోపతి విధానానికి నాంది పలికారు. సి.సి.మేటి ఆ మొక్క ఆకులను గాయాలైన వారికి ఇచ్చారు. ఫలితం కనిపించడంతో, చాలా రకాల మొక్కలను విశ్లేషించి రకరకాల రోగాలకు మందులు కనుగొన్నారు. రోగి తత్వాన్ని బట్టి ఎలక్ట్రో హోమియోపతి మందులను రూపొందిస్తారు. ఎలక్ట్రో హోమియోపతి ద్వారా అంతకుముందు ఎలాంటి మందులకు తగ్గని రోగాలను మేటి తగ్గించారు. మొదట ఇటలీలో ప్రాచుర్యం పొందిన ఈ వైద్య విధానం ఆ తరువాత జర్మనీ, ఇంగ్లాండ్, ఫ్రాన్స్, అమెరికా, కెనడా తదితర దేశాలలో ఎంతో ప్రాచుర్యం పొందింది. మనదేశంలో 1885లో కర్ణాటకలోని మంగళూరు ప్రాంతంలో డాక్టర్ అగస్టిన్, ఫాదర్ ముల్లర్ ద్వారా మొదటగా ఈ వైద్యం ప్రవేశించింది. తరువాత చాలా సంస్థలు ఎలక్ట్రో హోమియోపతి కళాశాలలను స్థాపించాయి. వేలమంది ఈ వైద్యపద్ధతిని అనుసరించారు. సరళమైన, దుష్ప్రభావాలు లేని మందులతో చేసే ఎలక్ట్రో హోమియోపతి వైద్య విధానాన్ని ప్రజలు నెమ్మదిగా ఆదరిస్తున్నారు.

■ డాక్టర్ గంజి గంగాధర్

ఎలక్ట్రో హోమియోపతి వైద్యుల సంఘం

(నేడు ఎలక్ట్రోహోమియోపతి పితామహుడు సి.సి.మేటి జయంతి)

వ్యాసాలు, ఉత్తరాలు పంపవలసిన మెయిల్: editpage@andhrajyothy.com

అంబేడ్కర్ డి.లిట్ డే ఉత్సవాలు

శతాబ్ద కాలం క్రితమే అనగా మే 9, 1916న కొలంబియా విశ్వ విద్యాలయంలో పరిశోధక విద్యార్థిగా ఉన్న అంబేడ్కర్ తన 25వ యేట నల్ల తెల్ల రంగులకు అతీతంగా భారత్‌లో కొనసాగుతున్న కుల వివక్ష గురించి "ఆరిజిన్ ఆఫ్ కాస్ట్" (కులాల పుట్టుపూర్వోత్తరాలు వాటి పనితీరు పుట్టుక, అభివృద్ధి) అనే విప్లవాత్మక సిద్ధాంత పత్రాన్ని ఆంత్రోపాలజీ సెమినార్‌లో సమర్పించారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని 2016లో శతాబ్ది ఉత్సవాలను కొలంబియా విశ్వవిద్యాలయం ఘనంగా నిర్వహించింది. మన దేశంలో ఉస్మానియా విశ్వవిద్యాలయం మాత్రమే నిర్వహించింది. మొట్టమొదటి సారిగా అంతర్జాతీయ విశ్వవిద్యాలయాలలో కుల వివక్ష, అంటరానితనం గురించి అంబేడ్కర్ చేసిన పరిశోధన ప్రపంచ మేధావుల వేదికగా పేరొందిన ఇండియన్ యాంటిక్వేరీ జర్నల్‌లో 1917 మే సంచికలో ప్రచురించబడింది. అట్టడుగు అంటరాని కులంలో పుట్టి అంతర్జాతీయ ప్రమాణాలు కల్గిన విశ్వవిద్యాలయాల్లో డాక్టరేట్ పట్టా పొందిన మొదటి భారత మహానేత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్. ఆయనకు రెండుసార్లు ఎకనామిక్స్‌లో నోబెల్ బహుమతికి అర్హత కల్గిన ఆర్థిక వేత్తగా ప్రపంచ మేధావులు గుర్తించినప్పటికి ఆనాటికి ఎకనామిక్స్‌లో నోబెల్ బహుమతి లేదు. 1968 సంవత్సరంలో మాత్రమే ఎకనామిక్స్‌ను నోబెల్ చేర్చారు. ఇంత కాలం మనం అంబేడ్కర్‌ను సామాజిక శాస్త్రవేత్తగానే ఎక్కువగా చదివాము కాని గొప్ప ఆర్థిక వేత్త అని గ్రహించాలి. ప్రపంచ మేధావి అయిన డాక్టర్ బి.ఆర్. అంబేడ్కర్ ప్రతిభను అమెరికాలోని కొలంబియా విశ్వవిద్యాలయం మొట్టమొదటిగా 1917లోనే గుర్తిస్తే, భారతదేశంలో 36 సంవత్సరాల తర్వాత ఉస్మానియా విశ్వవిద్యాలయం మాత్రమే జనవరి 12, 1953లో ఆయన ప్రతిభను గుర్తించి గౌరవ డాక్టరేట్ ఇచ్చింది. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని జనవరి 11, 12, 2018లో "డాక్టర్ బి.ఆర్. అంబేడ్కర్ రాజ్యాంగ తత్వం" అనే అంశంపై గ్లోబల్ సెమినార్‌తో పాటు, 66 సంవత్సరాల డి.లిట్ డే ఉత్సవాలను కూడా అధికారికంగా నిర్వహిస్తున్నాము.



భారత్‌లో లాగే నేడు భారతీయులు వలస వెళ్ళిన అన్ని దేశాల్లోనూ కులాల వారిగా వాడలను నిర్మించుకొని హేయమైన కుల వివక్ష, అంటరానితనాలను పాటిస్తున్నారు. ఇదే విషయాన్ని బాబా సాహెబ్ అంబేడ్కర్ తన పరిశోధన గ్రంథం ఆరిజన్ ఆఫ్ క్యాస్ట్‌లో 1916లోనే హెచ్చరించారు.

ఒకనాడు కేవలం భారతదేశానికి మాత్రమే పరిమితమైన కుల వివక్ష నేడు ప్రపంచ వ్యాప్తంగా వలసల రూపంలో కొనసాగుతున్నది. ప్రముఖ చరిత్రకారుల అంచనా ప్రకారం కులవివక్ష ఉత్తర, దక్షిణమెరికా, ఆఫ్రికా దేశాలు, మారిషస్, సూరినామ్, మలేషియా, కరేబియన్, బ్రిటన్ ఇంకా ఇతర దేశాల్లోనూ కుల వివక్ష జాతి వివక్షలాగే ప్రపంచ సమస్యగా మారింది. వలస వెళ్ళిన ఒక కోటి 90 లక్షల మంది భారతీయులు వారితో పాటే వారి కులాన్ని కూడా తీసుకెళ్ళారు. భారత్‌లో లాగే నేడు భారతీయులు వలస వెళ్ళిన అన్ని దేశాల్లోనూ కులాల వారిగా వాడలను నిర్మించుకొని హేయమైన కుల వివక్ష, అంటరానితనాలను పాటిస్తున్నారు. ఇదే విషయాన్ని బాబా సాహెబ్ అంబేడ్కర్ తన పరిశోధన గ్రంథం ఆరిజన్ ఆఫ్ క్యాస్ట్‌లో 1916లోనే హెచ్చరించారు. భారత దేశంలో హిందువులు ప్రపంచ దేశాల్లో ఎక్కడికెళ్ళినా వారితో పాటే వారి కులాన్ని కూడా వెంటబెట్టుకెళుతారని అప్పుడు కుల వివక్ష అంతర్జాతీయ సమస్యగా మారుతుందని ఆనాడే గ్రహించిన ప్రపంచ మేధావి అంబేడ్కర్. ఈ సమస్యను ఎలా పరిష్కరించాలో తన "కుల నిర్మూలన గ్రంథం"లో సూచించారు. అయితే ఇంత కాలం, భారతదేశంలో కులాల పుట్టుకకు కారణమైన తొలి కులాన్ని గురించి పట్టించుకోకుండా పశుపక్ష్యాదుల మాదిరిగానే కులాలన్నీ ఒక్కొక్కటి ఒక్కో మూలంతో సహజంగానే పుట్టుకొచ్చాయని, వాటి వాటి వృత్తుల ప్రకారం స్థిరపడి వ్యాప్తి చెందాయన్న సిద్ధాంతాన్ని సమర్థిస్తూ ప్రపంచానికి ఇదే వాస్తవం అని నమ్మిస్తూ వచ్చారు. ఊహాజనిత పురాణాలనే శాస్త్రీయ వాస్తవికవాదంగా నమ్మించే ప్రయత్నం చేశారు. అందువల్ల భారత్‌లో కుల వ్యవస్థ అనేది ఒక పెద్ద కుట్ర, సామాజిక అణిచివేత సాధనం అనే వాస్తవాలు ప్రపంచానికి తెలియకుండా పోయాయి. తమ కులం ఎంతటి హీనమైన వృత్తి చేస్తున్నప్పటికీ అది ఎంతో గొప్పది అయినట్టూ, తమ కుల సాంప్రదాయాలు బానిసత్వాన్ని ప్రబోధిస్తున్నప్పటికి వాటినే గొప్పగా ఆచరిస్తూ తమ కులమే ఆదిమ కులమని ప్రతికులం అనుకుంటూ పుక్కిటి కుల పురాణాల గాథలను వాడవాడల ప్రచారం చేస్తూ మనుస్మృతి ప్రణాళికను తమంతట తామే అనుసరిస్తున్నారు. అందుకే బాబాసాహెబ్ అంబేడ్కర్ ప్రపంచ క్రైస్తవ సమాజమంతా యేసుక్రీస్తు జన్మదినాన్ని జరుపుకునే డిసెంబర్ 25న ఈ దేశంలో అన్ని అసమానతలకు మూలమైన మనుస్మృతిని తగులబెట్టి ప్రపంచమంతా ఈ అంశంపై చర్చించుకునే విధంగా చేశారు. నిజానికి, కులతత్వం అనేది మానవజాతి చరిత్రలోనే ఒక సామాజిక నేరమని, అగ్రకులాల నుండి అంటరాని కులాల వరకు తుచ తప్పక పాటిస్తున్న సామాజిక అణిచివేత సాధనంగా కొనసాగుతున్న కులవ్యవస్థకు మూలకారణం ఆదిమ బ్రాహ్మణకుల వర్ణమే అని బాబాసాహెబ్ అంబేడ్కర్ మే 9, 1916లో ప్రపంచంలోనే నిరూపించి ఇండియన్ ఎథ్నాలజీ లేదా ఇండాలజీ శాస్త్ర పునాదులను కదిలించారు.

అంబేడ్కర్ 'ఆరిజన్ ఆఫ్ క్యాస్ట్' నిర్వచనం ప్రకారం 'మొదట్లో ఒకే క్యాస్ట్ వుండింది. ఆ కాస్ట్‌తోనే అంతా ఆరంభం అయింది' అంటే దాని అర్థం యే క్యాస్ట్ కూడా ఇండిపెండెంట్‌గా యేర్పడలేదు. ప్రతి కులమూ ఆ మొదటి బ్రాహ్మణ కుల / వర్ణం బలప్రయోగం కారణంగానే ఏర్పడింది! అంతే కాదు కులాలు నిరంతరం పరస్పర ప్రభావంతో మార్పులు చెందుతూ వుంటాయి. కులాలు పరిపూర్ణంగా ఏర్పడడం అనేది యెప్పటికీ వుండదు. మార్పుచెందడం నిరంతర ప్రక్రియ. ఈ విధమైన కులవ్యవస్థ కారణంగా ఏర్పడిన వివక్ష వలన భారత, సాంఘిక, ఆర్థిక, రాజకీయ సాంస్కృతిక రంగాల్లో వివక్షతకు పునాదులు ఏర్పడ్డాయి. అంబేడ్కర్ తన జీవిత కాలం అంతా కుల నిర్మూలన కోసం పాటుపడ్డారు. హిందూమతం పునాదిగా ఏర్పడ్డ ఈ కుల వ్యవస్థను ధ్వంసం చేయడానికి ప్రత్యామ్నాయంగా బౌద్ధమతాన్ని ఎంచుకున్నారు. రాజ్యాంగం ద్వారా కుల వివక్ష, అంటరానితనాల నిర్మూలనకు చట్టబద్ధత కల్పించారు. అందులో భాగంగా ఏర్పడిందే ఆర్టికల్ 17 (అంటరానితనం నిర్మూలన). అలాగే జనాభా దామాషా పద్ధతిన విద్యా, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో ఎస్సీ, ఎస్టీలకు ఆర్టికల్ 15(4), 16(4) ద్వారా రిజర్వేషన్లు కల్పించారు. ఈ పద్ధతి ద్వారానే వెనుకబడిన వర్గాలైన బీసీలు, మైనార్టీలు రిజర్వేషన్లు వర్తించే విధంగా రాజ్యాంగ రక్షణలు రూపొందించారు. రాజ్యాంగ రచన ద్వారా అంటరాని కులాలకు, వెనుకబడిన వర్గాలకు, మైనార్టీలకు సామాజిక ఆర్థిక, రాజకీయ, సాంస్కృతిక న్యాయం కల్పించారు. ఆనాటి నిజాం రాజుకు ఉస్మానియా విశ్వవిద్యాలయ రూపకల్పనకు, విద్యారంగానికి సంబంధించి తగు సూచనలు చేశారు. అంబేడ్కర్ కృషిని, ప్రతిభను గుర్తించిన నిజాం రాజు ఉస్మాన్ అలీఖాన్‌భారతదేశంలో మొదటిసారిగా అంబేడ్కర్‌కు డాక్టరేట్ ఇచ్చి గౌరవించారు. అంతే కాక ఔరంగబాద్‌లో బాబాసాహెబ్ స్థాపించిన సిద్ధార్థ్ విద్యాలయాలకు భూమి ఇచ్చి ప్రోత్సహించారు. నిజాం పరిపాలనలో ఎన్ని తప్పులు జరిగినా దళితులు, మైనార్టీలకు సంబంధించి నేటికీ నిజాంను మించిన పాలకుడు లేడు.

ప్రపంచ మేధావి అయిన డాక్టర్ అంబేడ్కర్ పేరుతో ప్రపంచ శ్రేణి విశ్వవిద్యాలయాలు 'పరిశోధనా పీఠాలు' ఏర్పాటుచేస్తే, ఉస్మానియాలో కనీసం స్టడీ సెంటర్ కూడా లేదు. అంబేడ్కర్ పేరుతో పరిశోధనా పీఠం ఏర్పాటు చేయాలని, జనవరి 12ను జాతీయ ప్రతిభావంతుల దినోత్సవంగా గుర్తించాలనీ డిమాండ్ చేస్తూ జనవరి 11, 12 (నేడు, రేపు) 'డాక్టర్ అంబేడ్కర్ రాజ్యాంగ తత్వం' అనే అంశంపై గ్లోబల్ సెమినార్ నిర్వహిస్తున్నాం.

■ డాక్టర్ గాలి వినోద్ కుమార్

ఉస్మానియా విశ్వవిద్యాలయం

వివాహబంధంపై న్యాయమీమాంస

158 సంవత్సరాలుగా కేవలం పురుషులకు మాత్రమే ఆరోపణ చేసే అవకాశాన్ని కల్పించిన సెక్షన్ 497కు సవరణలు తెస్తారా? తప్పు చేసిన భర్తమీద, అందుకు సహకరించిన వారిమీద ఆరోపణ చేసే అవకాశం స్త్రీలకూ ఇస్తారా? వివాహబంధాన్ని ఉల్లంఘించిన భార్య మీద నేరారోపణ చేసే అధికారం భర్తకు ఇస్తారా? అసలు శిక్షా స్వరూపంలోనే మార్పులు తెస్తారా?

వివాహేతర సంబంధం విషయమై ఆరోపణలకు సంబంధించిన కేసులలో భారతీయ శిక్షాస్మృతిలోని సెక్షన్ 497 ద్వారా కేవలం భర్తకు మాత్రమే ఆరోపణలు చేయగల అధికారం ఉన్నది. మగవారిని మాత్రమే చట్టం విచారిస్తుంది. ఆడవారికి భర్త మీద సంబంధిత స్త్రీ మీద కేసు వేయడానికి వీలులేదు. ఈ పరిస్థితుల మీద, గతంలో పూర్వపు సుప్రీం కోర్టు ఫుల్ బెంచ్ ఒక తీర్పు ఇచ్చింది. ఆ తీర్పును పునఃపరిశీలించాల్సిందిగా సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి దీపక్ మిశ్రా నాయకత్వంలోని ముగ్గురు న్యాయమూర్తుల ధర్మాసనం ఐదుగురు న్యాయమూర్తులతో కూడిన ఒక విస్తృత ధర్మాసనానికి నివేదించింది. అంతేగాక ఆ కేసును బదలాయిస్తూ చీఫ్ జస్టిస్ మిశ్రా నాయకత్వంలోని ధర్మాసనం ఒక తీర్మానం చేసింది. ఈ తీర్మానంతో వివాహేతర సంబంధాల కేసులలో స్త్రీ పురుషుల హక్కులకు సంబంధించిన చర్చ మరోసారి తెరమీదకు వచ్చింది.

ప్రస్తుతం అమలులో ఉన్న చట్టంలో వివాహేతర సంబంధం పెట్టుకున్న భార్యను విచారించే అధికారం భర్తకు లేదు, అదేవిధంగా వివాహేతర సంబంధం పెట్టుకున్న భర్తను విచారించే అధికారం భార్యకు లేదు. కేవలం భార్యతో సంబంధం పెట్టుకున్న పర పురుషుణ్ణి మాత్రమే శిక్షించేందుకు చట్టంలో అవకాశం ఉన్నది. అది కూడా భర్తకు మాత్రమే ఆ అధికారం ఉన్నది. బంధాన్ని ధిక్కరించిన భార్యను, నమ్మకాన్ని వంచించిన భర్తను విచారించడానికి చట్టంలో చోటులేదు. విచిత్రంగా మూడోవ్యక్తిని మాత్రమే అది కూడా మగవాడిని మాత్రమే బాధ్యుణ్ణి చేయడం నేటి చర్చకు ప్రధాన కారణం. అదే సందర్భంలో భార్యకు అటువంటి కేసులు దాఖలు చేసే అధికారం లేకపోవడం రాజ్యాంగ విరుద్ధమనేది మరో ప్రధాన ఆరోపణ.

భారతీయ శిక్షాస్మృతిలోని సెక్షన్ 497 చట్టబద్ధతను, పక్షపాత ధోరణిని గత 158 సంవత్సరాలుగా వివిధ వేదికల మీద అటు పురుష సమాజం ఇటు స్త్రీవాదులు ప్రశ్నిస్తూనే ఉన్నారు. అయితే ఇప్పుడు ఆ సెక్షన్‌పై జరుగుతున్నంత విస్తృత చర్చ ఎప్పుడూ జరగనేలేదని చెప్పవచ్చు. అసలు సెక్షన్ 497లో కేవలం వివాహేతర సంబంధం పెట్టుకున్న పరపురుషుణ్ణి మాత్రమే శిక్షించేవిధంగా జరిగిన ఏర్పాటును పరిశీలిస్తే వివిధ వాదనలు వినిపిస్తాయి. పూర్వకాలంలో స్త్రీలు పురుషుని ఆస్తిగా పరిగణించబడేవారు, ఒక పురుషుని ఆస్తిని అతని అనుమతి లేకుండా లోబరుచుకోవడం శిక్షార్హమనే నాటి ఆలోచనలకు ప్రతిరూపమే ఈ అధికరణ అని స్త్రీవాదులు వాదిస్తున్నారు. అయితే స్త్రీ సహజంగా బలహీనురాలని, ముఖ్యంగా భారతీయ సమాజంలో స్త్రీలు స్వతంత్రించి నిర్ణయాలు తీసుకోలేరని, కనుక స్త్రీని పురుషునితో సమానంగా దోషిగా నిలబెట్టడం భావ్యంకాదనే భావనతో చట్టంలో స్త్రీని నిందితురాలుగా పరిగణించలేదని ఉదారవాదులు వాదిస్తున్నారు. ఏది ఏమైనా స్త్రీని నిందితురాలుగా చేర్చకపోవడం ద్వారా ఈ సెక్షన్ స్త్రీ పక్షపాతవైఖరి అవలంబించిందనే వాదన ఒకవైపు వినిపిస్తున్నది. అయినప్పటికీ, వివాహేతరసంబంధం పెట్టుకున్న భర్తను ప్రశ్నించే అధికారం లేకుండా చేయడం, తన భర్తను తప్పుదారి పట్టించిన సదరు పర స్త్రీని విచారించకుండా భార్యను నిరోధించడం రాజ్యాంగంలో 14, 15 అధికరణాల ద్వారా ప్రసాదించబడిన స్త్రీ పురుషులకు సమాన హక్కులు, సమానన్యాయం అనే ప్రాథమిక హక్కును ఉల్లంఘించడమే అవుతున్నదనేది మరో వాదన.



akbar

గడపదాటడానికి అధికారం లేక భర్త చాటున బతికిన నాటి స్త్రీలకు, ఆకాశంలో సగం అన్నింట్లో సగం అంటున్న నేటి స్త్రీలకు మధ్య తేడా గురించి మరి చెప్పనవసరం లేదు. పురుషులతో సమానంగా ముందుకుసాగుతున్న ఈ క్రమంలో స్త్రీలు కూడా పురుషుల వలే పొరపాటు నిర్ణయాలు తీసుకుంటున్నారని చెప్పక తప్పదు. మారిన పరిస్థితులు, స్వతంత్ర ఆలోచనలు, విభిన్న మనస్తత్వాలు ఎన్నో రకాల నిర్ణయాలకు దారితీస్తున్నాయి. విభిన్నకోణంలో చూస్తున్నప్పటికీ, పలురకాలుగా వర్ణిస్తున్నప్పటికీ సెక్షన్ 497 విషయంలో ఆడవారికి కూడా అవకాశమివ్వాలనే వాదన రెండువర్గాల నుంచి వస్తున్నదనేది నిజం. వైవాహిక విలువలకు తిలోదకాలిచ్చిన భర్తను, అందుకు సహకరించిన/ప్రోత్సహించిన పరాయి స్త్రీని శిక్షించే అధికారమివ్వాలని ఒకవైపు, మాంగల్య బంధాన్ని కాదని, పరపురుషునితో సంబంధం ఏర్పరచుకున్న భార్యను శిక్షించే అధికారం ఇవ్వాలని మరోవైపు వాదనలు విన్పిస్తున్నాయి. ఈ వాదనల తీరులు వేరైనా వాటి దారొక్కటే. మారిన పరిస్థితులలో ఆర్థిక, సామాజిక స్వాతంత్ర్యం లభించిన స్త్రీ నేడు కేవలం బాధితురాలు మాత్రమే కాదు, అనేక సందర్భాల్లో నిందితురాలు కూడా. ఈ తరుణంలో చట్టసవరణ ఎంతో అవసరం. తప్పుచేసిన స్త్రీని రాళ్ళతో కొట్టిచంపే సౌదీ అరేబియా శిక్షలు అమానుషమైనవి. అదే సమయంలో తప్పులో సమాన బాధ్యత వహించిన భాగస్వామిని కేవలం స్త్రీ అని వదిలేయడమూ పక్షపాతమే అవుతుంది. అది కచ్చితంగా రాజ్యాంగ ప్రాథమిక హక్కులకు విరుద్ధమే. అదే సమయంలో తననే నమ్ముకుని తనవారినందరిని వదిలి వచ్చిన భార్యను మోసం చేసి తప్పుడు దారిలో నడిచిన భర్తను, అతన్ని ప్రోత్సహించిన అతివను ప్రశ్నించే అధికారం భార్యకు ఇవ్వకపోవడం పురుష పక్షపాతమే అవుతుంది.

భారతీయ ముఖ్యంగా హిందూ ధర్మశాస్త్రాల ప్రకారం భార్యాభర్తల మధ్య సంబంధం దైవనిర్ణయం. నైతికవిలువలకు సంబంధించిన విషయం. అదే విధంగా ముస్లిం ధర్మశాస్త్రాల పరంగా ఆలోచిస్తే భార్యాభర్తల సంబంధం ఒప్పందానికి లోబడేది (కాంట్రాక్ట్). ఏ విధంగా చూసినా అది ఇద్దరు వ్యక్తులకు రెండు జీవితాలకు సంబంధించిన వ్యక్తిగత విషయం. ఇందులో మూడో వ్యక్తికి లేదా వ్యవస్థకు స్థానం లేనేలేదు. అటువంటప్పుడు మూడోవ్యక్తిని భార్యా లేదా భర్త ఆహ్వానించడం అనైతికం, మోసం అవుతుంది లేదా ఒప్పందం ఉల్లంఘించడం అవుతుందే తప్ప మూడోవ్యక్తి తప్పిదమెలా అవుతుంది? వారు బాధ్యులెలా అవుతారు అనేది నేటి ఆలోచన. ముఖ్యంగా బంధాన్ని ఉల్లంఘించిన భాగస్వామిని వదిలేసి కేవలం స్వేచ్ఛగా వచ్చిన ఆహ్వానానికి అంతే స్వేచ్ఛగా స్పందించిన మూడోవ్యక్తిని శిక్షించడం ధర్మ సూక్ష్మానికి అంతుపట్టని విషయమే. గతంలో సుప్రీం కోర్టు శృంగారం అనేది ఇద్దరు వయోజనులకు సంబంధించిన వ్యక్తిగత విషయమని, వారి మధ్య అంగీకారం స్వేచ్ఛాపూర్వకమైనదైతే ఆ శృంగారం చట్టవిరుద్ధం కానేకాదు అని స్పష్టం చేసింది. ఈ విషయాన్ని ప్రస్తుత చర్చ సందర్భంగా పరిశీలిస్తే పై వాదనలో ఎంతో కొంత బలమున్నదనేది వాస్తవం. కొసమెరుపు ఏమిటంటే 2015లో తొమ్మిది మంది న్యాయమూర్తులతో కూడిన దక్షిణకొరియా అత్యున్నత న్యాయస్థానం 1953నుంచి ఆ దేశంలో అమల్లోఉన్న వివాహేతర సంబంధం నేరమనే అధికరణ రాజ్యాంగ విరుద్ధమని ప్రకటించింది. వివాహేతర సంబంధం ఖండించతగిందే అయినప్పటికీ, అనైతికమే అయినప్పటికీ, శృంగారం వయోజనుల వ్యక్తిగత విషయం. దానిపై ఏరకమైన విచారణ చేపట్టినా అది పౌరుల వ్యక్తిగత విషయంలో ప్రభుత్వ జోక్యమే అవుతుందనేది దక్షిణ కొరియా న్యాయస్థానం వారి తీర్పు. యూరోపియన్ యూనియన్‌లోని అనేకదేశాల్లో, అమెరికా సంయుక్త రాష్ట్రాల్లోని అనేక రాష్ట్రాల్లో వివాహేతర సంబంధం భాగస్వామిని మోసం చేయడంగా పరిగణిస్తూ, వ్యక్తిత్వాన్ని పరిశీలించే గీటురాయిగా అభివర్ణిస్తున్నారు. అయినా అనేక సందర్భాల్లో అపరాధ రుసుము మాత్రమే విధిస్తూ, తేలికపాటి శిక్షలనే నిర్ణయిస్తున్న తీరు పరిశీలిస్తే కొరియా న్యాయస్థానం తీర్పు కొత్త ఆలోచనలకు బీజం వేసిందనే చెప్పవచ్చు.

వివాహేతర సంబంధాల కేసుల్లో శిక్షలను సరళతరం చేయాలని ఐక్యరాజ్య సమితి అనేక సందర్భాల్లో ప్రపంచదేశాలకు విజ్ఞప్తి చేసింది. ఇందుకు కారణం ఆయా దేశాల్లోని చట్టాలు ముఖ్యంగా ఆడవారిపాలిట వివక్షచూపుతూ వారికి శాపంగా మారడమే. విచిత్రంగా భారతదేశంలో పరిస్థితి మాత్రం అందుకు విరుద్ధంగా ఉన్నది. తప్పుచేసిన భర్తను, అందుకు సహకరించిన స్త్రీని శిక్షించే హక్కు లేకపోవడం పక్షపాతమే అవుతుందన్నది భారతీయ స్త్రీవాదుల ఆరోపణ. లా కమిషన్ తన 42వ రిపోర్టులో స్పష్టంగా సెక్షన్ 497 విషయంలో స్త్రీ, పురుషులిద్దరికీ సమాన అవకాశం కల్పించే విధంగా మార్పులు చేయాలని కోరింది. ఏది ఏమైనా సుప్రీం కోర్టు మళ్ళీ ఒకసారి సమస్యను విస్తృత ధర్మాసనానికి పంపడం, కేంద్రప్రభుత్వ అభిప్రాయాన్ని కోరడం ముదావహం. 158 సంవత్సరాలుగా కేవలం పురుషులకు మాత్రమే ఆరోపణ చేసే అవకాశాన్ని కల్పించిన సెక్షన్ 497కు సవరణలు తెస్తారా? తప్పు చేసిన భర్తమీద అందుకు సహకరించిన వారిమీద ఆరోపణ చేసే అవకాశం స్త్రీలకు కూడా ఇస్తారా? వివాహబంధాన్ని ఉల్లంఘించిన భార్యమీద నేరారోపణ చేసే అధికారం భర్తకు ఇస్తారా? అసలు శిక్షా స్వరూపంలోనే మార్పులు తెస్తారా? వేచి చూడాలి.

■ చందుపట్ల రమణకుమార్ రెడ్డి

న్యాయవాది

తెలుగు సభల్లో అలిశెట్టి ప్రభ

విజయవాడలో జరిగిన ప్రపంచ తెలుగు రచయితల మహాసభల (2015, ఫిబ్రవరి)కు వెళుతూ నటుడు బ్రహ్మానందం ఫోన్ చేసి 'తెలుగు కవిత్వంలో శ్రీశ్రీ తర్వాతి స్థానం అలిశెట్టి ప్రభాకర్‌దేనని సభలో ప్రస్తావిస్తాను. నీకు తెలిస్తే సంతోషిస్తావని చెబుతున్నాను' అన్నారు. అక్షరాలా ఆ మాటే అనకున్నా తన ప్రసంగంలో ప్రభాకర్ పేరును ఉదహరిస్తూ బ్రహ్మానందం ఒక కవిత కూడా వినిపించారు. తన కవిత్వం ద్వారా పాఠకుల హృదయాలకు చేరువైనంతగా అలిశెట్టికి సాహితీ చర్చల్లో, సభలు సమావేశాల్లో చోటు లభించిన సందర్భాలు గతంలో అరుదుగానే ఉన్నాయి.

గత డిసెంబర్‌లో 15 నుండి 19 తారీఖుల్లో 5 రోజుల పాటు హైదరాబాద్‌లో తొలి తెలంగాణ ప్రభుత్వం నిర్వహించిన ప్రపంచ తెలుగు మహాసభల్లో మాత్రం ప్రభాకర్‌కు విశేషస్థానం లభించింది.

మహాసభల సందర్భంగా తెలుగు సాహిత్యంపై చెరగని ముద్ర వేసిన వారి పేర్లతో స్వాగత తోరణాలు ఏర్పాటు చేస్తున్నట్లుగా నిర్వాహకులు పది రోజుల ముందే తెలుగువెలుగుల పేర్లను వెల్లడించారు. 62 మంది జాబితాలో అలిశెట్టి ప్రభాకర్ ఒకరు. కాళోజీ, దాశరథుల సరసన ప్రభాకర్ నిలబడడం ఆయన అభిమానులకు కన్నుల పండుగే. మరో విప్లవోద్యమ ప్రేమికుడు గూడ అంజయ్య ఇందులో ప్రభాకర్‌కు తోడుగా ఉన్నారు. జ్వాలాముఖి, చెరబండరాజు ఇద్దరూ తెలంగాణ బిడ్డలే అయినా వారికి తోరణం లభించలేదు.

సభలు జరిగినన్ని రోజులు కవి సమ్మేళనం నిర్వహించిన ఇందిరా ప్రియదర్శిని ఆడిటోరియంకు 'అలిశెట్టి ప్రభాకర్ ప్రాంగణం' అని పేరు పెట్టడం ఎంతో సహేతుకంగా ఉంది. మహామహులను కాదని అలిశెట్టి పేరునే ఎంచుకోవడం యువ కవులకు ఉత్సాహభరితమైంది. ప్రభాకర్ స్మరణగా ఎంతో మంది ఆ తోరణం ముందు ఫొటోలు దిగడమే అందుకు తార్కాణం. ప్రధానవేదిక అయిన ఎల్‌బీ స్టేడియంలో స్తంభాలకు బిగించిన ప్రముఖుల చిత్రాలతో కూడా అలిశెట్టి ప్రభాకర్ కనబడతాడు. మాన్యుల కవి కాదు, సామాన్యుల కవిగా ముద్రపడిన అలిశెట్టి ప్రభాకర్‌కు ఈ ప్రభుత్వం ఇచ్చిన గౌరవం ఆయనపై సరికొత్త అంచనాలకు బాటలువేస్తుంది. సభల సందర్భంగా విడుదలచేసిన మోనోగ్రాఫ్‌లలోనూ అలిశెట్టికి స్థానం ఉండాల్సింది.


అలిశెట్టిని నిలబెట్టింది ఆయన కవిత్వంలోని పదునే అని కొత్తగా చెప్పవలసిన అవసరం లేదు. తెలుగు కవిత్వంతో పరిచయమున్నవారు ఆయన పేరునే కాకుండా ఆయన కవిత్వపు నాలుగు పంక్తులను కూడా గుర్తుపెట్టుకోవడం ప్రభాకర్‌కు దక్కిన అరుదైన గౌరవం. ఆయన కవిత్వంలో సూటిదనం, సరళతలతో పాటు ఒకింత సాహసం కూడా ఉండడమే ప్రభాకర్‌ను భిన్న కవిగా, జనపక్షపాతిగా నిలబెట్టింది.

'గుడిసెలే మేడల్ని కడతాయి
అయినా..
మేడలే గుడిసెల్ని కొడతాయి' అని రాశాడు ప్రభాకర్.

ఇంత సరళంగా, సూటిగా శ్రమదోపిడీని వివరించిన కవి తెలుగులో మరొకరు కానరారేమో... పరిమిత భాషాజ్ఞానం ఆయన్ను పిడికెడు పదాలతోనే విస్ఫోటనాలు సృష్టించే విద్య వైపు నడిపించింది. 'తను శవమై... ఒకరికి వశమై...' అన్న పంక్తులతో మొదలయ్యే వేశ్య కవిత పదవిన్యాసానికి పరాకాష్ఠ.

ప్రభాకర్ బతికున్నప్పుడు ఏ సత్కారాలను ఆశించలేదు, పైగా.. శాలువల, పురస్కారాల సంస్కృతిని వ్యతిరేకిస్తూ కవితలల్లినాడు. బతికుంటే సభల పట్ల ఆయన దృక్పథం ఎలా ఉండేదో ఆయన అక్షరాలే తేటతెల్లం చేస్తాయి. నడుస్తున్న రాజకీయాల్ని తీవ్రంగా వ్యతిరేకించిన వ్యక్తి, కవి అలిశెట్టి. ఆయన దీర్ఘ కవిత 'నిజరూపం'లో – 'జలగ'లూ, 'బ్రహ్మ' జెముళ్లూ/ అవకాశవాది 'రూలుకర్రా'/ 'ఆరణాల కూలీ'/ పునాది లేని 'భవనం' నాచారం 'సన్యాసు'లూ/ వరుసగా ఎవరెవరు ముఖ్యమంత్రులైనా... అంటూ వరసబెట్టి చెబుతూ 'అక్షరాలా అరాచకంలో మార్పుండదు' అంటాడు.

ప్రభాకర్ వ్యక్తిత్వమే ఆయన అక్షరాల్లో ప్రతిఫలించి ఆయన్ని ఉద్యమ కవిగా నిలబెట్టింది. ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నా సినిమాలకు రాసే అవకాశాల్ని తన పాద ధూళితో సమానమని వదులుకున్నాడు. 'ప్రతి సినిమా పోస్టరు/ నెత్తుట్లో తడిసి/ వెండి తెరలన్నీ/ ఎర్రజెండాలైతే/ విప్లవాలన్నీ/ వినోద భరితాలే...' అంటూ సినిమా ద్వారా వచ్చే మార్పును ఎద్దేవా చేశారు.



సభలు జరిగినన్ని రోజులు కవి సమ్మేళనం నిర్వహించిన ఇందిరా ప్రియదర్శిని ఆడిటోరియంకు 'అలిశెట్టి ప్రభాకర్ ప్రాంగణం' అని పేరు పెట్టడం ఎంతో సహేతుకంగా ఉంది. మహామహులను కాదని అలిశెట్టి పేరునే ఎంచుకోవడం యువ కవులకు ఉత్సాహభరితమైంది. ప్రభాకర్ స్మరణగా ఎంతో మంది ఆ తోరణం ముందు ఫొటోలు దిగడమే అందుకు తార్కాణం.

తను రాసి గీసిన కవితా చిత్రాల ఫ్రేమ్‌ల అమ్మకానికీ ముందుకు రాలేదు. ఓసారి ప్రభాకర్ తన కవితాచిత్రాలను చేతిలో పట్టుకొని స్కూటర్ వెనకాల కూచున్నాడు. కోఠి చౌరస్తా వద్ద సిగ్నల్ పడింది. పక్కనే కారులో ఉన్నాయన ప్రభాకర్ చేతిలోని చిత్రాలను చూసి 'సిగ్నల్ దాటాక ఆగమని' అడిగాడు. స్కూటర్ నడుపుతున్నాయన ముందుకెళ్లి ఆపాడు. కారులోంచి దిగొచ్చిన మనిషి 'ఈ ఫ్రేమ్ నాకు కావాలి. ఎంతకిస్తారు?' అని అడిగాడు. అమ్మడానికి కాదని ప్రభాకర్ జవాబిచ్చాడు. కావాలని అడిగిన మనిషి ఎన్టీఆర్‌కు దగ్గరి బంధువు, ఆనాడు పార్లమెంట్ సభ్యుడు స్కూటర్‌పై ప్రభాకర్‌ను తీసుకెళ్లిన మిత్రుడు ఈ మధ్య చెప్పిన విషయమిది. ఇలాంటి విషయాల్ని సైతం తేలిగ్గా తీసుకొనే ఎవరితోనూ పంచుకోని మనస్తత్వం ప్రభాకర్‌ది.

ప్రభాకర్‌కు పర్యవసానాల బెంగలేదు. రాయాలనుకున్న దాన్ని రాసే ధైర్యం ఆయనకుండేది. ఇలా రాస్తే కేసులు పెడతారనో, ఉద్యోగం ఊడుతుందనో, భార్యాపిల్లలు ఇక్కట్ల పాలవుతారనో అనే సందిగ్ధం ఆయన అక్షరాల కాళ్లకు ఎన్నడూ అడ్డం పడలేదు. హైదరాబాద్‌లో ఉన్న రోజుల్లో ఆయన కవిత్వం ఆయన్ని లక్డీకాపూల్‌లోని పోలీసు కార్యాలయంలో నిలబెట్టింది. ప్రభాకర్‌ను ఇంటి నుండి వెంటబెట్టుకొచ్చిన పోలీసుతో అధికారి 'ఈయనేనా అలిశెట్టి ప్రభాకర్' అని డౌటు పడ్డారు. ఔనంటూ ప్రభాకర్ తల ఊపాడు. అనుమానం తీరని అధికారి ప్రభాకర్‌తో ఈ మధ్య రాసిన కవిత్వం చదివి వినిపించమన్నారు. ఆ రోజుల్లో రాసిన 'సిటీ లైఫ్' ఖండికల్ని ప్రభాకర్ వినిపించాడు. అయితే బక్కపలచని ప్రభాకర్ శరీరం, మామూలు దుస్తులు చూసి వివరాలడిగి తెలుసుకున్నాడు. ఈ రాతలన్నీ కట్టిపెట్టి ముందు నీ ఆరోగ్యం కాపాడుకోమంటూ పంపివేశాడు పోలీసు అధికారి.

ఆర్ట్ ఫ్రేంకు వెలకడతానన్న పార్లమెంటు సభ్యునితో పరిచయం పెంచుకొని ఉంటే ఖాకీ పిలుపును గుమ్మం దగ్గరే నిలవరించే అవకాశం ఉండేది. అయితే 'కాసుకో/ కోసుకో/ రాజకీయమా!/ ప్రజలు పనస తొనలు/ వీరు కత్తిమొనలు' అని రాజకీయాల్ని, 'ఎదురు కాల్పుల/ కథలకు/ పోలీసుల/ తుపాకీ గొట్టాలే/ కలాలు' అని ఖాకీ వైఖరిని నిరసించిన ప్రభాకర్ బుర్రకు ఇలాంటి లౌక్యపు ఆలోచనలు తట్టే అవకాశం లేదు.

హైదరాబాద్ వచ్చాక ప్రభాకర్‌కు ఫొటోస్టూడియో చిరునామాగా మిగిలింది గాని ఆదాయ వనరు కాలేదు. కిరాయి చెల్లించలేక విద్యానగర్ నుండి స్టూడియోను నారాయణగూడ నాలా పక్కన పాత దుకాణంలోకి మార్చాడు. నారాయణగూడ ఫ్లైఓవర్ దాటి ఆర్టీసీ క్రాస్‌రోడ్ వైపు మరలే మూల మీద మూడంతస్తుల దుకాణ సముదాం శిథిలావస్థలో నేటికీ చూడవచ్చు. ఇరుకైన మెట్లలో మూడవ అంతస్తుకు ఎక్కిదిగడమే ప్రభాకర్‌కు ఎంతో ఆయాసంగా ఉండేది.

39వ ఏట 1993, జనవరి 12 ఉదయాన ప్రభాకర్ తుదిశ్వాస విడవడంతో భాగ్యం ఇద్దరు కొడుకులతో ఒంటరిదైంది. ప్రభాకర్ చివరి రోజుల్లో తెలుగు విశ్వవిద్యాలయం శిల్పకళ విభాగంలో తాత్కాలిక ఉద్యోగమిచ్చి ఆదుకునే ప్రయత్నం చేసింది. ఆయన మరణం తర్వాత భాగ్యం అదే విశ్వవిద్యాలయంలో దినసరి వేతనంపై కొనసాగుతోంది. ఇంకో మూడు నాలుగేళ్ల తర్వాత ఆమెకు ఉద్యోగ విరమణ తప్పదు. ఒక్కసారిగా నెలజీతం చేతికి రావడం ఆగిపోతే మూడువేల ఇంటి అద్దె చెల్లించడం కూడా సాధ్యపడదు.

"ముళ్లడొంక లాంటి నా బతుకు మీద మురిపాల పూలు పూచి నా కన్నీటి తెరమీద కమనీయ దృశ్యమైన నా భాగ్యానికి..' అని ప్రభాకర్ పుస్తకంలో రాసుకున్నా ఆ అక్షరాలని చదవలేని నిరక్షరాస్యురాలామె.

1980–81 ప్రాంతంలో సినిమా పెట్టుబడి కారణంగా తనఖాపడ్డ శ్రీశ్రీ ఇల్లు మద్రాసులో వేలం అవుతుందన్న వార్తకు ఆంధ్రప్రదేశ్‌లోని అభిమానులు స్పందించారు. హైదరాబాద్‌లోని శ్రీకృష్ణదేవరాయాంధ్ర భాషా నిలయంలో శ్రీశ్రీ రాకతో కిక్కిరిసిన సభ జరిగింది. పది రూపాయలకు శ్రీశ్రీతో కరచాలనం అనగానే అభిమానులంతా ఉత్సాహంగా ముందుకొచ్చారు. అది మంచో, చెడో కాని మహాకవి కష్టాలు తీరాయి. కవిత్వం కోసం రెండిళ్లు అమ్ముకున్న ప్రభాకర్‌కు ఇలాంటి అవకాశం సమకూరలేదు. ఆయన మహాకవి, ఈయన యువకవి. ఆయన అక్కడివాడు, ఈయన ఇక్కడివాడు అని కారణాలు వెతికిప్పుడు ప్రయోజనం లేదు. 'ఎల్లలు లేని/ కవితాకాశంలో/ ఎవరెవరి బాధలైనా/ రాస్తా.../ క్షమించండి/ నా ఒక్కడివి మాత్రమే/ దాస్తా...' అని రాసుకున్న ప్రభాకర్ ఇలాంటి ప్రతిపాదనకు అంగీకరించేవాడు కాదేమో.

ప్రభాకర్ ఇప్పుడు తెలంగాణ సాహితీమూర్తుల్లో ఒకడయ్యాడు. కాలం చాలా మార్పులు తెచ్చింది. తెలంగాణ రాకతో ఇక్కడ కవులు, కళాకారుల వైఖరి అనూహ్యంగా మారింది. తెలంగాణ కోసం పోరాడిన కలాలు, గళాలు ఇది మన ప్రభుత్వమని, ఇది ప్రజారంజక పాలన అని సంతృప్తిని వ్యక్తం చేస్తున్నాయి. ప్రగతిశీల భావజాలం నుండి రచయితలు ఓట్ల రాజకీయాల వైపు ఆకర్షితులౌతున్నారు.

ఇంత సందడిలోనూ ఎందుకో ప్రభాకర్ ఒంటరిగానే కనబడుతున్నాడు. సౌకర్యవంతంగా పొదిగిన అక్షరాలకు దూరంగా ఆయన కోల్పోయిన ఆస్తి, ఆరోగ్యమే చమురుగా ప్రభాకర్ కవిత్వం వెలిగిపోతోంది. ఆ వెలుగు దీపపు సెమ్మె కింద కష్టాల చీకటి అలాగే ఉంది.

■ బి. నర్సన్

(జనవరి 12న అలిశెట్టి ప్రభాకర్ జయంతి, వర్ధంతి)



గద్దెల ప్రాంగణంలో భక్తుల సందడి

మేడారంలో జోరుగా ముందుస్తు మొక్కులు

మేడారం మహా జాతరకు ముందే భక్తులు వెల్లువలా తరలివస్తున్నారు. సమ్మక్క, సారలమ్మల గద్దెలకు ముందస్తు మొక్కులు సమర్పిస్తున్నారు. బుధవారం భక్తుల తాకిడి ఎక్కువగానే ఉంది. ఒకట్రెండు రోజుల్లో సంక్రాంతి సెలవులు ప్రకటిస్తుండటంతో మేడారానికి తాకిడి పెరిగే అవకాశాలున్నాయి. అయితే తాగునీటికోసం ముందస్తు ఏర్పాట్లు చేయకపోవడంతో భక్తులు అవస్థలకు గురవుతున్నారు. ఇన్‌చార్జి కలెక్టర్ కర్ణన్ జాతర ఏర్పాట్లను పరిశీలించారు. పనులను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా 10వేల మంది పోలీసులతో భద్రతా ఏర్పాట్లు చేస్తున్నట్లు వరంగల్ రేంజ్ ఐజీ నాగిరెడ్డి తెలిపారు. బుధవారం ఆయన మేడారంలో పర్యటించారు. - మేడారం



రామయ్యకు విలాసోత్సవం

భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి దేవస్థానం ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు విలాసోత్సవాలు జరుగుతున్నాయి. రెండో రోజైన బుధవారం ఏపీలోని తూర్పు గోదావరి జిల్లా ఎటపాక మండలం పురుషోత్తపట్నం దమ్మక్క మండపంలో స్వామి వారికి విలాసోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. భద్రాద్రి దేవస్థానంలో ఈనెల 13న విశ్వరూప సేవ ఉత్సవాన్ని నిర్వహిస్తారు. - భద్రాచలం



యాదాద్రిలో నీరాటోత్సవం

యాదాద్రి శ్రీ లక్ష్మీనరసింహ స్వామి సన్నిధిలో బుధవారం ఆండాల్ అమ్మవారి నీరాటోత్సవం ఘనంగా జరిగింది. వేకువ జామునే బాలాలయంలో ఆండాల్ అమ్మవారిని ప్రత్యేక వేదికపై అధిష్ఠింపజేసి విశేష పూజలు నిర్వహించారు. తిరుప్పావై పాశుర పఠనం, మధ్యాహ్నం బాలాలయ మండపంలో స్నపన తిరుమంజనాలు జరిపారు. నీరాటోత్సవాలు ఐదు రోజుల పాటు కొనసాగుతాయి. - యాదాద్రి టౌన్

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య

- విద్యుదాఘాతంతో ఇద్దరు రైతులు మృతి

రాయపర్తి/యాదాద్రి, జనవరి 10: అప్పుల బాధతో వరంగల్ రూరల్ జిల్లా రాయపర్తి మండల కేంద్రం శివారు గుబ్బెడి తండాకు చెందిన బానోతు లాలూనాయక్ (55) ఆత్మహత్య చేసుకున్నాడు. లాలూకు మూడెకరాల వ్యవసాయ భూమి ఉంది. గతంలో వేసిన పత్తి పంటకు తీవ్ర నష్టం వాటిల్లింది. ఇటీవల సాగు భూమిలో రెండు బోర్లు వేసినా, నీరు పడలేదు. అప్పులు భారం పెరిగి పోవడంతో బుధవారం ఇంట్లో ఉరి వేసుకున్నాడు. యాదాద్రి భువనగిరి జిల్లాలో బుధవారం విద్యుదాఘాతంతో ఇద్దరు రైతులు మృతి చెందారు. అడ్డగూడూరు మండలం కంచనపల్లిలో బొంగు లక్ష్మి(45) అనే మహిళా రైతు పొలం పనులు చేస్తూ.. మోటార్ పైప్ లైన్‌ను పట్టుకుంది. విద్యుత్ సరఫరా కావడంతో మృతి చెందింది. బొమ్మల రామారం మండలం కంచెనపల్లి తండాకు చెందిన ధీరావత్ బిచ్చానాయక్(50) పొలానికి వెళ్లాడు. మధ్యాహ్నం దాహం వేయడంతో నీరు తాగేందుకు బోరు వద్దకు వెళ్లాడు. రైతు నీరు తాగుతుండగా విద్యుదాఘాతానికి గురై మృతి చెందాడు.

కట్టుకున్నోళ్లనే కడతేర్చారు



శ్రీను



బానమ్మ

- వేధిస్తున్నాడని భర్తను చంపిన భార్య
- ఆలు, మామ చేతిలో యువకుడి హతం
- ఇల్లాలిని కత్తితో చంపిన ఉన్మాది భర్త
- ఖమ్మం, భద్రాద్రి, జయశంకర్ జిల్లాల్లో దారుణాలు

ఆంధ్రజ్యోతి నెట్‌వర్క్: కట్టుకున్న వారినే కడతేర్చారు. భార్య చేతిలో భర్త, భర్త చేతిలో భార్య.. ఇలా బాగస్వామి చేతిలో ముగ్గురు హతమయ్యారు. కుటుంబ కలహాలు, బాగస్వామి నుంచి వేధింపులు, మద్యం మత్తు ఇలా పలు కారణాలతో ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, జయశంకర్ భూపాలపల్లి జిల్లాల్లో ఈ హత్యలు జరిగాయి. పోలీసుల కథనం ప్రకారం.. ఖమ్మం జిల్లా కారేపల్లి మండలం సామ్యాతండాకు చెందిన బాణోత్ శ్రీను(35) హత్యకు గురయ్యాడు. అతడి వేధింపులు తట్టుకోలేని భార్య కుదువాతో భర్త గొంతు బిగించింది. శ్రీనుకు టేకులపల్లి మండలం ముత్యాలపాడుకు చెందిన లక్ష్మితో వివాహం జరిగింది. వీరికి ఇద్దరు కుమార్తెలున్నారు. కొంత కాలంగా శ్రీను ఎలాంటి పనులు చేయకుండా తాగుడుకు బానిసగా మారడంతో.. లక్ష్మి కూలీ చేస్తూ పిల్లల్ని చదివిస్తోంది. చిన్న కూతురు రావ్య మూత్రపిండం చెడిపోయింది. అయితే ఇవేమీ పట్టించుకోకుండా శ్రీను తరచూ లక్ష్మిని వేధించడంతో మంగళవారం రాత్రి తప్ప తాగి వచ్చిన భర్తను హతమార్చి పోలీసులకు లొంగిపోయింది. అయితే తన కోడలుకు మరో వ్యక్తితో వివాహేతర సంబంధం ఉందని, ప్రియుడితో కలిసే ఈ హత్య చేసిందని శ్రీను తల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కుటుంబ కలహాల నేపథ్యంలో భద్రాద్రి కొత్తగూడెం అశ్వాపురం మండలంలోని రాంనగర్‌లోవలస ఆదివాసీ యువకుడు మంగళవారం రాత్రి హతమయ్యాడు. ఈ విషయం బుధవారం వెలుగులోకి వచ్చింది. ఛత్తీస్‌గఢ్ సుక్మా జిల్లాకు చెందిన కొర్స దేవయ్య (22) రెండేళ్ల క్రితం రాంనగర్ వలస వచ్చి.. తండాకు చెందిన సోడి లక్ష్మిని వివాహం చేసుకున్నాడు. కొద్ది రోజులుగా వీరి మధ్య వివాదాలు జరుగుతున్నాయి. మంగళవారం రాత్రి కూడా గొడవ జరగ్గా లక్ష్మి, ఆమె తండ్రి నందయ్య కలిసి కర్రతో దేవయ్యపై దాడి చేశారు. నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మద్యం మత్తులో కట్టుకున్న భార్యనే చంపేశాడు ఓ ఉన్మాది భర్త.జయశంకర్ భూపాలపల్లి జిల్లా వాజేడు మండలం క్రిష్ణాపురంలో బానమ్మ, లక్ష్మయ్య దంపతులు ఉంటున్నారు. లక్ష్మయ్య మద్యానికి బానిసై భార్యతో తరచూ గొడవ పడుతుండేవాడు. బుధవారం కూడా మద్యం తాగి భార్యతో గొడవపడ్డాడు. కూరగాయలు కోసే కత్తితో దాడి చేయడంతో బానమ్మ మృతిచెందింది. లక్ష్మయ్య పోలీసులకు లొంగిపోయినట్లు సమాచారం.

తల్లిదండ్రులు మందలించారని విద్యార్థిని ఆత్మహత్య



సుజాత

ఖానాపురం, జనవరి 10: తల్లిదండ్రులు మందలించారనే మనస్తాపంతో విద్యార్థిని ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటన వరంగల్ రూరల్ జిల్లా ఖానాపురం మండలం మంగళవారిపేటలో బుధవారం జరిగింది. బుధరావుపేట శివారు రామలింగయ్యపల్లెకు చెందిన బోడ సుజాత(14) బుధరావుపేట ప్రభుత్వ పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతోంది. ఆమె సరిగా పాఠశాలకు వెళ్లకపోడంతో తల్లిదండ్రులు మందలించారు. దీంతో మనస్తాపానికి గురైన సుజాత మంగళవారం ఇంటి నుంచి బయటకు వెళ్లింది. రాత్రి ఇంటికి రాకపోవడంతో ఆందోళన చెందిన తల్లిదండ్రులు సుజాత కోసం వెతికారు. ఈ క్రమంలో మంగళవారిపేట శివారులోని వ్యవసాయ బావిలో ఆమె మృతదేహాన్ని గుర్తించారు.

ఎస్సీ హాస్టల్‌లో విద్యార్థికి చెప్పు దెబ్బలు

- కలెక్టర్ ఆకస్మిక తనిఖీతో వెలుగులోకి
- వాచ్‌మన్, వంట మనిషి తొలగింపు

సిరిసిల్ల, జనవరి 10(ఆంధ్రజ్యోతి): రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండల కేంద్రంలోని ఎస్సీ బాలుర హాస్టల్‌లో జిల్లా కలెక్టర్ సాక్షిగా విద్యార్థులు పడుతున్న ఇబ్బందులు వెలుగులోకి వచ్చాయి. బుధవారం ఉదయమే కలెక్టర్ కృష్ణ భాస్కర్ ఆకస్మికంగా గంభీరావుపేట ఎస్సీ హాస్టల్‌కు వెళ్లారు. విద్యార్థులతో మాట్లాడుతూ వారి సమస్యలను తెలుసుకుంటుండగా.. మంగళవారం రాత్రి వాచ్‌మన్ తమను చెప్పుతో చితకబాదాడని ఒక విద్యార్థి విలపించాడు. ఆరో తరగతి చదువుతున్న రాజు 'సార్ వాచ్‌మన్ రహీం నన్ను చెప్పుతో కొట్టాడు' అని బోరుమన్నాడు. ఇతర విద్యార్థులు కూడా లేచి వాచ్‌మన్ తమతో దురుసుగా ప్రవర్తిస్తున్నాడని వాపోయారు. వంటమనిషి రాజమ్మ కూడ ఇష్టం వచ్చినట్లు చివాట్లు పెడుతోందని కలెక్టర్‌కు చెప్పుకున్నారు. దీంతో కలెక్టర్ విద్యార్థులను చెప్పుతో కొట్టడం ఏంటీ.. మరీ ఇంత దారుణమా అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. వాచ్‌మన్‌ను పిలిచి విద్యార్థిని చెప్పుతో కొడతావా అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. వాచ్‌మన్‌తో పాటు వంటమనిషిని విధుల నుంచి తొలగించి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.



కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్న విద్యార్థులు

త్వరలో పెళ్లి.. అంతలోనే ఆత్మహత్య

- వధువును ప్రేమిస్తున్నానని వరుడికి చెప్పిన యువకుడు
- మనస్తాపంతో యువతి ఆత్మహత్య

అశ్వారావుపేట రూరల్, జనవరి 10: ఇప్పటికే ఆమెకు వివాహం నిశ్చమైంది. సంక్రాంతి తర్వాత పెళ్లి చేద్దామని నిర్ణయించారు. అంతలోనే ఓ వ్యక్తి 'ఆ అమ్మాయిని నేను ప్రేమిస్తున్నాను. నువ్వు ఎలా పెళ్లిచేసుకుంటావో చూస్తా' అని యువతికి కాబోయే భర్తను బెదిరించాడు. దీంతో వరుడు.. విషయాన్ని కాబోయే అత్తమామలకు తెలిపాడు. ఈ పరిణామానికి మనస్తాపం చెందిన ఆ యువతి బుధవారం ఆత్మహత్య చేసుకుంది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట మండలం వడ్డెర రంగాపురం గ్రామానికి చెందిన డేరంగుల సంతోషికుమారి(19)కి నెలరోజుల క్రితం సత్తుపల్లి మండలం యాతాలకుంటకు చెందిన ఓ యువకుడితో వివాహం నిశ్చమైంది. పండుగ తరువాత పెళ్లి చేద్దామని పెద్దలు నిర్ణయించారు. ఈనెల 8న అదే గ్రామానికి చెందిన మిర్యాల రామారావు అనే యువకుడు యాతాలకుంట వెళ్లి వరుడిని కలిశాడు. సంతోషి, తాను ప్రేమించుకుంటున్నామని, త్వరలోనే పెళ్లిచేసుకుంటామని, ఆమెను మరిచిపోవాలని బెదిరించాడు. దీంతో కంగుతున్న వరుడు మంగళవారం వడ్డెర రంగాపురం వచ్చి జరిగిన విషయాన్ని సంతోషి తల్లిదండ్రులకు చెప్పాడు. అప్పటి నుంచి తీవ్ర మనస్తాపానికి గురైన సంతోషి బుధవారం తెల్లవారుజామున ఇంట్లో పురుగుమందు తాగింది. కుటుంబ సభ్యులు ఆసుపత్రికి తరలిస్తుండగా మృతిచెందింది.



టమాటల ఉచిత పంపిణీ

- ధరలేక పంటను పశువులకు మేపుతున్న రైతన్న

జడ్చర్ల, జనవరి 10: టమాటాకు గిట్టుబాటు ధర దక్కకపోవడంతో మహబూబ్‌నగర్ జిల్లాలో కడుపు మండిన రైతులు బుధవారం వినూత్న రీతిలో నిరసన తెలిపారు. మిడ్జిల్ మండలం కొత్తపల్లి శివారులో సుమారు ఐదెకరాల టమాట తోటను పశువులకు మేపారు. మరోవైపు జడ్చర్ల పట్టణంలోని నేతాజీ చౌరస్తాలో లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో టమాటాలను పట్టణ వాసులకు ఉచితంగా పంపిణీ చేశారు. వారం రోజులుగా టమాట కిలోకు మార్కెట్‌లో కేవలం రూ.2 మాత్రమే ధర ఉండడం, వాటిని కొన్న వ్యాపారులు వినియోగదారులకు రూ.8 నుంచి రూ.10 చొప్పున విక్రయిస్తుండడంతో రైతులు ఆందోళనకు గురవుతున్నారు. కడుపు మండి రోడ్డుపై పారబోసి, పశువులకు మేపారు. లయన్స్‌క్లబ్ సభ్యులు టమాటాలను కిలోకు రూ.10 చొప్పున క్వింటాలు కొనుగోలు చేసి, పట్టణవాసులకు ఉచితంగా పంపిణీ చేశారు.

గద్దర్ నాయకత్వంలో ఢిల్లీకి: వంగపల్లి



జగిత్యాల, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణ కోసం ప్రజా గాయకుడు గద్దర్ నాయకత్వంలో ఢిల్లీకి వెళ్లనున్నట్లు ఎమ్మార్పీఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ వంగపల్లి శ్రీనివాస్ చెప్పారు. జగిత్యాలలో బుధవారం నిర్వహించిన జిల్లా ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణ అమలుకు మాలలు అడ్డంకిగా మారారని, కొందరు తప్పుడు ప్రచారం చేస్తున్నారని అన్నారు. ప్రధాని మోదీతో పాటు కేంద్ర మంత్రి అపాయింట్‌మెంట్ కోసం ప్రయత్నాలు జరుగుతున్నట్లు చెప్పారు. అణగారిన కులాలు ఏకం కావాలని, రాజ్యాధికార సాధన దిశగా అడుగులు వేయాలని పిలుపునిచ్చారు. మాదిగలు ఓట్లకు అమ్ముడుపోయే రోజులు పోయాయని, రాబోయే రోజుల్లో ఓటు చైతన్యంతోనే జాతిని అభివృద్ధి చేస్తామని అన్నారు.

బండ్ల గణేశ్ సోదరులపై అట్రాసిటీ కేసు

షాద్‌నగర్ రూరల్, జనవరి 10: సినీ నిర్మాత బండ్ల గణేశ్, అతడి సోదరుడు శివబాబులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్‌కు చెందిన డాక్టర్ దిలీప్‌చంద్రకు ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని బూర్గుల శివారులో భూములు, పౌల్ట్రీలు ఉన్నాయి. వాటిని బండ్ల గణేశ్ కొనుగోలు చేశారు. తమకు రావాల్సిన డబ్బుల కోసం దిలీప్‌చంద్ర తన సతీమణి, కృష్ణవేణితో కలిసి బూర్గుల శివారులో ఉన్న గణేష్ పౌల్ట్రీ ఫాం కార్యాలయానికి వెళ్లారు. అయితే తమను గణేశ్, శివబాబు దూషించారంటూ కృష్ణవేణి ఆరోపించారు. ఆమె ఫిర్యాదు మేరకు బండ్ల సోదరులపై పోలీసులు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేశారు.

మరుగుదొడ్డి లేకుంటే గ్యాస్ కట్

రఘునాథపాలెం, జనవరి 10: మరుగుదొడ్డి నిర్మించుకోని వారి ఇళ్లలోంచి గ్యాస్ బండ తీసుకెళ్లడం, ఇంటికి తాళం వేయడం వంటి చర్యలను అధికారులు మొదలుపెట్టారు. బుధవారం ఇలా 15 ఇళ్లలో గ్యాస్ బండలు తీసుకెళ్లిన అధికారులు రెండు ఇళ్లకు తాళాలు వేశారు. ఈ ఘటన ఖమ్మం జిల్లా రఘునాథపాలెం మండలం పంగిడి పంచాయతీ రజబ్ ఆలీనగర్, పాపటపల్లి గ్రామాల్లో జరిగింది. ఈనెల 21 నాటికి వంద శాతం ఓడీఎఫ్ జిల్లాగా ప్రకటించేందుకు అధికారులు సన్నద్ధమవుతున్నారు. ఈ క్రమంలో ఇంకా మరుగుదొడ్లు నిర్మించుకోవాలని అధికారులు ఒత్తిడి చేస్తున్నారు.



మేడారం జాతరకు 4200 బస్సులు

- ఆర్టీసీ చైర్మన్ సత్యనారాయణ



హన్మకొండ అర్బన్, జనవరి 10: మేడారం భక్తుల సౌకర్యార్థం ఆర్టీసీ బస్సులను సిద్ధం చేసిందని, టీఎస్ ఆర్టీసీ చైర్మన్ సోమారపు సత్యనారాయణ తెలిపారు. బుధవారం ఆయన హన్మకొండలో ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. జాతరకు 52 చోట్ల నుంచి 4200 బస్సులను నడుపుతామని వివరించారు. ఈనెల 28 నుంచి ఫిబ్రవరి 4 వరకు ప్రత్యేక బస్సులను అందుబాటులో ఉంచుతామని చెప్పారు. హైదరాబాద్ నుంచి మేడారానికి 160 సూపర్ లగ్జరీ, ఏసీ బస్సులను నడుపుతున్నామన్నారు. హన్మకొండ నుంచి మేడారానికి 20 సూపర్ లగ్జరీ, 30 వజ్ర బస్సులను తిప్పనున్నట్లు వివరించారు. ఆర్టీసీ ఎండీ రమణారావు మాట్లాడుతూ ప్రతీ బస్సుకు యునిక్ కోడ్‌ను ఇస్తున్నామని, దీంతో బస్సు ఎక్కడ ఉంది, బస్సులో ప్రయాణికుల సంఖ్యను ఆన్‌లైన్‌లో తెలుసుకోవచ్చునన్నారు. అనంతరం టీఎస్ ఆర్టీసీ మేడారం జాతరపై రూపొందించిన ప్రత్యేక యాప్‌ను ప్రారంభించారు.

వేసవి సెలవుల్లోగా టీచర్ల బదిలీలు

భీమదేవరపల్లి, జనవరి 10: వేసవి సెలవుల్లోగా ఉపాధ్యాయుల బదిలీలు, ప్రమోషన్‌లు చేపట్టేలా రాష్ట్ర ప్రభుత్వం కార్యాచరణ రూపొందిస్తున్నదని మండలి చీఫ్ విప్ సుధాకర్‌రెడ్డి చెప్పారు. వరంగల్ అర్బన్ జిల్లా భీమదేవరపల్లిలోని కొత్తకొండ వీరభద్రస్వామి కల్యాణానికి హాజరైన ఆయన బుధవారం విలేకరులతో మాట్లాడారు.

కెరీర్ గైడ్

ఆఫ్‌బీట్ కోర్సులు...
ఆసక్తికి పట్టం



విదేశాల్లో స్థిరపడిన భారతీయుల గురించి చదవాలనే ఆసక్తి ఉందా? బుద్ధిజంలో మహాయానం ఏం చెబుతుందో తెలుసుకోవాలనుకుంటున్నారా? ఇలాంటి విభిన్న ఆసక్తులు ఉన్నవారికి తెలుగు రాష్ట్రాల్లోనే ప్రత్యేక కోర్సులు అందుబాటులో ఉన్నాయి. ప్రొఫెషనల్ కోర్సులపై మోజులో మరుగునపడిపోయిన విభిన్నమైన కోర్సులు సైన్స్, ఆర్ట్స్, ఇతర సబ్జెక్టుల్లో చాలా ఉన్నాయి. అభిరుచి ఉన్న విద్యార్థులు వీటిని ఎంచుకొని కెరీర్‌లో రాణించవచ్చు. తెలుగు రాష్ట్రాల్లోని అనేక యూనివర్సిటీలు విభిన్న కోర్సులను అందిస్తున్నాయి. విద్యార్థుల ఆసక్తికి పెద్దపీట వేస్తూ యూనివర్సిటీలు ఈ కోర్సులను నిర్వహిసున్నాయి. డిగ్రీ, పోస్టు గ్రాడ్యుయేషన్, పరిశోధన స్థాయిల్లో వీటిని ఎంచుకోవచ్చు. ఇలాంటి విభిన్న కోర్సుల గురించి తెలుసుకుందాం...

ఇండస్ట్రియల్ మైక్రోబయాలజీ



సూక్ష్మజీవులను పారిశ్రామికంగా ఉపయోగించే విధానాలు ఇండస్ట్రియల్ మైక్రోబయాలజీలో ఉంటాయి. అంటే సూక్ష్మజీవులను వినియోగించి వివిధ ఉత్పత్తులను తయారు చేస్తారు. ఔషధాలు, రసాయనాలు, ఇంధనాలు తదితర పరిశ్రమల్లో ఈ తరహా విధానాన్ని అనుసరిస్తారు. హెల్త్ ప్రొడక్ట్స్, ఫుడ్, బేవరేజెస్, వ్యాక్సిన్, అగ్రికల్చర్, కెమికల్, ఆయిల్, వేస్ట్ మేనేజ్‌మెంట్, ఎన్విరాన్‌మెంటల్ సంస్థల్లో విరివిరిగా అవకాశాలు ఉంటాయి. తిరుపతిలోని శ్రీ వేంకటేశ్వర యూనివర్సిటీ ఎంఎస్సీ - ఇండస్ట్రియల్ మైక్రోబయాలజీ కోర్సును ఆఫర్ చేస్తుంది.
వివరాలకు: www.svuniversity.edu.in

జానపద కళలు

బోధన, పరిశోధన, ప్రచురణ వంటి కార్యక్రమాల ద్వారా తెలుగు భాష, సాహిత్యం, సంస్కృతి, చరిత్రను పరిరక్షించడం, అభివృద్ధి చేయడం వంటి లక్ష్యాలతో తెలుగు విశ్వవిద్యాలయం ఏర్పాటైంది. ఈ విశ్వవిద్యాలయం జానపద కళలకు సంబంధించి ఎంపీఏ, ఎంఫిల్, పీహెచ్‌డీ, పీజీ డిప్లొమా, డిప్లొమా, సర్టిఫికెట్ స్థాయిల్లో కోర్సులను ఆఫర్ చేస్తుంది. ఇందులో జానపద సంగీతం, బుర్రకథ, జనపద వాద్యం, ఇంద్రజాలం విభాగాలు ఉన్నాయి. రంగస్థలం, నృత్యం, చిత్రలేఖనం, శిల్పకళ, సంగీతం, జ్యోతిషం, వాస్తు, జర్నలిజం, ట్రావెల్ అండ్ టూరిజం, ఫిల్మ్ డైరెక్షన్ తదితర కోర్సులను కూడా అందిస్తుంది.
వివరాలకు: http://teluguuniversity.ac.in/

ఆస్ట్రానమీ



ఖగోళ సంబంధ దృగ్విషయాలను అధ్యయనం చేసే శాస్త్రమే ఆస్ట్రానమీ. ఇందులో ఖగోళ వస్తువులు అంటే నక్షత్రాలు, గ్రహాలు, గెలాక్సీలు, చంద్రుడు, గ్రహ శకలాలు వంటి వాటి ఆవిర్భావం, ఉనికి, పరిణామం, పరిశోధనలు తదితర అంశాలు అంతర్భాగంగా ఉంటాయి. ఉస్మానియా యూనివర్సిటీ ఎంఎస్సీ ఆస్ట్రానమీ కోర్సును ఆఫర్ చేస్తుంది. ఈ కోర్సులో చేరాలంటే డిగ్రీలో మ్యాథమెటిక్స్, ఫిజిక్స్ చదివి ఉండాలి. రాత పరీక్ష ఆధారంగా ప్రవేశం కల్పిస్తారు. రాత పరీక్షలో ఫిజిక్స్ నుంచి ప్రశ్నలు అడుగుతారు.
వివరాలకు: www.osmania.ac.in/

అప్లయిడ్ లింగ్విస్టిక్స్

లింగ్విస్టిక్స్ (భాషా శాస్త్రం)లోని ఒక ఉప విభాగం అప్లయిడ్ లింగ్విస్టిక్స్ (అనువర్తిత భాషా శాస్త్రం). నిజ జీవితంలో భాషకు సంబంధించి ఎదురయ్యే వివిధ సమస్యలకు పరిష్కార మార్గాలను అప్లయిడ్ లింగ్విస్టిక్స్ సూచిస్తుంది. యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్ - సెంటర్ ఫర్ అప్లయిడ్ లింగ్విస్టిక్స్ అండ్ ట్రాన్స్‌లేషన్ స్టడీస్ ఎంఏ, ఎంఫిల్, పీహెచ్‌డీ స్థాయిల్లో అప్లయిడ్ లింగ్విస్టిక్స్ కోర్సును ఆఫర్ చేస్తుంది. రాత పరీక్ష ఆధారంగా ఇందులో ప్రవేశం కల్పిస్తారు. అదేవిధంగా ఐదేళ్ల ఎంఏ (లాంగ్వేజ్ సైన్స్) ఇంటిగ్రేటెడ్ కోర్సును కూడా అందిస్తుంది. వివరాలకు: www.uohyd.ac.in

యోగా



ఆరోగ్యం విషయంలో అందరికీ అవగాహన పెరిగింది. శరీరాన్ని ఫిట్‌గా ఉంచుకునేందుకు ఆధునిక విధానాలతోపాటు సంప్రదాయ పద్ధతులను అవలంబిస్తున్నారు. అటువంటి వాటిలో ప్రధానమైంది యోగా. కేవలం మన దేశంలోనే కాకుండా అంతర్జాతీయ స్థాయిలో యోగాకు మంచి ప్రాచుర్యం లభిస్తోంది. దీంతో ఐక్యరాజ్యసమితి ఏటా జూన్ 21ని అంతర్జాతీయ యోగా దినోత్సవంగా నిర్వహిస్తుంది. యోగాకు ఉన్న ఆదరణ దృష్ట్యా ఇది కూడా ఒక కెరీర్‌గా ఆవిర్భవించింది. యోగాలో నిష్ణాతులకు హెల్త్ క్లబ్, జిమ్స్, యోగా స్టూడియో, పాఠశాలలు, కళాశాలల్లో విరివిరిగా అవకాశాలు ఉంటున్నాయి. అంతేకాకుండా యోగా ఇన్‌స్ట్రక్టర్‌గా స్వయం ఉపాధి పొందొచ్చు. ఈ నేపథ్యంలో యోగాను ఒక కోర్సుగా కొన్ని విద్యా సంస్థలు ఆఫర్ చేస్తున్నాయి. విశాఖపట్నంలోని ఆంధ్రా యూనివర్సిటీ పీజీ డిప్లొమా ఇన్ యోగా (పార్ట్‌టైం, అర్హత - డిగ్రీ), ఎంఏ యోగా (అర్హత - డిగ్రీ, యోగాలో బేసిక్ సర్టిఫికెట్), డిప్లొమా ఇన్ యోగా (అర్హత ఇంటర్మీడియెట్), సర్టిఫికెట్ కోర్స్ ఇన్ యోగా (అర్హత 10వ తరగతి) కోర్సులను ఆఫర్ చేస్తుంది. వివరాలకు www.andhrauniversity.edu.in/

టూరిజం మేనేజ్‌మెంట్

ప్రస్తుతం పర్యాటక రంగానికి ప్రాధాన్యం పెరిగింది. రాష్ట్రాలన్నీ పర్యాటకులను ఆకర్షించేందుకు ప్రమోషన్ కార్యక్రమాలను భారీ స్థాయిలో నిర్వహిస్తున్నాయి. అంతర్జాతీయ స్థాయిలో బ్రాండింగ్ కోసం సినిమా తారలను, క్రీడాకారులను అంబాసిడర్స్‌గా కూడా నియమించుకుంటున్నాయి. దాంతో దేశ, విదేశాల నుంచి వచ్చే పర్యాటకుల సంఖ్య విపరీతంగా పెరుగుతోంది. ఫలితంగా సంబంధిత రంగంలో వేలాది అవకాశాలు స్వాగతం పలుకుతున్నాయి. ఈ నేపథ్యంలో పర్యాటక రంగంలో ఎటువంటి ఉద్యోగాలు ఉంటాయి, వాటికి ఎలా సిద్ధం కావాలి, ఎలాంటి నైపుణ్యాలను పెంచుకోవాలి అనే విషయంలో అవగాహన కల్పించడానికి టూరిజం మేనేజ్‌మెంట్ కోర్సులు అందుబాటులోకి వచ్చాయి. ఈ కోర్సులను పూర్తి చేసిన వారికి టూరిజం సంస్థలు, హోటల్స్, ట్రావెల్ కన్సల్టెన్సీ తరహా సంస్థల్లో ఉపాధి అవకాశాలు ఉంటాయి.



వరంగల్‌లోని కాకతీయ విశ్వవిద్యాయం అండర్ గ్రాడ్యుయేషన్ స్థాయిలో బీఏ (టూరిజం అండ్ ట్రావెల్ మేనేజ్‌మెంట్‌తోపాటు హిస్టరీ, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, తదితరాలు ఐచ్ఛికాలుగా), పీజీలో మాస్టర్ ఆఫ్ టూరిజం మేనేజ్‌మెంట్ (ఎంటీఎం) కోర్సులను ఆఫర్ చేస్తుంది. పీజీ కోర్సులో రాత పరీక్ష ఆధారంగా ప్రవేశం కల్పిస్తారు. వివరాలకు: http://kuwarangal.net/

ఎకనోమెట్రిక్స్




ఎకనోమెట్రిక్స్.. ఆర్థికశాస్త్రంలో ఒక విభాగం. వివిధ గణిత, సాంఖ్యక పద్ధతులను ఉపయోగించి ఆర్థిక రంగంలో భవిష్యత్ పరిణామాలను అంచనా వేయడానికి ఎకనోమెట్రిక్స్ తోడ్పడుతుంది. ఇందుకు సంబంధించిన అంశాలపై అవగాహన కల్పించేందుకు ఎకనోమెట్రిక్స్ కోర్సులను ప్రారంభించారు. ఈ కోర్సులను పూర్తి చేసిన వారికి ప్రభుత్వ సంస్థలు, బ్యాంకులు, ఫైనాన్షియల్ కంపెనీలు, ఇన్వెస్ట్‌మెంట్ ఏజెన్సీలలో ఎకనమిస్ట్, అనలిస్ట్, డెవలపర్స్, రీసెర్చ్ అనలిస్ట్ తదితర హోదాల్లో అవకాశాలు ఉంటాయి. తిరుపతిలోని శ్రీవేంకటేశ్వర యూనివర్సిటీ ఎంఏ, ఎంఫిల్, పీహెచ్‌డీ, పీజీ డిప్లొమా స్థాయిల్లో ఎకనోమెట్రిక్స్ కోర్సును ఆఫర్ చేస్తుంది.
వివరాలకు: www.svuniversity.edu.in

సెరికల్చర్



పట్టుపురుగుల పెంపకమే సెరికల్చర్. పట్టు పురుగుల పెంపకం, మన దేశంలో పట్టు పరిశ్రమకు ప్రత్యేక స్థానం ఉంది. తగిన పెట్టుబడి, శ్రమను జోడిస్తే పట్టు పురుగుల పెంపకం లాభదాయకంగా ఉంటుంది. ఈ కోణంలో ప్రభుత్వాలు కూడా పట్టు పరిశ్రమ స్థాపనకు పలు ప్రోత్సాహకాలను కల్పిస్తున్నాయి. ఈ అంశంపై శాస్త్రీయ అవగాహన కల్పించడంతోపాటు అవసరమైన నైపుణ్యాలను పెంపొందించే ఉద్దేశంతో తిరుపతిలో శ్రీపద్మావతి మహిళా విశ్వవిద్యాయలం ఎంఎస్సీ (సెరికల్చర్) కోర్సును ఆఫర్ చేస్తుంది. ఈ కోర్సులో సాయిల్ సైన్సెస్, మల్బరీ అగ్రానమీ, కాకూన్ ప్రొడక్షన్, ఫిజియాలజీ, సెరికల్చర్ ఎక్స్‌టెన్షన్, మేనేజ్‌మెంట్, మాలిక్యులర్ బయాలజీ, జెనెటిక్స్, బ్రీడింగ్, స్కిల్ ఫైబర్ తదితర అంశాలను బోధిస్తారు. 50 శాతం మార్కులతో బీఎస్సీ (సైన్స్ బ్రాంచ్) పూర్తి చేసిన వారు ఈ కోర్సులో చేరొచ్చు. వివరాలకు: www.spmvv.ac.in/

వైరాలజీ



వైరస్‌ల గురించి అధ్యయనం చేసే శాస్త్రమే వైరాలజీ. ఆధునిక వైద్య శాస్త్రంలో వైరాలజీకి ఎంతో ప్రాముఖ్యం ఉంది. అంటే వైరస్‌ల ద్వారా వ్యాపించే వ్యాధులు - లక్షణాలు, ఉత్పత్తి, వాటి జన్యు నిర్మాణం, వర్గీకరణ వంటి అంశాలను ఈ శాస్త్రంలో క్షుణ్ణంగా తెలుసుకుంటారు. వైరాలజీ అనేది మైక్రోబయాలజీ / పాథాలజీలో భాగంగా ఉంటుంది. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా ఆరోగ్య రంగంలో ఇల్‌నెస్ నుంచి వెల్‌నెస్ దిశగా పరిశోధనలు సాగుతున్నాయి. వివిధ వ్యాధులు, అందుకు కారణాలు, రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, అందుకు అవసరమైన టీకాలు, ఔషధాలు వంటి విషయాలను తెలుసుకునే ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఫార్మాస్యూటికల్, అగ్రికల్చర్, క్లినికల్ వంటి సంస్థల్లో నూతన డ్రగ్స్ ఉత్పత్తి కోసం నిత్యం పరిశోధనలు జరుగుతుంటాయి. కాబట్టి ఈ కోర్సును పూర్తి చేసిన వారికి ఆయా సంస్థల్లో అవకాశాలు ఉంటాయి. తిరుపతిలోని శ్రీవేంకటేశ్వర యూనివర్సిటీ ఎంఎస్సీ, పీహెచ్‌డీ స్థాయిల్లో వైరాలజీ కోర్సును ఆఫర్ చేస్తుంది.
వివరాలకు: www.svuniversity.edu.in

ఇండియన్ డయాస్పోరా



ప్రపంచవ్యాప్తంగా విస్తరించి ఉన్న భారతీయులపై అధ్యయనం చేయడానికి 1996లో యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్‌లో సెంటర్ ఫర్ స్టడీ ఆఫ్ ఇండియన్ డయాస్పోరాను ప్రారంభించారు. భారతదేశం నుంచి వలస వెళ్లిన వారి చారిత్రక నేపథ్యం, నాగరికత, సంస్కృతి, ఆర్థికంగా, రాజకీయంగా చోటు చేసుకున్న మార్పులు తదితర అంశాలను శాస్త్రీయంగా తెలుసుకోవడానికి ఈ సెంటర్ కృషిచేస్తుంది. ఈ క్రమంలో ఆయా అంశాలపై అవగాహన కల్పించడానికి ఎంఏ, ఎంఫిల్, పీహెచ్‌డీ స్థాయిల్లో ఇంటర్ డిసిప్లీనరీ కోర్సులను ఆఫర్ చేస్తుంది. వలస వెళ్లిన తరవాత గుర్తింపు, స్థిర పడిన విధానం, వారి జీవితాల్లో వచ్చిన మార్పులు, చేసిన పోరాటాలు, భారత్‌తో సంబంధాలు - వివిధ రంగాల్లో చేసిన సేవలు, ఈ విషయంపై వచ్చిన రచనలు వంటి అంశాలు ఆయా కోర్సుల్లో అంతర్భాగంగా ఉంటాయి.
వివరాలకు: www.uohyd.ac.in

మహాయాన బుద్ధిస్ట్ స్టడీస్

ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో 1982లో మహాయాన బుద్ధిస్ట్ స్టడీస్ శాఖను ప్రారంభించారు. ఈ శాఖ అధ్వర్యంలో ఎంఏ (మహాయాన బుద్ధిస్ట్ స్టడీస్) కోర్సును అందిస్తున్నారు. ఇందులో బౌద్ధమతం చరిత్ర, ఆ మత భావనలు, విలువలు, దేశంలో స్మారక కట్టడాలు, కళలు, ఆంధ్రప్రదేశ్‌లో బౌద్ధమతం, ఆగ్నేయాసియా దేశాల్లో బౌద్ధమతం, సమకాలీన ప్రపంచం - మతాలు - బౌద్ధమతం వంటి అంశాలను బోధిస్తారు.
వివరాలకు: www.nagarjunauniversity.ac.in/

జాబ్ కార్నర్

సిడాక్‌లో ప్రాజెక్ట్ ఇంజనీర్లు

నోయిడాలోని సెంటర్ ఫర్ డెవలప్‌మెంట్ ఆఫ్ అడ్వాన్స్‌డ్ కంప్యూటింగ్ (సిడాక్)- కాంట్రాక్ట్ ప్రాతిపదికన కింది పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- ★ మొత్తం ఖాళీలు: **53**
- ★ పోస్టులు: ప్రాజెక్ట్ మేనేజర్ 3, ప్రాజెక్ట్ ఇంజనీర్ 39, ప్రాజెక్ట్ సపోర్ట్ స్టాఫ్ 11
- ★ ఎంపిక: ఆన్‌లైన్ టెస్ట్/ ఇంటర్వ్యూ ద్వారా
- ★ ఆన్‌లైన్ టెస్ట్/ ఇంటర్వ్యూ: సపోర్ట్ స్టాఫ్‌కు ఫిబ్రవరి 15న కాగా మిగిలిన పోస్టులకు ఫిబ్రవరి 17న
- ★ ఆన్‌లైన్ దరఖాస్తుకు ఆఖరు తేదీ: జనవరి 31
- ★ వెబ్‌సైట్: www.cdac.in

ఎన్‌ఎండిసి లిమిటెడ్

హైదరాబాద్‌లోని ఎన్‌ఎండిసి లిమిటెడ్- ట్రైనీ మెయింటెనెన్స్ అసిస్టెంట్ల నియామకానికి దరఖాస్తులు కోరుతోంది.

- ★ ఖాళీలు: **44** ★ విభాగం: మెకానికల్
- ★ పూర్తి వివరాలకు జనవరి 20 నాటి ఎంప్లాయిమెంట్ న్యూస్ చూడవచ్చు
- ★ వెబ్‌సైట్: www.nmdc.co.in

రాష్ట్రీయ ఇస్పాత్ నిగమ్

రాష్ట్రీయ ఇస్పాత్ నిగమ్ లిమిటెడ్ - మేనేజ్‌మెంట్ ట్రైనీల నియామకానికి దరఖాస్తులు కోరుతోంది.

- ★ విభాగాలు: హెచ్‌ఆర్ & మార్కెటింగ్, టెక్నికల్ (ఎలక్ట్రికల్/ మెకానికల్/ మెటలర్జీ)
- ★ ఎంపిక: హెచ్‌ఆర్ & మార్కెటింగ్ విభాగానికి ఆన్‌లైన్ టెస్ట్ ద్వారా టెక్నికల్ విభాగానికి గేట్ 2018 స్కోరు ద్వారా అభ్యర్థులను ఎంపిక చేస్తారు.
- ★ ఆన్‌లైన్ దరఖాస్తు ప్రక్రియ ప్రారంభం: జనవరి 15 నుంచి
- ★ ఆన్‌లైన్ దరఖాస్తుకు ఆఖరు తేదీ: ఫిబ్రవరి 14
- ★ వెబ్‌సైట్: www.vizagsteel.com

నైవేలీ లిగ్నైట్

నైవేలీ లిగ్నైట్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఎన్‌ఎల్‌సి) - తమిళనాడులోని జనరల్ హాస్పిటల్‌లో మెడికల్ ప్రొఫెషనల్స్ కోసం ఇంటర్వ్యూలు నిర్వహిస్తోంది.

- ★ ఖాళీలు: **23**
- ★ పోస్టులు: సీనియర్ రెసిడెంట్స్, జూనియర్ రెసిడెంట్స్
- ★ అర్హత: ఎంబిబిఎస్ ఉత్తీర్ణతతోపాటు సిఆర్‌ఆర్‌ఐ పూర్తిచేసి ఉండాలి. సీనియర్ రెసిడెంట్స్‌కు పీజీ డిగ్రీ/ డిప్లొమా(జనరల్ మెడిసిన్/ జనరల్ సర్జరీ/ ఎమర్జెన్సీ మెడిసిన్/ డయాబెటాలజీ/ పీడియాట్రిక్స్/ గైనకాలజీ/ ఇఎన్‌టి/ రేడియాలజీ/ ఆప్తల్మాలజీ/ అనెస్థీషియాలజీ/ సైకియాట్రీ) పూర్తిచేసి ఉండాలి.
- ★ వయసు: జనవరి 1 నాటికి సీనియర్ రెసిడెంట్స్‌కు 30 ఏళ్ళ, జూనియర్ రెసిడెంట్స్‌కు 28 ఏళ్లు మించరాదు
- ★ కాంట్రాక్ట్ వ్యవధి: మూడేళ్లు
- ★ వేతనం: సీనియర్ రెసిడెంట్స్‌కు మొదటి ఏడాది నెలకు రూ.55000, రెండో ఏడాది రూ.57500, మూడో ఏడాది రూ.62500 ఇస్తారు. జూనియర్ రెసిడెంట్స్‌కు మొదటి ఏడాది నెలకు రూ.37500, రెండో ఏడాది రూ.40000, మూడో ఏడాది రూ.45500 ఇస్తారు.
- ★ ఇంటర్వ్యూ: జనవరి 17న
- ★ వేదిక: Industrial Medical Centre, NLCIL General Hospital, Neyveli
- ★ వెబ్‌సైట్: www.nlcindia.com

తిరుపతి ఐఐటి

తిరుపతిలోని ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఐఐటి)- కింది పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- ★ పోస్టులు: అసోసియేట్ ప్రొఫెసర్, అసిస్టెంట్ ప్రొఫెసర్, రిజిస్ట్రార్
- ★ విభాగాలు: కెమికల్/ సివిల్/ కంప్యూటర్ సైన్స్/ ఎలక్ట్రికల్/ మెకానికల్/ కెమిస్ట్రీ/ ఫిజిక్స్/ మేథమెటిక్స్/ హ్యూమానిటీస్/ సోషల్ సైన్సెస్
- ★ ఆన్‌లైన్ దరఖాస్తుకు ఆఖరు తేదీ: ఫిబ్రవరి 12
- ★ వెబ్‌సైట్: http://iittp.ac.in/recruitment

ఇండియన్ టెలిఫోన్ ఇండస్ట్రీస్

ఇండియన్ టెలిఫోన్ ఇండస్ట్రీస్ లిమిటెడ్- ఇంజనీర్, మేనేజర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- ★ మొత్తం ఖాళీలు: **45**
- ★ పోస్టులు: అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ 25, చీఫ్ మేనేజర్ 8, డిప్యూటీ జనరల్ మేనేజర్ (ఫైనాన్స్) 4, అడిషనల్ జనరల్ మేనేజర్ (మార్కెటింగ్) 4, జనరల్ మేనేజర్ (హెచ్‌ఆర్) 4
- ★ ఆన్‌లైన్ దరఖాస్తుకు ఆఖరు తేదీ: ఫిబ్రవరి 5
- ★ వెబ్‌సైట్: www.itiltd.india.com

రామగుండం ఫర్టిలైజర్స్ అండ్ కెమికల్స్

నేషనల్ ఫర్టిలైజర్స్ ఆధ్వర్యంలోని రామగుండం ఫర్టిలైజర్స్ అండ్ కెమికల్స్ లిమిటెడ్- కింది విభాగాల్లో మేనేజ్‌మెంట్ ట్రైనీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- ★ మొత్తం ఖాళీలు: **61**
- ★ విభాగాలవారీ ఖాళీలు: కెమికల్ 35, మెకానికల్ 10, ఎలక్ట్రికల్ 8, ఇన్‌స్ట్రుమెంటేషన్ 8
- ★ ఎంపిక: గేట్ 2016 స్కోరు ద్వారా
- ★ ఆన్‌లైన్ దరఖాస్తుకు ఆఖరు తేదీ: ఫిబ్రవరి 9
- ★ వెబ్‌సైట్: www.nationalfertilizers.com



మొత్తం ఖాళీలు **450**

కెనరా బ్యాంక్ నుంచి భారీ ప్రకటన విడుదలైంది. జూనియర్ మేనేజ్‌మెంట్ స్కేల్ 1 కేడర్‌లో ప్రొబేషనరీ ఆఫీసర్స్ పోస్టుల భర్తీకి ఉద్దేశించిన 'పోస్ట్ గ్రాడ్యుయేట్ డిప్లొమా ఇన్ బ్యాంకింగ్ అండ్ ఫైనాన్స్' ట్రైనింగ్ కోర్సుకు దరఖాస్తులను ఆహ్వానిస్తోంది. కోర్సు పూర్తిచేసుకొన్న అభ్యర్థులను వివిధ బ్రాంచ్‌ల్లో ప్రొబేషనరీ ఆఫీసర్స్‌గా నియమిస్తారు. దీనికి సంబంధించిన వివరాలను చూద్దాం....

బ్యాంకింగ్‌లో శిక్షణ.. వెంటనే ఉద్యోగం

ఖాళీలు

మొత్తం 450 వీటిలో జనరల్ వర్గానికి 227, ఒబిసిలకు 121, ఎస్సీలకు 67, ఎస్టీలకు 35 ఖాళీలను కేటాయించారు.

వేతనం

పిఓగా ఎంపికైన అభ్యర్థులకు నెలకు రూ.23,700 - 42020 వేతనశ్రేణితోపాటు డియర్‌నెస్ అలవెన్స్, హెచ్‌ఆర్‌ఏ, సిసిఏ, మెడికల్ ఎయిడ్, లీవ్ ఫేర్ కన్సెషన్ ఇస్తారు. క్వార్టర్స్, ఫర్నిచర్ తదితర సౌకర్యాలు కూడా కల్పిస్తారు.

అర్హత

జనవరి 1 నాటికి అభ్యర్థుల వయసు 20 నుంచి 30 ఏళ్ల మధ్య ఉండాలి. ప్రభుత్వ నిబంధనల మేరకు వయోపరిమితి సడలింపు వర్తిస్తుంది. గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి 60 శాతం మార్కులతో డిగ్రీ పూర్తిచేసి ఉండాలి. రిజర్వుడు వర్గాలవారికి 55 శాతం మార్కులు వస్తే చాలు.

కోర్సు వివరాలు

ఏడాది వ్యవధి గల ఈ కోర్సును బెంగళూరులోని మణిపాల్ గ్లోబల్ ఎడ్యుకేషన్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్ నుంచి గానీ మంగళూరులోని ఎన్ఐటిటిఇ ఎడ్యుకేషన్ ఇంటర్నేషనల్ ప్రైవేట్ లిమిటెడ్ నుంచి గానీ చేయాల్సి ఉంటుంది. కోర్సుకు ఎంపికైన అభ్యర్థులకు 9 నెలలపాటు రెసిడెన్షియల్ క్యాంపస్‌లో బోధనాపరమైన శిక్షణ ఉంటుంది. తరవాత కెనరా బ్యాంక్ బ్రాంచ్/ ఆఫీస్‌లో 3 నెలలు ఇంటర్న్‌షిప్ చేయాలి. కోర్సు పూర్తిచేసిన అభ్యర్థులకు పోస్టింగ్ తరవాత రెండేళ్ల ప్రొబేషన్ ఉంటుంది. అభ్యర్థులు పోస్టింగ్ తీసుకున్న నాటినుంచి అయిదేళ్లపాటు బ్యాంకులో పనిచేయడానికి అంగీకరిస్తూ బాండ్ సమర్పించాలి.

ఎంపిక

అభ్యర్థులను ఆన్‌లైన్ ఆబ్జెక్టివ్ టెస్ట్ ద్వారా ఎంపిక చేసి వారికి గ్రూప్ డిస్కషన్, ఇంటర్వ్యూ నిర్వహిస్తారు. ఆన్‌లైన్ టెస్ట్‌ను ముంబైలోని ఇనిస్టిట్యూట్ ఆఫ్ బ్యాంకింగ్ పర్సనల్ సెలెక్షన్ (ఐబిపిఎస్) నిర్వహిస్తుంది.

ఆన్‌లైన్ టెస్ట్ వివరాలు

పరీక్ష సమయం 2 గంటలు. మొత్తం మార్కులు 200. రీజనింగ్, క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్, ఇంగ్లీష్ లాంగ్వేజ్, జనరల్ అవేర్‌నెస్ విభాగాల నుంచి ప్రశ్నలు వస్తాయి. ఒక్కో విభాగం నుంచి 50 ప్రశ్నలు (50 మార్కులు) అడుగుతారు. ఇంగ్లీష్ మినహా అన్ని విభాగాలను ఇంగ్లీష్ & హిందీ మాధ్యమాల్లో ఇస్తారు. నెగెటివ్ మార్కింగ్ ఉంది. ప్రతి తప్పు సమాధానానికి పావు మార్కు కోత విధిస్తారు. అభ్యర్థులు ఒకటి కంటే ఎక్కువ సమాధానాలను గుర్తించినపుడు వాటిలో సరైన సమాధానం ఉన్నా కూడా దానిని తప్పుగా పరిగణించి కోత విధిస్తారు. ప్రశ్నకు సమాధానం ఇవ్వకపోతే ఎటువంటి పెనాల్టీ ఉండదు. బ్యాంకు నిర్ణయించిన కటాఫ్ మార్కుల మేరకు అభ్యర్థి ప్రతి విభాగంలోను కనీసార్హత సాధించాల్సి ఉంటుంది. ఆన్‌లైన్ టెస్టులో అర్హత పొందినవారిని బ్యాంకులో ఉన్న ఖాళీలను అనుసరించి అభ్యర్థుల మెరిట్ ప్రకారం 1:3 నిష్పత్తిలో గ్రూప్ డిస్కషన్, ఇంటర్వ్యూలకి పిలుస్తారు.

జిడి, ఇంటర్వ్యూ వివరాలు

ఒక్కోదానికి 50 మార్కులు కేటాయించారు. అభ్యర్థులు అర్హత సాధించాలంటే రెండింటిలో 40 శాతం మార్కులు తెచ్చుకోవాలి. ఎస్సీ/ ఎస్టీ / ఒబిసి / దివ్యాంగులకు 35 శాతం వస్తే చాలు. ఆన్‌లైన్ టెస్ట్, గ్రూప్ డిస్కషన్, పర్సనల్ ఇంటర్వ్యూల వెయిటేజీని 50:20:30గా నిర్ణయించారు.

తెలుగు రాష్ట్రాల్లోని పరీక్ష కేంద్రాలు

ఆంధ్రప్రదేశ్‌లోని చీరాల, చిత్తూరు, ఏలూరు, గుంటూరు, కడప, కాకినాడ, కర్నూలు, నెల్లూరు, ఒంగోలు, రాజమండ్రి, శ్రీకాకుళం, తిరుపతి, విజయవాడ, విశాఖపట్నం, విజయనగరం, తెలంగాణలోని హైదరాబాద్, కరీంనగర్, ఖమ్మం, వరంగల్ కేంద్రాల్లో ఆన్‌లైన్ టెస్ట్ నిర్వహిస్తారు.

ముఖ్య సమాచారం

- ★ దరఖాస్తు ఫీజు: రూ.708 (ఎస్సీ/ ఎస్టీ/ దివ్యాంగులకు రూ.118)
- ★ ఆన్‌లైన్ దరఖాస్తుకు ఆఖరు తేదీ: జనవరి 31
- ★ కాల్ లెటర్ డౌన్‌లోడింగ్: ఫిబ్రవరి 20 తరవాత
- ★ ఆన్‌లైన్ ఎగ్జామినేషన్ తేదీ: మార్చి 4
- ★ వెబ్‌సైట్: www.canarabank.com

ఆంధ్రజ్యోతి

అనేక

7 నిజామాబాద్ • గురువారం 11 జనవరి 2018



దేవుడే ఇచ్చాడు గాన గంధర్వుడిని..

55 ఏళ్లుగా స్వరరాగ గంగా ప్రవాహం

కొందరు పాడితే మధురంగా ఉంటుంది. కొందరు పాడితే శ్రావ్యంగా ఉంటుంది. కొందరు పాడితే విలక్షణంగా ఉంటుంది. కానీ కేజే ఏసుదాస్ పాట భగవంతునితో సంభాషణలా ఉంటుంది. ఆయన గొంతులో దైవత్వం పల్లవిస్తుంది. వయస్సు శరీరానికి మాత్రమే! ఆయన సంగీతానికి కాదు! 78వ ఏట అడుగు అడుగుపెట్టిన ఈ గానగంధర్వుడు లక్షకుపైగా పాటలతో అరుదైన రికార్డును సొంతం చేసుకున్నారు. తన స్వరరాగ గంగా ప్రవాహంతో 55 ఏళ్లుగా కోట్లాదిమంది సంగీతాభిమానులను అలరిస్తున్నారు.



తినగ తినగ మునగ మేలు చేయు

భారీగా దిగుమతి చేసుకుంటున్న అమెరికన్లు.. తమిళనాడులో లక్ష ఎకరాల్లో చెట్లు

బచ్చలి కూర కంటే 24 రెట్లు ఎక్కువ ఐరన్ ఇచ్చే ఆకు.. పాల కంటే 16 రెట్లు ఎక్కువ కాల్షియం ఇచ్చే ఆకు.. క్యారట్ కంటే 9 రెట్లు ఎక్కువ విటమిన్‌సి ఇచ్చే ఆకు.. అరటి పండులో కంటే ఎన్నో రెట్లు ఎక్కువ పొటాషియం కలిగి ఉండే ఆకు.. ఏంటో తెలుసా?

..పై ప్రశ్నలన్నిటికీ సమాధానం ఒక్కటే. అదే.. మునగాకు. ఆకు ఒక్కటే కాదు.. మునగ చెట్టు బెరడు నుంచి మునగ కాడలు, వాటిలోని గింజల దాకా అన్నీ ఆరోగ్యానికి మేలు చేసేవే. మునగ గురించి రెండు ముక్కల్లో చెప్పాలంటే.. అదో ఔషధాల నిధి. పోషకవిలువల గని.



మునగ.. పాశ్చాత్యలకు ఇది మేజికల్ ట్రీ. మన దగ్గర.. 'అమ్మకు ప్రియనేస్తం'. ఎన్నో పోషక పదార్థాలు ఉండే మునగను ఏడాదికొక్కసారైనా.. కనీసం ఆషాఢంలోనైనా తినాలన్నారు పెద్దలు! ఒక్క ఆషాఢం అనే ఏంటి.. తరచూ తినాల్సిన ఆకు అని ఆధునిక వైద్యనిపుణులు అంటున్నారు. అల్లోపతి, ఆయుర్వేదాలు రెండింటిలోనూ మునగకు విశిష్ట స్థానం ఉంది. ఇది యాంటీబయోటిక్‌గా పనిచేస్తుంది. బాక్టీరియాపై ప్రభావశీలమైన యుద్ధం చేస్తుంది కాబట్టి ఎన్నో వ్యాధులకు శారీరక సమస్యలకు ఓ అత్యుత్తమ పరిష్కారంగా డాక్టర్లు చెబుతున్నారు. మునగ విత్తనాల్లో యాంటీఆక్సిడెంట్స్ ఉంటాయి.. ఇవి వాపుల్ని, ఒత్తిడిని నయం చేస్తాయి. కణాలు దెబ్బతినకుండా అడ్డుకుంటాయి. కాలేయాన్ని, మూత్రపిండాల్ని, పేగుల్ని శుభ్రం చేసే గుణం ఉంది. కణాల డ్యామేజి జరక్కుండా చూస్తాయి.. యాంటాసిడ్‌గా మునగాకు గ్యాస్ట్రిక్ అల్సర్లను నయం చేస్తుంది. ఊబకాయం, మధుమేహానికి మంచి మందు. కేన్సర్ చికిత్సలోనూ దీని పాత్రను ఇపుడిపుడే అంచనా వేస్తున్నారు. కండరాల నొప్పి, క్షీణతకు తగిన మందు. శరీర ఉష్ణోగ్రతను తగ్గించడం వల్ల నిద్ర సరిగా పట్టేట్టు చేస్తుంది. గుండె పనితీరును మెరుగుపరుస్తుంది. కిడ్నీల్లో రాళ్ల తొలగించడానికి, లివర్ సిరోసిస్‌కు ఇది అద్భుతమైన మందు అని ఆయుర్వేద డాక్టర్లు చెబుతున్నారు. 200 మిల్లీ గ్రాముల మునగాకు పొడి తింటే రక్తంలో షుగర్ లెవల్స్ దాదాపు 40% తగ్గుతాయి. లైంగిక సామర్థ్యం పెరగడానికి ఇది ఎంతో దోహదం చేస్తుంది, తినడానికి ఘాటుగా ఉన్నా ఇది పరమౌషధం.

ఇవీ పోషకాలు..

వంద గ్రాముల మునగాకులో ఏమేం పోషకాలుంటాయంటే..

- మాంసకృత్తులు: 8.3 గ్రాములు
- కాల్షియం: 434 మిల్లీగ్రాములు
- పొటాషియం: 202 మిల్లీగ్రాములు
- విటమిన్ ఎ: 738 మిల్లీగ్రాములు
- విటమిన్ సి: 164 మిల్లీ గ్రాములు
- పీచుపదార్థాలు: 19.2 గ్రాములు

తమిళ మురుంగై.. ఇంగ్లిష్ మోరింగా

మునగను ఇంగ్లిషులో మోరింగా అని అంటారు. ఇది మురుంగై అనే తమిళ పదం నుంచి వచ్చింది. తమిళనాట దీనిని విస్తారంగా సేద్యం చేస్తున్నారు. ఒక అంచనా ప్రకారం తమిళనాట దాదాపు లక్ష పైచిలుకు ఎకరాల్లో మునగ సాగవుతోంది. అక్కడి నుంచి మునగాకు, పొడి, విత్తనాలను అమెరికా ఎక్కువగా కొంటోంది. విదేశాలు వీటిని కాస్మెటిక్స్‌లోనూ, ఔషధాల తయారీలోనూ వాడుతున్నారని చెబుతున్నారు తమిళనాడు కు చెందిన మునగ ఎగుమతి కంపెనీ ఎస్‌వీఎం ఎక్స్‌పోర్ట్స్ యజమాని ఎస్ ముత్తురాజ్. తమిళనాడులోనే కాదు.. ఏపీ, కర్ణాటక, ఒడిసాతో పాటు హిమాలయా పర్వత పాదాల వద్ద ఈ చెట్లు పెరుగుతాయి. ఘనా, మొజాంబిక్, నైజీరియా, కెన్యా, రువాండా, నైగర్, కంబోడియా, హైతీ, ఫిలిప్పీన్స్‌లోనూ మునగ పెరుగుతున్నది.

మన మునగాకుకే డిమాండ్



మునగ భారత్‌లోనూ, అనేక ఆఫ్రికన్ దేశాల్లోనూ ఎదుగుతుంది. పశ్చిమదేశాల్లో కానరాదు. వీటిలోనూ భారత్ నుంచి వచ్చే మునగాకు శ్రేష్ఠమైనది. అందుకే - భారత్ నుంచి మునగ ఆకును అమెరికా, కెనడా, ఐరోపా దేశాలు, చైనా, జర్మనీ, దక్షిణ కొరియాల్లో దీనికోసం ఎగబడుతున్నాయి. అక్కడ మునగాకు పొడికి చాలా డిమాండ్ ఉంది. 2015లో భారత్ నుంచి రూ 146 కోట్ల విలువైన మునగ ఆకులు ఆయా దేశాలకు ఎగుమతి అయ్యాయి. ఒక అంచనా ప్రకారం ప్రపంచవ్యాప్తంగా మునగాకు వ్యాపారం దాదాపు 27వేల కోట్లు.. ఇంకో రెండేళ్లలో ఇది రూ 47,500 కోట్లకు పెరగవచ్చు.

రూ.80 కిలో మునగాకు ఎగుమతి ధర

రూ.500 కిలో మునగ విత్తనాల ఎగుమతి ధర.





నీ జీను ప్యాంటు చూసి బుల్లెమ్మో..

'చిరిగిన జీన్సు.. యమహా బైకు.. కాలేజ్ క్యాంపస్ లైఫ్‌స్టైల్స్' ..అని ఒక పాపులర్ పాట ఉంది! నిజమే చినిగిన జీన్స్ ఫ్యాషనే. మరి ఫ్యాషనంటే ఎప్పటికప్పుడు అప్‌గ్రేడ్ అవ్వాలి కదా. ఇదుగో.. చిరిగిన జీన్స్‌లో కొత్త వెరైటీ ఇదే. లోదుస్తులు కనిపించేలా.. తొడల నుంచి మోకాలి దాకా మధ్యలో అడ్డగోలుగా కోత కోసిన కొత్తరకం జీన్స్ ఇది. యూకేకు చెందిన ఆన్‌లైన్ ఫ్యాషన్ దిగ్గజ సంస్థ ఆసోస్.. 'ద ర్యాగ్డ్ ప్రీస్ట్ బ్లాక్ లేబుల్ కలెక్షన్'లో భాగంగా వీటిని సరికొత్తగా లాంచ్ చేసింది. ధర.. ఇంచుమించుగా రూ.6500. చిరిగిపోయిన జీన్స్‌కు అంత ధరా? అని బుగ్గలు నొక్కుకుంటున్నారా? ఆసోస్ సంస్థ దృష్టిలో ఇవి 'హాట్ రైట్ నౌ డెనిమ్స్' మరి.. అందుకే ఆ రేటు!!

పందెం కోళ్లకు మరణశిక్ష

కోడి పందేలు చట్ట విరుద్ధం. ఇలాంటి కేసుల్లో నిర్వాహకులు, పందెం రాయుళ్లపైనే కేసులు నమోదవుతాయి. శిక్షలూ పడతాయి. కానీ కంబోడియాలో మాత్రం పందెంలో పాల్గొన్న కోడి పుంజులకు శిక్ష పడింది. అది కూడా మరణశిక్ష..! ఇటీవల ఇక్కడకోడి పందేల స్థావరాలపై పోలీసులు దాడులు చేసి పలువురిని అరెస్ట్ చేశారు. 92 పందెం కోళ్లను స్వాధీనం చేసుకున్నారు. అరెస్టైన నిందితులు నామమాత్రపు జరిమానా కట్టి జైలు నుంచి బయటకొచ్చారు. కానీ కోడి పుంజులకు మాత్రం కోర్టు మరణ శిక్ష విధిస్తూ తీర్పిచ్చింది. మొత్తం 92 కోళ్లను వధించాలని ఆదేశాలు జారీచేసింది. దీంతో పోలీసులు ఆ పుంజులను కోసేసి ఎంచక్కా విందు చేసుకున్నారు. దీనిపై సోషల్ మీడియాలోనూ జోకులు పేలుతున్నాయి.





థియేటర్లలో సినిమా ప్రదర్శనకు ముందు జాతీయ గీతం ప్రదర్శించడం తప్పనిసరి కాదంటూ సుప్రీంకోర్టు తాజాగా ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నేపథ్యంలో జాతీయ గీతాన్ని ప్రదర్శించాలా.. వద్దా.. అన్న అంశం థియేటర్ యాజమాన్యం ఇష్టం. ఒక వేళ థియేటర్‌లో జాతీయ గీతాన్ని ప్రదర్శిస్తే.. ప్రేక్షకులు తప్పనిసరిగా లేచి నిల్చోవాల్సిందే. ఈ విషయాన్ని ఫ్లాగ్ కోడ్ స్పష్టం చేస్తోంది. దేశ గౌరవ మర్యాదలకు ప్రతిబింబాలైన జాతీయ గీతాన్ని.. జాతీయ పతాకాన్ని ఎలా గౌరవించుకోవాలో ఫ్లాగ్ కోడ్ వివరిస్తుంది.

లేచి నిల్చోవాల్సిందే!

ఫ్లాగ్ కోడ్ చెబుతున్నది అదే.. 1950 నుంచి అమల్లో నిబంధనలు

జాతీయ జెండాకు సంబంధించి 'ఫ్లాగ్ కోడ్ ఆఫ్ ఇండియా-2002' ప్రస్తుతం అమల్లో ఉంది. 2002 జనవరి 26 నుంచి ఇది అమల్లోకి వచ్చింది. తెలుగు తేజం పింగళి వెంకయ్య చేతిలో రూపుదిద్దుకున్న జాతీయజెండాకు 1947 జూలై 22న రాజ్యాంగ సభ ఆమోదం తెలిపింది. ఈ జాతీయజెండా గౌరవ మర్యాదలను కాపాడేందుకు 1950లో ఫ్లాగ్ కోడ్‌ను అమల్లోకి తెచ్చారు. ఎంబ్లమ్స్ అండ్ నేమ్స్(ప్రివెన్షన్ ఆఫ్ ఇంప్రాపర్ యూజ్) యాక్ట్ 1950, ద ప్రివెన్షన్ ఆఫ్ ఇనసల్ట్స్ టు నేషనల్ హానర్ యాక్ట్ 1971కు అనుగుణంగా ఫ్లాగ్ కోడ్‌ను రూపొందించారు. 'ఫ్లాగ్ కోడ్ ఆఫ్ ఇండియా- 2002' 3 భాగాలుగా ఉంటుంది. మొదటి భాగంలో జాతీయ జెండా రూపురేఖలకు సంబంధించిన సమాచారం ఉంటుంది. రెండోభాగంలో జాతీయ జెండాను ఎగురవేసేందుకు ప్రజలు, ప్రైవేటు సంస్థలు, విద్యాసంస్థలు అనుసరించాల్సిన నిబంధనలను పేర్కొన్నారు. మూడో భాగంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జాతీయ జెండాను ఎగురవేసేందుకు అనుసరించాల్సిన నిబంధనలను తెలిపారు.

ఫ్లాగ్ కోడ్ ఏం చెబుతుంది..

- జాతీయ జెండాను ఎగురవేసి జాతీయ గీతాన్ని ఆలపించే సమయంలో ప్రతి ఒక్కరూ గౌరవసూచకంగా నిలబడాలి.
- ఖాదీ, చేనేత వస్త్రాలపైనే జాతీయ జెండాను తయారు చేయాలి. పొడవు, వెడల్పు నిష్పత్తి 3:2గా ఉండాలి.
- వ్యక్తిగత, వాణిజ్య అవసరాలకు జాతీయ జెండాను కానీ, అందులోని గుర్తులను కానీ వాడకూడదు.
- రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతి, సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తితోపాటు సుప్రీంకోర్టు జడ్జిలు, ప్రధాన మంత్రి, గవర్నర్లు, లెఫ్టినెంట్ గవర్నర్లు, ముఖ్యమంత్రులు, హైకోర్టు చీఫ్ జస్టిస్‌లు, కేంద్ర మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఆర్మీ, నేవీ, ఎయిర్‌ఫోర్సుకు చెందిన ఫ్లాగ్ ఆఫీసర్లకు మాత్రమే తమ వాహనాలపై జాతీయజెండాను ప్రదర్శించే అవకాశం ఉంటుంది.
- రాజ్యాంగబద్ధ పదవుల్లో ఉన్నావారు మృతి చెందినప్పుడు వారి వారి హోదాలను అనుసరించి ఆయా ప్రదేశాల్లో సంతాప సూచికంగా జాతీయజెండాను సగం వరకు అవనతం చేస్తారు. **-ఆంధ్రజ్యోతి, న్యూఢిల్లీ**

ఫ్లాగ్ కోడ్‌లో మార్పులుచేర్పులు

- స్వాతంత్ర దినోత్సవం, రిపబ్లిక్ డే రోజుల్లో తప్ప మిగిలిన రోజుల్లో ప్రైవేటు వ్యక్తులు ఎవ్వరూ జాతీయజెండాను ఎగురవేసేందుకు 2002 వరకు అనుమతి లేదు. అలాగే రాత్రి వేళ జాతీయ జెండా ఎగురవేయడంపైనా ఆంక్షలుండేవి. 1995లో నవీన్ జిందాల్ దీనిపై కోర్టును ఆశ్రయించారు. దీనిపై స్పందించిన సుప్రీంకోర్టు ఏడాది పొడవునా జాతీయజెండాను ఎగురవేసుకునే హక్కు ఉందని పేర్కొంది. ఈమేరకు కేంద్రం 2002లో ఫ్లాగ్‌కోడ్‌లో సవరణలు చేసింది.
- యూనిఫాంలపైన, కాస్ట్యూమ్స్‌పైన జాతీయ జెండాను వినియోగించడంపై 2005 వరకు నిషేధం ఉండేది. 2005 జూలైలో.. ఛాతి కింద భాగాన్ని మినహాయించి దుస్తులపై జాతీయజెండాను ముద్రించుకునే అవకాశం కల్పిస్తూ కేంద్రం ఆదేశాలు ఇచ్చింది. అయితే కర్చీఫ్‌లు, పిల్లో కవర్లపై జాతీయ జెండాను ముంద్రించడంపై మాత్రం నిషేధం ఉంది. దేశంలోని అన్ని విశ్వవిద్యాలయాల్లో జాతీయ జెండాను ఎగురవేయాలని 2016 ఫిబ్రవరి 18న కేంద్ర మానవవనరుల అభివృద్ధి శాఖ ఆదేశాలు ఇచ్చింది.

'ఆమె'కు కోర్టు అండ




భర్త గతించాక, భార్యకు ఇచ్చిన ప్రభుత్వ ఉద్యోగం నుండి... మళ్లీ పెళ్లి చేసుకుందన్న సాకుతో ఆమెను తొలగించరాదని 2017లో ప్రేమలతా ఆచార్య కేసులో సుప్రీంకోర్టు ప్రభుత్వాన్ని ఆదేశించింది. అదే కాదు.. గతంలోనూ పలు సందర్భాల్లో సుప్రీంకోర్టు మహిళల సంక్షేమం కోసం మేలైన తీర్పులు వెలువరించింది.

ఆకాశంలో సగమైన 'ఆమె'కు అవకాశాలు మాత్రం శూన్యం. జనాభా లెక్కల ప్రకారం దేశంలో 48.5 శాతం మహిళలున్నారు. దేశమంతటా సగమై విస్తరించిన వనితలు వేగంగా ఎదిగి దేశ నిర్మాణంలో ప్రధాన పాత్ర పోషించాలనేది రాజ్యాంగ స్ఫూర్తి. కానీ, వాస్తవంలో ఈ స్ఫూర్తి నీరుగారుతోంది. ఈ నేపథ్యంలో.. మహిళలకు రాజ్యాంగ ఫలాలు అందించటానికి చొరవ చూపి, మహిళా సాధికారత సాధనను సులువు చేయాలని రిచా మిశ్రా కేసు (2016)లో హితవు చెప్పిన సుప్రీంకోర్టు.. 60 ఏళ్లు దాటిన రాజ్యాంగ ప్రయాణంలో భారత స్త్రీలు ఇంకా వివక్షకు గురి కావడాన్ని ఆక్షేపిస్తూ కొన్ని నిర్మాణాత్మక సూచనలు చేసింది. గత ఏడాది మే నెలలో ప్రపంచ బ్యాంక్ వెలువరించిన భారత్ అభివృద్ధి నివేదిక ఉపాధి రంగంలో స్త్రీల అవకాశాలు రానురానూ దిగజారుతున్నాయని ఎత్తి చూపింది. 2004-2016 కాలంలో పారిశ్రామిక రంగంలో మహిళల పాత్ర 37 నుండి 28 శాతానికి దిగజారడంతో రాబోయే కొన్నేళ్లలో దాదాపు 19.6 మిలియన్ల స్త్రీలు ఉపాధి అవకాశాలను జారవిడుచుకుంటారని ఈ నివేదిక అంచనా వేసింది. ఈ నేపథ్యంలో దేశ న్యాయవ్యవస్థ స్త్రీల సర్వతోముఖాభివృద్ధికి దోహదం చేసే తీర్పులివ్వడం విశేషం.

మహిళలకు బాసటగా....

గర్భిణి అనే సాకుతో ఆర్మీలో ప్రవేశాన్ని నిరాకరించడం వివక్షతేననీ, రాజ్యాంగ విరుద్ధమనీ నీతు బాల కేసు (2016)లో పంజాబ్ హర్యాణా హైకోర్టు; ప్రాదేశిక సైన్యంలో మహిళల నియామకాల్ని సుగమం చేసిన ఇటీవలి ఢిల్లీ హైకోర్టు (కుష్ కల్రా కేసు - గత వారం) ఉపాధి, సేవా రంగాల్లో సమాన అవకాశాల సాధనకు మహిళలకు వత్తాసు పలికాయి. నౌకాదళంలోని అన్ని విభాగాల్లోనూ స్త్రీలకు శాశ్వత కమిషన్ హోదా కల్పించాల్సిందేనని 2015లో సుప్రీంకోర్టు (కమాండర్ నాగరాజు కేసు) ప్రభుత్వానికి తాఖీదిచ్చింది. కాగా, కుటుంబ మహిళలు అటు ఉద్యోగ బాధ్యతలతోనూ, ఇటు గృహ నిర్వహణలోనూ సతమతమవుతూనే ఇంటా బయటా హింసకూ, దౌర్జన్యాలకూ, లైంగిక, ఆర్థిక వేధింపులకూ గురికావడంతో అవకాశాలను అందిపుచ్చుకోవడంలో వారు వెనుకంజ వేస్తున్నారు. తరాలుగా కుటుంబ పెత్తనాన్ని పురుషులకే కట్టబెట్టిన సంప్రదాయానికి తిలోదకాలిస్తూ, ఇక ముందు స్త్రీలు కూడా జాయింటు కుటుంబకర్తలుగా వ్యవహరించి కుటుంబ యాజమాన్యం చేయవచ్చని 2015లో సుప్రీంకోర్టు శ్రేయా విద్యార్థి కేసులో తీర్పు చెప్పడం సాధికారత సాధనలో భారత మహిళలకు లభించిన గొప్ప బాసట. భారత సమాజంలో మహిళలను కట్టు బానిసలుగా చేసి, స్త్రీ జాతి ఎదుగుదలకు మోకాలడ్డే వ్యక్తుల, వ్యవస్థల సంకుచిత భావజాలంలో మార్పులు తీసుకురావాల్సిన అవసరాన్ని న్యాయవ్యవస్థ మనకు పదేపదే గుర్తు చేయడం ప్రశంసనీయం.

- వేదాంతం సీతారామావధాని, భారత సుప్రీంకోర్టు మాజీ సెక్రటరీ జనరల్, సెల్ : 70421 40099



లా-లోచనం

Law lochanam



జానా.. టీఆర్ఎస్ కార్యకర్తగా పనిచేస్తారా?

- 24 గంటల కరెంట్ ఇస్తే చేస్తానన్నారు.. ఇప్పుడేమంటారు?
- నిరంతర విద్యుత్తు సీఎం కేసీఆర్ చలవే: హరీశ్‌రావు



గజ్వేల్, జనవరి 10: వ్యవసాయానికి 24 గంటల విద్యుత్ సాధ్యం కాదని, తెలంగాణ ప్రభుత్వం ఇస్తే టీఆర్ఎస్ కార్యకర్తగా పనిచేస్తానన్న సీఎల్పీ నేత జానారెడ్డి ఇప్పుడు సిద్ధమా? అని భారీ నీటిపారుదల శాఖ మంత్రి టీ హరీశ్‌రావు ప్రశ్నించారు. సిద్దిపేట జిల్లా గజ్వేల్‌లో టీఆర్ఎస్ విస్తృత స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. తమ ప్రభుత్వం 24 గంటల కరెంటు, ఎకరాకు రూ.8 వేల పెట్టుబడి సహాయం ఇవ్వడంతో ప్రతి పక్షాలకు ఏం చేయాలో పాలుపోవడం లేదన్నారు. అసాధ్యాన్ని సుసాధ్యం చేసిన సీఎం కేసీఆర్‌ను కేంద్రమంత్రులు కూడా ప్రశంసిస్తున్నారన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టుపైనా కేసీఆర్ మొండి పట్టుదలతో ఉన్నారని, శక్తి మేరకు పనిచేస్తున్న తాము రెండేళ్లలోనే ప్రాజెక్టును పూర్తి చేసి దేశంలోనే అత్యంత వేగంగా ప్రాజెక్టును పూర్తి చేసిన ఘనతను దక్కించుకునేందుకు కృషి చేస్తున్నామన్నారు. గోదావరి నీటితో తెలంగాణ రైతుల కాళ్లు కడిగేందుకు టీఆర్ఎస్ ప్రభుత్వం, సీఎం కేసీఆర్ కృతనిశ్చయంగా ఉన్నారన్నారు.

'కావ్యహిత' దరఖాస్తుకు ఫిబ్రవరి 10 గడువు

హైదరాబాద్, జనవరి 10(ఆంధ్రజ్యోతి): బ్రాహ్మణ సామాజిక వర్గానికి చెందిన రచయితలు, కవులు తమ రచనల్ని ముద్రించుకునేందుకు వీలుగా ప్రవేశపెట్టిన కావ్యహిత పథకానికి ఫిబ్రవరి 10లోగా దరఖాస్తు చేసుకోవాలని పరిషత్ అడ్మినిస్ట్రేటర్ కె.చంద్రమోహన్ తెలిపారు. ఈ పథకం ద్వారా రచనలు ముద్రించుకోవడానికి గరిష్ఠంగా రూ.50 వేల ఆర్థిక సాయం అందిస్తారు. నివాస, ఆదాయ, కుల ధ్రువీకరణ పత్రాలతో కూడిన దరఖాస్తుతో పాటు రచనలకు సంబంధించిన రెండు ప్రతుల్ని తెలంగాణ బ్రాహ్మణ పరిషత్ కార్యాలయంలో లేదా admintbspgad@telangana.gov.in మెయిల్ ద్వారా ఫిబ్రవరి 10లోగా దరఖాస్తు చేసుకోవాలి.

కానిస్టేబుళ్ల పదోన్నతికే తొలి ప్రాధాన్యం: డీజీపీ

హైదరాబాద్, జనవరి 10(ఆంధ్రజ్యోతి): కానిస్టేబుళ్ల పదోన్నతికే తొలి ప్రాధాన్యం ఇస్తానని పోలీస్ అధికారుల సంఘం ప్రతినిధులకు డీజీపీ మహేందర్ రెడ్డి తెలిపారు.సుదీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న పదోన్నతి సమస్యను దశలవారీగా పరిష్కరిస్తున్నామన్నారు. కోర్టు ఉత్తర్వులకు లోబడి పదోన్నతులు ఇస్తామన్న హామీని అమలు చేయాలని పోలీస్ అధికారుల సంఘం అధ్యక్షుడు వై.గోపిరెడ్డి, తదితరులు కోరారు. కాగా, 2018ని ఇయర్ ఆఫ్ టెక్నాలజీగా ప్రకటించిన నేపథ్యంలో తమ లక్ష్యాన్ని చేరుకునేందుకు నిధులను సమకూర్చుకునేలా బడ్జెట్ అంచనాను పోలీసు అధికారులు రూపొందిస్తున్నారు. డీజీపీ మహేందర్‌రెడ్డి నేతృత్వంలో అధికారులు బుధవారం భేటీ అయ్యారు. 16లోగా సమగ్ర నివేదికను సర్కారుకు ఇస్తారు.

ఏపీకి 60, తెలంగాణకు 50 టీఎంసీలు: కృష్ణాబోర్డు

హైదరాబాద్, జనవరి 10(ఆంధ్రజ్యోతి): శ్రీశైలం, నాగార్జునసాగర్ రిజర్వాయర్ల నీటిలో ఆంధ్రప్రదేశ్ 60 టీఎంసీలు, తెలంగాణ రాష్ట్రం 50 టీఎంసీలను ఉపయోగించుకోవాలని ఇరురాష్ట్రాలకు కృష్ణాబోర్డు సూచించారు. నీటి కోటాపై చర్చించేందుకు కృష్ణా బోర్డు త్రిసభ్య కమిటీ బుధవారం ప్రత్యేకంగా సమావేశమైంది. బోర్డు సభ్య కార్యదర్శి పరమేశం, తెలంగాణ, ఏపీ ఇరిగేషన్ ఈఎన్‌సీలు మురళీధర్‌రావు, వెంకటేశ్వరరావు, అధికారులు పాల్గొన్నారు.

అడ్వాన్స్‌డ్ ఎయిర్‌లాస్ పై శిక్షణ

హైదరాబాద్, జనవరి 10(ఆంధ్రజ్యోతి): 'అడ్వాన్స్‌డ్ ఎయిర్ లాస్'పై నల్సార్ యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్ 5 రోజుల సర్టిఫికెట్ కోర్సును అందిస్తున్నట్లు ఆ సంస్థ రిజిస్ట్రార్ తెలిపారు. డిగ్రీ విద్యార్థులు అర్హులని అన్నారు. ఫిబ్రవరి 8 నుంచి 12 తేదీల్లో శిక్షణ ఇస్తామన్నారు. శిక్షణా రుసుము విద్యార్థులకు రూ.6వేలు, ఇతరులకు రూ.8వేలుగా నిర్ణయించారు. అభ్యర్థులు ఈ నెల 30లోగా http://casl.nalsar.ac.in/applicationలో దరఖాస్తు చేసుకోవాలి. వివరాలకు 040-234988212లో సంప్రదించాలని తెలిపారు.

అఫిలియేషన్ దరఖాస్తుకు 31 వరకు గడువు

హైదరాబాద్, జనవరి 10(ఆంధ్రజ్యోతి): ప్రైవేటు జూనియర్ కాలేజీలు అనుబంధ గుర్తింపు దరఖాస్తు గడువును పొడిగించినట్లు బోర్డు కార్యదర్శి తెలిపారు. అపరాధ రుసుము లేకుండా ఈనెల 31వ తేదీలోపు, రూ.20 వేల అపరాధ రుసుముతో మార్చి 14 వరకు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు.

'పోలీస్ ఉద్యోగాలకు వయోపరిమితి పెంచాలి'

హైదరాబాద్, జనవరి 10(ఆంధ్రజోతి): త్వరలో వెలువడే ఎస్సై, కానిస్టేబుల్ ఉద్యోగాలకు వయోపరిమితి పెంచాలని ప్రభుత్వాన్ని నిరుద్యోగులు బుధవారం కోరారు. ఎస్సై పోస్టుకు మహారాష్ట్రలో 31ఏళ్లు, గుజరాత్‌లో 35 ఏళ్లు, బిహార్‌లో 37 ఏళ్ల వయోపరిమితి ఉందన్నారు. తెలంగాణలో వయోపరిమితి 25 సంవత్సరాలు మాత్రమే ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. దీనిపై పలువురు నిరుద్యోగులు హోంమంత్రి, డీజీపీని కలిసి విజ్ఞప్తి చేశారు.

హౌజ్ కమిటీ చైర్మన్లతో స్పీకర్ సమావేశం

హైదరాబాద్, జనవరి 10(ఆంధ్రజ్యోతి): అసెంబ్లీ ఏర్పాటు చేసిన పలు కమిటీల చైర్మన్లతో శాసనసభ స్పీకర్ మధుసూధనాచారి బుధవారం సమావేశమయ్యారు. మండలి చైర్మన్ స్వామిగౌడ్‌తోపాటు మూడు హౌజ్ కమిటీల చైర్మన్లు ఈ సమావేశంలో పాల్గొన్నారు. కో-ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీల్లో అవకతవకలు, అసైన్డ్ భూముల కేటాయింపుల్లో అక్రమాలు, వక్ఫ్ భూములకు సంబంధించిన విచారణ కమిటీల చైర్మన్లు ఆరూరి రమేశ్, మర్రి పెద్ది సుధీర్‌రెడ్డి, బాజిరెడ్డి గోవర్ధన్‌లతో స్పీకర్ సమావేశమయ్యారు.

4 వారాల్లో ట్రయల్ రన్ ప్రారంభించాలి: ప్రశాంత్

హైదరాబాద్, జనవరి 10(ఆంధ్రజ్యోతి): మిషన్ భగీరథ పంపింగ్ స్టేషన్లు అన్నింటిలోనూ ట్రయల్ రన్‌ను 4 వారాల్లోగా ప్రారంభించాలని మిషన్ భగీరథ చైర్మన్ వేముల ప్రశాంత్ రెడ్డి ఆదేశించారు. త్వరలో అందుబాటులోకి రానున్న పంపులు, మోటార్లకు సంబంధించిన ఎరక్షన్ పనులకు సుశిక్షితులైన నిపుణులను సిద్ధం చేసుకోవాలన్నారు. మిషన్ భగీరథ పనులపై పంపులు, మోటార్ల తయారీదారులతో గురువారం సమావేశమయ్యారు.

తెలంగాణకు పాఠశాల విద్యాశాఖ ఉద్యోగులు

హైదరాబాద్, జనవరి 10(ఆంధ్రజ్యోతి): ఏపీలో రెసిడెన్షియల్ ఎడ్యుకేషన్ ఇన్‌స్టిట్యూషన్స్ సొసైటీలో విధులు నిర్వహిస్తున్న తెలంగాణకు చెందిన 10 మంది ఉద్యోగులు స్వరాష్ట్రానికి వచ్చేందుకు ఆమోదం తెలుపుతూ తెలంగాణ పాఠశాల విద్యాశాఖ బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఆమోదం పొందిన వారిలో ఒక మ్యాథ్స్ టీచర్, సూపరింటెండెంట్, జూనియర్ అసిస్టెంట్, రికార్డ్ అసిస్టెంట్, ఆరుగురు ఆఫీస్ సబార్డినేట్స్ ఉన్నారు.

తెలంగాణలో 10 మందికి కన్‌ఫర్డ్ ఐఏఎస్

హైదరాబాద్, జనవరి 10(ఆంధ్రజ్యోతి): తెలంగాణకు చెందిన 10 మంది స్టేట్ సివిల్ సర్వీసెస్ కొర్రా లక్ష్మి(డైరెక్టర్, స్టేట్ ఆర్ట్ గ్యాలరీ), చిట్టెం లక్ష్మి (సివిల్ సప్లయీస్ కార్పొరేషన్), కె.ధర్మారెడ్డి (మేడ్చల్ మల్కాజ్‌గిరి జాయింట్ కలెక్టర్), టీ వినయ్‌కృష్ణారెడ్డి, సీహెచ్ శివలింగయ్య (జేసీ నిర్మల్), వాసం వెంకటేశ్వర్లు (సంగారెడ్డి జాయింట్‌కలెక్టర్), ఎం హనుమంతరావు (గాడా ప్రత్యేకాధికారి), డీ అమోయ్‌కుమార్, కే హైమావతి, ఎం హరిత (వరంగల్ రూరల్ జాయింట్ కలెక్టర్)లను కన్‌ఫర్డ్ ఐఏఎస్‌లుగా ఎంపిక చేస్తూ యూపీఎస్సీ డీవోపీటీకి పంపినుంది. దీంతో నేడో రేపో ఈ జాబితాను వెలువరిస్తూ డీవోపీటీ ఉత్తర్వులు ఇవ్వనుంది.

13 నుంచి కాలేజీలకు సంక్రాంతి సెలవులు

హైదరాబాద్, జనవరి 10(ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండుగ సందర్భంగా ఈ నెల 13 నుంచి 15 వరకు జూనియర్ కళాశాలలకు ఇంటర్‌బోర్డు సెలవులు ప్రకటించింది. సెలవు రోజుల్లో తరగతులు నిర్వహించొద్దని కళాశాలలను ఆదేశించింది. తరగతులు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించింది. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లోని కేంద్ర ప్రభుత్వ కార్యాలయాలకు ప్రభుత్వం జనవరి 15న సెలవు ప్రకటించింది. గతంలో సెలవు దినంగా ప్రకటించిన సెప్టెంబరు 3న కేంద్ర ప్రభుత్వ కార్యాలయాలు యథావిధిగా పనిచేస్తాయని పేర్కొంది.

'మోడల్'లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

హైదరాబాద్, జనవరి 10(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని మోడల్ స్కూళ్లలో 2018-19 విద్యాసంవత్సరానికి గాను ఆరు, ఏడు, పది తరగతుల్లో ప్రవేశాలకు ప్రభుత్వం బుధవారం నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ నెల 23 నుంచి ఫిబ్రవరి 16 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరించనున్నారు. ఏప్రిల్ 15న ప్రవేశ పరీక్షను నిర్వహిస్తారు. ఓసీ విద్యార్థులు రూ. 100, బీసీ, ఎస్టీ, ఎస్సీ విద్యార్థులు రూ. 50 దరఖాస్తు ఫీజు చెల్లించి దరఖాస్తు చేసుకోవాలి. వివరాలకు http://telanganams.cgg.gov.in వెబ్‌సైట్‌ను సంప్రదించాలి.

ప్రాజెక్టులకు సాయం చేయండి

ఫార్మాసిటీకి రూ.1500 కోట్లు కావాలి.. మెగా లెదర్ పార్కు మంజూరు చేయండి.. కేంద్ర వాణిజ్య మంత్రి సురేశ్‌ప్రభుకు కేటీఆర్ విజ్ఞప్తి

న్యూఢిల్లీ, జనవరి 10(ఆంధ్రజ్యోతి): తెలంగాణలో ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న పలు ప్రాజెక్టులకు ఆర్థిక సహకారం అందించాలని, రాష్ట్రానికి మెగా లెదర్ పార్కు మంజూరు చేయడంతో పాటు పసుపు బోర్డు ఏర్పాటు ప్రక్రియను వేగవంతం చేయాలని కేంద్ర వాణిజ్య శాఖ మంత్రి సురేశ్ ప్రభుకు రాష్ట్ర పరిశ్రమలు, ఎన్ఆర్ఐ వ్యవహారాల శాఖ మంత్రి కేటీఆర్ విజ్ఞప్తి చేశారు. బుధవారం ఆయన ఢిల్లీలో కేంద్ర మంత్రికి వినతిపత్రం అందించడంతో పాటు గల్ఫ్‌లో ఉంటున్న భారతీయుల సమస్యలపై కేంద్ర విదేశీ వ్యవహారాల మంత్రి సుష్మా స్వరాజ్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేటీఆర్ విలేకరులతో మాట్లాడుతూ.. టీఎస్ ఐపాస్ ద్వారా పెద్ద ఎత్తున పెట్టుబడులను ఆకర్షిస్తున్న తెలంగాణ ప్రభుత్వాన్ని సురేశ్ ప్రభు అభినందించారన్నారు. దావోస్‌లో జరిగే వరల్డ్ ఎకనామిక్ సమ్మిట్‌లో పాల్గొనాలని సూచించారన్నారు. హైదరాబాద్ ఫార్మాసిటీకి ఎన్ఐఎంజడ్ హోదా ఇచ్చే ప్రక్రియను వేగవంతం చేయాలని కోరానన్నారు. అందులో కామన్ ఎఫ్లూయంట్ ట్రీట్‌మెంట్ ప్లాంట్‌ను ఏర్పాటు చేసేందుకు రూ.1500 కోట్లు మంజూరు చేయాలని కోరానన్నారు. నిజామాబాద్‌లోని స్పైస్‌పార్క్‌కు రూ.20 కోట్లు మంజూరు చేస్తున్నట్లు ఇటీవల ప్రకటించిన కేంద్రమంత్రిని త్వరలో ఉత్తర్వులు జారీ చేయాలని కోరానన్నారు. హైదరాబాద్ - వరంగల్, హైదరాబాద్ - రామగుండం, హైదరాబాద్ - బెంగళూరు ఇండస్ట్రియల్ కారిడర్ల అభివృద్ధిని వేగవంతం చేసి మౌలిక సదుపాయాల కల్పనకు నిధులు కేటాయించాలని విజ్ఞప్తి చేశానన్నారు. ఫిబ్రవరిలో తెలంగాణ ప్రభుత్వం నిర్వహించే బయో ఏషియా కార్యక్రమానికి ఆహ్వానించానని, ఫిబ్రవరి 23న జరిగే సీఈవోల సదస్సులో పాల్గొనాలని కోరానన్నారు. తన విజ్ఞప్తులకు సానుకూలంగా స్పందించిన కేంద్ర మంత్రి సమస్యల పరిష్కారానికి తెలంగాణ భవన్ రెసిడెంట్ కమిషనర్‌తో పనిచేయాలని తన కార్యదర్శిని ఆదేశించారన్నారు.



ఢిల్లీలో బుధవారం కేంద్ర వాణిజ్య మంత్రి సురేశ్‌ప్రభుతో కేటీఆర్ భేటీ

మళ్లీ మళ్లీ వెళ్తే ఐదేళ్లు పాస్‌పోర్టు రద్దు


ఎమెన్, లిబియా వంటి గల్ఫ్ దేశాల్లో భారతీయులు చిక్కుకున్నప్పుడు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి వెనక్కి తీసుకొచ్చినా వాళ్లు మళ్లీ అదే దేశానికి వెళ్తున్నారని, అలా ప్రభుత్వానికి ఇబ్బంది కలిగిస్తున్న వారి పట్ల కఠినంగా వ్యవహరించాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని కేటీఆర్ తెలిపారు. టూరిస్టు వీసాపై వెళ్లి ఉద్యోగాలు చేస్తున్న వాళ్ల పాస్‌పోర్టును ఐదేళ్ల పాటు రద్దు చేస్తామన్న కేంద్రం నిర్ణయాన్ని రాష్ట్రం స్వాగతిస్తుందన్నారు. నకిలీ ఏజెంట్ల పట్ల తెలంగాణ ప్రభుత్వం కఠినంగా వ్యవహరిస్తుందన్నారు. తాను రాష్ట్ర హోంమంత్రితోనూ, పోలీసులతోనూ సమావేశం నిర్వహించి ఉక్కుపాదం మోపేలా చర్యలు చేపడ్తామని సుష్మాస్వరాజ్‌కు హామీ ఇచ్చానన్నారు. 5 రోజుల్లోనే పాస్‌పోర్టులు జారీ చేయడంతో పాటు ప్రవాసీయుల పట్ల చిత్తశుద్ధితో పని చేస్తున్న తెలంగాణ ప్రభుత్వాన్ని సుష్మ అభినందించారన్నారు. హైదరాబాద్‌లో నిర్మించే విదేశీ భవన్ శంకుస్థాపనకు కేంద్రమంత్రిని ఆహ్వానించానన్నారు.

మీ చార్జీలకో దండం!

డిస్కమ్‌లకు 'ఓపెన్ యాక్సెస్' గండం

- బయటి కొనుగోళ్లకే భారీ పరిశ్రమలు మొగ్గు
- రాత్రిళ్లు పరమ చౌకగా అందుబాటులో కరెంటు
- డిస్కమ్‌లకు కోట్ల రూపాయలు నష్టం
- మిగిలేది ఉచిత, చౌక వినియోగదారులే
- డిస్కమ్‌లకు స్వేచ్ఛ లేక కష్టాలు

(అమరావతి/హైదరాబాద్ - ఆంధ్రజ్యోతి)



పెద్ద వాడిని కొట్టు... పేదవాడికి పెట్టు!

కరెంటు విషయంలో సర్కారు వారిది అచ్చంగా 'రాబిన్‌హుడ్' స్టైలు! ఇక్కడ పెద్దలంటే... భారీ పరిశ్రమలు, వాణిజ్య అవసరాలకు విద్యుత్తును ఉపయోగించేవారు. వీరి నుంచి భారీగా చార్జీలు వసూలు చేస్తారు. ఆ మొత్తాన్ని వ్యవసాయానికి ఉచిత విద్యుత్తు, పేదలకు 50 యూనిట్లలోపు ఉచితం తదితర పథకాలకు సర్దుబాటు చేస్తారు. ఇప్పుడు విద్యుత్తు పంపిణీ సంస్థలకు రాజ పోషకులుగా ఉన్న భారీ పారిశ్రామిక వినియోగదారులు 'మీ కరెంటు మాకొద్దు' అంటున్నారు. కాలానుగుణంగా ధరలు తగ్గుతున్నా డిస్కమ్‌లు తక్కువ ధరకు కరెంటు ఇవ్వడానికి విముఖత చూపుతుండటంతో హెచ్‌టీ వినియోగదారులంతా ఇండియన్ ఎనర్జీ ఎక్స్ఛేంజ్(ఐఈఎక్స్)కు క్యూ కడుతున్నారు. ఓపెన్ యాక్సెస్ విధానంలో... నేరుగా విద్యుదుత్పత్తి సంస్థల నుంచి తక్కువ ధరకే కరెంటు కొనుగోలు చేస్తున్నారు. ఫలితంగా డిస్కమ్‌ల పరిధిలో సబ్సిడీలపై ఆధారపడే గృహ, వ్యవసాయ, సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలే మిగిలిపోనున్నాయి. ఈ నేపథ్యంలో డిస్కమ్‌లకు భారీ ఆదాయ లోటు తప్పదు. ఏపీ విషయానికి వస్తే... డిస్కమ్‌లు 2017-18లో రూ.6,108 కోట్లు నష్టం నమోదు చేశాయి. 2018-19లో రూ.7226 కోట్లు నష్టం వస్తుందని అంచనా వేశాయి. అసలే నష్టాల్లో ఉన్న డిస్కమ్‌లకు ఇప్పుడు ఓపెన్ యాక్సెస్ కష్టాలు తోడయ్యాయి. ఏపీఈపీడీసీఎల్ పరిధిలో 1800 మిలియన్ యూనిట్లు, ఎస్పీడీసీఎల్ పరిధిలో 660 మిలియన్ యూనిట్ల దాకా ఓపెన్ యాక్సెస్‌కు బడా పారిశ్రామిక సంస్థలు వెళ్లిపోయాయి. ఫలితంగా డిస్కమ్‌లు 250 కోట్ల ఆదాయం కోల్పోయాయి. తెలంగాణ విషయానికి వస్తే... 2015-16లో హెచ్‌టీ వినియోగదారులు 902 మిలియన్ యూనిట్లను ఓపెన్ యాక్సెస్ నుంచి కొనుగోలు చేశారు. 2016-17లో ఏకంగా 2,135 మిలియన్ యూనిట్లు కొన్నారు. ఉదయం 6 గంటల నుంచి రాత్రి 10 గంటల దాకా డిస్కమ్‌లు ఇచ్చే కరెంట్‌ను కొంటున్న హెచ్‌టీ వినియోగదారులు...రాత్రి 10కాగానే 'ఎనర్జీ ఎక్స్ఛేంజ్'లోకి దూకుతున్నారు. రాత్రి సమయంలో తెలంగాణ డిస్కమ్‌లు యూనిట్‌కు రూపాయి చొప్పున రాయితీ ఇస్తున్నాయి. బయటి నుంచి కరెంటు కొంటే రూ.1.65ల క్రాస్ సబ్సిడీ, 52 పైసలు అదనపు సర్‌చార్జీ కూడా విధిస్తున్నాయి. అయినా బయటి కరెంటే యూనిట్‌కు రూ.2 దాకా చౌక కావడం గమనార్హం.

డిస్కమ్‌లపై స్వారీ...

వ్యాపార ప్రణాళికలు సిద్ధం చేసుకుని.. ఎవరి నుంచి ఎంత ధరకు విద్యుత్తును కొనుగోలు చేయాలో నిర్ణయించుకునే అధికారం డిస్కమ్‌లకు లేదు. డిస్కమ్‌లపై జెన్కో, ట్రాన్స్‌కోల పెత్తనం కొనసాగుతోంది. జెన్కో విద్యుత్కేంద్రాల్లో యూనిట్ ధర ఎంత చెబితే అంత చెల్లించి డిస్కమ్‌లు కొనుగోలు చేస్తున్నాయి. ఎన్టీపీసీతో కొనుగోలు ఒప్పందాలు చేసుకున్నప్పుడు ఆచితూచి బేరాలాడే డిస్కమ్‌లు.. జెన్కో విషయంలో ఆ పని చేయవు. జెన్కో లాభాల్లో ఉండగా, డిస్కమ్‌లు నష్టాలు చూపిస్తుండటం గమనార్హం. జెన్కో ఉత్పత్తి చేసే వి ద్యుత్తునంతటినీ కొనుగోలు చేయాలనే నిబంధనను ఎత్తివేసినప్పుడే డిస్కమ్‌లు ఊపిరి పీల్చుకోగలుగుతాయని ఇంధన శాఖ నిపుణులు స్పష్టం చేస్తున్నారు.

ఉదయ్ వచ్చినా...

'ఉజ్వల్ డిస్కమ్ అస్యూరెన్సు యోజన' (ఉదయ్)ను కేంద్ర ఇంధన మంత్రిత్వ శాఖ అమలు చేస్తోంది. డిస్కమ్‌లకు అనేక రాయితీలు, ఇతర ప్రయోజనాలను కల్పిస్తోంది. రెండు తెలుగు రాష్ట్రాలు ఈ పథకంలో చేరాయి. ఉదయ్ నిబంధనల ప్రకారం డిస్కమ్‌ల అప్పుల్లో 75 శాతం రెండు రాష్ట్ర ప్రభుత్వాలు నెత్తిన వేసుకున్నాయి. అయినా... డిస్కమ్‌లలో వెలుగు కనిపించడంలేదు. ఇందుకు ప్రధాన కారణం డిస్కమ్‌లు అధిక ధరలకు విద్యుత్తును కొనుగోలు చేయడమేనని అధికారులు అంతర్గత సంభాషణల్లో అంగీకరిస్తున్నారు. నిజానికి... ఉదయ్‌ను అమలు చేసే డిస్కమ్‌లు ప్రతి 3 నెలలకోసారి చార్జీలను సవరించుకోవాలి. కానీ... చార్జీలను తగ్గించాల్సిన పరిస్థితుల్లో పెంచడమంటే ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత రావడం ఖాయం. దీంతో తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాలు చార్జీల పెంపునకు ససేమిరా అంటున్నాయి.

వాటిని నియంత్రించేదెవరు?

విద్యుత్తు సంస్థలను నియంత్రించేందుకు 2 రాష్ట్రాల్లో విద్యుత్తు నియంత్రణ మండళ్లు ఉన్నా.. విద్యుదుత్పత్తి, వినియోగంతో ముడిపడిన కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థలు కోల్ ఇండియా, రైల్వేలు, పోర్టులను నియంత్రించే వ్యవస్థలు మాత్రం లేవు. ఇటీవల సిబ్బందికి జీతాలు పెంచిన కోల్ ఇండియా... బొగ్గు ధరలను కూడా 10% పెంచేసింది. ఇటీవల రైల్వేలూ రవాణా చార్జీలను పెంచేశాయి. ఓడల ద్వారా రవాణా వ్యయం పెరిగింది. ఇదంతా విద్యుదుత్పత్తిపై వ్యయం ప్రభావం చూపుతోంది.

రైల్వేదీ అదే బాట...

కరెంట్ కొనుగోళ్ల భారంగా మారుతుండటంతో గత కొన్నేళ్లుగా దక్షిణ మధ్య రైల్వే కూడా తాము బయటి నుంచి కరెంటు కొంటామని, ఇందుకు నిరభ్యంతర పత్రం ఇవ్వాలని తెలంగాణను కోరింది. పీపీపీ విధానంలో ఏర్పాటు చేసిన ఒక ప్రాజెక్టు నుంచి రైల్వే శాఖ కరెంట్ కొనుగోళ్లు చేస్తోంది. ఈ విషయంలో ఏకంగా ప్రధానమంత్రి కూడా జోక్యం చేసుకున్నారు. ఏపీలో ఈఆర్సీ చొరవతో యూనిట్ రూ.4.05లకే కరెంటు ఇస్తామని చెప్పి, ఒప్పించారు. తెలంగాణలోనూ రానున్న ఆర్థిక సంవత్సరంలో రూ.4.05లకే యూనిట్ ఇస్తామని ప్రతిపాదించింది.

కేసీఆర్‌ను తిట్టినా.. ఐపీ అడ్రస్ ఇవ్వం

- సీసీఎస్ విజ్ఞప్తిని తిరస్కరించిన ఫేస్‌బుక్
- కేంద్ర హోం శాఖకు సీఐడీ అధికారుల లేఖ
- సమాచారం ఇప్పించాల్సిందిగా అభ్యర్థన

హైదరాబాద్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి కేసీఆర్‌పై ఫేస్‌బుక్‌లో అనుచిత వ్యాఖ్యలు చేసిన కేసులో దర్యాప్తు ముమ్మరమైంది. ఏ ఐపీ అడ్రస్ నుంచి ఆ పోస్టులు పెట్టారో తెలపాల్సిందిగా సీసీఎస్ అధికారులు చేసిన విజ్ఞప్తిని ఫేస్‌బుక్ తిరస్కరించడంతో.. ఆ వివరాలు ఇప్పించాలంటూ సీఐడీ అధికారులు కేంద్ర హోం లేఖ రాశారు. రామకృష్ణ ఆకుతోట అనే ఐడీతో ఎవరో ఫేస్‌బుక్‌లో గత నవంబరులో



సీఎం కేసీఆర్‌పై పలు ఆరోపణలు, అనుచిత వ్యాఖ్యలు చేస్తూ పోస్టులు పెట్టారు. ఆజంపురా టీఆర్ఎస్ కార్యకర్త వసీం అలీ ఆ పోస్టులపై పోలీస్‌లకు ఫిర్యాదు చేశారు. దీనిపై చాదర్‌ఘాట్ పోలీస్‌స్టేషన్‌లో నవంబర్ 13న కేసు నమోదైంది. స్థానిక పోలీసులు తదుపరి దర్యాప్తు నిమిత్తం ఈ కేసును సీసీఎస్(సెంట్రల్ క్రైమ్ స్టేషన్)కు బదిలీ చేశారు. ఆ వ్యాఖ్యలు ఏ ఐపీ అడ్రస్ నుంచి ఫేస్‌బుక్‌లో పోస్ట్ అయ్యాయో.. ఆ వివరాలు ఇవ్వాల్సిందిగా సీసీఎస్ అధికారులు గత నెలలో ఫేస్‌బుక్ సంస్థకు లేఖ రాశారు. ఐపీ అడ్రస్ ఇచ్చేందుకు సదరు సంస్థ నిరాకరించింది. సీఎం కేసీఆర్‌పై అనుచిత వ్యాఖ్యలకు సంబంధించిన కేసు కావడంతో విషయాన్ని తీవ్రంగా పరిగణించిన అధికారులు నోడల్ ఏజెన్సీగా వ్యవహరిస్తున్న సీఐడీ ద్వారా ఎంహెచ్ఏకు లేఖ రాశారు. ఈ విషయంలో ఫేస్‌బుక్ సంస్థతో సంప్రదించి కేసు దర్యాప్తునకు అవసరమైన సమాచారం ఇప్పించాల్సిందిగా లేఖలో అభ్యర్థించారు. మ్యూచువల్ లీగల్ అసిస్టెన్స్ ట్రీటీ ప్రకారం ఎంహెచ్ఏ ఫేస్‌బుక్ సంస్థపై ఒత్తిడి తెచ్చి దర్యాప్తునకు అవసరమైన సమాచారం రాబట్టనుంది. మరో 10 రోజుల తర్వాత ఐపీ అడ్రస్ వివరాలు వచ్చే అవకాశం ఉందని, ఆ తర్వాత కేసు దర్యాప్తులో తదుపరి చర్యలు తీసుకోనున్నట్లు అధికారులు తెలిపారు.

కాళేశ్వరం.. అద్భుతం

(మొదటి పేజీ తరువాయి)

అప్రయిజల్ డైరెక్టర్ రాజీవ్ కుమార్‌లతో కూడిన అధికారుల బృందం రెండు రోజులుగా క్షేత్రస్థాయిలో పర్యటించి, కాళేశ్వరం నిర్మాణ పనులను పరిశీలించింది. హైదరాబాద్ వచ్చిన ఈ బృంద సభ్యులు బుధవారం జలసౌధలో విలేకరులతో మాట్లాడారు. దేశంలో ఇలాంటి ప్రాజెక్టును తాము ఇంతవరకు చూడలేదన్నారు. మిగిలిన వాటితో పోలిస్తే కాళేశ్వరం విభిన్నమైనదిగా గుర్తింపు పొందనుందన్నారు. ప్రస్తుతం జరుగుతున్న పద్ధతిలోనే పనులు కొనసాగితే నిర్ణీత గడువులోగా ప్రాజెక్టు పూర్తి కావడం సాధ్యమేనన్నారు. ఇది సమీకృత, బహుళార్థ సాధక ప్రాజెక్టు అని పేర్కొన్నారు. మిడ్ మానేరు, ఎస్ఆర్ఎస్పీ సహా పలు ప్రాజెక్టులకు కాళేశ్వరం ఆధారం కాబోతోందని వివరించారు. ఒక భారీ ప్రాజెక్టు మరిన్ని సాగునీటి ప్రాజెక్టులతో అనుసంధానం చేస్తున్న ప్రక్రియ అభినందనీయమన్నారు. స్ట్రక్చర్ల నిర్మాణాలు, ప్రణాళిక, వేగంగా పనులు జరుగుతున్న తీరు తమను ఆకట్టుకున్నాయని చెప్పారు. పనుల వేగాన్ని బట్టి చూస్తుంటే వానాకాలం నాటికల్లా కాళేశ్వరం ప్రాజెక్టు మొదటి మైలు రాయి దాటుతుందని దాస్ ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ ప్రాజెక్టు నిర్మాణంలో సీఈ హరిరాం కృషిని ఆయన ప్రత్యేకంగా ప్రస్తావించారు. కాళేశ్వరం ప్రాజెక్టుతో ఎన్నో ప్రయోజనాలున్నాయని, 18 లక్షల ఎకరాల ఆయకట్టును స్థిరీకరించడంతో పాటు మరో 18 లక్షల ఎకరాలకు కొత్తగా సాగునీటిని అందించే బృహత్తర ప్రాజెక్టు అని ఆయన ప్రశంసించారు. జూన్‌లో ప్రాజెక్టు ద్వారా తొలి ఫలితాన్ని అందించాలనే విధంగా ప్రభుత్వం చేస్తున్న కృషిని ఆయన అభినందించారు. జాతీయాభివృద్ధిలో కాళేశ్వరం భాగస్వామి అవుతుందని దాస్ విశ్వాసం వ్యక్తం చేశారు. కోట్లాది మంది రైతుల ప్రయోజనాలతో పాటు బహుళ ప్రయోజనాలు ఇమిడి ఉన్న ఈ ప్రాజెక్టు ఒక అద్భుతమన్నారు. దీనిని పూర్తి చేయడమే ఒక ఛాలెంజ్ అని, అది గడువులోగా పూర్తి చేస్తే.. వ్యయభారంతో పాటు సమస్యలు కూడా పెరగవన్నారు. ఇందుకు అన్ని శాఖలూ కలిసి కట్టుగా పనిచేయాలని దాస్ సూచించారు. మేడిగడ్డ వద్ద నీటి లభ్యతకు ఎలాంటి సమస్య లేదని కేంద్ర జలసంఘం హైడ్రాలజీ డైరెక్టర్ నిత్యానంద రాయ్ స్పష్టం చేశారు. కాళేశ్వరం నిర్మాణపనులు చాలా సంతృప్తికరంగా జరుగుతున్నాయని, దేశంలోనే గొప్ప ప్రాజెక్ట్‌గా కాళేశ్వరం నిర్మాణం అవుతున్నట్టు రాయ్ వ్యాఖ్యానించారు.



కన్నెపల్లి వద్ద పంప్‌హౌజ్ పనులను మ్యాపు ద్వారా వివరిస్తున్న డీఈ

గడువులోగా పూర్తి చేస్తాం

కాళేశ్వరాన్ని నిర్ణీత గడువులోగా పూర్తయ్యేలా ప్రణాళికా బద్ధంగా పని చేస్తున్నట్టు ప్రభుత్వ స్పెషల్ చీఫ్ సెక్రెటరీ ఎస్‌కే జోషి అన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్, ఇరిగేషన్ మంత్రి హరీశ్ ఈ ప్రాజెక్టు పనులను నిరంతరం సమీక్షిస్తున్నట్టు ఆయన తెలిపారు. నిర్ణీత గడువు లోపే ప్రాజెక్టును పూర్తి చేసి రికార్డును నెలకొల్పుతామని స్పెషల్ సీఎస్ చెప్పారు. అలాగే ముందు వేసిన అంచనా వ్యయంలోనే ప్రాజెక్టును పూర్తి చేయనున్నట్లు తెలిపారు. విలేకరుల సమావేశంలో కేంద్ర బృంద సభ్యులతో పాటు కాళేశ్వరం సీఈ లు ఎన్ వెంకటేశ్వర్లు, హరి రామ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రపంచంలోనే కాళేశ్వరం ప్రాజెక్ట్ గొప్పది

- రాష్ట్ర ప్రభుత్వ అటవీ సంరక్షణ అధికారి పీకే జాన్

ధర్మారం/మహదేవపూర్, జనవరి 10: ప్రపంచంలోనే కాళేశ్వరం ప్రాజెక్ట్ గొప్పదని రాష్ట్ర ప్రభుత్వ అటవీ సంరక్షణ కార్యదర్శి పీకే జాన్ అన్నారు. పెద్దపల్లి జిల్లా ధర్మారం మండలం మేడారంలో బుధవారం కాళేశ్వరం ప్రాజెక్ట్‌లో 6 ప్యాకేజీ నిర్మాణ పనులను ఐఎఫ్ఎస్ బృందం సభ్యులు పరిశీలించారు. అండర్ టన్నెల్ నిర్మాణాల ప్రగతిని కాళేశ్వరం ప్రాజెక్ట్ సీఈ వెంకటేశ్వర్లు, ఈఈ నూనే శ్రీధర్‌లు మ్యాప్ ద్వారా వివరించారు. కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా అదేవిధంగా జయశంకర్ భూపాలపల్లి జిల్లా కన్నెపల్లి పంప్‌హౌస్ నుంచి అన్నారం బ్యారేజీ వరకు నిర్మిస్తున్న 13 కిలోమీటర్ల గ్రావిటీ కెనాల్ నిర్మాణంలో కోల్పోయిన 330 హెక్టార్ల అటవీ స్థలాన్ని బుధవారం అటవీ శాఖ అధికారుల బృందం పరిశీలించింది. హైదరాబాద్ నుంచి అటవీ శాఖ ముఖ్య కార్యదర్శి పీకే ఝా ఆధ్వర్యంలో అటవీశాఖ అధికారుల బృందంలో జిల్లాలో పర్యటించింది.

బీసీ సబ్‌ప్లాన్ పెట్టకుంటే ఉద్యమం

- మేము గొర్లు, బర్లు కాసుకుంటే మీరు సీట్లల్లో కూర్చుంటారా
- బీసీ వ్యతిరేక సర్కార్‌కు ప్రజలు బుద్ధి చెప్తారు: లక్ష్మణ్

హైదరాబాద్ సిటీ, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ మాదిరిగా బీసీలకు సబ్‌ప్లాన్ పెట్టకుంటే పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడతామని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ కె. లక్ష్మణ్ ప్రభుత్వాన్ని హెచ్చరించారు. నాగోల్‌లో బుధవారం బీజేపీ ఓబీసీ మోర్చా ఆధ్వర్యంలో రాష్ట్ర బీసీ నాయకుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన లక్ష్మణ్ మాట్లాడుతూ రాష్ట్రంలో 54 శాతం బీసీ జనాభా ఉందని, బీసీలకు సబ్‌ప్లాన్ పెట్టి ప్రత్యేక నిధులను కేటాయించాలన్నారు. బీసీలకు ఆ నిధులను ఖర్చు చేయకుంటే ప్రభుత్వ పాలనను స్తంభింపజేస్తామన్నారు. బీసీలు చదువుకుని ఉన్నత స్థానాలకు వెళ్లాలనుకుంటే సీఎం కేసీఆర్ మాత్రం విద్య సౌకర్యాలు కల్పించకుండా.. బీసీలకు గొర్లు, బర్లు ఇస్తాం.. వాటిని కాసుకుంటూ బతకండీ.. మేము మాత్రం సీట్లపై కూర్చుని అధికారం చెలాయిస్తామనే రీతిలో వ్యవహరిస్తున్నారన్నారు. తెలంగాణ సర్కార్ బీసీ వ్యతిరేక విధానాలకు పాల్పడుతోందన్నారు. బీసీలకు అన్ని రంగాల్లో సగం వాటా కావాలని, బీసీలను పారిశ్రామిక వేత్తలుగా తయారు చేసేందుకు ఫిక్కీ తరహాలో బిక్కీని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఎంబీసీలకు వెయ్యి కోట్ల రూపాయలు కేటాయించామని చెబుతున్న ప్రభుత్వం అందులో ఒక్క రూపాయి కూడా ఖర్చు చేయలేదన్న ఆయన.. రెండు నెలల్లో ఈ నిధులను ఖర్చు చేయకుంటే కేసీఆర్ సర్కార్‌ను గద్దె దించేందుకు బీసీలందరినీ ఏకం చేస్తామన్నారు. 2019 ఎన్నికల్లో ప్రధాన అంశం బీసీ ఎజెండా కావాలని, బీసీలకు సామాజిక న్యాయం జరిగే వరకు బీజేపీ ఆధ్వర్యంలో ప్రతి పల్లెకు వెళ్లి వివరిస్తామని చెప్పారు. స్థానిక సంస్థల్లో బీసీలకు రిజర్వేషన్లు కల్పించినట్టుగా, విద్యా, ఉద్యోగ రంగాల్లో బీసీలకు ఉన్న 25 శాతం రిజర్వేషన్ల శాతాన్ని పెంచాలన్నారు. త్వరలోనే లక్ష మంది బీసీలతో భారీ సభ నిర్వహిస్తామని ఆయన చెప్పారు. బీజేపీ అధికారంలోకి వచ్చిన మూడున్నరేళ్లలో సామాజిక న్యాయం కోసం పాటుపడుతుందన్నారు. బీసీ వర్గానికి చెందిన మోదీ ప్రధాని కావడంతో కాంగ్రెస్ పార్టీ జీర్ణించుకోలేకపోతుందన్నారు. సికింద్రాబాద్ ఎంపీ బండారు దత్తాత్రేయ మాట్లాడుతూ పార్లమెంట్ సమావేశాల్లో ఓబీసీ బిల్లు ప్రవేశపెడుతున్నారనీ, ఆ బిల్లు పాస్ అవుతుందన్నారు. దాంతో ఓబీసీలకు అనేక హక్కులు లభిస్తాయన్నారు. ఓబీసీ బిల్లు అమలు చేసేందుకు కృషి చేస్తున్న ప్రధానమంత్రికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. తెలంగాణ సెంటిమెంట్ కంటే ఇప్పుడు బీసీల సెంటిమెంట్ ఎక్కువ ఉంది కాబట్టే ముఖ్యమంత్రి హడావుడిగా బీసీల సంక్షేమం కోసం మంత్రి వర్గ ఉప సంఘాన్ని ఏర్పాటు చేశారని విమర్శించారు.



రాష్ట్ర బీసీ నాయకుల ఆత్మీయ సమ్మేళనంలో వేదికపై నేతల సంఘీభావం

సత్యం కేసులో పిడబ్ల్యుసిపై సెబి వేటు

న్యూఢిల్లీ: దేశంలో అతిపెద్ద కార్పొరేట్ కుంభకోణాల్లో ఒకటైన సత్యం కంప్యూటర్స్ కేసుకు సంబంధించి అంతర్జాతీయ ఆడిటింగ్ ఏజెన్సీ ప్రైస్ వాటర్‌హౌస్ కూపర్స్ (పిడబ్ల్యుసి)పై క్యాపిటల్ మార్కెట్ నియంత్రణ మండలి సెబి వేటు వేసింది. వచ్చే రెండేళ్ల వరకు భారత్‌లోని ఏ లిస్టెడ్ కంపెనీకి కూడా ఆడిట్ సర్టిఫికెట్లు జారీ చేయకుండా పిడబ్ల్యుసి నెట్‌వర్క్‌లోని ఆడిటింగ్ సంస్థలపై సెబి నిషేధం విధించింది. ఈ కుంభకోణానికి సంబంధించి అక్రమంగా పొందిన రూ.13 కోట్ల లాభాన్ని వడ్డీతో సహా కట్టాలని పిడబ్ల్యుసి బెంగళూరుతోపాటు ఇద్దరు వ్యక్తులను నియంత్రణ మండలి ఆదేశించింది.

రియల్టీ విలవిల

- జిఎస్‌టి, రెరా, నోట్ల రద్దు ప్రభావం
- 2017లో 78 శాతం తగ్గిన కొత్త ప్రాజెక్టులు
- హైదరాబాద్‌లో భారీగా తగ్గిన కొత్త వెంచర్లు



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): గత ఏడాది రియల్టీ మార్కెట్‌కు చేదు అనుభవమే మిగిలింది. 2016తో పోలిస్తే కొత్త ప్రాజెక్టులు 78 శాతం తగ్గాయి. పెద్ద నోట్ల రద్దు, రెరా చట్టం, జిఎస్‌టి చట్టం అమలు ఇందుకు ప్రధాన కారణాలని ప్రాపర్టీ కన్సల్టెన్సీ సంస్థ నైట్ ఫ్రాంక్ ఇండియా సంస్థ విడుదల చేసిన ఒక సర్వే పేర్కొంది. గత ఆరు నెలల్లో హైదరాబాద్, చెన్నై, ముంబై, కోల్‌కతా, ఢిల్లీతో సహా దేశంలోని ఎనిమిది ప్రధాన నగరాల్లో రియల్టీ మార్కెట్ తాజా పరిస్థితిని ఈ నివేదికలో వివరించారు. 'గత ఏడాది హైదరాబాద్ రియల్టీ మార్కెట్‌కూ చేదు అనుభవమే మిగిలింది. కొత్త ప్రాజెక్టులు 70 శాతం పడిపోయాయి. 2016 రెండో అర్ధ భాగంతో పోల్చినా 2017 రెండో అర్ధ భాగంలో కొత్త గృహ నిర్మాణ ప్రాజెక్టులు 84 శాతం, అమ్మకాలు 13 శాతం క్షీణించాయి. ఈ కాలంలో 940 కొత్త యూనిట్లు మాత్రమే మార్కెట్‌లో ప్రవేశించాయి. హైదరాబాద్ రియల్టీ మార్కెట్లో గతంలో ఎన్నడూ ఇలాంటి పరిస్థితి లేదు' అని నైట్ ఫ్రాంక్ ఇండియా సంస్థ హైదరాబాద్ బ్రాంచ్ డైరెక్టర్ శాంసన్ ఆర్థర్ విలేకరులతో చెప్పారు. కొత్త ప్రాజెక్టుల ప్రారంభం దేశంలో మరే ప్రధాన నగరంలోనూ హైదరాబాద్ స్థాయిలో పడిపోలేదు.

అనుమతులున్న ప్రాజెక్టులపైనే దృష్టి

జనవరి 1, 2017 నాటికి భవన నిర్మాణ అనుమతులు పొందిన గృహ నిర్మాణ ప్రాజెక్టుకు రెరా చట్టం వర్తించదన్న తెలంగాణ ప్రభుత్వ నిబంధన కూడా ఇందుకు దోహదం చేసింది. దీంతో బిల్డర్లు కొత్త ప్రాజెక్టులు పక్కన పెట్టి జనవరి 1, 2017 నాటికి అనుమతులు పొందిన ప్రాజెక్టులు పూర్తి చేసేందుకే మొగ్గు చూపుతున్నారు. జిఎస్‌టిపై స్పష్టమైన అవగాహన లేకపోవడం, రెడీ టు మూవ్ గృహాల లభ్యత తక్కువగా ఉండడంతో నివాస గృహాల ధర మాత్రం మూడు శాతం వరకు పెరిగింది. 'గత ఆరు నెలల్లో దేశంలో ఒక్క హైదరాబాద్, అహ్మదాబాద్ మార్కెట్లలో మాత్రమే ధరలు పెరిగాయి' అని ఆర్థర్ చెప్పారు. దీంతో ఇన్వెంటరీల (అమ్ముడు పోకుండా ఖాళీగా ఉన్న నివాసాలు) సంఖ్యా 38 శాతం తగ్గింది.

ఆఫీస్ స్పేస్‌కు పెరిగిన డిమాండ్

గత ఏడాది రెండో అర్ధ భాగంలో మాత్రం హైదరాబాద్‌లో ఆఫీస్ స్పేస్‌కు మంచి డిమాండ్ ఏర్పడింది. దీంతో గతంలో ఎన్నడూలేని విధంగా ఈ కాలంలో 33.40 లక్షల చదరపు అడుగుల ఆఫీస్ స్పేస్ క్రయ విక్రయాల లావాదేవీలు జరిగాయి. 2016 రెండో అర్ధ భాగంతో పోలిస్తే ఇది ఐదు శాతం ఎక్కువ. అయితే 2017 సంవత్సరం మొత్తాన్ని పరిగణనలోకి తీసుకుంటే మాత్రం నాలుగు శాతం క్షీణత నమోదైందని నైట్ ఫ్రాంక్ ఇండియా నివేదిక పేర్కొంది. 'నాణ్యమైన ఆఫీసు స్పేస్ లభ్యత చాలినంత స్థాయిలో లేకపోవడం కూడా ఇందుకు ప్రధాన కారణం' అని ఆర్థర్ చెప్పారు. రెరా చట్టం, జిఎస్‌టిపై స్పష్టత ఏర్పడడంతో ఈ సంవత్సరం హైదరాబాద్‌తో పాటు, దేశ వ్యాప్తంగా రియల్టీ మార్కెట్ ఆశాజనకంగా కనిపిస్తోందన్నారు.

మెట్రో రైలు ప్రాజెక్టు కూడా ఈ సంవత్సరం ఇందుకు దోహదం చేస్తుందని నైట్ ఫ్రాంక్ ఇండియా అంచనా వేసింది.

ఎయిర్ ఇండియాలోకి విదేశీ పెట్టుబడి

ఎఫ్‌డిఐ విధానంలో భారీ మార్పులు.. ఆమోదించిన ప్రభుత్వం.. సింగిల్ బ్రాండ్ రిటైల్‌లో 100 శాతం ఎఫ్‌డిఐ ఆటోమేటిక్ మార్గంలోనే



న్యూఢిల్లీ : విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల విధానంలో ప్రభుత్వం మరోసారి భారీ మార్పులు చేసింది. సింగిల్ బ్రాండ్ రిటైల్‌లో ఆటోమేటిక్ మార్గంలోనే 100 శాతం ఎఫ్‌డిఐకి గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. అప్పుల ఊబిలో ఉన్న ఎయిర్‌ఇండియాలో 49 శాతం వాటా తీసుకునేందుకు విదేశీ ఎయిర్‌లైన్స్ సంస్థలను అనుమతించింది. నిర్మాణం, విద్యుత్ ట్రేడింగ్ రంగాల్లోనూ, వైద్య పరికరాల ఉత్పత్తిలోనూ, విదేశీ పెట్టుబడులున్న సంస్థల ఆడిటింగ్ కంపెనీలకు సంబంధించి ఎఫ్‌డిఐ విధానాల్లో మార్పులు చేసింది. 2018-19 వార్షిక బడ్జెట్‌కు కేవలం 20 రోజుల వ్యవధి మాత్రమే ఉన్న తరుణంలో ప్రధాని నరేంద్ర మోదీ సారథ్యంలో సమావేశమైన కేంద్ర కేబినెట్ భారీ 'ఎఫ్‌డిఐ సంస్కరణ'లకు ఆమోద ముద్ర వేసింది. ఆర్థిక మంత్రి జైట్లీ ఫిబ్రవరి ఒకటిన వార్షిక బడ్జెట్‌ను పార్లమెంట్‌లో ప్రవేశపెట్టనున్న విషయం తెలిసిందే. ఎన్‌డిఎ ప్రభుత్వం ప్రవేశపెట్టనున్న పూర్తి స్థాయి బడ్జెట్ కూడా ఇదే. దావోస్‌లో జరగనున్న ప్రపంచ ఆర్థిక వేదిక సదస్సుకు హాజరు కానున్న ప్రధాని మోదీ ప్రపంచపెట్టుబడిదారులకు, సంస్థలకు ఆర్థిక సంస్కరణల విషయంలో తమ నిజాయితీని, నిబద్ధతను స్పష్టం చేసేందుకు ఈ నిర్ణయాలను తీసుకొని ఉంటారని భావిస్తున్నారు.

- సింగిల్ బ్రాండ్ రిటైల్‌లో 100 శాతం పెట్టుబడిని ఆటోమేటిక్ మార్గం లో అనుమతించడం వల్ల స్వీడన్‌కు చెందిన బహుళజాతి ఫర్నిషింగ్ సంస్థ ఐకియాకు లాభం కలిగే అవకాశం ఉంది. భారత్‌లో భారీ ఎత్తున విస్తరణ యోచనలో ఉన్న ఈ సంస్థ తొలి స్టోర్‌ను హైదరాబాద్‌లో మరికొద్ది నెలల్లోనే ప్రారంభించనుంది.
- సింగిల్ బ్రాండ్ రిటైల్‌లో 100 శాతం ఎఫ్‌డిఐకి ఇప్పటి వరకు ప్రభుత్వ అనుమతులకు లోబడి మాత్రమే ఆమోదం ఉంది.

ఎయిర్ ఇండియాకు విదేశీ నిధులు

ఎయిర్ ఇండియాను వదిలించుకునే ఆలోచనలో ఉన్న ప్రభుత్వం తాజాగా 49 శాతం వరకు ఈక్విటీ పెట్టుబడులు పెట్టేందుకు విదేశీ ఎయిర్‌లైన్స్ సంస్థలను అనుమతించాలని నిర్ణయించింది. విదేశీ సంస్థ వాటా 49 శాతం మించకూడదని, ఎయిర్‌ఇండియాపై నికర యాజమాన్య హక్కులు భారతీయ సంస్థకే ఉండాలని ప్రభుత్వం ప్రతిపాదించింది. 2017 మార్చినాటికి ఎయిర్ ఇండియా రుణాల మొత్తం 48877 కోట్ల రూపాయలుంది. ఇందులో 17360 కోట్ల రూపాయలు విమానాల కొనుగోలుకు సంబంధించిన రుణం కాగా 31,517 కోట్ల రూపాయలు వర్కింగ్ కాపిటల్ రుణం. 2017-18లో ఈ సంస్థ మరో 3579 కోట్ల రూపాయల నష్టాన్ని నమోదు చేసే అవకాశం ఉంది.

విద్యుత్ ట్రేడింగ్‌లో..

విద్యుత్ ట్రేడింగ్ కోసం ఏర్పాటైన ఆన్‌లైన్ ట్రేడింగ్ ప్లాట్‌ఫామ్స్‌కు సంబంధించి కూడా విదేశీ పెట్టుబడి నిబంధనలను సరళతరం చేశారు. ప్రస్తుతం పవర్ ఎక్స్ఛేంజీల్లో 49 శాతం వరకు విదేశీ పెట్టుబడికి ఆటోమేటిక్ మార్గంలో అనుమతి ఉంది. ఎఫ్ఐఐలు మాత్రం ఎక్స్ఛేంజీల్లో వాటాలను సెకండరీ మార్కెట్ల ద్వారానే కొనుగోలు చేయాల్సి ఉంటుంది.

రియల్ బ్రోకర్లకు ఊరట

రియల్ ఎస్టేట్ బ్రోకింగ్, రియల్ ఎస్టేట్ బిజినెస్ రెండూ వేరువేరని ప్రభుత్వం స్పష్టం చేసింది. ఎఫ్‌డిఐ నిబంధనల ప్రకారం, రియల్ బ్రోకింగ్ సర్వీసులను రియల్ బిజినెస్‌గా పరిగణించరాదని స్పష్టం చేసింది. అందువల్ల రియల్ బ్రోకింగ్ సంస్థల్లోకి 100 శాతం ఎఫ్‌డిఐని ఆటోమేటిక్ రూట్‌లోనే అనుమతించవచ్చు.

మరికొన్ని ప్రతిపాదనలు

ఆటోమేటిక్ రూట్‌లో ఎఫ్‌డిఐకి ఆమోదం ఉన్న రంగాల్లోని సంస్థలకు ప్రీ ఇన్‌కార్పొరేషన్ ఖర్చులు, యంత్రాల దిగుమతి వ్యయాన్ని కూడా ఆటోమేటిక్ మార్గంలో అనుమతిస్తారు. గతంలో ఇన్‌కార్పొరేషన్‌కు ముందు జరిపే వ్యయానికి ప్రభుత్వ ఆమోదం తప్పని సరిగా తీసుకోవాలన్న నిబంధన ఉంది.

ఏఐపై సింగపూర్ ఎయిర్‌లైన్స్ ఆసక్తి

ఎయిర్ ఇండియాలో 49 శాతం వరకు వాటా కొనుగోలుకు విదేశీ ఎయిర్‌లైన్స్‌కు అనుమతిచ్చిన కొద్ది గంటల్లోనే సంస్థలో వాటా కొనుగోలుకు మేము సిద్ధమని సింగపూర్ ఎయిర్‌లైన్స్ ప్రకటించింది. ప్రస్తుతానికైతే విస్తారా వ్యాపారమే మా ప్రాధాన్యమన్న సింగపూర్ ఎయిర్‌లైన్స్.. ఎయిర్‌ఇండియా ప్రైవేటీకరణ విషయంలోనూ ఆసక్తిగా ఉన్నట్లు ఇ-మెయిల్ స్టేట్‌మెంట్‌లో పేర్కొంది. టాటాసన్స్ భాగస్వామ్యంలో ఏర్పాటు చేసిన విస్తారాలో ఈ ఎయిర్‌లైన్‌కు 49 శాతం వాటా ఉంది.

ఎన్‌డిఎ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఎఫ్‌డిఐ విధానంలో భారీ ఎత్తున మార్పులు చేయడం ఇది రెండోసారి 2016 జూన్‌లో మొదటిసారి భారీ మార్పులు చేసింది. ఈ నేపథ్యంలో ప్రభుత్వ నిర్ణయంపై వచ్చిన వ్యాఖ్యలు..

లాభపడనున్న విదేశీ మొబైల్ కంపెనీలు

రిటైల్ రంగంలో ఆటోమేటిక్ మార్గంలో 100 శాతం ఎఫ్‌డిఐని అనుమతించాలన్న నిర్ణయం వల్ల యాపిల్‌తో పాటు చైనా మొబైల్ బ్రాండ్లు షామీ, ఒప్పో భారీగా లాభపడే అవకాశం ఉంది. ఎడాపెడా తమ ఉత్పత్తులను విక్రయిస్తూ మార్కెట్ పెంచుకుంటున్న విదేశీ మొబైల్ కంపెనీలు ఇక నేరుగా విక్రయ కేంద్రాలను తెరిచి వినియోగదారులకు మరింత చేరువగా వెళ్తాయని విశ్లేషకుల అంచనా.

అద్భుతం...

రిటైల్ వ్యాపారుల సంఘం సర్కారు సరళతర విధానాలపై ఎక్కడాలేని ఆనందాన్ని వ్యక్తం చేసింది. అయితే, మల్టీబ్రాండ్ రిటైలింగ్‌లోనూ ఎఫ్‌డిఐని అనుమతిస్తే బాగుండేదని రిటైల్ వ్యాపారుల సంఘం పేర్కొంది. ప్రభుత్వ నిర్ణయం వల్ల దేశంలోకి కొత్త కొత్త బ్రాండ్స్ వస్తాయని, వినియోగదారులకు లాభం కలుగుతుందనీ, ఉద్యోగాలు పెరుగుతాయని కూడా సంఘం తెలిపింది.

ఆందోళన వ్యక్తం చేసిన ట్రేడర్లు

ఎఫ్‌డిఐ విధానాలను సవరిస్తూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని ఆల్ ఇండియా ట్రేడర్స్ కాన్ఫడరేషన్ మాత్రం తీవ్రంగా వ్యతిరేకించింది. ముఖ్యంగా రిటైల్ రంగానికి సంబంధించిన నిర్ణయం వల్ల స్థానికంగా ఉపాధి దెబ్బతింటుందని ఆందోళనవ్యక్తం చేసింది. అలవోకగా బహుళజాతి సంస్థలు భారత్‌లో అడుగుపెట్టేందుకు ప్రభుత్వ నిర్ణయం దోహదం చేస్తుందని ఆక్షేపించింది.

జోయాలుక్కాస్‌పై ఐటి దాడులు

- మరో జువెలరీ సంస్థ మంజలీపై కూడా
- 130 దుకాణాల్లో ఏకకాలంలో దాడులు నిర్వహించిన అధికారులు

హైదరాబాద్: ప్రముఖ బంగారం, ఆభరణాల వ్యాపార సంస్థ జోయాలుక్కాస్‌కు చెందిన దుకాణాలపై దేశవ్యాప్తంగా ఆదాయం పన్ను శాఖ అధికారులు దాడులు నిర్వహించారు. బహుళ దుకాణాల జువెలరీ సంస్థ మంజలీ జువెలర్స్‌పై కూడా ఐటి అధికారులు దాడులు చేశారు. ఈ రెండు సంస్థలకు సంబంధించి వివిధ నగరాల్లోని మొత్తం 133 దుకాణాలపై దాడులు జరిగినట్టు తెలిసింది. దాదాపు అన్ని ప్రాంతాల్లోనూ జోయాలుక్కాస్ దుకాణాలను తెరిపించి సోదాలు నిర్వహించిన అధికారులు కీలకపత్రాలను స్వాధీనం చేసుకున్నారు. ఉద్యోగులను దాదాపు అన్ని చోట్ల దుకాణాల్లోకి అనుమతించలేదు. గుజరాత్, తమిళనాడు, కేరళ, మహారాష్ట్ర, కర్ణాటక, పశ్చిమబెంగాల్‌తో సహా సంస్థ ప్రధాన కార్యాలయాలు, దుకాణాలు ఉన్న అన్ని ప్రాంతాల్లోనూ ఐటి దాడులు జరిగాయి. పన్నుల ఎగవేత, అమ్మకాల వివరాలను దాచిపెట్టడం, భారీ ఎత్తున నగదు డిపాజిట్లు... ఈ ఆరోపణలపై దాడులు నిర్వహించినట్టుగా ఐటి అధికారులు తెలిపారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణలోని ప్రధాన నగరాల్లోని ఆంధ్రజ్యోతి ప్రతినిధులు జోయాలుక్కాస్ షోరూమ్‌లపై ఐటి దాడులు జరిగినట్టు సమాచారం అందజేశారు. హైదరాబాద్‌లోనూ జోయాలుక్కాస్‌కు చెందిన నాలుగు షోరూమ్‌లపైనా ఐటి దాడులు జరిగినట్టు ఆంధ్రజ్యోతి ప్రతినిధులు ధృవీకరించారు. ఢిల్లీ, ముంబై, చెన్నై, బెంగళూరు నుంచి కూడా ఇదే విధమైన సమాచారం అందింది. వార్తా సంస్థలు ఈ రకమైన వివరాలనే అందించాయి. బుధవారం ఉదయమే ప్రారంభమైన దాడులు సాయంత్రం పొద్దుపోయాక కూడా కొనసాగుతూనే ఉన్నాయి. కేరళ ప్రధాన కేంద్రంగా ప్రస్థానం ప్రారంభించిన బహుళ దుకాణాల జ్యువెలరీ సంస్థ జోయాలుక్కాస్ దాదాపు 11 దేశాలకు తన వ్యాపారాన్ని విస్తరించింది. దేశంలోని దాదాపు అన్ని ప్రధాన పట్టణాల్లో సంస్థకు వ్యాపారాలున్నాయి. ఐటి దాడులను చెన్నైలోని ఐటి విభాగం సమన్వయం చేస్తున్నట్టు తెలిసింది.

కార్ల ధరలు పెంచిన మారుతి, హోండా

న్యూఢిల్లీ : మారుతి సుజుకీ, హోండా కార్స్ ఇండియా తమ కార్ల ధరలను పెంచాయి. మారుతి సుజుకీ గరిష్ఠంగా 17 వేల రూపాయల వరకు పెంచింది. మోడల్‌ను బట్టి పెరిగిన ధర 1,700 రూపాయల నుంచి 17,000 రూపాయల వరకు ఉంది. కమోడిటీ, పరిపాలనా, పంపిణీ వ్యయాలు పెరిగిన నేపథ్యంలో ధరలను పెంచాల్సి వచ్చినట్టు కంపెనీ తెలిపింది. హోండా మోడల్‌ను బట్టి 6,000 రూపాయల నుంచి 32,000 రూపాయల వరకు పెంచింది. పెంచిన ధరలు జనవరి 8వ తేదీ నుంచి అమల్లోకి వచ్చినట్టు కంపెనీ ఉన్నతాధికారి తెలిపారు.

వృద్ధిపై మేధోమథనం

వృద్ధిని ప్రగతి పట్టాలెక్కించేందుకు ఉన్నత స్థాయి మేధోమథనం జరిగింది. ప్రధాని మోదీ ఆర్థికవేత్తలతో సమావేశమై అభివృద్ధికి ఊతమిచ్చేందుకు చేపట్టాల్సిన చర్యలపై చర్చించారు. పెద్ద నోట్ల రద్దు, జిఎస్‌టి అమలుతో కుదేలైన వృద్ధిరేటు.. 2018లో మళ్లీ పునరుద్ధరణబాట పట్టనుందని ప్రపంచ బ్యాంక్ ఆశాభావం వ్యక్తం చేసింది.



- ఆర్థికవేత్తలు, నిపుణులతో ప్రధాని మోదీ భేటీ

న్యూఢిల్లీ: ఆర్థిక వ్యవస్థలో ప్రస్తుత పరిస్థితులపై చర్చించేందుకు ఆర్థికవేత్తలు, నిపుణులతో ప్రధాని నరేంద్ర మోదీ బుధవారం భేటీ అయ్యారు. నాలుగేళ్ల కనిష్ఠానికి పతనంకానున్న వృద్ధిరేటును పునరుద్ధరించే ప్రయత్నాల్లో భాగంగా నీతి ఆయోగ్ నిర్వహించిన ఈ సమావేశంలో 40 మందికిపైగా ఆర్థికవేత్తలు, పలు రంగాల నిపుణులు పాల్గొన్నారు. వచ్చేనెల 1న మోదీ సర్కారుకిదే చివరి పూర్తి స్థాయి బడ్జెట్‌ను ప్రవేశపెట్టనుంది. ఈ నేపథ్యంలో ఆర్థికవేత్తలతో భేటీ ప్రాధాన్యం సంతరించుకుంది.

'ఎకనామిక్ పాలసీ-ది రోడ్ ఎహెడ్' అనే అంశంపై ఈ సమావేశం జరిగింది. స్థూల ఆర్థిక వ్యవస్థ, వ్యవసాయం, గ్రామీణాభివృద్ధి, ఉద్యోగాల కల్పన, విద్య, వైద్యం, వస్తు ఉత్పత్తి, ఎగుమతులు, పట్టణాభివృద్ధి, మౌలిక సదుపాయాలు, రవాణా మార్గాల అభివృద్ధికి సంబంధించి ఆర్థికవేత్తలు, విశ్లేషకులు పలు సూచనలు చేశారని, అందుకు మోదీ వారికి అభినందనలు తెలిపినట్లు ప్రధానమంత్రి కార్యాలయం(పిఎంఒ) స్టేట్‌మెంట్ పేర్కొంది. అయితే వారేం సూచనలు చేశారు..?, ఏయే అంశాలపై చర్చ జరిగిందన్న విషయాల్ని మాత్రం పిఎంఒ వెల్లడించలేదు.

ఈ సమావేశంలో ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ, నీతి ఆయోగ్ వైస్ చైర్మన్ రాజీవ్ కుమార్‌తోపాటు కేంద్రం, నీతిఆయోగ్‌కు చెందిన పలువురు సీనియర్ అధికారులు పాల్గొన్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2017-18)లో వృద్ధి రేటు 6.5 శాతానికి పడిపోవచ్చని కేంద్ర గణాంక కార్యాలయం (సిఎస్ఒ) ఈ మధ్యే అంచనాలు విడుదల చేసింది.

ఈ ఏడాది 7.3 శాతానికి వృద్ధి: ప్రపంచ బ్యాంకు

ప్రస్తుతేడాదిలో భారత ఆర్థిక వృద్ధిరేటు 7.3 శాతానికి పెరగవచ్చని, వచ్చే రెండేళ్లపాటు 7.5 శాతం చొప్పున వృద్ధి నమోదు చేసుకోవచ్చని ప్రపంచ బ్యాంక్ అంచనా వేస్తోంది. మిగత వర్ధమాన దేశాలతో పోలిస్తే భారత్ ఆర్థికాభివృద్ధి సామర్థ్యం అపారమని, ఈ మధ్యకాలంలో చేపట్టిన సంస్కరణలు దేశ పురోగతికి బాటలు వేయనున్నాయని '2018 గ్లోబల్ ఎకనామిక్స్ ప్రాస్పెక్ట్' పేరుతో వరల్డ్ బ్యాంక్ విడుదల చేసిన నివేదిక పేర్కొంది.

చైనా డౌన్.. భారత్ అప్

పెద్ద నోట్ల రద్దు, జిఎస్‌టి అమలుతో ఇబ్బందులెదురైనప్పటికీ గత సంవత్సరంలో భారత్ 6.7 శాతం వృద్ధి చెందవచ్చని ప్రపంచ బ్యాంక్ నివేదిక అంచనా వేసింది. గత సంవత్సరం చైనా భారత్‌కన్నా 0.1 శాతం అధిక (6.8 శాతం) వృద్ధి నమోదు చేసుకుంది. ఈ ఏడాదిలో మాత్రం చైనా జిడిపి 6.4 శాతానికి తగ్గవచ్చని, వచ్చే రెండేళ్లలో వరుసగా 6.3 శాతం, 6.2 శాతానికి పతనం కావచ్చని అంచనా.

నేడు బ్యాంకర్లతో కెటిఆర్ భేటీ

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమ(ఎస్ఎంఇ)ల ప్రగతి, పనితీరును సమీక్షించేందుకు రాష్ట్ర పరిశ్రమలు, ఐటి శాఖ మంత్రి కె తారకరామారావు గురువారం రాష్ట్ర స్థాయి బ్యాంకర్ల కమిటీ(ఎస్ఎల్‌బిసి)తో సమావేశం అవుతున్నారు. ఎస్ఎంఇల స్థాపన కోసం వచ్చిన రుణ ప్రతిపాదనలపై బ్యాంకర్లు తీసుకున్న చర్యలపై మంత్రి ఈ సమావేశంలో సమీక్షిస్తారు. చాలా కాలం తర్వాత ఏర్పాటైన ఈ కమిటీ సమావేశంలో నోడల్ బ్యాంక్ అధికారులు, పరిశ్రమల శాఖ అధికారులతో పాటు సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పారిశ్రామికవేత్తల సమాఖ్య ప్రతినిధులు పాల్గొననున్నట్టు అధికారులు తెలిపారు. ఇదే సమావేశంలో దీర్ఘకాలికంగా అపరిష్కృతకంగా ఉన్న ఎంఎస్ఎంఇల సమస్యలపైనా చర్చించి నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. సూక్ష్మ, చిన్న, మధ్యతరహా కంపెనీలు ఏర్పాటు చేసేందుకు ముందుకు వచ్చే ఔత్సాహిక ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనారిటీ, మహిళా పారిశ్రామికవేత్తలకు కల్పించాల్సిన సదుపాయాలు, బ్యాంకర్ల నుంచి రుణాలు అందించే ఏర్పాట్లతో పాటు రాయితీలు, ప్రోత్సహకాలను ఖరారు చేసే అవకాశం ఉన్నట్టు అధికారులు పేర్కొన్నారు.

రూ.110 రీచార్జ్‌పై పూర్తి టాక్‌టైమ్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): సంక్రాంతిని పురస్కరించుకుని భారత్ సంచార్ నిగమ్ లిమిటెడ్ (బిఎస్ఎన్ఎల్) ఎపి, తెలంగాణలోని ప్రీపెయిడ్ కస్టమర్ల కోసం ప్రమోషనల్ ఆఫర్ తెచ్చింది. ఇందులో భాగంగా 110 రూపాయలతో రీచార్జ్ చేసుకుంటే పూర్తి టాక్‌టైమ్‌ను అందిస్తోంది. ఈ ఆఫర్ ఫిబ్రవరి మూడో తేదీ వరకు అందుబాటులో ఉంటుందని సంస్థ తెలిపింది.

ఇ కామర్స్‌లోకి ఇఫ్కో

- రైతు ఇంటికే ఉచితంగా వ్యవసాయ ఉత్పాదకాలు

IFFCO
पूर्णत: सहकारी स्वामित्व
Wholly owned by Cooperatives

న్యూఢిల్లీ : రైతులకు శుభవార్త. ఆన్‌లైన్ ద్వారా తమకు నచ్చిన వ్యవసాయ ఉత్పాదకాలను కొనుగోలు చేసే అవకాశంతోపాటు వాటిని ఉచితంగానే ఇంటి ముంగిటకు డెలివరీ చేసే సదుపాయాన్ని ఫెర్టిలైజర్ కోఆపరేటివ్ దిగ్గజం ఇఫ్కో అందుబాటులోకి తెచ్చింది. ఇఫ్కో ఇటీవలే ఇండియన్ కోఆపరేటివ్ డిజిటల్ ప్లాట్‌ఫామ్ (www.iffcobazar.in)ను ప్రారంభించింది. ఇది తెలుగు సహా 13 భాషల్లో అందుబాటులో ఉంది. ఈ వెబ్‌సైట్ ద్వారా రైతులు వ్యవసాయ ఇన్‌పుట్స్ అయిన నీటిలో కరిగే రసాయనిక ఎరువులు, ఆగ్రో కెమికల్స్, బయో ఫెర్టిలైజర్స్, విత్తనాలు, ఇతర వ్యవసాయ ఆధారిత ఉత్పత్తులను కొనుగోలు చేయవచ్చు. ఈ ఉత్పత్తులు 5 కిలోల వరకు ప్యాక్‌లలో అందుబాటులో ఉంటాయి. వీటిని కొనుగోలు చేసిన వారికి ఉచితంగానే ఇంటికి పంపిస్తారు.

పారిశ్రామికరంగానికి రూ. 4,882 కోట్లు

తెలంగాణ ప్రభుత్వానికి అధికారుల ప్రతిపాదన

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని పారిశ్రామిక రంగానికి 2018-19 ఆర్థిక సంవత్సరంలో సుమారు రూ.4,882 కోట్ల నిధులు కేటాయించాలని అధికారులు ప్రభుత్వానికి నివేదించినట్టు తెలిసింది. గత ఏడాది రూ.985 కోట్ల నిధులు కేటాయించినప్పటికీ డిమాండ్ మేరకు నిధులు విడుదలకాకపోవడంతో బకాయిలు పెరిగిపోయిన్నట్టు అధికారులు చెబుతున్నారు. టిఎస్-ఐపాస్‌తో రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టడానికి దేశ విదేశాల నుంచి భారీ ఎత్తున పారిశ్రామికవేత్తలు తరలివస్తున్నప్పటికీ ప్రకటిత పారిశ్రామిక రాయితీలను సమకూర్చడంలో నిధుల కొరత కారణంగా జాప్యం జరుగుతున్నట్టు నివేదికలో పేర్కొన్నట్టు సమాచారం. 2014-15 ఆర్థిక సంవత్సరం నుంచి రాష్ట్రంలో పరిశ్రమలు ఏర్పాటు చేసిన పారిశ్రామికవేత్తలకు దాదాపుగా రూ. 2200 కోట్లకు పైగా పారిశ్రామికప్రోత్సాహకాల కింద చెల్లించాల్సి ఉంది. కాగా 2018-19 ఆర్థిక సంవత్సరంలో పారిశ్రామిక అవసరాల కోసం ప్రణాళికా-ప్రణాళికేతర పద్దుల కింద రూ.4,882 కోట్లు కేటాయిస్తే మరిన్ని పెట్టుబడులు ఆకర్షించేందుకు అవకాశం ఉంటుందని అధికారవర్గాలు చెబుతున్నాయి. తెలంగాణ రాష్ట్ర పారిశ్రామిక మౌలిక వసతుల కల్పన సంస్థ చేపట్టిన ప్రాజెక్టులు, పారిశ్రామిక పార్కులను అభివృద్ధికి బడ్జెట్‌లో రూ.1750 కోట్లు కేటాయించాలని, చర్మ పరిశ్రమల క్లస్టర్, పార్కు అభివృద్ధితోపాటు చర్మ పరిశ్రమల రంగంలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని సమకూర్చుకునేందుకు రూ.175 కోట్లుకు పైగా నిధులు అవసరమని ప్రతిపాదించినట్టు తెలిసింది. ఖాయిలా పరిశ్రమలను గట్టెక్కించేందుకు ప్రారంభించిన ఇండస్ట్రియల్ హెల్త్ క్లినిక్ కోసం అదనపు నిధులు అవసరమని అంటున్నారు. కాగా పారిశ్రామిక ప్రోత్సాహకాల కింద రూ.2,200 కోట్ల బకాయిలను 2017-18 సంవత్సరంలో చివరి విడతలో విడుదల చేస్తే వచ్చే ఏడాది బడ్జెట్ కేటాయింపుల్లో ఈ మేరకు కోతలు పెట్టవచ్చని భావిస్తున్నారు.

మన్న ఫుడ్స్‌లో మోర్గాన్ స్టాన్లీ పెట్టుబడి

చెన్నై : మన్న ఫుడ్స్ బ్రాండ్ పేరుతో ఆరోగ్య ఆహార ఉత్పత్తులను తయారు చేస్తున్న సదరన్ హెల్త్ ఫుడ్స్‌లో మోర్గాన్ స్టాన్లీ ప్రైవేట్ ఈక్విటీ ఆసియా 152 కోట్ల రూపాయల పెట్టుబడి పెట్టింది. ఈ సొమ్ముతో కంపెనీ దక్షిణాదిలో విస్తరణ కార్యకలాపాలు చేపట్టనుంది. అంతేకాకుండా ఇప్పటికే కంపెనీలో పెట్టుబడి పెట్టిన ఇన్వెస్టర్లు పాక్షికంగా వాటాను విక్రయిస్తే వారికి చెల్లింపులు జరపనుంది. ఇంతకు ముందు 2015లో ఫల్‌క్రమ్ నుంచి కంపెనీ రూ.30 కోట్లు సమీకరించింది.

చిన్న పట్టణాలపై బుక్‌మైషో దృష్టి

- ఆన్‌లైన్ టికెట్ బుకింగ్స్‌లో హైదరాబాదే టాప్
- ఈ ఏడాది మార్చినాటికి 5300కు స్క్రీన్ల సంఖ్య
- బుక్‌మైషో సినిమా విభాగ సిఒఒ ఆశిష్ సక్సేనా



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): ఆన్‌లైన్‌లో సినిమా టికెట్ బుకింగ్ సేవలందిస్తున్న అతిపెద్ద ప్లాట్‌ఫాం బుక్‌మైషో వ్యాపార విస్తరణలో భాగంగా చిన్న పట్టణాలపై దృష్టిసారించింది. ఇప్పటికే దేశంలోని ప్రధాన నగరాలు, ప్రముఖ పట్టణాలకు విస్తరించిన తమ సంస్థ.. మున్ముందు చిన్న పట్టణాల్లోని సినిమా ప్రేక్షకులకు సైతం ఆన్‌లైన్ టికెట్ బుకింగ్ సదుపాయాన్ని అందుబాటులోకి తేనున్నట్లు బుక్‌మైషో సినిమా విభాగ సిఒఒ ఆశిస్ సక్సేనా తెలిపారు. దేశవ్యాప్తంగా 650 నగరాలు/పట్టణాల్లో కలిపి మొత్తం 5,000 వేలకు పైగా స్క్రీన్లలో ఆన్‌లైన్ బుకింగ్ సేవలందిస్తున్నట్లు ఆయన వెల్లడించారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం చివరికల్లా(మార్చి 2018) సంస్థ నెట్‌వర్క్‌లోని సినిమా స్క్రీన్ల సంఖ్య 5,300కు పెరగవచ్చన్న సక్సేనా.. వచ్చే ఆర్థిక సంవత్సరం(2018-19)లో మరో 1000 స్క్రీన్లను యాడ్ చేయనున్నట్లు ఆయన చెప్పారు. ఇప్పటికే 1700కు పైగా స్క్రీన్లలో మొబైల్ టికెట్ (ఎం- టికెట్) సదుపాయాన్ని అందుబాటులోకి తెచ్చిన సంస్థ మున్ముందు మరిన్ని థియేటర్ల కోసం ఈ సేవలను ప్రారంభించాలని అనుకుంటున్నది. సినిమా టికెట్‌తోపాటు ఆ థియేటర్‌లోని రెస్టారెంట్‌లో ఫుడ్ అండ్ బెవరేజ్‌ను సైతం ఆన్‌లైన్‌లో ఆర్డర్ చేసుకునేందుకు తమ సంస్థ వీలుకల్పిస్తున్నదని, ఇప్పటికే 700 స్క్రీన్లలో ఈ సేవలను అందుబాటులోకి తెచ్చినట్లు సక్సేనా వెల్లడించారు.

దక్షిణాది వాటా 40 శాతం

సంస్థ పోర్టల్ ద్వారా సినిమా టికెట్ల బుకింగ్స్‌లో దక్షిణాది మార్కెట్ వాటనే 35-40 శాతంగా ఉందని సక్సేనా అన్నారు. కనీసం ఏడాది కాలంగా హైదరాబాద్ నుంచే అత్యధిక సంఖ్యలో టికెట్లు బుక్ అవుతున్నాయని అన్నారు. ఆంధ్రప్రదేశ్ విషయానికొస్తే.. విజయవాడ, వైజాగ్‌లు టాప్ ప్లేస్‌లో ఉన్నాయన్నారు.

తెలుగు రాష్ట్రాల్లో 650 స్క్రీన్లు

ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్, తెలంగాణలోని 65 ప్రాంతాలకు చెందిన 650 స్క్రీన్లలో సినిమా చూసేందుకు తమ పోర్టల్ ద్వారా టికెట్ బుక్ చేసుకునే సౌకర్యం కల్పిస్తున్నట్లు సక్సేనా వెల్లడించారు. వచ్చే ఆర్థిక సంవత్సరం తెలుగు రాష్ట్రాల్లో మరో 250 థియేటర్లలో సంస్థ సేవలను అందుబాటులోకి తేవాలని లక్ష్యంగా పెట్టుకున్నామని అన్నారు.

ఉచిత బ్యాంకింగ్ సేవల రద్దు నిజం కాదు: ఐబిఎ

ముంబై : ఇప్పటి వరకు ఉచితంగా అందిస్తున్న బ్యాంకింగ్ సేవలు రద్దు చేస్తున్నట్టు సోషల్ మీడియాలో వస్తున్న వార్తలను ఇండియన్ బ్యాంక్స్ అసోసియేషన్ (ఐబిఎ) తోసిపుచ్చింది. 'ఇప్పటి వరకు అలాంటి ఆలోచనే లేదు. ఇవన్నీ నిరాధారమైన తప్పుడు వార్తలు' అని ఒక ప్రకటనలో పేర్కొంది. ఇప్పటి వరకు ఉచితంగా అందిస్తున్న ప్రతి సేవలపైనా ఈ నెల 20 నుంచి బ్యాంకులు చార్జీలు వసూలు చేయబోతున్నట్టు గత వారం రోజుల నుంచి కొన్ని వాట్సప్ గ్రూపుల్లో ప్రచారమవుతోంది. ఖాతాదారులు సెల్ఫ్ చెక్‌పై వెనక్కి తీసుకునే గరిష్ఠ నగదు పరిమితిని రూ.50,000కు పరిమితం చేయడంతో పాటు రూ.10 వసూలు చేయాలని నిర్ణయించినట్టు వార్తలు వచ్చాయి. అలాగే థర్డ్ పార్టీకి ఇచ్చే చెక్కు విత్‌డ్రా పరిమితిని రూ.10,000కు కుదించి దానిపైనా రూ.10 వసూలు చేయబోతున్నట్టు సోషల్ మీడియాలో వార్తలు షికారు చేశాయి. దీంతో ఈ వార్తల్లో ఎలాంటి నిజం లేదని ఐబిఎ స్పష్టం చేసింది.

ఆర్‌ఎఫ్‌సిఎల్‌లో వాటాపై డెన్మార్క్ కంపెనీ ఆసక్తి

కోల్‌సిటీ (గోదావరిఖని): రామగుండం ఫెర్టిలైజర్స్ అండ్ కెమికల్స్ లిమిటెడ్ (ఆర్‌ఎఫ్‌సిల్) డైరెక్టర్ల బోర్డు సమావేశం బుధవారం ప్లాంట్ ఆవరణలో జరిగింది. సంస్థ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ అజయ్ నారాయణ్‌దేశ్ పాండే, డైరెక్టర్ రాకేష్ మోహన్ జోషితోపాటు మరో ముగ్గురు డైరెక్టర్లు, సిఇఒ వివేక్ మల్హోత్రా, సిఎఫ్ఒ సునీల్ భాటియా ఈ సమావేశానికి హాజరయ్యారు. గురువారం కూడా సమావేశం జరగనుంది. ఆర్‌ఎఫ్‌సిఎల్‌లో నేషనల్ ఫెర్టిలైజర్స్, ఇంజనీర్స్ ఇండియాకు 26 శాతం, ఎఫ్‌సిఐ, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వాలకు 11 శాతం చొప్పున వాటా ఉంది. మిగిలిన 26 శాతం వాటాకు భాగస్వాములను ఆర్‌ఎఫ్‌సిఎల్ వెతుకుతోంది. ఆర్‌ఎఫ్‌సిఎల్‌లో అమ్మోనియా తయారీ టెక్నాలజీకి సంబంధించి డెన్మార్క్‌కు చెందిన హాల్డర్ టాప్స్‌కు టెండర్ ఇచ్చింది. ఈ సంస్థ ఆర్‌ఎఫ్‌సిఎల్‌లో వాటాకు ఆసక్తి కనబరుస్తోంది. ఈ సంస్థ ఉన్నత స్థాయి సభ్యుల బృందం గురువారం ఆర్‌ఎఫ్‌సిఎల్‌ను సందర్శించనుంది. టెక్నాలజీ ఏర్పాటుకు సంబంధించి పరిశీలనతోపాటు ఆర్‌ఎఫ్‌సిఎల్‌లో వాటాకు అనుకూలమైన పరిస్థితులను కూడా అంచనా వేయనుంది. వీరిచ్చే నివేదిక ఆధారంగా హాల్డర్ టాప్స్ నిర్ణయం తీసుకోనుంది.

సెన్సెక్స్	నిఫ్టీ	బంగారం	వెండి	రూపాయి డాలర్	ముడి చమురు
34433.07 ↓10.12	10632.20 ↓4.80	29810 ↑130	38885 ↑340	63.60	69.23

బంగారం: ముంబై 10 గ్రాములు (99.9 స్వచ్ఛత)

హ్యుండయ్ వెర్నాలో సరికొత్త వేరియెంట్లు

గరిష్ఠ ధర రూ.9.09 లక్షలు

హ్యుండయ్ మోటార్ ఇండియా లిమిటెడ్ (హెచ్ఎంఐఎల్).. మిడ్ సైజ్ ప్రీమియం సెడాన్ 'వెర్నా'లో రెండు కొత్త వేరియెంట్లను విడుదల చేసింది. 1.4 లీటర్ పెట్రోల్ ఇంజిన్‌తో కూడిన ఈ రెండు వేరియెంట్ల ధరను రూ.7.79 లక్షలు, రూ.9.09 లక్షలుగా (ఢిల్లీ షోరూం) నిర్ణయించారు. ఇవి లీటరుకు 19.1 కిలోమీటర్ల మైలేజీ ఇస్తాయని సంస్థ తెలిపింది. గత ఏడాది ఆగస్టులో కొత్త తరం వెర్నాను మార్కెట్లోకి ప్రవేశపెట్టిన హ్యుండయ్.. 1.6 లీటర్ పెట్రోల్, డీజిల్ పవర్‌ట్రెయిన్స్ వేరియంట్లను ఇప్పటికే మార్కెట్లో విక్రయిస్తున్నది. వీటి ధర రూ.9.68 లక్షల నుంచి రూ.12.87 లక్షల స్థాయిలో ఉంది. కొత్త వేరియంట్లను ప్రవేశపెట్టడంతో వెర్నాకు ఆదరణతోపాటు కస్టమర్లకు ఆప్షన్లు కూడా పెరుగుతాయని హెచ్ఎంఐఎల్ సేల్స్ అండ్ మార్కెటింగ్ విభాగ డైరెక్టర్ రాకేష్ శ్రీవాస్తవ అన్నారు.

బజాజ్ డిస్కవర్‌లో 2 కొత్త మోడళ్లు

గరిష్ఠ ధర రూ.56,314

బజాజ్ ఆటో.. డిస్కవర్ బైకుల్లో రెండు కొత్త మోడళ్లను మార్కెట్లోకి విడుదల చేసింది. ఒకటి డిస్కవర్ 110 మోడల్ కాగా.. మరొకటి డిస్కవర్ 125. ప్రీమియం ఎగ్జిక్యూటివ్ బైక్‌ల సెగ్మెంట్‌లో మార్కెట్ వాటాను మరింత పెంచుకొనే వ్యూహంలో భాగంగా సంస్థ ఈ మోడళ్లను విడుదల చేసింది. 115.5 సిసి ఇంజిన్ సామర్థ్యంతో కూడిన డిస్కవర్ 110 మోడల్ ధరను రూ.50,496గా నిర్ణయించారు. ఇక 124.5సిసి ఇంజిన్‌తో రూపొందించిన డిస్కవర్ 125 రేటును డ్రమ్ బ్రేక్, డిస్క్ బ్రేక్ ఫీచర్ల ఆధారంగా రూ.53,491, రూ.56,314గా నిర్ణయించినట్లు సంస్థ వెల్లడించింది. ఇవి మహారాష్ట్ర మార్కెట్ ధరలు. ఈ రెండు కొత్త మోడళ్లలో డేటైం రన్నింగ్ ఎల్ఇడి హెడ్‌లాంప్స్, డిజిటల్ ఇన్‌స్ట్రుమెంట్ డిస్‌ప్లే ప్యానెల్ వంటి ఫీచర్లను సైతం పొందుపర్చారు.

డాట్సన్ రెడీ-గో ప్రీ బుకింగ్ ప్రారంభం

జపాన్ ఆటో సంస్థ నిస్సాన్.. డాట్సన్ రెడీ-గో 1.0 లీటర్ ఆటోమేటెడ్ మాన్యువల్ ట్రాన్స్‌మిషన్ (ఎఎంటి) మోడల్‌ను త్వరలో దేశీయ మార్కెట్లోకి ప్రవేశపెట్టనుంది. ఈ కారు కొనుగోలు చేసేందుకు ఆసక్తిగా ఉన్నవారి కోసం బుధవారం నుంచి ప్రీ-బుకింగ్ సేవలను ప్రారంభించింది. నిస్సాన్, డాట్సన్ డీలర్ల వద్ద రూ.10,000 చెల్లించి ఈ కారును బుక్ చేసుకోవచ్చని సంస్థ వెల్లడించింది. ముందుగా బుక్ చేసుకున్నవారికి కార్లను అందించే ప్రక్రియ ఈనెల 23 నుంచి ప్రారంభంకానుంది. రెడీ-గో 1.0 లీటర్ ఎఎంటి మోడల్‌ను ఫైవ్ స్పీడ్ ఆటోమేటెడ్ ట్రాన్స్‌మిషన్‌తో కూడిన ఇంటెలిజెంట్ స్పార్క్ ఆటోమేటెడ్ టెక్నాలజీ (ఐశాట్) 1.0 ఎల్ త్రీ సిలిండర్ ఇంజిన్‌తో డిజైన్ చేశారు.

బులియన్

బంగారం (10 గ్రాములు)	హైదరాబాద్	విజయవాడ	విశాఖపట్నం	ప్రొద్దుటూరు	చెన్నై
24 క్యారెట్లు	30,500	30,510	30,720	---	29,670
క్రితం ముగింపు	30,560	---	30,530	30,380	29,620
22 క్యారెట్లు	28,240	28,300	28,260	---	28,260
క్రితం ముగింపు	28,290	---	28,080	28,160	28,210
వెండి (కిలో)	39,600	40,000	40,000	---	41,800
క్రితం ముగింపు	39,800	---	39,800	40,000	41,800

రిటైల్ (ఒక గుడ్డు) ధర రూ. 4.60 — నెక్ (100 గుడ్లు)

హైదరాబాద్	402.00	చిత్తూరు	398.00
వరంగల్	404.00	చెన్నై	405.00
విజయవాడ	404.00	నమక్కల్	395.00
గోదావరి	404.00	బెంగళూరు	405.00
విశాఖపట్నం	404.00	ముంబై	447.00

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్

హైదరాబాద్	88.00	విజయవాడ	88.00
కరీంనగర్	90.00	గుంటూరు	88.00
వరంగల్	88.00	ఒంగోలు	90.00
మహబూబ్‌నగర్	88.00	చిత్తూరు	77.00
కర్నూలు	88.00	నెల్లూరు	85.00
విశాఖపట్నం	82.00	అనంతపురం	83.00
గోదావరి	88.00		

ఫారెక్స్ (థామస్‌కుక్ రేట్లు) (రూపాయల్లో..)

కరెన్సీ	కొనుగోలు	అమ్మకం
యుఎస్ డాలర్	57.94	67.18
పౌండ్	78.43	90.95
యూరో	69.20	80.26
ఆస్ట్రేలియా డాలర్	45.35	52.46
బహ్రెయిన్ దినార్	156.40	179.23
కువైట్ దినార్	174.62	217.45
ఒమని రియాల్	153.65	175.79
సౌదీ రియాల్	15.40	18.26
సింగపూర్ డాలర్	43.37	51.40
యుఎఇ దిరమ్	15.77	18.43

ఎన్ఎండిసికి అద్భుత స్పందన

» ఇష్యూకు 5.4 రెట్లు ఓవర్ సబ్‌స్క్రిప్షన్

ముంబై/న్యూఢిల్లీ : ప్రభుత్వ రంగంలోని ఎన్ఎండిసిలో వాటాల విక్రయానికి రిటైల్ ఇన్వెస్టర్ల నుంచి అద్భుత స్పందన లభించింది. రిటైల్ ఇన్వెస్టర్ల విభాగం 5.40 రెట్లు ఓవర్ సబ్‌స్క్రయిబ్ అయింది. ఆఫర్ ఫర్ సేల్ (ఒఎఫ్ఎస్) విధానం కింద ఎన్ఎండిసిలో 2.52 శాతం వాటాల విక్రయాన్ని ప్రభుత్వం చేపట్టింది. షేర్ల కొనుగోలుకు మొదటి రోజున సంస్థాగత ఇన్వెస్టర్లు పోటీ పడగా రెండో రోజు రిటైల్ ఇన్వెస్టర్లు క్యూ కట్టారు. సంస్థాగత ఇన్వెస్టర్ల విభాగం 1.68 రెట్లు ఓవర్ సబ్‌స్క్రయిబ్ అయింది. వారి కోసం 3.79 కోట్ల షేర్లు కేటాయించగా 6.36 కోట్ల షేర్లకు బిడ్‌లు దాఖలయ్యాయి. రిటైల్ ఇన్వెస్టర్ల కోసం 1.59 కోట్ల వాటాలను కేటాయించగా 8.58 కోట్ల షేర్లకు బిడ్‌లు దాఖలయ్యాయి.

బిఎస్ఇలో బుధవారం నాటి ముగింపు ధర 155.30 రూపాయల ధర వద్ద 2.52 శాతం వాటాల విక్రయంపై ఖజానాకు 1200 కోట్ల రూపాయల ఆదాయం సమకూరుతుందని అంచనా. వాస్తవానికి కంపెనీలు 1.5 శాతం వాటాలను విక్రయించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇష్యూకు ఓవర్ సబ్‌స్క్రిప్షన్ వచ్చినట్టయితే మూడు శాతం వాటాల వరకు విక్రయించే స్వేచ్ఛను చేతిలో ఉంచుకుంది. సంస్థాగత ఇన్వెస్టర్ల స్పందన గమనించిన ప్రభుత్వం వాటాల విక్రయం పరిమితిని 2.52 శాతం వరకు ఉంచుకోవచ్చని నిర్ణయించింది. పిఎస్‌యుల్లో వాటాల విక్రయం ద్వారా ఈ ఏడాది ప్రభుత్వం ఇప్పటివరకు 52500 కోట్ల రూపాయలు సమీకరించింది. ఈ ఏడాది 72500 కోట్ల రూపాయలు సమీకరించాలన్నది ప్రభుత్వ లక్ష్యం కాగా పిఎస్‌యుల్లో మైనారిటీ వాటాల విక్రయం ద్వారా 46,500 కోట్ల రూపాయలు, వ్యూహాత్మక వాటాల విక్రయం ద్వారా 15 వేల కోట్ల రూపాయలు సమీకరించాలని భావించింది.

లాభాల స్వీకరణతో కుంగిన మార్కెట్

ప్రభుత్వం భారీ ఎఫ్‌డిఐ సంస్కరణలకు తెర తీసినా ఆ చర్య మార్కెట్‌లో ఉత్సాహాన్ని నింపలేకపోయింది. కార్పొరేట్ల మూడో త్రైమాసిక ఆర్థిక ఫలితాల పైనే దృష్టి సారించిన ఇన్వెస్టర్లు ఆచితూచి వ్యవహరించారు. దీంతో స్టాక్ ఇండెక్స్‌లు నాలుగు రోజులుగా సాగుతున్న పరుగుకు విరామం ఇచ్చాయి. కార్పొరేట్ ఆర్థిక ఫలితాల సీజన్ ప్రారంభం అవుతూ ఉండడంతో ఇన్వెస్టర్లు అప్రమత్తం అయ్యారని మార్కెట్ వర్గాలన్నాయి.

ఇంట్రాడేలో సెన్సెక్స్ 34565.63 పాయింట్ల జీవిత కాల గరిష్ఠ స్థాయిని తాకినా లాభాల స్వీకరణతో దిగజారి చివరికి 10 పాయింట్ల నష్టంతో 34433.07 పాయింట్ల వద్ద ముగిసింది. నిఫ్టీ 4.80 పాయింట్ల నష్టంతో 10632.20 పాయింట్ల వద్ద ముగిసింది. ఇంట్రాడేలో ఇండెక్స్ 10655.50 పాయింట్ల రికార్డు స్థాయిని తాకింది.

టిసిఎస్ టాప్

సెన్సెక్స్ షేర్లలో 3.64 శాతం లాభంతో టిసిఎస్ అగ్రస్థానంలో నిలిచింది. గురువారం కంపెనీ ఫలితాలు వెలువడనున్నాయి. దీనికి ముందే టిసిఎస్ షేరు లాభపడడం విశేషం. ఇంట్రాడేలో ఈ షేరు 52 వారాల గరిష్ఠ స్థాయి 2816 రూపాయలను తాకి చివరికి 3.64 శాతం లాభంతో 2807 రూపాయల వద్ద ముగిసింది. ఒక్క రోజులోనే కంపెనీ మార్కెట్ విలువ 18884.67 కోట్లరూపాయలు పెరిగి 5,37,359.67 కోట్ల రూపాయల వద్ద ముగిసింది.

- బద్దిలోని ప్లాంట్‌కు యుఎస్ ఎఫ్‌డిఎ తనిఖీ నివేదిక అందిందన్న ప్రకటనల నడుమ ఆల్కెమ్ లాబ్స్ షేరు ఆరు శాతం దూసుకుపోయింది. కంపెనీ మార్కెట్ విలువ 1523 కోట్ల రూపాయలు పెరిగి 28,070.28 కోట్ల రూపాయలకు చేరింది.
- సెబి గణాంకాల ప్రకారం మంగళవారం ఎఫ్‌పిఐలు 303.94 కోట్ల రూపాయల విలువ గల షేర్లను విక్రయించగా దేశీయ సంస్థలు 522.90 కోట్ల రూపాయల విలువ గల షేర్లను కొనుగోలు చేశాయి.
- టిసిఎస్ ఫలితాల ప్రకటనతో గురువారం నుంచి కార్పొరేట్ ఆర్థిక ఫలితాల ప్రక్రియ ప్రారంభం అవుతుంది. శుక్రవారం మరో ఐటి దిగ్గజం ఇన్ఫోసిస్ ఫలితాలు ప్రకటించనుంది.

ఆదాయాలు పైకి, లాభాలు దిగువకు

క్యు3 ఫలితాలపై క్రిసిల్ అంచనా

ముంబై: భారత కార్పొరేట్ రంగం మూడో త్రైమాసికంలో ఆదాయాల్లో ఐదేళ్ల గరిష్ఠ స్థాయిలో 9 శాతం ఆదాయాల వృద్ధిని నమోదు చేస్తుందని దేశీయ రేటింగ్ సంస్థ క్రిసిల్ అంచనా వేసింది. అయితే పెరిగిన కమోడిటీ ధరల కారణంగా లాభాలు మాత్రం క్షీణించవచ్చునని తాజా నివేదికలో తెలిపింది. ఉక్కు, అల్యూమినియం, సిమెంట్, క్రూడాయిల్ అనుబంధ రంగాల్లో ఉత్పత్తులపై రాబడులు పెరగడం, ఆటో, ఏవియేషన్ వంటి వినియోగ ఆధారిత రంగాల్లో డిమాండు పెరగడం వల్ల ఆదాయాలు పెరిగే ఆస్కారం ఉన్నట్టు పేర్కొంది. 2017-18 ఆర్థిక సంవత్సరం మొత్తం మీద లిస్టెడ్ కంపెనీల ఆదాయాలు 8-9 శాతం పెరగవచ్చని క్రిసిల్ సీనియర్ డైరెక్టర్ ప్రసాద్ కోపార్కర్ అన్నారు. ఎన్ఎస్ఇలో లిస్టింగ్ అయిన, మార్కెట్ విలువలో 70 శాతం వాటా ఉన్న భిన్న రంగాలకు చెందిన కంపెనీల పనితీరు ఆధారంగా తాము ఈ అంచనాకు వచ్చినట్టు క్రిసిల్ పరిశోధనా విభాగం తెలిపింది. అయితే ఎగుమతి ఆధారిత ఐటి, ఫార్మా రంగాలు, ధరల పోటీ తీవ్రంగా ఉన్న టెలికాం రంగం నిరాశ పరిచే ఆస్కారం ఉన్నట్టు పేర్కొంది. రెండో త్రైమాసికంలో టెలికాం మినహా వినియోగ ఆధారిత రంగాలన్నీ కలిసి ఆదాయాల్లో సగటున 15 శాతం వృద్ధిని నమోదు చేయగా జిఎస్‌టి ప్రభావం తీవ్రంగానే ఉన్నప్పటికీ ప్రథమార్థంలో 6 శాతం వృద్ధిని సాధించినట్టు తెలిపింది.

10640 పైన మరింత అప్‌ట్రెండ్

టెక్ వ్యూ

నిఫ్టీ ప్రారంభంలో 10640 వరకు వెళ్లి రియాక్షన్‌లో పడింది. కాని ఇంట్రాడే మద్దతు స్థాయి 10580 వద్ద కోటుకుని చివరికి డే గరిష్ఠ స్థాయిలో క్లోజ్ కావడం ట్రెండ్‌లో సానుకూలత సంకేతం. గత మూడు రోజులుగా 10600 వద్ద మైనర్ రియాక్షన్ సాధిస్తున్నా ప్రధాన మద్దతు స్థాయిల కన్నా పైనే నిలుస్తోంది. 20 డిఎంఎ, కీలక స్థాయి 10500 రెండింటి కన్నా పైనే ఉంటోంది.

గురువారం స్థాయిలివే...

నిరోధం : 10640 **మద్దతు :** 10580

- మరింత అప్‌ట్రెండ్ కోసం ఇంట్రాడే నిరోధం 10640 కన్నా పైన నిలదొక్కుకోవాలి. ప్రధాన నిరోధ స్థాయిలు 10700, 10800.
- మైనర్ ఇంట్రాడే మద్దతు స్థాయి 10580 కన్నా దిగజారితే మైనర్ బలహీనత సంకేతం ఇస్తుంది. ప్రధాన మద్దతు స్థాయి 10500. అంతకన్నా దిగజారితే స్వల్పకాలిక కరెక్షన్ ముప్పు ఏర్పడుతుంది.
- బ్యాంక్ నిఫ్టీ గరిష్ఠ స్థాయిల్లో అప్రమత్త ధోరణి కనబరుస్తోంది. 25800 బలమైన నిరోధ స్థాయి.

■ వి.సుందర్ రాజా

ఆటుపోట్లకు ఆస్కారం

ఆస్ట్రో వ్యూ

తిథి : పుష్య బహుళ దశమి **నక్షత్రం :** విశాఖ

అశ్విని, మఖ, మూల నక్షత్ర జాతకులు, వృశ్చిక, మీన రాశుల వారు అప్రమత్తంగా ఉండాలి.

నిఫ్టీ : 10632.20 (-4.80)

ట్రెండ్ మార్పు వేళలు : 11.33

ధోరణి : గ్రహగతులను బట్టి నిలకడగా ప్రారంభమై 9.50 నుంచి 11.25 వరకు మెరుగ్గా ట్రేడవుతూ ఆ తర్వాత ఒంటి గంట వరకు నిస్తేజం ట్రేడ్ కావచ్చు. తిరిగి 2.45 వరకు మెరుగ్గా మారి చివరిలో మళ్లీ నిస్తేజం కావచ్చు.

ట్రేడింగ్ వ్యూహం...

నిఫ్టీ ఫ్యూచర్స్ 9.45 సమయానికి ప్రారంభ స్థాయి/సగటు (ఎటిపి)పైన ట్రేడవుతుంటే తగు స్టాప్‌లాస్‌తో లాంగ్ పొజిషన్లు తీసుకుని 11.15 సమయానికి క్లోజ్ చేసుకోవాలి. 11.30 తర్వాత ఎటిపికన్నా దిగువకు వస్తే షార్ట్ పొజిషన్లు తీసుకుని 2.50 సమయానికి క్లోజ్ చేసుకోవాలి. ఇంట్రాడే ట్రేడింగ్‌కు ప్రారంభ స్థాయి కీలకం. అంతకన్నా దిగువన షార్ట్ పొజిషన్లు శ్రేయస్కరం.

నిరోధ స్థాయిలు : 10670, 10705

మద్దతు స్థాయిలు : 10590, 10555

గమనిక : ఇది పూర్తిగా ఆస్ట్రోటెక్నికల్ అంశాల ఆధారంగా ఇచ్చిన సూచన. మార్కెట్ వాస్తవిక కదలికల ఆధారంగా నిర్ణయాలు తీసుకోవాలి.

■ డా.భువనగిరి అమరనాథశాస్త్రి www.thefinanciala strologer.blogspot.in

బిఎస్ఇలో తెలుగు రాష్ట్రాల కంపెనీల షేర్లు

ACI INFOCOM 10(9.5)561321
ADITYA SPIN. 9.42(8.98)725
AGRO TECH FO 739.55(742.6)406
AISHWARYA TE 10.43(11.03)154513
ALPHAGEO (I) 1007.8(964.65)44649
ALU FLUORIDE 137.4(138.6)13320
AMAR RAJA BA 853.75(858.3)20876
ANDHRA BANK 57.45(57.95)94321
ANDHRA CEMEN 14.99(15.52)136230
ANDHRA PETRO 65.2(66.7)147916
ANJANI PORTL 256.3(253.75)2353
ASTRA MICRO 118.2(120.45)47551
AUROB.PHARMA 672.6(673.2)104659
AVANTEL LTD 530.6(537.3)7338
AVANTI FEEDS 2578.3(2663.15)8090
B.N.RATHI SE 50.85(50.65)9218
BALAJI AMINE 709(723)16318
BAMBINO AGRO 336.55(340.2)4303
BARTRONICSIN 15.37(15.85)39202
BHAGIRA.CHEM 348.8(358.75)943
BHAGYA INL 49.85(49.95)16874
BHARATFIN 1055.15(1052.8)22829
BNR UDYOG 29(27.95)833
CAMBRIDGE 91.5(89.75)7209
CAT TECHN. 1.3(1.28)38886
CCHHL 18.35(17.5)41196
CCL PRODUCTS 304.8(306)26374
CELESTIAL 21.7(21.7)21413
CIL SECURITS 37.4(37.45)767
COROM INTER 570.65(575.6)15565
CUBEX TUBING 28.55(29.5)2463
CYBERMATE 3.86(3.68)266176
CYIENT 580.35(584.1)2528
DANLAW TECH. 93.45(93.25)28395
DECAN CEMENT 625.25(633.1)1203
DHAN ROTO SP 38.75(40.1)5591
DIAMONPOWER 22.75(21.8)249091
DIVI'S LAB. 1080.6(1089.8)24677
DIVYA.GRANIT 122.6(121.1)5999
DQ ENT 18.9(19.2)7050
DR.REDDY'S 2422.8(2458.4)30704
EMPEE SUGARS 5.39(5.39)12881
EVEREST ORG. 174.95(165.05)21906
FACOR ALLOYS 4.28(4.29)203306
FIRSTOBJ 15.7(15.65)8838
GATI LTD. 137.1(138.2)119201
GAYATRI PROJ 217.7(214.75)42109
GENNEX LAB 5.93(5.98)343013
GMR INFRASTR 22.25(21.25)4431291
GODAVARI DRU 40.85(41.7)8285
GOLDST INFRA 227.7(230.8)37114
GOLDSTONE EN 16.25(15.5)8840
GRANULES (I) 140.6(139.1)163446
GVK POWERINF 23.25(22.15)2728190
HBL P SYS 72.45(73.75)276770
HERITGFOOD 836.1(837.65)1305
I.C.S.A. IND 5.69(5.47)244834
INCAP LTD. 113.95(116.55)2981
IPAPPM 384.45(383.35)99333
IVRCL LTD 5.86(6.16)393952
KAKATIYA CEM 408.05(408.5)9058
KALLAM SPG. 25.1(25.8)27485
KARAN WOO-SN 1.15(1.1)1100
KAVERI SEED 526.85(532.4)37625
KCP LTD 154.2(153.4)29001
KERNEX MICRO 49.6(47.25)5799
KNR CONST 315.5(307.9)26692
KREBS BIOCHM 158.4(157.15)843
LANCO INFRA 1.95(1.86)2712460
LOKESH MACH 77.35(76.95)65766
LOTUS CHOC 24.1(23)1250
MADHUCON PRJ 39.05(37.85)227607
MOLD-TEK TEC 74.55(76)1296
MOSCHIP SEMI 43.4(43)174919
MSR INDIA 37.1(37.8)4805
N C L IND. 275.7(270.45)9506
NACLIND 61.5(64.1)130088
NATCO PHARM 990.9(984.95)31217
NCC 138.1(140.05)570774
NEHA INTER. 9.93(10.28)80711
NETTLINX LTD 89.75(86.3)26641
NEULAND LAB. 836(844.25)5196
NIHAR INFO 14.26(14.4)1970
NILE LTD. 991.5(992.4)11666
NTL 5.48(5.55)19390
OIL COUNTRY 62.4(59.55)108510
PADMALAYA TE 5.76(5.7)26312
PALRED 92.5(91.4)22131
PANYAM CEMEN 66.75(66.9)30365
PENNAR STEEL 71.7(74.7)236276
PFL INFOTECH 10.69(10.19)3610
PHYTOCHEM I. 77.7(74.65)49718
PITTI LAMIN. 100.25(101.6)18719
POKARNA LTD 262.55(269.7)28019
PRAJAY ENGS. 19.7(19.38)466016
PREMIER EXPL 489.35(494.55)3327
PRISM CEMENT 136.35(134.8)140812
RAIN 449.85(459.15)600255
RAJ PACKAGIN 39.15(39.5)5052
REG.CERAMIC 8.98(8.92)9537
RESTILE CER. 9.45(9.79)8092
SAGAR CEM. 1094.05(1080.5)6008
SAMKRG PIST. 359.35(350.95)17546
SAMPRE NUTRI 85.05(87.05)15750
SANGHI IND. 137.9(138.15)51879
SATVAH.ISPAT 36.2(36.9)81403
SAVEN TECHNO 24.05(23.9)5043
SIBAR AUTO 11.6(12)114
SMPL 1.76(1.74)117050
SMS PHARMACE 103.7(106.65)13169
SREE RAYALA 223.6(229.8)3213
STEEL EXCH 41.7(41.8)120428
SUJANA INDUS 1.06(1.01)2950
SURANATP 6.7(6.9)28281
SURYACHAKRA 1.7(1.63)312121
SURYAMBA SP 73(74.5)2700
SURYAVA SPIN 8.41(8.85)1581
SURYLAK.COTT 104.65(104.65)9783
SUVEN LIFE S 212.2(213.95)49708
TAJ GVK HOTL 182.65(181.85)3101
TANLA 43.95(46.15)722139
TCI INDUS. 1008.8(1008.8)2
TRANSCORP IN 48.85(51.2)43822
TRANSGENE BI 2.38(2.29)21051
TRANSPORT CO 291.9(293.55)1802
USHER AGRO 8.36(8.5)6703
VICEROY HOTE 20.4(20.65)162532
VIJAY TEXTIL 48.1(44.7)32967
VIMTA LABS 170.1(170.4)7603
VIRAT CRANE 45.6(46.05)5912
VIRINCHI 141.8(143.4)132976
VISAKA IND. 753.9(771.25)11616
VISTA PHARMA 48.5(48.7)20765
VIVIMED LABS 106.05(106.3)123965
VST INDUS. 3170.15(3200)4
WATERBASE 359.1(364.15)312175
XLENERGY 4.16(4.01)27595
YBRANTDIGI 8.44(7.65)4616067
ZEN TECH 150.1(147.05)97372
ZENOTECH 49(49.9)12000

ఎన్ఎస్ఇ-500 NSE

షేర్ల ప్రస్తుత, క్రితం ముగింపు ధరలు, వాణిజ్య పరిమాణం వరుసగా

AARTIDRUGS 763.95(770.35)45197
BALMLAWRIE 270.25(274.8)112224
BALRAMCHIN 142.05(143.7)2002192
BANKBARODA 162.5(164.5)10993630
BANKINDIA 165(170.25)3634803
BASF 2258.1(2282.95)11608
BATAINDIA 753.95(746.9)979124
BBTC 1776.1(1757.65)400880
BEML 1554.1(1567.05)265749
CYIENT 581.6(583.1)238709
DABUR 357.8(359.35)894740
DALMIABHA 3171(3194.65)62537
DBCORP 379.45(373.3)165452
DBREALTY 83.7(82.35)2517981
DCBBANK 199.85(204.5)2224280
DCMSHRIRAM 563.6(559.65)99166
DEEPAKFERT 414.95(419.45)100678
GMRINFRA 22.3(21.2)66971505
GODFRYPHLP 1036.35(1040.25)132142
GODREJCP 978.45(988.25)276141
GODREJIND 617.15(609)525463
GODREJPROP 826.35(791.55)611451
GPPL 143.05(138.75)2989137
GRANULES 140.5(139.4)2204921
GREAVESCOT 145.4(147.35)1314452
INDHOTEL 143.15(142.15)2263363
INDIACEM 193(192.1)4854968
INDIANB 373.45(377.95)768888
INDOCO 290.85(284)173928
INDUSINDBK 1734.1(1725.05)1223879
INEOSSTYRO 1081.5(1087.45)5766
INFRATEL 370.8(368.4)4204087
INFY 1052.25(1041.35)4734317
KTKBANK 161.2(161.55)2830106
KWALITY 111.9(114.4)771419
L&TFH 181.3(183.05)5408651
LAKSHVILAS 143.4(145.3)582332
LAOPALA 627.9(627.7)13072
LAXMIMACH 6380.75(6470.9)2588
LICHSGFIN 575.2(578.05)1381286
LITL 1.75(1.7)1831353
ORIENTBANK 123(125.1)1711905
ORIENTCEM 171.95(174.75)93625
ORISSAMINE 2020.55(2023.95)5029
PAGEIND 22923.55(24153.85)62848
PARSVNATH 28.95(27.9)312276
PCJEWELLER 533.4(532)3799293
PEL 2857.35(2892.95)101747
PERSISTENT 743.85(742.6)419518
SANOFI 4697.7(4801.8)6673
SBIN 301.1(304.3)13064599
SCHAEFFLER 5702.65(5776.25)1175
SCHNEIDER 128.85(129.2)104689
SCI 97.55(95.15)3787252
SHARDACROP 463.45(469.45)13473
SHILPAMED 600.6(602.05)41876
SHK 287.7(289.2)66235
TECHM 542.1(533.85)2748547
TECHNO 409.1(411.55)47133
TEXRAIL 115.5(117.7)988129
THERMAX 1322.2(1324.95)43160
THOMASCOOK 248.85(249.75)218524
TIDEWATER 7527.75(7594.45)3057
TIMKEN 918.1(920.45)214006
TITAN 917.6(932.95)1605433

ప్రేమించలేదని.. పొడిచేశాడు!

- ప్రేమోన్మాదానికి మరో యువతి బలి
- ఏడాదిగా వెంటపడి వేధించాడు
- తిరస్కరించడంతో ప్రాణం తీశాడు
- హైదరాబాద్‌లో ఉన్మాది ఘాతుకం



జానకి(ఫైల్‌ఫోటో)

కూకట్‌పల్లి / హైదరాబాద్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): ప్రేమోన్మాదానికి మరో యువతి బలైపోయింది. తన ప్రేమను తిరస్కరించిందన్న కక్షతో కత్తితో దాడి చేసి హతమార్చాడో ఉన్మాది. ఈ ఘటన నగరంలోని మూసాపేటలో మంగళవారం రాత్రి జరిగింది. శ్రీకాకుళం జిల్లా రాజాం మండలం గుయ్యానవలసలో కూలిపని చేసుకునే బోను సూరెప్పడు, జయమ్మ దంపతులకు ఆరుగురు కుమార్తెలు. వారిలో చివరి కుమార్తె జానకి(25) స్థానికంగా డిగ్రీ పూర్తి చేసుకొని ఉద్యోగ నిమిత్తం మూడేళ్లక్రితం కూకట్‌పల్లి ప్రాంతానికి వచ్చింది. మూసాపేటలోని హబీబ్ నగర్‌లో స్నేహితురాలు రూపతో కలిసి ఉంటోంది. డీమార్ట్‌లో సేల్స్ ప్రమోటర్‌గా చేరింది. అక్కడే పనిచేసే ఆనంద్ అలియాస్ అనంతప్ప జానకిని ప్రేమిస్తున్నానని ఏడాదిగా వెంటపడుతున్నాడు. ఆమె తిరస్కరించడంతో వేధించడం మొదలుపెట్టాడు. విషయం డీమార్ట్ నిర్వాహకులకు తెలియడంతో జానకిని మరో బ్రాంచ్‌కు బదిలీ చేశారు. అనంతప్పను పది రోజులపాటు సస్పెండ్ చేశారు. ఇంత జరిగినా అనంతప్పలో మార్పురాలేదు. తరచూ ఫోన్ చేసి వేధించడంతో అతని నంబర్‌ను బ్లాక్‌లిస్టులో పెట్టింది. దీంతో కోపంతో ఆమె పనిచేస్తున్న చోటుకే వెళ్లి దుర్భాషలాడాడు. తనను ప్రేమించకపోతే చంపుతానని బెదిరించాడు. ఆమె ఎంతకీ తన ప్రేమను అంగీకరించకపోవడంతో గత నెల 24న ఆమెపై దాడి చేసి తీవ్రంగా కొట్టాడు. విషయాన్ని జానకి తన బంధువుకు చెప్పింది. అతను అనంతప్పను మందలించి సెల్‌ఫోన్ లాక్కొన్నాడు. విషయం అనంతప్ప తల్లిదండ్రులు, బంధువులకు చెప్పడంతో వాళ్లు కేసు పెట్టవద్దని విజ్ఞప్తి చేశారు. అయినా తన ధోరణి మార్చుకోని అనంతప్ప వేధింపులను తీవ్రతరం చేశాడు. అనంతప్పకు భయపడి జానకి తన బంధువుతో కలిసి రోజూ విధులకు వెళ్తుండేది. అయితే మంగళవారం అతనికి పని ఉండటంతో తోడు వెళ్లలేకపోయాడు. అంతేకాకుండా జానకి బుధవారం రాత్రి సొంతూరు వెళ్తుందన్న విషయం తెలుసుకొన్న అనంతప్ప.. ఆమెపై మరింత కక్ష పెంచుకొన్నాడు. మంగళవారం సాయంత్రం 5గంటలకు విధులు ముగించుకొన్న జానకి ఇంటికి తిరిగి వెళ్లింది. సాయంత్రం 6:45గంటలకు జానకి రూమ్మేట్ రూప వచ్చేసరికి గదికి బయట గడియ పెట్టి ఉంది. తలుపు తీసి లోపలకు వెళ్లగా.. జానకి రక్తపు మడుగులో కొట్టుమిట్టాడుతోంది. ఆమె ఛాతి, నడుం భాగాల్లో కత్తి పోట్లు ఉండటంతో స్థానికుల సహాయంతో జానకిని స్థానిక ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. కొన ఊపిరితో ఉన్న ఆమెను కూకట్‌పల్లిలోని మరో ఆస్పత్రికి తరలించారు. కొద్దిసేపటికే జానకి మృతి చెందింది. నిందితుడు జానకిని కత్తితో పొడవడంతోపాటు గొంతునులిమి చంపినట్లు పోలీసులు భావిస్తున్నారు. అనంతప్పను పోలీసులు అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్లు తెలిసింది.



ఆనంద్

మళ్లీ హైదరాబాద్ రానంది..

జానకి పెళ్లి చేయాలని నిర్ణయించిన తల్లిదండ్రులు ఇటీవల ఓ సంబంధం చూశారు. జానకి కూడా సానుకూలంగా స్పందించిందని మేనమామ జయరాజ్ తెలిపారు. సంక్రాంతికి ఊరెళ్లి పెళ్లి సంబంధం ఖాయం చేసుకుంటానని, మళ్లీ హైదరాబాద్ వచ్చే ఆలోచన లేనట్లు జానకి చెప్పిందని స్నేహితురాలు రూప తెలిపింది.



99ఏళ్ల వృద్ధురాలికి తుంటి కీలు మార్పిడి

మారేడుపల్లి/హైదరాబాద్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ నర్సింగ్ హోంలో 99 ఏళ్ల వృద్ధురాలికి విజయవంతంగా తుంటి మార్పిడి చికిత్స చేశారు. బోయిన్‌పల్లికి చెందిన ప్యారీబాయి అనే వృద్ధురాలు గత ఏడాది డిసెంబరు 7న బాత్‌రూంలో జారి పడటంతో ఆమె తుంటి కీలు ఎముక విరిగిపోయింది. దీంతో డిసెంబరు 10న కీళ్ల మార్పిడి శస్త్ర చికిత్స నిపుణుడు డా. శ్రీనివాస్ గౌడ్‌ను కుటుంబ సభ్యులు ఆశ్రయించగా.. గంటన్నరపాటు శ్రమించి విజయవంతంగా ఆమె కీలు మార్పిడి చేశారు. కాగా, భారత్‌లో ఇటువంటి శస్త్ర చికిత్స చేయించుకున్న అత్యంత వృద్ధురాలు ఈమే కావడం విశేషం. ఈ మేరకు బుధవారం జరిగిన విలేకరుల సమావేశంలో డా.శ్రీనివాస్ గౌడ్ వివరాలు వెల్లడించారు.

పంచాయతీలకు 'పరోక్షం' సరికాదు

పంచాయతీ రాజ్ ఛాంబర్

పంజాగుట్ట, రాంనగర్/హైదరాబాద్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): సర్పంచి ఎన్నికల్లో పరోక్ష పద్ధతి సరికాదని, ఈ నిర్ణయంతో సర్పంచులు ప్రజలకు కాకుండా.. వార్డు సభ్యులకు జవాబుదారీగా మారుతారని తెలంగాణ పంచాయతీ రాజ్ ఛాంబర్ అభిప్రాయపడింది. 1959 నుంచి 2017 వరకు పరోక్ష పద్ధతిలో సర్పంచి ఎన్నికలు నిర్వహించిన మహారాష్ట్ర కూడా ఆ విధానం తప్పని గుర్తించి.. గత ఏడాది ప్రత్యక్ష పద్ధతిని ఎంచుకున్న విషయాన్ని గుర్తు చేసింది. బుధవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో.. ఛాంబర్ అధ్యక్షుడు చింపుల సత్యనారాయణ రెడ్డి మాట్లాడుతూ.. నూతన పంచాయతీ రాజ్ చట్టం, రెండుసార్లు ఒకే రిజర్వేషన్ నిర్ణయాలను తాము స్వాగతిస్తున్నామని, అదే సమయంలో పరోక్ష ఎన్నికల ప్రతిపాదనను వ్యతిరేకిస్తున్నామన్నారు. రాష్ట్రంలో ప్రస్తుతమున్న 8600 పంచాయతీల్లో సరిపడా గ్రామ కార్యదర్శులు లేరని, ఈ నేపథ్యంలో కొత్తగా 4000 పంచాయతీల ఏర్పాటు నిర్ణయంపై ప్రభుత్వం పునరాలోచించాలని కోరారు. సర్పంచి ఎన్నిక ఎలా జరగాలన్నదానిపై ప్రభుత్వం అఖిలపక్షాన్ని ఏర్పాటు చేయాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. బుధవారం బీసీ భవన్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. పరోక్ష ఎన్నికలు జరిగితే గ్రామాల్లో ధనవంతులు, రెడ్లు, దొరలు సర్పంచ్ పదవులను డబ్బులతో కొనుగోలు చేసే ప్రమాదం ఉందన్నారు.

కరెంటు మంటలు!

- వ్యవసాయానికి 24 గంటల విద్యుత్తుపై కాంగ్రెస్, టీఆర్ఎస్ సవాళ్లు.. ప్రతిసవాళ్లు
- విద్యుత్తు కొనుగోళ్లలో అక్రమాలు జరిగాయన్న రేవంత్
- కాంగ్రెస్ నేతలవి తప్పుడు ఆరోపణలు: పల్లా, సుమన్





హైదరాబాద్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): రైతాంగానికి 24 గంటలపాటు విద్యుత్తు సరఫరాపై మాటల యుద్ధం మొదలైంది. విద్యుత్తు కొనుగోళ్లలో అక్రమాలు జరుగుతున్నాయంటూ ప్రతిపక్ష కాంగ్రెస్ ఆరోపించగా.. అవన్నీ తప్పుడు ఆరోపణలేనని అధికార టీఆర్ఎస్ కొట్టిపారేసింది. వాటిని రుజువు చేయాలని సవాలు విసిరింది. అయితే ఈ సవాలుకు తాము సిద్ధమేనని కాంగ్రెస్ నేతలు ప్రకటించారు. ఎమ్మెల్యే రేవంత్‌రెడ్డి బుధవారం గాంధీభవన్‌లో విలేకరులతో మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం, ఏపీ ప్రభుత్వం తక్కువ ధరకు విద్యుత్తు ఇస్తామన్నా.. కాదని, ప్రైవేటు కంపెనీల నుంచి ఎందుకు కొనుగోలు చేస్తున్నారని ప్రశ్నించారు. విద్యుదుత్పత్తి సంస్థల నిర్మాణం, వాటికోసం తెచ్చిన అప్పుల వెనక చాలా మతలబు ఉందని ఆరోపించారు. జెన్‌కో ఉత్పత్తిని తగ్గించి, విద్యుత్తు కొరతను చూపించి, దానిని అధిగమించేందుకు ప్రైవేటు సంస్థలకు కొనుగోలు పేరిట వేల కోట్లు వెచ్చిస్తోందని అన్నారు. ఇండియా బుల్స్ సంస్థతో జరిగిన ఒప్పందాలను బయటపెట్టాలని, విద్యుత్తు ప్రాజెక్టులకు సంబంధించి శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఐఏఎస్ అధికారులు నిర్వహించే పోస్టుల్లో తమకు అనుకూలురైన, పదవీ విరమణ చేసిన ఉద్యోగులను కూర్చోబెట్టారని విమర్శించారు. అయితే కాంగ్రెస్ నేతలు గాంధీభవన్ వేదికగా పదే పదే అబద్ధాలు చెబుతున్నారని టీఆర్ఎస్ ఎంపీ బాల్క సుమన్, ఎమ్మెల్సీలు పల్లా రాజేశ్వర్‌రెడ్డి, భానుప్రసాద్ అన్నారు. టీఆర్ఎస్ఎల్పీలో వారు విలేకరులతో మాట్లాడుతూ రైతులకు 24 గంటల విద్యుత్తు ఇవ్వడంతో కాంగ్రెస్ నేతలకు షాక్ తగులుతోందన్నారు. రాష్ట్రం ఏర్పడ్డాక జరిగిన విద్యుత్తు కొనుగోలు ఒప్పందాలు రెండేనని, అందులోనూ యూనిట్‌కు రూ.5 కంటే తక్కుకే కొంటున్నామని పల్లా స్పష్టం చేశారు. విద్యుత్ సంస్థల ఉన్నతాధికారులుగా నాన్ ఐఏఎస్‌లను గతంలోనూ నియమించిన విషయాన్ని కాంగ్రెస్ నేతలు గుర్తుంచుకోవాలన్నారు. విద్యుత్తుకు సంబంధించి రేవంత్ చెప్పినవన్నీ తప్పుడు లెక్కలేనని, వాటిపై చర్చించేందుకు సిద్ధంగా ఉన్నామని అన్నారు. విద్యుత్తు కొనుగోలు విషయమై ప్రభుత్వం ఒప్పందం కుదుర్చుకున్నది కాంగ్రెస్ నేత సుబ్బరామిడ్డికి చెందిన సంస్థతోనేనని, దమ్ముంటే అందులో అవకతవకలు జరిగాయని గాంధీభవన్ సాక్షిగా రుజువు చేయాలని అన్నారు. కాగా టీఆర్ఎస్ సవాలుకు సిద్ధమని రేవంత్ ప్రకటించారు. తాను, ఎమ్మెల్యే సంపత్, దాసోజు శ్రావణ్‌తో కలిసి శుక్రవారం మధ్యాహ్నం 2గంటలకు చర్చకు వస్తానని అన్నారు. వేదికను టీఆర్ఎస్ నేతలే నిర్ణయించుకోవచ్చని ప్రతి సవాల్ విసిరారు. ఇదిలా ఉండగా.. వ్యవసాయ భూముల్లో విద్యుత్తు టవర్లు నిర్మిస్తున్నందుకు రైతులకు ఇవ్వాల్సిన పరిహారాన్ని తెలంగాణ ప్రభుత్వం అరకొరగా అందిస్తోందని, కేంద్ర బృందాలను పంపించి పరిశీలించాలని కాంగ్రెస్ సీనియర్ నేత వి.హనుమంతరావు కేంద్ర విద్యుత్ శాఖ మంత్రి ఆర్కే సింగ్‌కు లేఖ రాశారు. మరోవైపు రాష్ట్రంలో కౌలు రైతులకు కూడా ప్రభుత్వం ఎకరాకు రూ.4 వేల పెట్టుబడి సాయం అందించాలని సీఎల్పీ ఉపనేత టి.జీవన్‌రెడ్డి డిమాండ్ చేశారు. పంటల సాగుపై వ్యవసాయశాఖ మంత్రి పోచారం శ్రీనివాసరెడ్డికి అవగాహన లేదన్నారు.

'వంటేరు'ను విడుదల చేయాలి

- లేకుంటే రేపు ప్రగతి భవన్ ముట్టడి
- టీఆర్ఎస్‌ను కూకటివేళ్లతో పెకిలిస్తాం : రమణ

హైదరాబాద్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): గజ్వేల్‌లో టీడీపీ నాయకుడు వంటేరు ప్రతాప్‌రెడ్డికి పెరుగుతున్న ప్రజాదరణ చూసి తట్టుకోలేక కుట్రపూరితంగా కేసులు పెట్టి అరెస్టు చేశారని టీడీపీ-టీఎస్ అధ్యక్షుడు ఎల్.రమణ విమర్శించారు. గురువారం సాయంత్రంలోగా ఆయనను విడుదల చేసి, ఓయూ విద్యార్థులపై కేసులు ఉపసంహరించుకోకుంటే శుక్రవారం ప్రగతిభవన్ ఎదుట ధర్నా చేపడతామని తెలిపారు. ఎన్టీఆర్‌భవన్‌లో బుధవారం ఆయన మాట్లాడుతూ రాజకీయ ప్రత్యర్థులపై టీఆర్ఎస్ ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతోందని మండిపడ్డారు. మంత్రులు కేటీఆర్, హరీశ్ కంకణం కట్టుకుని అక్రమ కేసులు పెట్టించి జైలుకు పంపుతున్నారని ఆరోపించారు. వంటేరు అంతర్జాతీయ టెర్రరిస్టు అన్నట్టుగా ప్రభుత్వం వ్యవహరిస్తోందని పొలిట్‌బ్యూరో సభ్యుడు మోత్కుపల్లి నర్సింహులు మండిపడ్డారు. రాష్ట్రంలో అప్రకటిత ఎమర్జన్సీ కొనసాగుతోందని మరో నేత రావుల చంద్రశేఖర్ రెడ్డి ఆరోపించారు. కాగా, ఎన్టీఆర్ భవన్‌లో పార్టీ మండల అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శుల మూడో బ్యాచ్ శిక్షణ తరగతుల సందర్భంగా రమణ మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో టీఆర్ఎస్ పార్టీని కూకటివేళ్లతో పెకిలించి వేస్తామని వ్యాఖ్యానించారు.

సంపత్ వచ్చినా చేర్చుకోం: ఎమ్మెల్యే గువ్వల

హైదరాబాద్, జనవరి 10(ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ ఎమ్మెల్యే సంపత్‌కుమార్ ఏ ఎండకు ఆ గొడుగు పట్టడంలో సిద్ధహస్తుడని, ఆ పార్టీలో ఇమడలేక వేరే మార్గం చూసుకుంటున్నారని టీఆర్ఎస్ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు ఆరోపించారు. టీఆర్ఎస్‌లోకి వస్తానని అడిగినా సంపత్‌ను చేర్చుకునేది లేదన్నారు. తుమ్మిళ్ల ఎత్తిపోతల పథకానికి శంకుస్థాపన సందర్భంగా మంత్రి హరీశ్‌ను సంపత్ సత్కరించారని, దీనిపై కాంగ్రెస్ నేతలు చీవాట్లు పెట్టడంతో తెల్లారేసరికి మాటమార్చారని విమర్శించారు. రాష్ట్ర అభివృద్ధి కోసం మంత్రి హరీశ్‌రావు చేస్తున్న కృషి కాంగ్రెస్ నేతలకు దిగజారుడుతనంగా కనిపిస్తోందా? అని ప్రశ్నించారు.

రోడ్డు రవాణా మరియు జాతీయ రహదారుల మంత్రిత్వ శాఖ

(భారత ప్రభుత్వం)

బహిరంగ ప్రకటన

(కి.మీ. 0.000 నుండి కి.మీ. 39.980 వరకు NH-161లో సంగారెడ్డి-నాందేడ్- అకోలా సెక్షన్ 4/6 లేనింగ్ కొరకు NH యాక్ట్ 1956లో సెక్షన్-3-G(3) క్రింద)

నం. B3/NH/161/1032/2017 తేది: 10.01.2018

తెలంగాణ రాష్ట్రంలో సంగారెడ్డి జిల్లా, సంగారెడ్డి రెవెన్యూ డివిజన్ పరిధిలో కి.మీ. 0.000 నుండి కి.మీ 39.980 (సంగారెడ్డి-నాందేడ్- అకోలా సెక్షన్) వరకు గల ఎన్‌హెచ్-161 నిర్మాణం(వెడల్పు చేయుట/ఫోర్-లేనింగ్ ద్వారా) కొరకు భారత ప్రభుత్వ రాజపత్రం, అసాధారణ భాగంలో ప్రచురించబడిన, భారత ప్రభుత్వ రాజపత్రం, అసాధారణ భాగంలో సెక్షన్ 3 సబ్‌సెక్షన్ (ii) తేది 22 డిసెంబర్, 2017 లో ప్రచురించబడిన ప్రకటన ఎస్.ఓ. 4018(ఇ) ప్రకారం జాతీయ రహదారుల చట్టం, 1956 (48 ఆఫ్ 1956)లో సెక్షన్ 3 D (2) క్రింద దిగువ షెడ్యూలులో వివరించిన నిర్మాణములు, చెట్ల ద్వారాలతో కలిగిన భూములు ఎటువంటి వివాదములు లేకుండా భూములు భారత కేంద్రప్రభుత్వానికి సంక్రమించినవి. సదరు భూమిపై ప్రయోజనం గల వ్యక్తులందరూ వారి భూములకు సంబంధించిన ఒరిజినల్ డాక్యుమెంట్లు మరియు డాక్యుమెంట్ల జిరాక్స్ కాపీలతో స్వయంగా లేదా ఏజెంట్ ద్వారా లేదా లీగల్ ప్రాక్టీషనర్ ద్వారా వారి సంబంధిత భూముల ప్రయోజన స్వభావం తెలుపుటకు మరియు ప్రతీ మండల కార్యాలయం ఎదురుగా తెలిపిన తేదిలలో సమర్థప్రాధికారి, రెవెన్యూ డివిజనల్ ఆఫీసర్, సంగారెడ్డి వారి సమక్షంలో హాజరు కావలసినదిగా కోరబడుతున్నారు.

క్ర.సం.	జిల్లా పేరు	మండలం పేరు	గ్రామం పేరు	విచారణ ప్రదేశం	తేది & సమయం
1	సంగారెడ్డి	కంది	1. కంది, 2. మామిడిపల్లి	రెవెన్యూ డివిజనల్ కార్యాలయం సంగారెడ్డి	20.01.2018
2		పుల్కల్	1. శివంపేట, 2.తాడన్‌పల్లి		
3		అందోల్	1. అల్మాయ్‌పేట 2. దాకూర్, 3. ఎర్రారం		

షెడ్యూలు

తెలంగాణ రాష్ట్రంలో జాతీయ రహదారి నం.161 పై కి.మీ. 0.000 నుండి కి.మీ. 39.980 (సంగారెడ్డి - నాందేడ్ - అకోల సెక్షన్) వరకు గల భూభాగంలోవున్న కట్టడాలతో లేదా కట్టడాలు లేకుండా సేకరించాల్సి ఉన్న భూమి సంక్షిప్త వివరణ

సర్వే నంబరు	భూమి రకం	భూమి స్వభావం	చ.మీలో విస్తీర్ణం	భూమి యజమానులు/ ప్రయోజనం గల వ్యక్తుల పేరు	అనుబంధంగా ఉన్నవి / కట్టడములు
తాలుకా/మండలం: 1.కంది					గ్రామము: (1) కంది
466	ప్రైవేటు	మెట్ట	16086	1) పరేష్ కుమార్ తండ్రి విట్టల్ దాస్	1. టిన్ రూమ్స్, 2. బావి-6
467	ప్రైవేటు	మెట్ట	2428	1) పరేష్ కుమార్ తండ్రి విట్టల్ దాస్	1.బావి-1, 2.బోరు బావి-1,3.మామిడి చెట్లు 4.జామ (5), 5.దానిమ్మ (2), 6.వేప చెట్లు(23)
468	ప్రైవేటు	మెట్ట	14008	1) పరేష్ కుమార్ తండ్రి విట్టల్ దాస్	1.టిన్ రూమ్స్ (2), 2. కాంపౌండ్ వాల్ (50 మీటర్లు), 3.పైప్‌లైన్ 10 మీటర్లు, 4.డ్రిప్ పైప్‌లైన్, 5.ఫెన్సింగ్, 6.మామిడి చెట్లు (62) (15 సం॥లు), 7.మామిడి చెట్లు 87 (1 సం॥), 8.నీలగిరి చెట్లు-203 (10 సం॥లు), 9. అశోక చెట్లు - 8 (5 సం॥) (10.కామగు చెట్లు-73 (8 సం॥లు), 11.జామ-45 (10 సం॥లు) 12.వేప-2 (6 సం॥లు), 13.సపోటా-1 (4 సం॥లు), 14.టేకు-61 (5 సం॥లు)
469	ప్రైవేటు	మెట్ట	19199	1) శ్రీ కైలాస్ ఎస్.ఆర్ మేనేజింగ్ డైరక్టర్	
443	ప్రైవేటు	మెట్ట	21654	1) కొండల్ రావు తండ్రి నారాయణ రావు 2) నవీన్ కుమార్ తండ్రి కొండల్ రావు 3) గుండ్ల నర్సింగ్ రావు తండ్రి వెంకట్ రావు 4) జి. శ్రీనివాస్ తండ్రి నర్సింగ్ రావు 5) జి.జగత్ రావు తండ్రి నర్సింగ్ రావు 6) జి. సుధాకర్ రావు తండ్రి నర్సింగ్ రావు 7) జి. నాగ రాజ్ తండ్రి నర్సింగ్ రావు	1.బోర్ బావి-2, 2.టిన్ రూఫ్-4, 3.ట్రాన్స్ ఫార్మెంట్స్-1, 4.దాబా-1, 5.ఫెన్సింగ్ స్టోన్స్-450, 6.మామిడి చెట్లు-286 (9 సం॥లు), 7.వేప చెట్లు-23 (15 సం॥లు) 8.చింత-4 (5 సం॥లు), 9.సుబాబులు చెట్లు-20 (4 సం॥లు)
444	ప్రైవేటు	మెట్ట	12643	1) కొండల్ రావు తండ్రి నారాయణ రావు 2) నవీన్ కుమార్ తండ్రి కొండల్ రావు 3) గుండ్ల చంద్రమ్మ తండ్రి నర్సింగ్ రావు 4) గుండ్ల శ్రీలత భర్త శ్రీనివాస్ 5) గుండ్ల నర్మద భర్త జగత్ 6) గుండ్ల మాధవి భర్త సుధాకర్ 7) గుండ్ల అర్చన భర్త నాగారు	
తాలుకా/మండలం: 1.కంది					గ్రామము: (2) మామిడిపల్లి
463	ప్రైవేటు	మెట్ట	5463	1) వాసుదేవ్ రావు తండ్రి శేషగిరి రావు	1.కాంపౌండ్ వాల్, 2.కొబ్బరి చెట్లు-6
464	ప్రైవేటు	మెట్ట	8903	1) వాసుదేవ్ రావు తండ్రి శేషగిరి రావు 2) నిర్మల భాయ్ భర్త వెంకట స్వామి 3) వి. బాలామణి భర్త రాజమల్లయ్య 4) వి. రాజమల్లయ్య తండ్రి చిట్టయ్య	1.ఫెన్సింగ్ స్టోన్స్, 2.పైప్‌లైన్, 3.మామిడి చెట్లు-30, 4.కొబ్బరి-30, 5.టేకు-18, 6.పనస-25
471	ప్రైవేటు	మెట్ట	5634	1) వాసుదేవ్ రావు తండ్రి శేషగిరి రావు 2) ఎం.డి. మహబూబ్ అలీ తండ్రి ఖాజా మియా 3) బి. అనిలా భర్త వెంకటేశ్వర్లు 4) ఎం.డి ఖైరత్ అలీ తండ్రి ఖాజా మియా 5) హలీం బీ భర్త మహ్మద్ మియా 6) ముజఫర్ అలీ తండ్రి యూసఫ్ అలీ 7) మోమిన్ తండ్రి యూసుఫ్ అలీ 8) మహమ్మద్ అఫ్జల్ తండ్రి హస్సేన్ సాబ్ 9) చాంద్ మియా తండ్రి జాన్మియా 10) గుండాల నాగరాజు తండ్రి నర్సింగ్ రావు 11) ఖాజా మొహినుద్దీన్ తండ్రి సాబీర్ మియా 12) బాబు మియా తండ్రి నబీ సాబ్ & ఇతరులు	1.పైప్‌లైన్, 2.టేకు-30, 3.చింత-1, 4.బోరు పైప్‌లైన్
470	ప్రైవేటు	మెట్ట	2412	1) సారా బలరాం తండ్రి రాజారాం 2) చోటీభాయ్ భర్త విట్టల్ 3) సారా విట్టల్ తండ్రి రాజా రాం 4) సారా పద్మ భాయ్ భర్త జానకి రాం 5) సారా జానకిరాం తండ్రి లక్ష్మణ్	1.పైప్‌లైన్, 2.రూమ్, 3.షెడ్, 4. వాటర్ హౌస్
505	ప్రైవేటు	మెట్ట	2428	1) చింతా బాలయ్య తండ్రి చంద్రయ్య 2) చింతా లక్ష్మి భర్త నారాయణ 3) గౌసియా బేగం భర్త ఖైరత్ అలీ 4) సునీల్ కుమార్ మైతి తండ్రి సాంబునల్ మైతి 5) సుహాశ్ జయ్ తండ్రి కమల్ రాజన్ జయ్ 6) బసంత్ కుమార్ పాటిల్ తండ్రి ప్రసాద్ 7) భీమార్జున్ రెడ్డి తండ్రి సుబ్బా రెడ్డి	ఫెన్సింగ్
503	ప్రైవేటు	మెట్ట	1113	1) బి.అనీలా భర్త వెంకటేశ్వర్లు 2) సారా జానకి రాం తండ్రి లక్ష్మణ్	
502	ప్రైవేటు	మెట్ట	1821	1) కుర్మా పెంటమ్మ భర్త చంద్రయ్య 2) కుర్మా భీరమ్మ భర్త పోచయ్య 3) బి. జయలక్ష్మి భర్త జగన్నాథ్ రావు 4) వై.ఉమా దేవి భర్త వెంకటేశ్వర రావు	
501	ప్రైవేటు	మెట్ట	1619	1) కుర్మా పెంటమ్మ భర్త చంద్రయ్య 2) బి. జయలక్ష్మి భర్త జగన్నాథ్ రావు 3) వై.ఉమా దేవి భర్త వెంకటేశ్వర రావు 4) బి. జయలక్ష్మి భర్త జగన్నాథ్ రావు	
563	ప్రైవేటు	మెట్ట	1684	1) మల్లా రెడ్డి తండ్రి నర్సింహారెడ్డి 2) బండి రమేష్ తండ్రి భాస్కర్ రావు	
562	ప్రైవేటు	మెట్ట	5969	1) బండి రమేష్ తండ్రి భాస్కర్ రావు 2) కాసాల రాములు తండ్రి నారాయణ	ఫెన్సింగ్ వైర్
561	కుంట	మెట్ట	3958	1) శికం కుంట	
560	గైరాన్	మెట్ట	15883	1) IIT, హైదరాబాద్	బోరు బావి, ఫెన్సింగ్ వాల్
530	ప్రైవేటు	మెట్ట	2529	1) లంబాడి జాప్ల తండ్రి చక్రియా 2) పి.రమణ తండ్రి సత్యనారాయణ 3) లంబాడి భీమ్ల తండ్రి చక్రియా 4) లంబాడి రూప్లా తండ్రి చక్రియా 5) నేనావత్ లక్ష్మి భర్త రూప్లా నాయక్ 6) IIT, హైదరాబాద్	
531	ప్రైవేటు	మెట్ట	9460	1) నేనావత్ లక్ష్మి భర్త రూప్లా నాయక్ 2) లంబాడి సువలి భర్త లాలియా 3) దోత్రా నాయక్ తండ్రి రమ్యా నాయక్ 4) హబీబ్ అహ్మద్ తండ్రి ఫతే మహమ్మద్ 5) వజీర్ అహ్మద్ తండ్రి ఫతే మహమ్మద్ 6) అబ్దుల్ రహ్మాన్ తండ్రి ఫతే మహమ్మద్	RCC, హౌస్
532	ప్రైవేటు	మెట్ట	11971	1) లంబాడి మాగ్యా తండ్రి ధార్యా 2) S.J.H.C ప్రైవేట్ లిమిటెడ్, షమ్మ భర్త రశర్ఫ్ 3) టీక్యా తండ్రి ధర్యా	
538	ప్రైవేటు	మెట్ట	2630	1) లంబాడి సంప్యా తండ్రి హత్యా & ఇతరులు	
539	ప్రైవేటు	మెట్ట	2346	1) రాంజీ తండ్రి సోమ్లా 2) చవాన్ లఛ్మి భర్త సీతారాం 3) చవాన్ శాంతి భర్త అమ్రియా 4) శాంతి భర్త మోతిలాల్ 5) లంబాడి శంకర్ తండ్రి కిమ్యా 6) చవాన్ శారద భర్త శంకర్	
540	ప్రైవేటు	మెట్ట	7992	1) చాంది భర్త తుకారామ్ 2) లంబాడి సంప్యా తండ్రి హాత్యా 3) దేవి భర్త బహదూర్ 4) జాప్ల తండ్రి హాత్యా 5) రమావత్ జయంత్ రావు తండ్రి సోమ్లా 6) లంబాడి పన్ని తండ్రి మిత్యా 7) లంబాడి గోర్ని భర్త మిత్యా	1. పైప్ లైను
తాలూకా/మండలం:3. పుల్కల్					గ్రామం: (1) శివంపేట
253	ప్రైవేటు	మెట్ట	506	1) రెడ్డి రామకృష్ణా రెడ్డి తండ్రి అనంత రెడ్డి 2) కోదూరి మణెమ్మ భర్త వీరయ్య 3) శాంతమ్మ భర్త వీరయ్య	
తాలూకా/మండలం:3. పుల్కల్					గ్రామం: (3) తాడన్‌పల్లి
78	ప్రైవేటు	మెట్ట	1252	1) మహమ్మద్ మహబూబ్ తండ్రి ఖాజా మియా	1. బోరు బావి
72	ప్రైవేటు	మెట్ట	617	1) మిర్జే వాజీ బేగ్ తండ్రి వజీర్ బేగ్	
57	ప్రైవేటు	మెట్ట	1529	1) షేక్ మహమ్మద్ తండ్రి ఇబ్రహీం సాబ్ 2) షరీఫ్ తండ్రి ఇబ్రహీం సాబ్ 3) సత్యనారాయణ రెడ్డి 4) హస్సేన్ సాబ్ తండ్రి పాషా సాబ్ 5) రామకృష్ణా రెడ్డి తండ్రి దుర్గా రెడ్డి	
55	ప్రైవేటు	మెట్ట	875	1) ఎ. ప్రతాప్ రెడ్డి తండ్రి రాయప్ప రెడ్డి 2) ఎ. జోసఫ్ రెడ్డి తండ్రి రాయప్ప రెడ్డి	
45	ప్రైవేటు	మెట్ట	2072	1) అర్జున్ గౌడ్ తండ్రి అంజి గౌడ్ 2) సుభాష్ గౌడ్ తండ్రి చెన్నా గౌడ్ 3) పి.మర్రి అనురాధ భర్త ఎ.జె ఎన్నారెడ్డి	
44	ప్రైవేటు	మెట్ట	6276	1) ఎస్.శ్రీనివాస్ తండ్రి మల్లయ్య 2) ఎస్.మొగులమ్మ భర్త చంద్రయ్య 3) కె. సంజీవ రెడ్డి తండ్రి నర్సింహారెడ్డి 4) దేష్ పాండె విజయ భాస్కర్ తండ్రి రామారావు 5) మంగీ రాజు రాఘవేందర్ తండ్రి శ్యామ్ రావు 6) ఎస్.రవి కుమార్ తండ్రి రాదయ్య 7) అనిరుద్దా కృష్ణా తండ్రి మల్లయ్య 8) గొల్లా బాలాగౌడ్ తండ్రి కిష్టయ్య 9) మల్లా రెడ్డి మాలతి భర్త ప్రభాకర్ రెడ్డి	
54	ప్రైవేటు	మెట్ట	192	1) మన్నె సత్తయ్య తండ్రి మల్లయ్య 2) నీరుడి నాగయ్య తండ్రి అశయ్య 3) ఎర్రోళ్ల లచ్చమ్మ భర్త బుచ్చయ్య	
తాలూకా/మండలం: 4. అందోల్					గ్రామం: (1) అల్మాయిపేట్
207	ప్రైవేటు	మెట్ట	2529	1) మహమ్మద్ మౌలానా తండ్రి యూసుఫ్ అలీ 2) మహమ్మద్ సాదిక్ తండ్రి యూసుఫ్ అలీ 3) బషీరుద్దీన్ అహ్మద్ తండ్రి బషీరుద్దీన్	
208	ప్రైవేటు	మెట్ట	85	1) మహమ్మద్ మౌలానా తండ్రి అనీసుద్దీన్ 2) మహబూబ్ అలీ తండ్రి హమ్మద్దీన్	
351	ప్రైవేటు	మాగాణి	316	1) నర్సింగ్ రావు తండ్రి సాయన్న	
473	ప్రైవేటు	మాగాణి	405	1) కుతుబుద్దీన్ తండ్రి గులామ్ దస్తగిర్	
420	ప్రైవేటు	మెట్ట	911	1) పి.అశోక్ తండ్రి నర్సిములు 2) పి.సుగుణమ్మ భర్త నర్సిములు 3) పి.దేవయ్య తండ్రి గుండయ్య 4) టి.గంగాధర్ తండ్రి రాజయ్య 5) టి.విష్ణు తండ్రి రాజయ్య 6) టి. పద్మ భర్త అర్జున్ 7) పి.జగన్నాథం తండ్రి సంగయ్య 8) టి.హరికిషన్ తండ్రి మానయ్య 9) టి.స్వరూప భర్త నాగరాజ్ 10) టి.సుభాష్ తండ్రి సంగయ్య	
419	ప్రైవేటు	మెట్ట	506	1) అహ్మద్ మొహినుద్దీన్ తండ్రి గులామ్ దస్తగిర్ లోకులతో సహా	
421	ప్రైవేటు	మెట్ట	405	1) పి.అశోక్ తండ్రి నర్సిములు 2) పి సుగుణమ్మ భర్త నర్సిములు 3) టి.గంగాధర్ తండ్రి రాజయ్య 4) టి.విష్ణు తండ్రి రాజయ్య 5) పోచయ్య తండ్రి సంగయ్య 6) హరి కిషన్ తండ్రి మానయ్య	
422	ప్రైవేటు	మెట్ట	506	1) మహమ్మద్ గఫార్ తండ్రి అహ్మద్ మొహియుద్దీన్	
423	ప్రైవేటు	మెట్ట	1185	1) మహమ్మద్ గఫార్ తండ్రి అహ్మద్ మొహియుద్దీన్	
425	ప్రైవేటు	మెట్ట	1794	1) వెంకట్ కృష్ణా రెడ్డి తండ్రి జహంగీర్ రెడ్డి	
426	ప్రైవేటు	మెట్ట	2428	1) వీరారెడ్డి తండ్రి ప్రతాప్ రెడ్డి	
428	ప్రైవేటు	మెట్ట	1416	1) వీరారెడ్డి తండ్రి ప్రతాప్ రెడ్డి	
433	ప్రైవేటు	మెట్ట	2428	1) కార్వోల్ సత్య గౌడ్ తండ్రి బల్‌రాజ్ గౌడ్	
434	ప్రైవేటు	మెట్ట	6374	1) రావతి లక్ష్మీ భర్త భీమ్‌సేన్ 2) రాఘవేందర్ రావు తండ్రి వెంకట్ రావు 3) భీమ్‌సేన్ రావు తండ్రి వెంకట్ రావు	
435	ప్రైవేటు	మెట్ట	3844	1) రావతి లక్ష్మీ భర్త భీమ్‌సేన్ 2) రాఘవేందర్ రావు తండ్రి వెంకట్ రావు 3) భీమ్‌సేన్ రావు తండ్రి వెంకట్ రావు	
436	ప్రైవేటు	మెట్ట	2023	1) డి. శ్రీనివాస్ రెడ్డి తండ్రి మోహన్ రెడ్డి 2) మధుసూదన్ రెడ్డి తండ్రి మోహన్ రెడ్డి 3) సుధాకర్ రెడ్డి తండ్రి మోహన్ రెడ్డి	
437	ప్రైవేటు	మెట్ట	2327	1) డి. శ్రీనివాస్ రెడ్డి తండ్రి మోహన్ రెడ్డి 2) మధుసూదన్ రెడ్డి తండ్రి మోహన్ రెడ్డి 3) సుధాకర్ రెడ్డి తండ్రి మోహన్ రెడ్డి	
438	ప్రైవేటు	మెట్ట	4350	1) శ్రీనివాస్ రెడ్డి తండ్రి మోహన్ రెడ్డి 2) మధుసూదన్ రెడ్డి తండ్రి మోహన్ రెడ్డి 3) సుధాకర్ రెడ్డి తండ్రి మోహన్ రెడ్డి	
456	ప్రైవేటు	మెట్ట	1720	1) బి.రవీందర్ తండ్రి నాగ రత్నం గౌడ్ 2) బి. రాధాకృష్ణ గౌడ్ తండ్రి నాగ రత్నం గౌడ్ 3) కె.రాధా కృష్ణ తండ్రి రామకృష్ణ 4) ఎం. రావంత్ రెడ్డి తండ్రి మహిపాల్ రెడ్డి	
457	ప్రైవేటు	మెట్ట	1720	1) కోటి రామ కృష్ణ తండ్రి రాధయ్య 2) బి. రాధాకృష్ణ గౌడ్ తండ్రి నాగరత్నం గౌడ్	
458	ప్రైవేటు	మాగాణి	1922	1) కోటి రామ కృష్ణ తండ్రి రాధయ్య 2) బి. రాధాకృష్ణ గౌడ్ తండ్రి నాగరత్నం గౌడ్	
459	ప్రైవేటు	మాగాణి	557	1) జైపాల్ రెడ్డి తండ్రి రంగారెడ్డి	
461	ప్రైవేటు	మాగాణి	1619	1) అమ్మి రెడ్డి తండ్రి జైపాల్ రెడ్డి	
463	ప్రైవేటు	మాగాణి	2125	1) కలాల్ మణెమ్మ తండ్రి నారాయణ్ గౌడ్ 2) నర్సిములు తండ్రి బలరామ్	
469	ప్రైవేటు	మాగాణి	1922	1) మహమ్మద్ ఖాదర్ తండ్రి హస్సేన్ 2) నాయెబు జబ్బార్ తండ్రి ఉస్మాన్ అలీ 3) శ్రీనివాస్ తండ్రి సంగయ్య	
470	ప్రైవేటు	మాగాణి	607	1) మహమ్మద్ ఖాదర్ తండ్రి హస్సేన్ 2) నాయెబు జబ్బార్ తండ్రి ఉస్మాన్ అలీ 3) శ్రీనివాస్ తండ్రి సంగయ్య	
471	ప్రైవేటు	మాగాణి	101	1) మహమ్మద్ ఖాదర్ తండ్రి హస్సేన్ 2) నాయెబు జబ్బార్ తండ్రి ఉస్మాన్ అలీ 3) శ్రీనివాస్ తండ్రి సంగయ్య	
480	ప్రైవేటు	మాగాణి	641	1) సయ్యద్ అసద్ అలీ తండ్రి సయ్యద్ అలీ	
481	ప్రైవేటు	మాగాణి	303	1) కలాలి మణెమ్మ భర్త నారాయణ్ గౌడ్ 2) కలాలి నర్సిములు తండ్రి బలరామ్ 3) నాగరత్నం తండ్రి బలరామ్	
482	ప్రైవేట్	మాగాణి	607	1) ఎం.రమాదేవి భర్త అశోక్ 2) జి.పెంటయ్య తండ్రి నారాయణ	
484	ప్రైవేట్	మాగాణి	506	1) ఎం.వినోద్ కుమార్ తండ్రి విఠల్	
485	ప్రైవేట్	మాగాణి	809	1) భారతి భర్త విఠల్	
486	ప్రైవేట్	మాగాణి	809	1) ఎం.వినోద్ కుమార్ తండ్రి విఠల్	
508	ప్రైవేట్	మెట్ట	1113	1) నారాయణ తండ్రి దుర్గయ్య	
509	ప్రైవేట్	మెట్ట	708	1) మధునాల రాములు తండ్రి దుర్గయ్య	
510	ప్రైవేట్	మెట్ట	911	1) నండ్ల శ్రీహర్ష తండ్రి బాబూరావు 2) ఎన్.బాబూ రావు తండ్రి బాపయ్య 3) షేక్ దావూద్ తండ్రి మౌలాన	
424	ప్రైవేట్	మెట్ట	65	1) శ్రీనివాస్ తండ్రి సంగయ్య	
తాలూకా/ మండలం 4. అందోల్					గ్రామం: (4) దాకూర్
649	ప్రైవేట్	మెట్ట	1722	1) దుదియాల రామ్‌కృష్ణ తండ్రి గోపాల్ 2) మరియమ్మ భర్త రాములు 3) బి.మణెమ్మ భర్త అగమయ్య	
650	ప్రైవేట్	మెట్ట	10218	1) రామ్ రెడ్డి తండ్రి నారాయణ రెడ్డి 2) పి.మాణిక్ రెడ్డి తండ్రి పాపిరెడ్డి 3) నరేందర్ రెడ్డి తండ్రి రామ్ రెడ్డి 4) సురేందర్ రెడ్డి తండ్రి రామ్ రెడ్డి 5) మహేందర్ రెడ్డి తండ్రి రామ్ రెడ్డి	
678	ప్రైవేట్	మెట్ట	13812	1) అర్జునయ్య తండ్రి అడివయ్య 2) యెర్రం శాంతమ్మ భర్త బాగయ్య 3) కాలువ 4) అర్జునయ్య తండ్రి దేవయ్య 5) యెర్రం బాలయ్య తండ్రి దేవయ్య 6) వై. యెల్లమ్మ భర్త బాలయ్య	
679	ప్రైవేట్	మెట్ట	869	1) ఎస్.వెంకటేశ్వర్లు తండ్రి యోగేశ్వర్ రావు	
తాలూకా/ మండలం 4. అందోల్					గ్రామం: (5) ఎర్రారం
282	ప్రైవేట్	మాగాణి	1315	1) మాచనగారి నారాయణ్ రెడ్డి తండ్రి భూం రెడ్డి	
266	ప్రైవేట్	మెట్ట	9813	1) పట్లోళ్ల లక్ష్మి భర్త ప్రభాకర్ రెడ్డి 2) యాదమ్మ భర్త పోచయ్య 3) రామయ్య తండ్రి సంగయ్య 4) వీరమ్మ భర్త కిష్టయ్య	
221	ప్రభుత్వం	మెట్ట	607	1) ప్రభుత్వ భూమి	
249	ప్రభుత్వం	శిఖం	8296	1) శిఖం భూమి	
250	ప్రైవేట్	మెట్ట	3642	1) పట్లోళ్ల బుచ్చిరెడ్డి తండ్రి బాలకిష్టా రెడ్డి	
597	ప్రైవేట్	మెట్ట	5666	1) శీలం విన్ని భూషణ్ తండ్రి వాసుదేవ్ రావు 2) మన్నె నాగయ్య తండ్రి మొగులయ్య 3) మన్నె అంజయ్య తండ్రి మొగులయ్య 4) మన్నె అడివమ్మ భర్త బాగయ్య	
595	ప్రైవేట్	మెట్ట	270	1) శీలం విన్ని భూషణ్ తండ్రి వాసుదేవ్ రావు	
588/1	ప్రైవేట్	మెట్ట	13658	1) శీలం వాసుదేవ్ రావు తండ్రి పాలెం శెట్టి	
583/1	ప్రైవేట్	మెట్ట	2327	1) చౌదరి ప్రభాకర్ తండ్రి నర్సిములు 2) సి.నరేందర్ తండ్రి ప్రభాకర్ 3) సి. నవీన్ కుమార్ తండ్రి ప్రభాకర్ 4) పట్నం మల్లయ్య తండ్రి శివయ్య 5) పట్నం కిష్టయ్య తండ్రి శివయ్య 6) శంకరయ్య తండ్రి శివయ్య	
557/1 557/2	ప్రైవేట్	మెట్ట	126	1) కంబగోళ్ల ప్రేమయ్య తండ్రి ఎల్లయ్య మరియు సోదరులు	
281	ప్రైవేట్	మాగాణి	1654	1) కలాలి పుష్పమ్మ 2) కలాలి మంగమ్మ	
283	ప్రైవేట్	మాగాణి	1409	1) రణంపేట ఈశ్వర్ తండ్రి నాగోజి 2) బాయికాడి నర్సిములు తండ్రి దేవయ్య 3) బాయికాడి మల్లమ్మ భర్త మల్లయ్య	
284	ప్రైవేట్	మాగాణి	506	1) మంగళి అంజమ్మ భర్త సాయిలు	

[F.No. NHAI/PIU-HYD/NH-161/S-N-A/GC/1/2016]

సం/- డా॥ డి.శ్రీనివాస్ రెడ్డి
రెవెన్యూ డివిజనల్ ఆఫీసర్ / భూసేకరణకు సమర్థ ప్రాధికారి
NH. 161, NHAI Sangareddy



తిరుమలలో ప్రహ్లాద్‌భాయ్ మోదీ

తిరుమలలో మోదీ సోదరుడు

వాహనంపై పార్టీ జెండా, మోదీ ఫొటో.. విమర్శల వెల్లువ



తిరుమల, జనవరి 10:ప్రధానమంత్రి నరేంద్రమోదీ సోదరుడు ప్రహ్లాద్‌భాయ్ మోదీ బుధవారం శ్రీవారి దర్శనార్థం తిరుమల వచ్చారు. రాత్రి 7 గంటలకు గోవిందసాయి అతిథి గృహానికి చేరుకున్న ఆయనకు టీటీడీ రిసెప్షన్ అధికారులు స్వాగతం పలికి బస, దర్శన ఏర్పాట్లు చేశారు. గురువారం ఉదయం వీఐపీ బ్రేక్‌లో ఆయన శ్రీవారిని దర్శించుకోనున్నారు. ఆయన తిరుమలకు వచ్చిన వాహనంపై బీజేపీ జెండా ఉండటంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. తిరుమలలో రాజకీయ పార్టీల జెండాలు, ప్రచారాలు, నినాదాలు నిషేధం.

రాజకీయ లాయర్లకు బార్ కౌన్సిల్ ఝలక్

చట్టసభ సభ్యుడైతే కోర్టులో వాదించొద్దంటూ ప్రతిపాదన

న్యూఢిల్లీ, జనవరి 10: చట్టసభల్లో సభ్యులుగానూ, న్యాయవాద వృత్తిలోనూ రెండింటా కొనసాగుతున్న ప్రముఖులకు బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ఝలక్ ఇచ్చింది. ఎంపీ, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ పదవుల్లో ఉన్నంతకాలం న్యాయవాదిగా ప్రాక్టీసు చేయకుండా ఎందుకు డిబార్ చేయరాదో చెప్పాలని ఓ నోటీసులో కోరింది. రెండు పోస్టుల్లోనూ కొనసాగడం కుదరదని, రూలు ప్రకారం ప్రభుత్వోద్యోగులు (పబ్లిక్ సర్వెంట్లు) అడ్వొకేట్లుగా పనిచేయరాదని పేర్కొంది. దీనిపై తుది నిర్ణయాన్ని ఈ నెల 22న తీసుకుంటామని బార్ వెల్లడించింది. ఢిల్లీకి చెందిన అశ్వనీకుమార్ ఉపాధ్యాయ అనే వ్యక్తి - చట్టసభ సభ్యులు, లాయర్లుగా కూడా పనిచేసుకోకూడదని వాదిస్తూ ఓ ప్రజాహిత దావాను బార్ కౌన్సిల్ కు పంపారు. దాని ఆధారంగా ఈ నోటీసులిచ్చారు. ఈ నిర్ణయం గనక అమలయితే కొంతమంది రాజకీయ లాయర్లకు పెద్ద దెబ్బే. ఈ జాబితాలో కేంద్ర మంత్రులు అరుణ్ జైట్లీ, రవిశంకర్ ప్రసాద్, నితిన్ గడ్కరీ, మాజీ మంత్రులు పి.చిదంబరం, కపిల్ సిబాల్ తదితరులు ఉన్నారు.

బాలుడిని చంపి తిన్న చిరుత

మరో ఇద్దరు చిన్నారులూ మృత్యువాత

ఛింద్వాడా, జనవరి 10: అడవికి చేరువలో ఉన్న ఆ గ్రామాలు భయం గుప్పిట్లో ఉన్నాయి. మాయదారి చిరుతపులి ఎప్పుడొచ్చి మీద పడుతుందో... ఎవరి ప్రాణాలు తీస్తుందోనని వణికిపోతున్నాయి. ఇది మధ్యప్రదేశ్‌లోని ఛింద్వాడా జిల్లాలో పల్లెల పరిస్థితి. ఇప్పటికే ఆ చిరుత ముగ్గురు చిన్నారులను పొట్టనపెట్టుకుంది. మంగళవారం రాత్రి 12 ఏళ్ల బాలుడిని చంపి సగం దేహాన్ని తినేసింది. ఆదివారం తల్లి చూస్తుండగానే మూడేళ్ల బాలికను నోట కరుచుకుపోయింది. అదే రోజు ఇంటి వద్ద ఆడుకుంటున్న పదేళ్ల బాలుడినీ బలిగొంది. ఆ పిల్లాడిని వంద మీటర్ల దూరం లాక్కుపోయింది.

సాయిబాబాను వెంటనే విడుదల చేయాలి

ప్రజాసంఘాల డిమాండ్

న్యూఢిల్లీ, జనవరి 10(ఆంధ్రజ్యోతి): మావోయిస్టులతో సంబంధాల ఆరోపణలపై జైలుశిక్ష అనుభవిస్తున్న ప్రొఫెసర్ సాయిబాబాను వెంటనే విడుదల చేయాలని ప్రజాసంఘాలు డిమాండ్ చేశాయి. బుధవారం ఢిల్లీలో బస్తర్ సంఘీభావ సమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సాయిబాబా భార్య వసంతతో పాటు ఢిల్లీ వర్సిటీ ప్రొఫెసర్లు, ప్రజాసంఘాల నేతలు మాట్లాడారు. హైదరాబాద్‌లో మంచి వైద్యం లభిస్తున్నందున ఆయనను నాగ్‌పూర్ జైలు నుంచి చర్లపల్లి జైలుకు తరలించాలని డిమాండ్ చేశారు. సాయిబాబా భార్య వసంత మాట్లాడుతూ.. జైలులో ఆయనతో సరిగ్గా మాట్లాడడానికి కూడా అవకాశం ఇవ్వడం లేదని ఆరోపించారు. పీయూసీఎల్ నేత సుధా భరద్వాజ్, జర్నలిస్టు అనీల్ చమాడియా, ఢిల్లీ వర్సిటీ ప్రొఫెసర్ బిశ్వజిత్ మొహంతి, డాక్యుమెంటరీ ఫిలిమ్ మేకర్ సంజయ్ కాక్, పీయూడీఆర్ నేత నవలఖా ఈ సమావేశంలో మాట్లాడారు.

'అభివృద్ధి'కి మార్గదర్శకులుగా గవర్నర్లు!

రాష్ట్రపతికి నివేదిక అందజేసిన కమిటీ

న్యూఢిల్లీ, జనవరి 10: 'సర్వ శ్రేష్ఠ భారత్'పై ఏర్పాటు చేసిన గవర్నర్ల కమిటీ బుధవారం రాష్ట్రపతి రాంనాథ్ కోవింద్‌ను కలిసింది. సమాజంలో మార్పు తేవడంలో గవర్నర్ల పాత్రపై కమిటీ నివేదికను అందజేసినట్లు రాష్ట్రపతి భవన్ ఒక ప్రకటనలో తెలిపింది. గవర్నర్లు తమ రాష్ట్రాల్లో చేపట్టే అభివృద్ధి పథకాల అమలులో మార్గదర్శకులుగా వ్యవహరించాలని నివేదికలో సూచించారు. తెలుగు రాష్ట్రాల గవర్నర్ నరసింహన్, తమిళనాడు, ఉత్తరప్రదేశ్, త్రిపుర, హిమాచల్‌ప్రదేశ్ గవర్నర్లు భన్వరీలాల్ పురోహిత్, రాంనాయక్, తథాగతరాయ్, ఆచార్య దేవవ్రత్‌లతో ఈ కమిటీ ఏర్పాటు చేశారు. భారత దేశ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని రాష్ట్రపతి రాంనాథ్ కోవింద్ భారత సంతతి పార్లమెంటేరియన్లను కోరారు. పీఐవో పార్లమెంటేరియన్ల సమావేశంలో ఆయన మాట్లాడారు.

అపోలో ఆస్పత్రికి నోటీసులు!

12లోపు జయ చికిత్స వివరాలివ్వాలి : కమిషన్

చెన్నై, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): దివంగత ముఖ్యమంత్రి జయలలితకు అందించిన చికిత్స వివరాలను ఈనెల 12వ తేదీలోపు సమర్పించకుంటే చర్యలు తప్పవని విచారణ కమిషన్ అపోలో ఆస్పత్రికి నోటీసులు జారీ చేసినట్టు సమాచారం. జయకు అందించిన చికిత్సపై నివేదిక ఇవ్వాలని కమిషన్ అధ్యక్షుడు జస్టిస్ ఆర్ముగస్వామి గతంలోనే అపోలో ఆస్పత్రికి సమన్లు జారీ చేశారు. అయితే ఇప్పటివరకు ఆస్పత్రి నిర్వాహకులు నివేదిక అందించలేదు. దీనిపై ఆగ్రహించిన కమిషన్ ఈనెల 12వ తేదీలోపు నివేదిక సమర్పించాలని నోటీసులు జారీ చేసినట్లు సమాచారం. మరోవైపు జస్టిస్ ఆర్ముగస్వామి కమిషన్ విచారణలో పలు ఆసక్తికర విషయాలు వెల్లడవుతున్నట్టు సమాచారం. ఆసుపత్రిలో జయలలితను ఐదుగురు పరామర్శించినట్లు ఇప్పటివరకు కమిషన్ విచారణలో తేలినట్టు వెల్లడైంది.

వికలాంగుల చట్టంలో సవరణలకు కేబినెట్ ఓకే

న్యూఢిల్లీ, జనవరి 10: వికలాంగుల సంక్షేమ ట్రస్టు ఛైర్‌పర్సన్ పదవీకాలం విషయంలో సంబంధిత చట్టంలోని సెక్షన్ 4(1)లో మార్పులు చేయాలనే ప్రతిపాదనకు కేంద్ర కేబినెట్ ఆమోద ముద్ర వేసింది. ఈ సెక్షన్ ప్రకారం ట్రస్టు ఛైర్‌పర్సన్, సభ్యుల పదవీకాలం మూడేళ్లుగా ఉన్నా.. అనివార్య కారణాలతో వారు రాజీనామా చేస్తే.. తదుపరి నియామకాల వరకు వారే కొనసాగాల్సి ఉంటుంది. అదేవిధంగా మూడేళ్ల పదవీకాలం పూర్తైనా.. తదుపరి సభ్యుల నియామకాల వరకు బాధ్యతలను వీరే నిర్వర్తించాలి. ఈ నేపథ్యంలో రాజీనామాలు, పదవీకాలాల విషయంలో.. వెంటనే వారిని రిలీవ్ చేసేలా సవరణలు చేయాలని ప్రధాని నరేంద్రమోదీ అధ్యక్షతన జరిగిన కేబినెట్ సమావేశం నిర్ణయించింది. మరోవైపు సీఐఎస్ఎఫ్ కేడర్ రివ్యూ ప్రతిపాదనలకు కేబినెట్ ఆమోద ముద్ర వేసింది. ఇంకోవైపు ఆర్థిక వ్యవహారాలపై ఏర్పాటైన కేంద్ర కేబినెట్ కమిటీ ఎంపీల స్థానిక ప్రాంతాల అభివృద్ధి పథకాన్ని 2020 మార్చి 31 వరకు కొనసాగించాలని నిర్ణయించింది.

మార్చి 5 నుంచి సీబీఎస్ఈ పరీక్షలు

న్యూఢిల్లీ, జనవరి 10: పది, పన్నెండో తరగతి వార్షిక పరీక్షల తేదీలను సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ (సీబీఎస్ఈ) ప్రకటించింది. మార్చి 5 నుంచి ఏప్రిల్ 4 వరకు పదో తరగతి, మార్చి 5 నుంచి ఏప్రిల్ 12 వరకు పన్నెండో తరగతి పరీక్షలు జరగనున్నాయి. జనవరి మధ్య నుంచి జనవరి 31 వరకు 12వ తరగతి విద్యార్థులకు ప్రాక్టికల్స్ నిర్వహిస్తారు.

అమెరికాకు పాక్ రాం..రాం..

వాషింగ్టన్/ఇస్లామాబాద్, జనవరి 10: అమెరికాకు సైనిక, ఇంటెలిజెన్స్ సహకారాలన్నింటినీ రద్దు చేస్తున్నట్టు పాకిస్థాన్ ప్రకటించింది. అమెరికా తమకు సైనిక సహకారాన్ని నిలిపివేయడం ఏమంత ప్రాముఖ్యమైన విషయం కాదని మంగళవారం పాక్ రక్షణ మంత్రి ఖుర్రం దస్తగిర్ ఖాన్ అన్నట్టు ది న్యూస్ ఇంటర్‌నేషనల్ ప్రచురించింది.

గల్ఫ్‌కు వెళ్లాలంటే ధ్రువీకరణ ఇవ్వాల్సిందే

ఉపాధి కోసం వెళ్లే వారికి ఇది తప్పనిసరి.. యూఏఈ అనూహ్య నిర్ణయం.. ఫిబ్రవరి 4 నుంచి అమలు

ఆంధ్రజ్యోతి గల్ఫ్ ప్రతినిధి: ఉపాధి కోసం గల్ఫ్ దేశాలకు వచ్చే వారు ఇకపై విధిగా తమ ప్రవర్తనకు సంబంధించిన ధ్రువీకరణ పత్రాన్ని సమర్పించాలని యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ) సంచలన నిర్ణయం తీసుకుంది. దుబాయి, షార్జా, అబుదాబి ఇతర గల్ఫ్ దేశాలకు ప్రతినిత్యం వేల సంఖ్యలో భారతీయులు ఉద్యోగ వీసాలపై వస్తుంటారు. వీరిలో కొంత మంది నేరచరిత్ర కలిగి ఉండడం, క్రిమినల్ కేసులు నమోదై ఉండడంతో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నట్లు యూఏఈ ప్రకటించింది. ఫిబ్రవరి 4 నుంచి దీన్ని అమలు చేస్తామని వెల్లడించింది. ఇందుకు సంబంధించిన విధివిధానాలను ఇంకా ప్రకటించాల్సి ఉంది. పర్యాటక, వ్యాపార ఇతర రకాల వీసాలపై వచ్చేవారికి ధ్రువీకరణ పత్రం అవసరం లేదని తేల్చిచెప్పింది. వాస్తవానికి పాస్‌పోర్టు కార్యాలయం ద్వారా పోలీసులు జారీ చేసే క్లియరెన్స్ సర్టిఫికెట్‌ను ప్రవర్తనా సర్టిఫికెట్‌గా వ్యవహరిస్తారు.

తప్పని భారీ వడపోత

ఉపాధి వీసాలపై దుబాయి, షార్జా నగరాలకు తెలుగు రాష్ట్రాల నుంచి వచ్చే వారు ఇకపై పీసీసీ కోసం పాస్‌పోర్టు కార్యాలయాలు, పోలీసుల చుట్టూ తిరగాల్సి ఉంటుంది. సాధారణ నేరాలతో పాటు తీవ్ర నేరాలకు పాల్పడిన వారు వీసాలపై వచ్చి ఇక్కడి వచ్చి ఇక్కడ ఉద్యోగాలు చేస్తుంటారు. అయితే వివిధ రాష్ట్రాల నుంచి గల్ఫ్ దేశాలకు పోలీసులు పంపే నివేదికలు అధ్యయనం చేసి కేంద్రసంస్థలు భారతీయ దౌత్య కార్యాలయాలకు పంపడం ఎక్కువైంది. దీనిని దృష్టిలో ఉంచుకుని పై విధానాన్ని అమలు చేయాలని యూఏఈ నిర్ణయించింది.

సివిల్స్ మెయిన్స్ ఫలితాలు విడుదల

ఫిబ్రవరి 19 నుంచి ఇంటర్వ్యూలు

న్యూఢిల్లీ, జనవరి 10: సివిల్ సర్వీసుల మెయిన్స్ పరీక్షా ఫలితాలను యూపీఎస్సీ బుధవారం విడుదల చేసింది. మెయిన్స్‌లో అర్హత సాధించిన అభ్యర్థుల వివరాలను www.upsc.gov.in వెబ్‌సైట్‌లో పొందుపరిచినట్లు వెల్లడించింది. ఎంపికైన అభ్యర్థులకు ఫిబ్రవరి 19 నుంచి ఇంటర్వ్యూలు నిర్వహిస్తారు. జనవరి 18 నుంచి ఇంటర్వ్యూ కాల్ లెటర్లను డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. క్వాలిఫై కాని అభ్యర్థుల మార్కుల పత్రాలను తుది ఫలితాలు విడుదలైన 15 రోజుల లోపు వెబ్‌సైట్‌లో పొందుపరుస్తారు.

ఐస్ ఏజ్ 6.0!

సహారా ఎడారిలో మంచు.. అమెరికాలో పలు రాష్ట్రాలు గజగజ



- స్విస్ రిసార్ట్‌లో గడ్డకట్టిన రైలు
- చిక్కుకున్న 13 వేల మంది పర్యాటకులు
- ప్రపంచవ్యాప్తంగా పలు దేశాల్లో
- గణనీయంగా తగ్గిపోతున్న ఉష్ణోగ్రతలు
- చాలా చోట్ల మైనస్ డిగ్రీల నమోదు



సహారా ఎడారిలో మంచు, (ఇన్‌సెట్‌లో) స్విస్ ఆల్ప్స్ పర్వతాల్లోని ఓ రిసార్ట్‌ను మంచు కప్పేసిన దృశ్యం

ఎడారిలో మంచు కురుస్తుందా? కురిసింది. ఇటీవలే సహారా ఎడారిలో కురిసింది. అల్జీరియాలోని ఎర్రటి ఇసుక దిబ్బల్ని తెల్లటి మంచు కమ్మేసింది!! అటు అమెరికాలోని కొన్ని రాష్ట్రాలు మైనస్ డిగ్రీల చలితో అల్లాడిపోతున్నాయి. అక్కడి నదులు, సరస్సులు అన్నీ గడ్డకట్టిపోయాయి. అల్లంత ఎత్తు నుంచి అధాట్టున దూకే నయాగరా జలపాతం సైతం మంచుముద్దగా మారి స్తంభించిపోయింది. ఆ చలిగాలులు అటు క్యూబా దాకా కొడుతున్నాయి. స్విట్జర్లాండ్‌లోని ఆల్ప్స్ పర్వతాల్లో ఏకంగా రైలే మంచు గడ్డలా మారిపోయి.. అక్కడి రిసార్టులో 13 వేల మంది చిక్కుకుపోయారు. తడవకు కొంత మంది చొప్పున వారిని హెలికాప్టర్లలో తరలిస్తున్నారు. పాశ్చాత్య దేశాల సంగతి పక్కన పెడితే.. మన పొరుగునే ఉన్న బంగ్లాదేశ్‌లో 70 ఏళ్ల కనిష్ఠ ఉష్ణోగ్రత ఈ ఏడాది నమోదయింది. మనదేశంలోనూ శ్రీనగర్‌లో మైనస్ 6 డిగ్రీలు, లెహ్‌లో మైనస్ 15.6 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. మొత్తమ్మీద గతంలో వచ్చిన ఐదు మంచు యుగాల్లాగా మరో మంచు యుగం ముంచుకొస్తోందా? అన్న ఆందోళన వ్యక్తమవుతోంది. 2021 నాటికి చలి మరింత పెరిగిపోతుందని కొందరు శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నారు. పెరిగిపోతున్న భూతాపమే ఇందుకు కారణమని కొందరు అంటుంటే.. దానికీ దీనికీ సంబంధం లేదని మరికొందరు శాస్త్రవేత్తలు అంటున్నారు. ఉత్తరార్ధ గోళం నుంచి వచ్చే చలిగాలులే ఈ వాతావరణానికి కారణమని వారు వివరిస్తున్నారు. మరికొందరు శాస్త్రవేత్తలు మాత్రం.. నిర్ణీత కాలావధిలో సూర్యుడిలో వచ్చే మార్పుల ఫలితమే ఈ గడ్డకట్టించే వాతావరణం అని వెల్లడిస్తున్నారు.



వరద.. బురద.. కాలిఫోర్నియాలో 13 మంది మృతి

లాస్‌ఏంజెల్స్, జనవరి 10: గత నెలలో వరుస కార్చిచ్చులతో వణికిపోయిన కాలిఫోర్నియాపై.. ఇప్పుడు వరదల రూపంలో మరో ప్రకృతి విపత్తు విరుచుకుపడింది. సీజన్‌లో తొలిసారిగా కురుస్తున్న వర్షాలు పసిఫిక్ తీరంలో బీభత్సం సృష్టిస్తున్నాయి. ఆకస్మిక వరదల కారణంగా శాంటా బర్బరా సహా పలు ప్రాంతాల్లో కొండలపై నుంచి భారీగా బురద, బండరాళ్లు కొట్టుకొచ్చి జనావాసాలపై పడ్డాయి. బురదలో చిక్కుకొని 13 మందికి పైగా చనిపోగా, 25 మందికిపైగా గాయపడ్డారు. సహాయక సిబ్బంది మరో 50 మందిని రక్షించారు. మిగతావారి కోసం గాలింపు కొనసాగుతోంది.

ఆయనేం దేవుడు?

- హుండీనే కాపాడుకోలేడు.. భక్తులనేం కాపాడతాడు?
- వెంకన్నకు శక్తులుంటే భద్రత ఎందుకు?
- మతాలన్నీ మనుషులను విడదీసేవే!
- డీఎంకే ఎంపీ కనిమొళి వ్యాఖ్యలు



చెన్నై, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): "తిరుమల వేంకటేశ్వరుడు కోటీశ్వరులకే దేవుడు. పేదవారు ఆయన్ను దర్శించుకోవాలంటే పడిగాపులు కాయాల్సిందే. తన హుండీనే కాపాడుకోలేని ఆయన భక్తులనెలా కాపాడతాడు? తిరుమలేశుడికి శక్తులే ఉంటే ఆయనకు భద్రత ఎందుకు?"... ఇవి డీఎంకే ఎంపీ కనిమొళి సంధించిన ప్రశ్నలు! ఇటీవల తిరుచ్చిలో జరిగిన 'నాస్తిక సమాజం మహానాడు'లో కనిమొళి ఏడుకొండలవాడిపై తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ప్రపంచంలో ఉన్న అన్ని మతాలూ మానవులను విడగొడుతున్నాయని, నాస్తికవాదమే మానవ జాతి కలిసి ఉండేలా చేస్తుందని తెలిపారు. మహిళలను బానిసలుగా మార్చేలా మతాలు ఉసిగొల్పుతున్నాయని, ప్రపంచ యుద్ధాల కంటే మతాల వల్లే చిందిన రక్తమే అధికమని కనిమొళి అన్నారు. జాతి, మత ఘర్షణలు, వాదాలను నిర్మూలించాలంటే మానవతావాదాన్ని, నాస్తికవాదాన్ని వ్యాపింపజేయాలని ఆమె పిలుపునిచ్చారు. వెంకన్నపై కనిమొళి చేసిన వ్యాఖ్యలపై హిందూమక్కల్ కట్చి మండిపడింది. పార్టీ రాష్ట్ర కార్యదర్శి శివ ఆమెపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆమె కోట్లాది మంది హిందువుల మనోభావాలను దెబ్బతీసేలా ఉన్నాయని మండిపడ్డారు. జాతీయ భద్రత చట్టం కింద ఆమెను అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు.

చనిపోయేందుకు అనుమతివ్వండి

- రాష్ట్రపతి కోవింద్‌కు ముంబై వృద్ధ దంపతుల అర్జీ
- పిల్లలు లేరు.. తోబుట్టువులు చనిపోయారు
- బతకడం వల్ల ఎవరికీ ఉపయోగం లేదని ఆవేదన



ముంబై, జనవరి 10: "మేం బతకడం వల్ల మాకు గానీ సమాజానికి గానీ ఎలాంటి ఉపయోగం లేదు. అందుకే, మేం చనిపోవాలని నిర్ణయించుకున్నాం. అందుకు మాకు అనుమతివ్వండి".. ముంబైకి చెందిన నారాయణ్ లవాటే (88), ఐరావతి (78) అనే వృద్ధ దంపతులు రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్‌కు పెట్టుకున్న అర్జీ ఇదీ! వారికి ఏవైనా అనారోగ్య సమస్యలు పట్టి పీడిస్తున్నాయా? అంటే అదీ లేదు. ఇద్దరూ పూర్తి ఆరోగ్యంగా ఉన్నారు. ఇంట్లో తమ పనులను తామే స్వయంగా చేసుకుంటున్నారు. అయితే, వారికి పిల్లలు లేరు. తోబుట్టువులు చనిపోయారు. ఈ నేపథ్యంలో.. తమకు ఇంకా బతకాలనే ఆశ లేదని, వృద్ధాప్య సమస్యలతో అనారోగ్యానికి గురయ్యే దాకా బతకడమూ సమంజసం కాదని భావిస్తున్నట్టు వారు పిటిషన్‌లో కోరారు. ఉరివేసుకొని, లేదంటే భవంతిపై నుంచి దూకి ప్రాణాలు తీసుకోవచ్చని, అలా చేస్తే చనిపోతామనే గ్యారంటీ లేదన్నారు. అందుకే.. చట్టబద్ధమైన పద్ధతిలో ఐచ్ఛిక మరణానికి (యాక్టివ్ యుథనేసియా), లేదంటే వైద్యుల సాయంతో ఆత్మహత్య (అసిస్టెట్ సూసైడ్)కు అనుమతివ్వాలని ఈ మేరకు గత నెల డిసెంబరు 21న పెట్టుకున్న అర్జీలో రాష్ట్రపతిని కోరారు. నారాయణ్.. మహారాష్ట్ర ఆర్టీసీలో పనిచేసి 1989లో రిటైరయ్యారు. ఆయన భార్య ఐరావతి గతంలో ఓ స్కూల్ ప్రిన్సిపాల్‌గా పనిచేశారు. ఈ దంపతులు దక్షిణ ముంబైలోని చార్నీ రోడ్‌లో ఉంటున్నారు. ఈ సందర్భంగా నారాయణ్ మాట్లాడుతూ.. ఇష్టపూర్వకంగా తనువును చాలించాలనే వారి కోసం స్విట్జర్లాండ్‌లో డిగ్నిటాస్ అనే సంస్థ ఉందని, అందులో తాను, తన భార్య సభ్యులమన్నారు. ఆత్మహత్య చేసుకోవాలనుకునేవారికి అక్కడి వైద్యులు ఎలాంటి చార్జీలు లేకుండా సహకరిస్తారన్నారు. అయితే, పాస్‌పోర్టు లేని కారణంగా తాము అక్కడికి వెళ్లలేని పరిస్థితి నెలకొందన్నారు. మరణశిక్షను ఎదుర్కొంటున్న వారికి ప్రాణభిక్ష పెట్టే అధికారం రాష్ట్రపతికి ఉంటుందని, ఆయన అదే విచక్షణాధికారంతో జీవితాలను ముగించే ందుకు అనుమతివ్వాలని కోరారు. మరణానంతరం శరీరాలను దానం చేయాలని, తర్వాత తమ ఆస్తిని రాష్ట్ర ఖజానాకు స్వాధీన పరచాలని తాము ఇప్పటికే నిర్ణయించుకున్నామని ఆయన తెలిపారు.

ప్రతిభ ఉంటేనే వీసా!

లాటరీ విధానం రద్దు: ట్రంప్

వాషింగ్టన్, జనవరి 10: ప్రతిభ ఆధారిత వలస విధానాన్ని అమలు చేస్తామని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పునరుద్ఘాటించారు. 'ఆస్ట్రేలియా, కెనడాలో ప్రస్తుతం అమలవుతున్న ప్రతిభ ఆధారిత వలస విధానాన్ని అమెరికాలోనూ అమలు చేస్తాం. అత్యుత్తమ ప్రతిభావంతులను మాత్రమే దేశంలోకి అనుమతిస్తాం.' అని ట్రంప్ స్పష్టం చేశారు. అమెరికాలో ఉంటున్న ఓ వ్యక్తిని ఆసరాగా చేసుకుని అతని కుటుంబసభ్యులు అందరూ అమెరికాకు వచ్చే చైన్ మైగ్రేషన్ విధానానికి ముగింపు పలకనున్నట్లు ట్రంప్ ప్రకటించారు. వీసాల కేటాయింపులో లాటరీ విధానానికీ స్వస్తి పలుకుతామన్నారు. వైట్ హౌస్‌లో రెండు పార్టీల కాంగ్రెస్ సభ్యులతో ట్రంప్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ట్రంప్ నిర్ణయాలకు పలువురు కాంగ్రెస్ సభ్యులు మద్దతు పలికారు. కాగా చిన్నతనంలోనే అమెరికాకు వెళ్లి అక్కడే ఉపాధి పొందుతున్న వారికి సంబంధించిన డిఫర్డ్ యాక్షన్ ఫర్ చైల్డ్‌హుడ్ అరైవల్స్(డీఏసీఏ) ప్రోగ్రాంను రద్దు చేస్తూ ట్రంప్ సర్కార్ తీసుకున్న నిర్ణయాన్ని యూఎస్ డిస్ట్రిక్ట్ జడ్జి అడ్డుకున్నారు. కాగా, దావోస్‌లో 22 నుంచి జరగనున్న ప్రపంచ ఆర్థిక సదస్సులో ట్రంప్, మోదీ హాజరు కానున్నారు. ఈ సందర్భంగా వారు భేటీ అయ్యే అవకాశం ఉంది.

భారతీయుడిని తిప్పి పంపిన అమెరికా

అక్రమంగా అమెరికా పౌరసత్వం పొందారని ఆరోపణలు ఎదుర్కొంటున్న బల్జీందర్ సింగ్ అలియాస్ దేవిందర్ సింగ్‌ను అమెరికా ప్రభుత్వం ఇండియాకు తిప్పి పంపింది. 1991లో బల్జీందర్ సింగ్ ఎలాంటి పత్రాలు లేకుండా అమెరికాలోకి ప్రవేశించారు. అనంతరం స్థానిక యువతిని పెళ్లి చేసుకొని పౌరసత్వం పొందారు. నిబంధనలకు విరుద్ధంగా అమెరికాలోకి ప్రవేశించడమే కాకుండా పౌరసత్వం పొందడంపై ఇమ్మిగ్రేషన్ అధికారులు బల్జీందర్‌ను తిప్పి పంపారు

పీఎస్ఎల్‌వీ-సీ40కి గ్రీన్‌సిగ్నల్

- నేటి ఉదయం నుంచి కౌంట్‌డౌన్
- రేపు ఉదయం 9.29కి ప్రయోగం



ప్రయోగ వేదికపై సిద్ధంగా ఉన్న పీఎస్ఎల్వీ-సీ40 రాకెట్


శ్రీహరికోట (సూళ్లూరుపేట), జనవరి 10: పీఎస్ఎల్‌వీ-సీ40 ప్రయోగానికి పచ్చజెండా లభించింది. మూడు స్వదేశీ, 28 విదేశీ ఉపగ్రహాలతో 42వ సారి రోదసి యానానికి ఈ రాకెట్ సిద్ధమైంది. నెల్లూరు జిల్లాలోని షార్ కేంద్రంలో ఉన్న ప్రథమ ప్రయోగ వేదిక నుంచి శుక్రవారం ఉదయం 9.29 గంటలకు రాకెట్ నింగిలోకి దూసుకుపోనుంది. ఈ ప్రయోగం కోసం బుధవారం షార్‌లో జరిగిన మిషన్ రెడీనెస్ రివ్యూ సమావేశంలోను, షార్ డైరెక్టర్ కున్హికృష్ణన్ ఆధ్వర్యంలో లాంచ్ ఆథరైజేషన్ బోర్డు సమావేశంలోనూ శాస్త్రవేత్తలు ప్రయోగానికి పచ్చజెండా ఊపారు. ఈ ప్రయోగం కోసం గురువారం ఉదయం 5.29 గంటలకు కౌంట్‌డౌన్ ప్రారంభం అవుతుంది. ఆ సమయంలో రిమోట్ ద్వారా రాకెట్‌లోని రెండు, నాలుగు దశల మోటార్లకు ద్రవ ఇంధనం నింపుతారు. 1, 3 దశల ఇంజన్లు ఘన ఇంధనంతో పని చేస్తాయి. శుక్రవారం ఉదయం 9.29 గంటలకు రాకెట్‌ను ప్రయోగించనున్నారు.

ఇవీ ఉపగ్రహాలు

మన దేశానికి చెందిన 710 కిలోల భూ పరిశీలన ఉపగ్రహం కార్టోశాట్-2ఈఆర్‌తో పాటు 100 కిలోల మైక్రోశాట్, 11 కిలోల నానో ఉపగ్రహాలను ఈ రాకెట్ రోదసిలో విడిచిపెట్టనుంది. అలాగే కెనడా, ఫిన్‌లాండ్, ఫ్రాన్స్, యూకేలకు చెందిన ఒక్కో నానో ఉపగ్రహాన్ని, రిపబ్లికన్ ఆఫ్ కొరియాకు చెందిన 5, అమెరికాకు చెందిన 19 నానో ఉపగ్రహాలను ఈ రాకెట్ ద్వారా వివిధ కక్ష్యల్లోకి ప్రవేశపెడతారు. ఈ 28 విదేశీ ఉపగ్రహాలు 420 కిలోలు బరువుకలిగి ఉన్నాయి.

కేంద్రీయ విద్యాలయాల్లో.. హిందూ ప్రార్థనాగీతమే ఎందుకు?

కేంద్రాన్ని ప్రశ్నించిన సుప్రీంకోర్టు



న్యూఢిల్లీ, జనవరి 10: కేంద్రీయ విద్యాలయాల్లో మైనార్టీ విద్యార్థులు, వారి తల్లిదండ్రుల మనోభావాలకు విరుద్ధంగా హిందూ ప్రార్థనాగీతాన్ని అనుమతించడంపై సమాధానమివ్వాలంటూ కేంద్ర ప్రభుత్వానికి సుప్రీం కోర్టు నోటీసులిచ్చింది. మధ్యప్రదేశ్‌కు చెందిన వీనాయక్ షా అనే వ్యక్తి ఈ మేరకు సుప్రీంకోర్టులో దాఖలు చేసిన పిటిషన్‌ను జస్టిస్ ఆర్ఎఫ్ నారిమన్, జస్టిస్ నవీన్ సిన్హాలతో కూడిన ధర్మాసనం బుధవారం స్వీకరించింది. వీనాయక్ తన పిటిషన్‌లో చేసిన అభియోగాలపై వైఖరేంటో తెలపాలని కేంద్ర ప్రభుత్వాన్ని ఆ నోటీసుల్లో కోరింది. 'సొంతం భగవంతుడు, హిందూ మతానికి సంబంధించిన ఈ ప్రార్థనాగీతం విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్కోణాన్ని దెబ్బతీసేలా ఉంది. దీంతోపాటు, ఇది మైనార్టీ వర్గాలు, నాస్తికుల భావాలకు విరుద్ధంగా ఉంది. ఈ ప్రార్థనను దేశంలోని అన్ని కేంద్రీయ విద్యాలయాల్లో ఉదయం వేళల్లో ఆలపిస్తున్నారు' అని వీనాయక్ తన పిటిషన్‌లో పేర్కొన్నారు. ఈ తరహా ప్రార్థనలు రాజ్యాంగ స్ఫూర్తికి, ఆర్టికల్ 28, 28 (1)లకు విరుద్ధమని పేర్కొన్నారు.

ఆధార్ లేకుంటే భారతీయుడు కాదా?: సుప్రీం

న్యూఢిల్లీ, జనవరి 10: ఆధార్ తప్పనిసరి అన్న ప్రభుత్వ నిర్ణయంపై ప్రజల్లో ఓ వైపు చర్చ జరుగుతుండగా సుప్రీంకోర్టు కొత్త ప్రశ్నను లేవనెత్తింది. నిలువ నీడలేని వాళ్లు ఆధార్ కార్డు పొందలేరని, అలాంటప్పుడు ప్రభుత్వం దృష్టిలో వాళ్లు భారతీయులు కాదా? అని సూటిగా ప్రశ్నించింది. చలి తీవ్రత పెరిగిన నేపథ్యంలో ఫుట్‌పాత్‌పై బతుకీడుస్తున్న నిర్భాగ్యులు గజగజ వణుకుతూ అనారోగ్యానికి గురవుతున్నారు. వారికి రాత్రిపూట ఆశ్రయం కల్పించేందుకు ఆధార్‌కార్డు గుర్తింపు తీసుకోవాలని నిర్ణయించినట్లు కోర్టుకు ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం తెలిపింది. దీంతో ఆధార్‌కార్డు పొందాలంటే నివాస స్థలం గుర్తింపును తెలపాలని, ఫుట్‌పాత్‌పై బతుకున్న వారికి స్థిరమైన నివాసమే లేనప్పుడు ఆధార్ ఎలా తీసుకోగలరని ప్రశ్నించింది.

సిక్కుల ఊచకోతపై కొత్తగా సిట్

న్యూఢిల్లీ, జనవరి 10: సిక్కుల ఊచకోతకు సంబంధించిన కేసులపై సుప్రీంకోర్టు సంచలన నిర్ణయం తీసుకుంది. మూసివేసిన 186 కేసులను సుప్రీంకోర్టు పర్యవేక్షణలోని ప్రత్యేక దర్యాప్తు బృందం(సిట్) మళ్లీ విచారించనుంది. ముగ్గురు సభ్యులుండే సిట్‌కు రిటైర్డ్ హైకోర్టు న్యాయమూర్తి నేతృత్వం వహిస్తారు. 1984లో అప్పటి ప్రధానమంత్రి ఇందిరాగాంధీ హత్య తర్వాత సిక్కులే లక్ష్యంగా ఊచకోతకు పాల్పడ్డారు. ఒక్క ఢిల్లీలోనే 2,733 మందిని అల్లరిమూకలు పొట్టనపెట్టుకున్నాయి. 250 కేసులు నమోదు కాగా అందులో 186 కేసులను ఎలాంటి విచారణ చేపట్టకుండానే మూసివేశారు. ఇలా మూసివేసిన కేసులను సిట్ తిరిగి విచారించనుంది. ప్రత్యేక దర్యాప్తు బృందంలో రిటైర్డ్ హైకోర్టు జడ్జితోపాటు డీఐజీ ర్యాంకకు తగ్గకుండా రిటైర్ అయిన పోలీసు అధికారి ఒకరు, అలాగే సర్వీసులో ఉన్న మరో పోలీసు ఉన్నతాధికారి సభ్యులుగా ఉంటారు.

కార్తీ చిదంబరం కేసు నుంచి వైదొలగిన సీజేఐ

న్యూఢిల్లీ, జనవరి 10: ఎయిర్‌సెల్-మాక్సిస్ ఒప్పందం కేసులో తమ ఆస్తులను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) జప్తు చేయడాన్ని సవాల్ చేస్తూ.. కేంద్ర మాజీ మంత్రి పి.చిదంబరం కుమారుడు కార్తీ చిదంబరం, మరో రెండు సంస్థలు దాఖలు చేసిన పిటిషన్లపై విచారణ నుంచి భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ దీపక్ మిశ్రా వైదొలిగారు. 2జీ స్పెక్ట్రమ్ కేటాయింపుల కేసుకు సంబంధించిన ఈ పిటిషన్లు బుధవారం ఆయన, జస్టిస్ ఏఎం ఖన్విల్కర్, జస్టిస్ వైవీ చంద్రచూడ్‌లతో కూడిన ధర్మాసనం ముందుకు వచ్చాయి. ఈ కేసును తాను ఢిల్లీ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా ఉండగా విచారించానని.. ఇప్పుడీ పిటిషన్లను విచారించదలచుకోలేదని ప్రధాన న్యాయమూర్తి పేర్కొన్నారు. వీటిని జస్టిస్ అరుణ్ మిశ్రా నేతృత్వంలోని వేరే ధర్మాసనానికి బదిలీచేశారు.

ప్రీమియర్ బ్యాడ్మింటన్ లీగ్
హైదరాబాద్ హంటర్స్ X బెంగళూరు బ్లాస్టర్స్
(రా. 7.00 నుంచి)

ప్రో రెజ్లింగ్ లీగ్
పంజాబ్ రాయల్స్ X యూపీ దంగల్
(రా. 7 నుంచి)

సయ్యద్ ముస్తాక్ అలీ టీ-20 ట్రోఫీ
హైదరాబాద్ X కర్ణాటక
(ఉదయం 9 నుంచి)
ఆంధ్రప్రదేశ్ X కేరళ
(మధ్యాహ్నం 1 నుంచి)


ఆంచల్ ఠాకూర్

మంచు ముత్యం.. ఆంచల్

అంతర్జాతీయ స్కీయింగ్‌లో భారత్‌కు తొలి పతకం



న్యూఢిల్లీ: స్కీయింగ్.. దేశ క్రీడాభిమానులకు పెద్దగా పరిచయంలేని ఆట. ఇది వింటర్ గేమ్స్‌కు సంబంధించిన క్రీడ. వింటర్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (డబ్ల్యూజీఎఫ్ఐ) ఉన్నా దానికి క్రీడా మంత్రిత్వ శాఖ తోడ్పాటు లేదు. అలాంటి స్కీయింగ్‌లో చండీగఢ్‌కు చెందిన 21 ఏళ్ల ఆంచల్ ఠాకూర్ చరిత్ర సృష్టించింది. టర్కీలో జరిగిన ప్రతిష్ఠాత్మక 'ఆల్పైన్ ఎజెర్ 3200 కప్' అంతర్జాతీయ టోర్నీలో కాంస్య పతకం గెలుపొందింది. అంతర్జాతీయ స్కీయింగ్ సమాఖ్య (ఎఫ్ఐఎస్) నిర్వహించిన ఈ చాంపియన్‌షి‌ప్‌లో స్లాలోమ్ రేస్ విభాగంలో ఆంచల్ మూడోస్థానంలో నిలవడం ద్వారా ఈ క్రీడలో భారత్‌కు తొలి అంతర్జాతీయ పతకం అందించింది. దేశంలో వింటర్ స్పోర్ట్స్‌కు స్థానం లేని నేపథ్యంలో ఆంచల్ ఠాకూర్ సాధించింది గొప్ప ఘనతగా చెప్పాలి. ఆంచల్ తండ్రి రోషన్. డబ్ల్యూజీఎఫ్ఐ సెక్రటరీ జనరల్ కావడంతో కూతురు ఆంచల్‌తోపాటు కుమారుడు హిమాన్షును స్కీయింగ్ దిశగా ప్రోత్సహించారు.

2022 వింటర్ గేమ్స్ లక్ష్యం

తన తదుపరి లక్ష్యం దక్షిణకొరియాలోని పాంగ్యాంగ్‌లో వచ్చే నెలలో జరిగే వింటర్ ఒలింపిక్స్‌కు అర్హత సాధించడమేనని ఆంచల్ చెప్పింది. ఆమె సోదరుడు హిమాన్షు ఆ క్వాలిఫికేషన్ మార్క్‌కు దగ్గరలోనే ఉన్నా..ఆంచల్ అర్హత సాధించడం ఒకింత కష్టంగా ఉంది. 'ఒలింపిక్స్‌కు అర్హత పొందాలంటే ఐదు రేసుల్లో 140కంటే తక్కువ పాయింట్లు దక్కించుకోవాల్సి ఉంటుంది. నేను ఒక రేసులో కూడా అవి సాధించలేదు. టర్కీ రేసులో పరిస్థితులు సవాలు విసిరాయి. అక్కడ స్వర్ణ పతకం నెగ్గిన స్కీయర్ స్కోరుకూడా 140 దాటడంతో ఆమె కూడా పాంగ్యాంగ్‌కు అర్హత పొందలేకపోయింది' అని ఆంచల్ వివరించింది. ఒలింపిక్స్ క్వాలిఫయింగ్‌కు ఈనెల 21 కటాఫ్ తేదీ. 'నా సోదరుడు, నేను ఐస్‌లాండ్ టోర్నీలో పోటీపడుతున్నాం. ఆ తర్వాత ఇరాన్, పాకిస్థాన్‌లో రేసులున్నాయి. పాక్‌లో రేస్‌లో పాల్గొనేందుకు వీసా లభిస్తుందో లేదో చూడాలి. మొత్తంగా పాంగ్యాంగ్ వింటర్ గేమ్స్ అవకాశాలు లేనట్టే. కానీ నేను ఇప్పటికే 2022 వింటర్ ఒలింపిక్స్ ధ్యేయంగా పెట్టుకొన్నా' అని ఆంచల్ వెల్లడించింది.

ప్రధాని మోదీ అభినందన

పతకం గెలిచిన ఆంచల్‌ను ప్రధాని నరేంద్ర మోదీ అభినందించారు. 'ప్రధాని నన్ను అభినందిస్తూ ట్వీట్ చేస్తారని ఊహించలేదు. ఎట్టకేలకు దేశంలోని ఇతర ప్రముఖ క్రీడాకారుల మాదిరే మమ్మల్ని గుర్తించడం గర్వంగా ఉంది' అని ఆంచల్ స్పందించింది. ఏడో తరగతినుంచే ఆమె యూరప్‌లో శిక్షణ పొందుతోంది. తనకు, తన సోదరుడి శిక్షణకు తండ్రి ఎంతో ఖర్చు భరిస్తున్నాడని వెల్లడించింది. జమ్మూ కశ్మీర్‌లోని గుల్మార్గ్, ఉత్తరాఖండ్‌లోని ఔలీ స్కీయింగ్‌కు అద్భుత ప్రదేశాలని ఆంచల్ తండ్రి రోహన్ చెప్పారు. కానీ పోటీల సమయంలో తప్ప మిగిలిన కాలంలో ఆ ప్రాంతాలను పట్టించుకోరని వెల్లడించారు. అందువల్ల అక్కడ శిక్షణకు అవకాశం ఉండదని వివరించారు.



నిఖత్‌కు పతకం ఖాయం

రోహ్‌తక్: తెలంగాణ బాక్సర్ నిఖత్ జరీన్ జాతీయ మహిళల బాక్సింగ్ చాంపియన్‌షి‌ప్‌లో అదరగొడుతోంది. జూనియర్ ప్రపంచ మాజీ చాంపియన్ అయిన నిఖత్ 51 కిలోల విభాగంలో సెమీఫైనల్ చేరి పతకాన్ని ఖాయం చేసుకుంది. బుధవారం జరిగిన క్వార్టర్స్ బౌట్‌లో నిఖత్ 5-0తో చత్తీస్‌గఢ్‌కు చెందిన ఆభాపై గెలిచింది. సెమీస్‌లో హరియాణా అమ్మాయి రీతూతో నిఖత్ తలపడనుంది. సెమీస్‌లో ఓడినా నిఖత్‌కు కాంస్య పతకం దక్కుతుంది.

లంకపై భారత్ భారీ విజయం



యూఏఈ: అంధుల క్రికెట్ ప్రపంచ కప్‌లో భాగంగా బుధవారం శ్రీలంకతో జరిగిన మ్యాచ్‌లో భారత్ 6వికెట్ల తేడాతో గెలిచింది. హరియాణాకు చెంది న దీపక్ మాలిక్ (103 బంతుల్లోనే 179 నాటౌట్) అద్భుత సెంచరీ చేసి భారత్ విజయంలో కీలక పాత్ర పోషించాడు. తొలుత లంక నిర్ణీత 40 ఓవర్లలో 8 వికెట్లకు 358 పరుగులు చేసింది. ఆ జట్టులో సురంగ సంపత్ (68), సిల్వ (64) అర్ధసెంచరీలతో రాణించారు. భారత బౌలర్ సునీల్ రమేష్ 3వికెట్లు పడగొట్టాడు. లక్ష్యఛేదనలో దీపక్ అజేయ సెంచరీతో విజృంభించడంతో భారత్ 32 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి గెలిచింది. ప్రకాష్ జయరామయ్య (76) అర్ధ సెంచరీ చేశాడు.

జూనియర్ ద్రావిడ్ సెంచరీ



బెంగళూరు: టీమిండియా దిగ్గజం రాహుల్ ద్రావిడ్ కుమారుడు సమిత్ కూడా తండ్రి బాటలోనే క్రికెటర్‌గా ఎదుగుతున్నాడు. కర్ణాటక క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన బీటీఆర్ కప్ అండర్-14 అంతర పాఠశాలల టోర్నీలో సమిత్ సెంచరీ (150) కొట్టి అంద రినీ ఆకట్టుకున్నాడు. వివేకానంద స్కూల్‌తో జరిగిన ఈ మ్యాచ్‌లో సమిత్ భారీ శతకం సాధించ డంతో అతని జట్టు మాల్య అదితి ఇంటర్నేషనల్ స్కూల్ 412 పరుగుల భారీ తేడాతో గెలిచింది. మాజీ స్పిన్నర్ సునీల్ జోషి తనయుడు ఆర్యన్ (154) కూడా మ్యాచ్ విన్నింగ్ ఇన్నింగ్స్ ఆడాడు. సమిత్-ఆర్యన్ కదం తొక్కడంతో మాల్యా స్కూల్ 50 ఓవర్లలో 500 పరుగుల భారీ స్కోరు చేసింది. ప్రతిగా వివేకానంద స్కూల్ 88 పరుగులకే కుప్పకూలింది.

ఐర్లాండ్ టూర్‌కు టీమిండియా

న్యూఢిల్లీ: భారత క్రికెట్ జట్టు పదేళ్ల తర్వాత తొలిసారి ఐర్లాండ్‌లో పర్యటించనుంది. ఈ ఏడాది జూలైలో మొదలయ్యే ఇంగ్లండ్ పర్యటనకు ముందు కోహ్లీసేన ఐర్లాండ్‌కు వెళ్లి ఆ జట్టుతో రెండు టీ20 మ్యాచ్‌లు ఆడనుంది. జూన్ 27, 29న డబ్లిన్ వేదికగా ఈ రెండు టీ20లు జరుగుతాయి. ఇప్పటిదాకా ఐర్లాండ్‌తో ఒకేఒక్క అంతర్జాతీయ టీ20 మ్యాచ్‌లో భారత్ తలపడింది. 2009 టీ20 ప్రపంచకప్‌లో ఇరుజట్ల మధ్య ఆ మ్యాచ్ జరిగింది. ఐర్లాండ్‌తో మ్యాచ్‌లు ముగిసిన వెంటనే, భారత్ అటునుంచే సుదీర్ఘ సిరీస్ కోసం ఇంగ్లండ్‌కు వెళ్లనుంది.

మిథాలీకే పగ్గాలు

సఫారీ టూర్‌లో జమీమాకు చోటు


జమీమా

న్యూఢిల్లీ: వచ్చేనెలలో జరిగే దక్షిణాఫ్రికా టూర్‌కు మహిళల జట్టు కెప్టెన్‌గా మిథాలీ రాజ్ వ్యవహరించనుంది. 16 మంది సభ్యుల జట్టును బీసీసీఐ బుధవారం ప్రకటించింది. హర్మన్‌ప్రీత్ కౌర్ వైస్‌కెప్టెన్‌గా ఎంపికైంది. ముంబైకి చెందిన 17ఏళ్ల జమీమా రోడ్రిగ్స్‌కు భారత జట్టులో తొలిసారిగా చోటుదక్కింది. మిథాలీ (16ఏళ్లు) తర్వాత జాతీయజట్టుకు ఎంపికైన పిన్నవయస్కురాలిగా జమీమా రికార్డు కెక్కింది. ఫిబ్రవరి 5 నుంచి మొదలయ్యే ఈ టూర్‌లో భారత్ 3 వన్డేలు, 5 టీ20లు ఆడనుంది.

హ్యాండ్‌బాల్ చాంప్స్ రంగారెడ్డి, ఖమ్మం


రంగారెడ్డి జట్టు

జనగామ టౌన్: జనగామ జిల్లా కేంద్రంలోని మినీ స్టేడియంలో మూడ్రోజుల క్రితం మొదలైన అండర్-17 రాష్ట్రస్థాయి పాఠశాల సమాఖ్య హ్యాండ్‌బాల్ పోటీలు బుధవారం ముగిశాయి. బాలుర ఫైనల్లో రంగారెడ్డి.. వరంగల్‌ను ఓడించి విజేతగా నిలిచింది. బాలికల టైటిల్‌పోరులో ఖమ్మం జట్టు.. ఆదిలాబాద్‌పై గెలిచి ట్రోఫీ అందుకుంది. ఈ టోర్నీ ద్వారా జాతీయస్థాయి పోటీలకు రాష్ట్ర జట్లను ఎంపికచేశారు.

అటు ముగ్గురు.. ఇటు వంద మంది

జపాన్‌లో క్రేజీ ఫుట్‌బాల్ మ్యాచ్

టోక్యో: 'ఒక్కొక్కరిని కాదు.. వంద మందిని ఒకేసారి రమ్మను' అనేది పాపులర్ సినిమా డైలాగ్. అయితే జపాన్‌లో ఓ క్రేజీ ఫుట్‌బాల్ మ్యాచ్‌లో ముగ్గురితో కూడిన ఓ జట్టుతో వంద మందితో ఉన్న టీమ్ పోటీ పడింది. కానీ, అంతిమంగా ముగ్గురున్న జట్టే గోల్ చేసి విజేతగా నిలిచింది. కొత్త సంవత్సరాన్ని పురస్కరించుకుని ఇక్కడ 100 మంది పాఠశాల విద్యార్థులతో ముగ్గురు ప్రొఫెషనల్ ప్లేయర్లు ఫ్రెండ్లీ మ్యాచ్ ఆడడం ఆనవాయితీగా వస్తోంది. ఈ నేపథ్యంలో జే1 లీగ్ స్టార్ ఫుట్‌బాలర్లు హొటారు యమగూచి, యోసుకే ఐడగూచి, హిరోషి కియోటకే ఓ జట్టుగా వంద మంది స్కూల్ పిల్లల జట్టుతో తలపడ్డారు. అయితే 40-40-20 ఫార్మాట్‌లో బాలురు చుట్టుముట్టినా.. మ్యాచ్‌లో ప్రొఫెషనల్ ప్లేయర్ల ఆధిపత్యమే కొనసాగింది. చిన్నోళ్లపై నుంచి ఐడగూచి బంతిని నెట్‌లోకి పంపాడు. అనుభవజ్ఞుడు సంధించిన ఆ బంతిని ఎలా అడ్డుకోవాలో తెలియని చిన్నారులు చూస్తూ ఉండిపోయారు.

బ్రాడ్‌మన్ రికార్డ్ బ్రేక్

అఫ్ఘాన్ క్రికెటర్ బహీర్ సంచలనం



న్యూఢిల్లీ: అంతర్జాతీయ క్రికెట్‌లో బుడిబుడి అడుగులు వేస్తున్న అఫ్ఘానిస్థాన్‌లో.. ఓ యువ ఆటగాడు సంచలనం సృష్టించాడు. ఏకంగా సర్ డొనాల్డ్ బ్రాడ్‌మన్ రికార్డు బద్దలుగొట్టాడు. అఫ్ఘాన్‌కు చెందిన 18 ఏళ్ల బహీర్ షా..ఏడు మ్యాచ్‌ల్లో 12 ఇన్నింగ్స్‌లో 121.77 సగటుతో 1096 పరుగులు చేశాడు. తద్వారా..ఫస్ట్‌క్లాస్ క్రికెట్‌లో బ్రాడ్‌మన్ సగటు 95.14 రికార్డును అతడు తిరగరాశాడు. స్పీన్ ఘర్ రీజియన్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్న షా తన తొలిమ్యాచ్‌లోనే అదరగొట్టాడు. అమో రీజియన్‌పై అజేయంగా 256 రన్స్ చేసి అరంగేట్ర ఫస్ట్‌క్లాస్ మ్యాచ్‌లో రెండో అత్యధిక స్కోరు చేసిన క్రికెటర్‌గా మరో రికార్డు నెలకొల్పాడు. ఈ జాబితాలో భారత మాజీ క్రికెటర్ అమోల్ మజుందార్ (260) అగ్రస్థానంలో ఉన్నాడు. రెండేళ్ల రెండు నెలల ఫస్ట్‌క్లాస్ కెరీర్‌లో షా ఇప్పటికే 5సెంచరీలు సాధించడం విశేషం. అంతేకాదు, ఐదు ఇన్నింగ్స్‌ల తర్వాత ట్రిపుల్ సెంచరీ కూడా కొట్టిన షా.. మియాందాద్ తర్వాత ఈ ఫీట్ చేసిన పిన్నవయసు క్రికెటర్‌గా ఘనత వహించాడు.


90 ఏళ్ల కెరీర్..106 ఏళ్లకు రిటైర్



పారిస్: ఫ్రాన్స్ సైక్లిస్ట్ రాబర్ట్ మర్చండ్ 106 ఏళ్ల వయస్సు లో ఆ క్రీడకు గుడ్‌బై చెప్పాడు. సైక్లింగ్ అంటే పడిచచ్చే అతడు గత ఏడాదే.. 105ఏస్ విభాగంలో 22.528 కి.మీ. (14.08 మైళ్లు) దూరాన్ని కేవలం గంటలో చేరుకుని అందరినీ ఆశ్చర్యపరిచాడు. అయితే చాలామంది ఈ సమయాన్ని ఆ వయో విభాగంలో వరల్డ్ రికార్డుగా భావిస్తారు. పారిస్‌లోని ఓ ఇండోర్ పార్క్‌లో జరిగిన ఆ పోటీ ప్రపంచవ్యాప్తంగా మీడియాను విశేషంగా ఆకర్షించింది. ప్రొఫెషనల్ సైక్లిస్ట్‌గా రాబర్ట్ 90 ఏళ్లకుపైగా కొనసాగడం మరో విశేషం.

సెమీస్‌కు ఢిల్లీ డాషర్స్

హంటర్స్, బెంగళూరు కూడా


సంగ్ జీ హ్యూన్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడా ప్రతినిధి): ప్రీమియర్ బ్యాడ్మింటన్ లీగ్ మూడో సీజన్‌లో మరో లీగ్ మ్యాచ్ మిగిలుండగానే సెమీఫైనల్ బెర్తులు ఖరారయ్యాయి. చివరి అంచెలో భాగంగా గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో బుధవారం జరిగిన మ్యాచ్‌లో ఢిల్లీ డాషర్స్ 4-1తో నార్త్ ఈస్టర్న్ వారియర్స్‌ను చిత్తుగా ఓడించింది. దాంతో, ఐదు మ్యాచ్‌ల్లో 15 పాయింట్లతో ఢిల్లీ సెమీస్‌కు చేరుకోగా.. నార్త్ ఈస్టర్న్ (12) ఆరో స్థానంతో టోర్నీని ముగించింది. అదే విధంగా గురువారం జరిగే చివరి మ్యాచ్‌లో తలపడే బెంగళూరు బ్లాస్టర్స్ (15), హైదరాబాద్ హంటర్స్ (14) దాని ఫలితంతో సంబంధం లేకుండా సెమీస్‌కు అర్హత సాధించాయి. అహ్మదాబాద్ (17) టాప్ ప్లేస్‌తో ఇప్పటికే నాకౌట్‌కు చేరుకుంది. కాగా, నార్త్ ఈస్టర్న్‌తో పోరులో ఢిల్లీకి శుభారంభం దక్కలేదు. మొదటిదైన మిక్స్‌డ్ డబుల్స్‌లో ఢిల్లీ జోడీ అశ్విని పొన్నప్ప-వ్లాదిమిర్ ఇవనోవ్ 13-15, 11-15తో లీ మిషెల్లీ-షిన్ బీక్ చేతిలో కంగుతిన్నది. అయితే, ఆ తర్వాత ఢిల్లీ గొప్పగా పుంజుకొని గెలుపొందింది.

పాఠాలు నేర్వాలి..!

(కృష్ణమాచారి శ్రీకాంత్)

మరో సువర్ణావకాశం టీమిండియా చేజారింది. పిచ్ నుంచి ఎటువంటి ప్రతికూలతలూ లేనప్పటికీ 208 పరుగుల ఛేదనలో కోహ్లీసేన కుదేలైంది. విదేశాల్లో పరిస్థితులు ఎప్పుడూ సవాళ్లు విసురుతుంటాయి. వాటిని సమర్థవంతంగా ఎదుర్కొనే స్థాయికి ఎదగాలి. కానీ మన టాపార్డర్ బ్యాట్స్‌మెన్ ఎలాంటి కారణం లేకుండానే ఆత్మరక్షణలో పడిపోయారు. అయితే పాండ్యా, అశ్విన్ ఎంతో పట్టుదలతో క్రీజులో

నిలిచి ప్రత్యర్థి బౌలర్లపై ఎదురుదాడి చేశారు. భువనేశ్వర్ రక్షణాత్మకంగా ఎలా ఆడాలో చూపించాడు. పేసర్లు అద్భుతంగా రాణించారు. 20 వికెట్లు కూల్చి జట్టుకు అనుకూల వాతావరణాన్ని సృష్టించారు. తొలి ఇన్నింగ్స్‌లో కొన్ని పరుగులు ఇచ్చినా.. రెండోఇన్నింగ్స్‌లో మాత్రం పక్కాగా బౌలింగ్ చేశారు. దక్షిణాఫ్రికా కూడా బౌలింగ్, బ్యాటింగ్‌లో భయంకరంగా ఏమీ లేదు. సిరీస్ నెగ్గడానికి భారత జట్టుకు ఇంకా అవకాశాలున్నాయి. తొలి టెస్టు ఓటమి నుంచి పాఠాలు నేర్చి పక్కాగా వ్యూహాలు అమలు చేస్తే కోహ్లీ అండ్ కో చరిత్ర సృష్టించే అవకాశం ఉంది. - (టీసీఎం)

హరియాణా శుభారంభం

న్యూఢిల్లీ: ప్రో రెజ్లింగ్ లీగ్‌లో హరియాణా హ్యామర్స్ శుభారంభం చేసింది. రియో ఒలింపిక్స్ స్వర్ణ పతక విజేత హెలెన్ మరోలిస్, హర్ఫూల్ తమ బౌట్లను నెగ్గడంతో హరియాణా 5-2తో వీర్ మరాఠాస్‌పై గెలిచింది. హరియాణా రెజ్లర్లు వ్లాదిమిర్ (57 కిలోలు), సరిత (50 కి), హర్ఫూల్ (65 కి), హెలెన్ మరోలిస్ (57 కి), కెతిక్ తషబొలేవ్ (74 కి) తమతమ బౌట్లలో నెగ్గారు.



ఇలా ఆరంభిస్తే ఎలా?


విజయ్
ధవన్

క్రికెట్‌లో శుభారంభాలు చాలా ముఖ్యం. టెస్టుల్లో అయితే మరింత కీలకం..! ఓపెనర్లు మెరుగ్గా ఆడి మంచి పునాది వేస్తే.. మిగతా బ్యాట్స్‌మెన్ స్వేచ్ఛగా ఆడగలుగుతారు..! అప్పుడు జట్టు విజయావకాశాలు మెరుగవుతాయి..! కానీ, సౌతాఫ్రికాతో మొదటి టెస్టులో భారత ఓపెనింగ్ ద్వయం తీవ్రంగా నిరాశ పరిచింది..! ధవన్-విజయ్ తొలి ఇన్నింగ్స్‌లో 16, రెండో ఇన్నింగ్స్‌లో 30 పరుగులు మాత్రమే జోడించడం జట్టును దెబ్బ తీసింది..! ఇప్పటికే రాహుల్‌ను కాదని ధవన్‌ను ఆడించడంపై విమర్శలు వస్తున్న నేపథ్యంలో సెంచూరియన్‌లో శనివారం మొదలయ్యే రెండో టెస్టులో కోహ్లీసేన ఓపెనింగ్ కాంబినేషన్ మార్పు తప్పదనిపిస్తోంది..!

(ఆంధ్రజ్యోతి క్రీడా విభాగం)

మొదటి టెస్టులో నాలుగో రోజు భారత్ కోల్పోయిన పది వికెట్లలో వెర్నాన్ ఫిలాండర్ ఆరింటిని ఖాతాలో వేసుకున్నాడు. బంతిని రెండు వైపులా స్వింగ్ చేయడంలో సిద్ధహస్తుడైన ఫిలాండర్‌కు టీమిండియా ఒక రకంగా దాసోహమైంది. అతనికి చిక్కిన ఆరుగురిలో ఇద్దరు టెయిలెండర్లు, ఒక బౌలింగ్ ఆల్‌రౌండర్ (అశ్విన్), తడబడిన ఓపెనర్ (మురళీ విజయ్), ఇద్దరు మిడిలార్డర్ ఆటగాళ్లు (కోహ్లీ, రోహిత్) ఉన్నారు. మొత్తంగా కెరీర్‌లో ఉత్తమ గణాంకాలు నమోదు చేసిన ఫిలాండర్ ఈ మ్యాచ్‌లో బెస్ట్ ఆటగాడిగా నిలిచాడు. ఊరించిన 208 పరుగుల స్వల్ప లక్ష్యఛేదనలో కోహ్లీసేన నడ్డి విరిచి.. జట్టు ఆశలపై నీళ్లు కుమ్మరించాడు. ఇప్పుడు రెండో టెస్టు జరిగే సెంచూరియన్ వైపు అందరూ చూస్తుండగా.. ఫిలాండర్ గురించి భారత మేనేజ్‌మెంట్‌లో చర్చ నడుస్తోంది. స్టెయిన్, రబాడ, మోర్నీ మోర్కెల్‌తో పోల్చితే ఈ సౌతాఫ్రికా పేసర్ తక్కువ వేగంతో బంతులు వేసి నా.. తనకు అనుకూలించే పరిస్థితుల్లో తక్కిన వారి కంటే అతను అత్యంత ప్రమాదకరమన్న విషయం గత మ్యాచ్‌తో అర్థమైంది. అయితే, సెంచూరియన్ పిచ్ పేస్‌కు అనుకూలించే కఠిన పిచ్‌గా భావిస్తున్నారు. కానీ, న్యూలాండ్స్‌లో ఇరు జట్ల బౌలర్లకు ఊతం ఇచ్చిన స్వింగ్ అక్కడ అంతగా ఉండబోదని సౌతాఫ్రికా మాజీ పేసర్ ఫానీ డివిల్లీర్స్ అంటున్నాడు. బ్యాటింగ్‌కు అనుకూలించే చిన్నదైన సెంచూరియన్ మైదానంలో కోహ్లీసేన పుంజుకుంటుందని భావిస్తున్నాడు. అలా జరగాలంటే మాత్రం టీమిండియా ఓపెనర్లు శుభారంభం ఇవ్వాల్సిన అవసరం చాలా ఉందంటున్నాడు. కానీ, టీమిండియా శిబిరం ఆందోళన చెందుతున్నది ఈ విషయంలోనే. లోకేశ్ రాహుల్‌ను కాదని తుది జట్టులోకి వచ్చిన శిఖర్ ధవన్ తీవ్రంగా నిరాశపరచగా.. మరో ఓపెనర్ మురళీ విజయ్ అవుట్ సైడ్ ఆఫ్-స్టంప్ బలహీనతను బయటపెట్టడం మేనేజ్‌మెంట్‌ను కలవరపెడుతోంది. చివరగా 2013 డిసెంబరులో భారత్ ఇక్కడ పర్యటించింది. అప్పుడు రెండు టెస్టుల్లో.. వాండరర్స్ మ్యాచ్‌ను డ్రా చేసుకొని.. డర్బన్‌లో పది వికెట్ల తేడాతో


కేఎల్ రాహుల్

చిత్తుగా ఓడింది టీమిండియా. ఆ రెండు మ్యాచ్‌ల్లోనూ ధవన్, విజయ్‌లే ఓపెనర్లు. అయితే, డర్బన్‌లో విజయ్ 97 పరుగులతో ఆకట్టుకోగా.. ధవన్ ఇబ్బందిపడ్డాడు. అదే విధంగా 2010-11లోనూ విజయ్ దక్షిణాఫ్రికా పర్యటనకు వచ్చాడు. నాడు మూడు టెస్టుల్లో డర్బన్‌లో జరిగిన మ్యాచ్‌లో మాత్రమే ఆడిన అతను.. అంతగా ప్రభావం చూపలేకపోయాడు. పదేళ్ల కెరీర్‌లో విజయ్ ఇప్పటికే 54 టెస్టులు ఆడేసినా.. రెండు సార్లు సౌతాఫ్రికాలో పర్యటించిన అనుభవం ఉన్నా కూడా ఆఫ్ స్టంప్ అవతల పడ్డ బంతిని వెంటాడి చేయి కాల్చుకోవడం శోచనీయం. అలాగే, అతను సరైన ఫుట్‌వర్క్ లేకుండా స్ట్రోక్స్ ఆడుతున్నాడు. రెండు సార్లు ఎల్బీగా అవుటైనా.. డీఆర్ఎస్ కోరి బతికిపోయినప్పటికీ వాటిని విజయ్ సద్వినియోగం చేసుకోలేకపోయాడు. మరోవైపు ధవన్.. సఫారీల పదునైన పేస్ బౌలింగ్‌ను ఏ మాత్రం ప్రతిఘటించలేక చేతులెత్తేశాడు. అతని షాట్ల ఎంపిక బాగా లేదు. రెండు ఇన్నింగ్స్‌ల్లోనూ సరైన ఆరంభం లేకపోవడం తొలి టెస్టు ఓటమికి ప్రధాన కారణం. ఈ నేపథ్యంలో సెంచూరియన్‌లో ఇదే కూర్పుతో కొనసాగే అవకాశాలు కనిపించడం లేదు. ఈ ఇద్దరిలో ఒకరిని తప్పించి రాహుల్‌ను జట్టులోకి తీసుకోవాలన్న అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. ముఖ్యంగా ధవన్‌కు దారి వదలి బెంచ్‌కు పరిమితమైన లోకేశ్ రాహుల్‌ను తుది జట్టులోకి తీసుకునే ఆలోచనతో మేనేజ్‌మెంట్ ఉన్నట్టు సమాచారం. దేశవాళీల్లో మెరుగైన ప్రదర్శన చేసి టెస్టు జట్టులో చోటు సంపాదించుకున్న రాహుల్‌కు.. సవాల్ విసిరే పరిస్థితుల్లో సత్తా చాటుతాడన్న పేరుంది. అదే సమయంలో ఈ ముగ్గురు ఓపెనర్లు మంచి స్నేహితులు. సిరీస్‌లో నిలవాలంటే సెంచూరియన్ టెస్టులో విజయం అవశ్యం కాబట్టి ఈ ముగ్గురిని కూర్చోబెట్టి కర్తవ్యం బోధిస్తే బాగుంటుంది. ఇక, వృద్ధిమాన్ సాహా స్థానంలో వెటరన్ ప్లేయర్ పార్థివ్ పటేల్‌ను ఓపెనర్-వికెట్ కీపర్‌గా తీసుకుంటే.. మిడిలార్డర్‌లో అంజిక్యా రహానెను అదనపు బ్యాట్స్‌మన్‌గా ఎంపిక చేసుకునే సౌలభ్యం కూడా ఉన్నది. అయితే, బ్యాటుతో విఫలమైనా.. పది క్యాచ్‌లు అందుకొని.. వికెట్ల వెనకాల అద్భుత నైపుణ్యం ప్రదర్శించిన సాహాపై వేటు వేయకపోవచ్చు.

ఆధార్ స్థానంలో 'వర్చువల్ ఐడీ'


▸ కొత్త విధానం తీసుకొచ్చిన యూఐడీఏఐ



న్యూఢిల్లీ, జనవరి 10: ఆధార్ కార్డులోని వివరాల గోప్యతపై ఆందోళన వ్యక్తం అవుతున్న తరుణంలో యూఐడీఏఐ కొత్త పద్ధతిని తీసుకొచ్చింది. సిమ్ వెరిఫికేషన్ లేదా ఇతర కేవైసీ అవసరాల కోసం ఇకపై ఆధార్‌కార్డుకు బదులు 'వర్చువల్ ఐడీ'ని సమర్పిస్తే సరిపోతుంది. ఇది 16 అంకెలుగా ఉంటుంది. ఇది కూడా ఆధార్‌తో సమానమేనని యూఐడీఏఐ స్పష్టం చేసింది. ఈ ఏడాది మార్చి ఒకటి నుంచి వర్చువల్ ఐడీని క్రియేట్ చేసుకోవచ్చు. జూన్ ఒకటి నుంచి అన్ని సంస్థలూ తప్పనిసరిగా దీనిని ఆమోదించాల్సి ఉంటుంది. కాదూ కూడదని ఎవరైనా నిరాకరిస్తే వారిపై చర్యలు ఉంటాయని బుధవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో యూఐడీఏఐ హెచ్చరించింది. దీనివల్ల ఆధార్ కార్డులోని సమాచారం ఎవ్వరికీ తెలిసే అవకాశం ఉండబోదని భావిస్తోంది. ఈ మధ్య రూ. 500లకే ఆధార్ వివరాలు బహిర్గతం అని వార్తలు రావడంతో కలకలం రేగింది. అలాంటి అవకాశం లేదని యూఐడీఏఐ స్పష్టం చేసినా...భద్రతా కారణాల రీత్యా వర్చువల్ ఐడీని తీసుకొచ్చినట్లు అధికార వర్గాలు చెబుతున్నాయి. కేవైసీ విధానంలో ఎవరికి ఎంత సమాచారం అవసరమో అంతే తెలిసేలా కొత్త విధానం ఉంటుందని వెల్లడిస్తున్నాయి. ఇప్పటికే దేశంలో 119 కోట్ల మందికి ఆధార్‌కార్డులు జారీ అయ్యాయి. వీరంతా వర్చువల్ ఐడీ కోసం కుస్తీ పట్టాల్సి ఉంటుంది.

వర్చువల్ ఐడీ ఎలా?

యూఐడీఏఐ వెబ్‌సైట్‌లోకి వెళ్లి ఒక వ్యక్తి ఎన్ని వర్చువల్ ఐడీలనైనా క్రియేట్ చేసుకోవచ్చు. దీనిద్వారా వ్యక్తి పేరు, ఫొటో, చిరునామా మాత్రమే కనిపిస్తాయి. అదే ఆధార్ అయితే మొత్తం వివరాలు తెలిసిపోతాయి. ఒకసారి వర్చువల్ ఐడీ సంపాదిస్తే అది నిర్దేశిత కాలం వరకూ ఉంటుంది. కాదూ మార్చుకోవాలని భావిస్తే పాత ఐడీ పోతుంది. ఇలా ఒక వ్యక్తి ఎన్నిసార్లు అయినా వర్చువల్ ఐడీలను పొందవచ్చు. కాకపోతే చివరిసారిగా అతను సంపాదించిన ఐడీయే మనుగడలో ఉంటుంది. దీనికి సంబంధించిన విధివిధానాలపై ఇప్పటికే అధీకృత ఆధార్ సెంటర్‌లకు ఆదేశాలిచ్చారు.



ఏప్రిల్‌లో రజనీ పార్టీ!

▸ '2.0' విడుదల తర్వాతే ప్రారంభం

▸ ప్రచారానికి వేసవి సెలవులు అనుకూలమనే అభిప్రాయం

▸ పేర్ల నమోదులో 'రజనీమండ్రం' జోరు

చెన్నై, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): సూపర్‌స్టార్ రజనీకాంత్ ఏప్రిల్ నెలాఖరులో పార్టీని ప్రారంభించాలని నిర్ణయించుకున్నారు. ఈ మేరకు సన్నాహకాలు ఊపందుకున్నాయి. గత డిసెంబరు 31న తాను రాజకీయాల్లోకి వస్తున్నట్లు రజనీ ప్రకటించిన విషయం తెలిసిందే. సంక్రాంతి పండుగ సందర్భంగా పార్టీని ప్రారంభించే అవకాశముందని ప్రచారం జరిగింది. ఆయన సోదరుడు సత్యనారాయణ కూడా దీన్ని ధ్రువీకరించినా కొన్ని అనివార్య కారణాలతో ఆ నిర్ణయాన్ని వాయిదా వేసుకున్నట్లు సమాచారం. '2.0' చిత్రం విడుదల అనంతరం ఏప్రిల్ నెలాఖరులో పార్టీ ప్రారంభించాలని రజనీ భావిస్తున్నట్లు తెలిసింది. వేసవి సెలవులైతే అభిమానులు, యువత భారీగా తరలిరావడంతో పాటు ప్రచారానికి అనువుగా ఉంటుంది కాబట్టి ఆ సమయంలో పార్టీ ప్రారంభిద్దామని ఆయన సన్నిహితుల వద్ద చెప్పినట్లు తెలిసింది. ఈలోపు పెద్దజిల్లాల్లో కనీసం 10లక్షల మంది, చిన్న జిల్లాల్లో కనీసం 5లక్షల మంది సభ్యులు ఉండేలా సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టాలని అభిమానులు భావిస్తున్నారు. ఇప్పటికే ప్రారంభమైన రజనీ మండ్రం వెబ్‌సైట్‌లోనూ పేర్ల నమోదు ప్రక్రియ వేగంగా జరుగుతోంది. ఇందులో యువత అత్యధికంగా ఉన్నట్లు తెలిసింది.



సైబర్ నేరాలపై ఫిర్యాదుకు.. కేంద్ర ప్రభుత్వ పోర్టల్

▸ సుప్రీంకోర్టుకు తెలిపిన కేంద్రం

▸ హైదరాబాద్ ఎన్జీవో చొరవ

న్యూఢిల్లీ, జనవరి 10: హైదరాబాద్‌కు చెందిన 'ప్రజ్వల' స్వచ్ఛంద సంస్థ చొరవతో.. సైబర్ నేరాలపై ఫిర్యాదుకు కేంద్ర ప్రభుత్వం ఒక వ్యవస్థను సిద్ధం చేసింది. ఇందుకోసం ఒక పోర్టల్ (www.cyber-police.gov.in)ను అందుబాటులోకి తీసుకువచ్చింది. ఈ విషయాన్ని కేంద్ర హోంశాఖ బుధవారం సుప్రీంకోర్టుకు తెలిపింది. ప్రస్తుతం ఈ పోర్టల్‌లో ఫిర్యాదుల స్వీకరణ వ్యవస్థ ఉందని, ఫిబ్రవరి 10 నుంచి మరిన్ని అంశాలను అందుబాటులోకి వస్తాయని జస్టిస్ మదన్ లోకుర్, యూయూ లలిత్‌ల ధర్మాసనానికి వివరించారు. 2015లో స్నేక్‌గ్యాంగ్ అరాచకాలపై సోషల్ మీడియాలో వైరల్‌గా మారిన వీడియో క్లిప్పులను ప్రజ్వల సంస్థ ఓ లేఖ ద్వారా సుప్రీంకోర్టు దృష్టికి తీసుకెళ్లిన విషయం తెలిసిందే. అశ్లీలం, లైంగిక నేరాలకు సంబంధించిన సాహిత్యం, వీడియోలను వెబ్ నుంచి తొలగించాలని ప్రజ్వల ఆ లేఖలో కోరింది. సుప్రీంకోర్టు ఆదేశాలతో హోంమంత్రిత్వ శాఖ ఫిర్యాదుల వ్యవస్థను అందుబాటులోకి తెచ్చింది.

దయలేని పుత్రులు.. 59.47%

ఆరళ్లు పెట్టే కోడళ్లు 60 శాతం.. తిట్టే కూతుళ్లు 7 శాతం.. అల్లుళ్లు 6 శాతం

▸ మెట్రో నగరాల్లో వృద్ధుల దుస్థితి

▸ హెల్ప్ ఏజ్ ఇండియా సర్వేలో వెల్లడి

▸ బెంగళూరులో 70% వృద్ధులది అదే వ్యథ

▸ 60 శాతంతో 2వ స్థానంలో హైదరాబాద్



హైదరాబాద్, జనవరి 10: కుటుంబ వ్యవస్థకు.. మానవీయ విలువలకు.. పెట్టిందిపేరు భారతదేశం. కానీ అదంతా గతం. వర్తమానంలో పరిస్థితి వేరుగా ఉంది. కని, పెంచి, విద్యాబుద్ధులు చెప్పించి తమ భవిష్యత్తును తీర్చిదిద్దిన తల్లిదండ్రులను.. వృద్ధాప్యంలో పట్టించుకోవట్లేదు నేటి తరం. దేశంలోని మెట్రో నగరాల్లో 'హెల్ప్ ఏజ్ ఇండియా' అనే సంస్థ నిర్వహించిన సర్వేలో తేలిందిది. వారి సర్వేల్లో పాల్గొన్న వృద్ధుల్లో 59.47 శాతం మంది.. తమ కొడుకులు తమను నిర్లక్ష్యం చేస్తున్నారని చెప్పడం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది. ఆ సర్వే నివేదిక ప్రకారం..

- దేశంలోని వృద్ధుల్లో 29% పట్టణ, నగర ప్రాంతాల్లో జీవిస్తుండగా.. 71 శాతం మంది గ్రామీణ ప్రాంతాల్లో ఉంటున్నారు.
- నగరాల్లో నివసించే వృద్ధుల్లో ఇతరులపై ఆధారపడి జీవించేవారు 51.1 శాతం కాగా.. చిన్నపాటి పట్టణాల్లో ఉండే వృద్ధుల్లో ఇలాంటివారు కేవలం 12.4 శాతం మాత్రమే ఉన్నారు.
- కోడళ్ల అనాదరణకు గురవుతున్నట్టు ఈ సర్వేలో చెప్పిన అత్తమామలు 61 శాతం మంది!
- కొడుకులు, కోడళ్లే కాదు.. కూతుళ్లు కూడా తల్లిదండ్రులతో దయలేకుండా ప్రవర్తిస్తున్నారని సర్వేలో తేలింది. అలాంటి కూతుళ్ల సంఖ్య ఏడు శాతంగా ఉండగా.. అల్లుళ్ల సంఖ్య 6 శాతంగా ఉంది.
- ఏపీ, తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక, మహారాష్ట్ర జనాభాలో వృద్ధులు 10 శాతం దాకా ఉన్నారు. నగరాలవారీగా చూస్తే.. బెంగళూరులో నివసించే వృద్ధుల్లో 70 శాతం మంది తమ పిల్లలు తమను సరిగ్గా చూడట్లేదని చెప్పారు.

నగరం	శాతం
హైదరాబాద్	60
గువాహటి	59
కోల్‌కతా	52
చెన్నై	49
ముంబై	33
ఢిల్లీ	23

'బినామీ'లకు ఏడేళ్ల శిక్ష!



న్యూఢిల్లీ, జనవరి 10: "బినామీ లావాదేవీలకు పాల్పడుతున్నారా..? జాగ్రత్త! క్రిమినల్ కేసు పెట్టి దర్యాప్తు చేస్తాం. ఏడేళ్ల వరకు కఠిన కారాగార శిక్ష పడుతుంది! కొత్త చట్టం ప్రకారం నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవు" ఇదీ ఆదాయ పన్ను శాఖ చేస్తున్న హెచ్చరిక. ప్రజలు బినామీ లావాదేవీలకు దూరంగా ఉండాలని హెచ్చరించింది. ఈ విషయంపై ఐటీ శాఖ ప్రముఖ జాతీయ దినపత్రికల్లో ప్రకటనలు ఇచ్చింది. 'బినామీ లావాదేవీలకు దూరంగా ఉండండి' అన్న శీర్షికన ఇచ్చిన ప్రకటనలో.. నల్లధనాన్ని 'మానవజాతిపై జరుగుతున్న నేరం'గా అభివర్ణించింది. నల్లధనాన్ని రూపుమాపేందుకు ప్రజలంతా ప్రభుత్వానికి సహకరించాలని విజ్ఞప్తి చేసింది. "బినామీదారు (ఇతరుల ఆస్తి వీరి పేరిట ఉంటుంది), లబ్ధిదారులు (వాస్తవ యజమాని) ఎవరైనా సరే నిబంధనలు ఉల్లంఘించి బినామీ లావాదేవీలకు పాల్పడితే దర్యాప్తు చేస్తారు. ఏడేళ్ల వరకు కఠిన కారాగార శిక్షతో పాటు బినామీ ఆస్తి వాస్తవ మార్కెట్ విలువలో 25 శాతం జరిమానా విధించవచ్చు" అని ఐటీ శాఖ ఇచ్చిన ప్రకటనలో తెలిపింది. "బినామీ ఆస్తుల లావాదేవీల నిరోధక చట్టం, 2016 ప్రకారం అధికారులకు తప్పుడు సమాచారం ఇచ్చే వ్యక్తులు విచారణార్హులవుతారు. ఐదేళ్ల వరకు జైలు శిక్ష విధించడంతో పాటు బినామీ ఆస్తుల వాస్తవ మార్కెట్ విలువలో 10 శాతం జరిమానా వసూలు చేసే అవకాశం ఉంటుంది" అని వెల్లడించింది. బినామీ ఆస్తిని ప్రభుత్వం అటాచ్ లేదా జప్తు చేస్తుందని, దీనికితోడు పన్ను ఎగవేత ఆరోపణలపై ఆదాయ పన్ను చట్టం 1961 ప్రకారం దర్యాప్తు కూడా జరుగుతుందని తెలిపింది.

గత ఏడాది నవంబరు 1 నుంచి కొత్తగా అమల్లోకి వచ్చిన బినామీ లావాదేవీల నిరోధక (సవరణ)చట్టం 2016 ప్రకారం ఐటీ శాఖ చర్యలకు ఉపక్రమించింది. దేశవ్యాప్తంగా

రూ.1833 కోట్ల బినామీ ఆస్తుల స్వాధీనం

నవంబరు 1, 2016 నుంచి అక్టోబరు 2017 వరకు 517 నోటీసులు జారీ చేసి.. 541 అటాచ్‌మెంట్లు చేసింది. మొత్తం రూ.1833 కోట్ల విలువైన బినామీ ఆస్తులను స్వాధీనం చేసుకుంది.



ఇస్రో చైర్మన్‌గా శివన్

▸ కేబినెట్ కమిటీ ఆమోదం

న్యూఢిల్లీ, జనవరి 10: ప్రముఖ శాస్త్రవేత్త కే శివన్ ఇస్రో చైర్మన్‌గా నియమితులయ్యారు. ఆయనను ఏఎస్ కిరణ్ కుమార్ స్థానంలో నియమించేందుకు కేబినెట్ అపాయింట్‌మెంట్ కమిటీ అంగీకరించింది. దీంతో ఆయన ఖగోళ శాస్త్ర విభాగానికి కార్యదర్శిగానూ, ఖగోళ కమిషన్ చైర్మన్‌గానూ మూడేళ్లపాటు బాధ్యతలు నిర్వహిస్తారు. శివన్ ప్రస్తుతం విక్రం సారాభాయ్ స్పేస్ సెంటర్ డైరెక్టర్‌గా ఉన్నారు. ఆయన మద్రాస్ ఐఐటీలో ఏరోనాటికల్ ఇంజనీరింగ్‌ను అభ్యసించారు.



బ్రిటన్ మంత్రివర్గంలో నారాయణమూర్తి అల్లుడు

లండన్, జనవరి 10: ఇన్ఫోసిస్ సహవ్యవస్థాపకుడు నారాయణమూర్తి అల్లుడు రిషి సునక్(37)కు బ్రిటన్ మంత్రివర్గంలో చోటు లభించింది. మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణలో భాగంగా థెరెసా మే కొత్తగా పదవులు అప్పగించిన ఇద్దరు భారత సంతతి ఎంపీల్లో సునక్ ఒకరు. కన్జర్వేటివ్ పార్టీ తరఫున రిచ్‌మండ్ నుంచి ఎంపీగా ఎన్నికైన ఆయనకు హౌజింగ్, కమ్యూనిటీస్, లోకల్ గవర్నమెంట్ వ్యవహారాల బాధ్యతలు అప్పగించారు. ఆయనతో పాటు భారత సంతతికే చెందిన ఫెర్నాండెజ్ కూడా మంత్రిగా నియమితులు కాగా.. అలోక్‌వర్మ ఇప్పటికే మంత్రి పదవిలో కొనసాగుతున్నారు.



ఇందిరా గాంధీ పాత్రలో విద్యాబాలన్

ముంబై, జనవరి 10: బాలీవుడ్ హీరోయిన్ విద్యాబాలన్... మాజీ ప్రధాని ఇందిరా గాంధీగా కనిపించబోతున్నారు. ఇందిర రాజకీయ జీవితంఆధారంగా తెరకెక్కబోతున్న చిత్రంలో ఆమె ప్రధాన పాత్రను పోషించబోతున్నారు. ప్రముఖ విలేకరి సాగరికా ఘోష్ పుస్తకం "ఇందిర: ఇండియాస్ మోస్ట్ పవర్‌ఫుల్ ప్రైమ్ మినిస్టర్" పై విద్యాబాలన్ అనుసరణ హక్కులను సొంతం చేసుకున్నారు. "ఇందిర పుస్తకంపై హక్కులు పొందడం సంతోషంగా ఉంది. అయితే సినిమా తీయాలా? వెబ్ సిరీస్ రూపొందించాలా? అనే దానిపై నిర్ణయం తీసుకోలేదు." అని విద్యాబాలన్ అన్నారు. అటు ఇందిరాగాంధీని తెరపై చూసేందుకు ఎదురుచూస్తున్నానని సాగరికా ఘోష్ ట్విట్టర్‌లో పేర్కొన్నారు.

మోదీకి నాప్కిన్ సందేశం

▸ 12శాతం జీఎస్టీపై విద్యార్థుల నిరసన



గ్వాలియర్, జనవరి 10: శానిటరీ నాప్కిన్‌లపై 12శాతం జీఎస్టీ విధించడంపై మధ్యప్రదేశ్‌లోని గ్వాలియర్ విద్యార్థులు వినూత్న రీతిలో నిరసన చేపట్టారు. వెయ్యి నాప్కిన్లతో ప్రధాని మోదీకి సందేశం పంపించేందుకు సిద్ధమవుతున్నారు. నాప్కిన్‌పై జీఎస్టీని తొలగించాలంటూ జనవరి 4 నుంచి సోషల్ మీడియాలో ప్రచారం చేపట్టారు. వెయ్యి నాప్కిన్లపై తమ సందేశాన్ని రాసి మార్చి 3లోగా ప్రధానికి పంపేందుకు సన్నద్ధమవుతున్నారు. నాప్కిన్లను విలాస వస్తువులుగా పరిగణించడంపై ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. మహిళలకు ఉచితంగా నాప్కిన్లను పంపిణీ చేయాలంటున్నారు.

దేశమంతా ఒకే స్టాంప్ డ్యూటీ!

▸ పన్ను ఎగవేతలకు అడ్డుకట్టే లక్ష్యం.. నేడు వాణిజ్య శాఖాధికారుల భేటీ

▸ రివర్స్ చార్జీల విధానం సరళీకరణ.. 18న జీఎస్టీ మండలి తుది నిర్ణయం

అమరావతి, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): దేశమంతా ఒకే స్టాంప్ డ్యూటీ అమలు చేయాలని జీఎస్టీ మండలి సూత్రప్రాయంగా నిర్ణయించింది. ఇది రాష్ట్రానికో రకంగా ఉండటంతో భారీ స్థాయిలో పన్ను ఎగవేతలు జరుగుతున్నాయని భావిస్తోంది. ఈ మేరకు సిద్ధం చేసిన ప్రతిపాదనలపై అన్ని రాష్ట్రాలకు చెందిన వాణిజ్యశాఖ అధికారులు గురువారం ఢిల్లీలో సమావేశం కానున్నారు. 'ఒకే దేశం- ఒకే పన్ను' లక్ష్యంతో జీఎస్టీని అమల్లోకి తెచ్చినప్పటికీ.. జీఎస్టీ పరిధిలోకి రాని ఇతర పన్నుల కారణంగా కేంద్ర ఖజానాకు భారీ నష్టం వాటిల్లుతోందని రాష్ట్ర వాణిజ్యశాఖ అధికారులు చెబుతున్నారు. దేశ వ్యాప్తంగా ఒకే స్టాంప్ డ్యూటీ అమలుకు జీఎస్టీ మండలి నిర్ణయించిందని వారు పేర్కొన్నారు. అలాగే రివర్స్ చార్జీల విధానాన్ని కూడా కొంతమేర సవరించాలని నిర్ణయించారు. ప్రస్తుత విధానం ప్రకారం... నమోదు చేసుకోని డీలర్ల వద్దనుంచి నమోదు చేసుకున్న డీలర్లు కొనుగోళ్లు జరిపితే.. ఆ కొనుగోలుకు సంబంధించిన పన్ను భారం నమోదు చేసుకున్న డీలర్‌పై పడుతుంది. ఆ మొత్తానికి కేంద్రం నుంచి ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ వస్తుంది. ఆ తర్వాత నమోదు చేసుకున్న డీలర్ తన విక్రయాలపై మళ్లీ పన్ను చెల్లించాల్సి ఉంటుంది. ఇంత సంక్లిష్టమైన ప్రక్రియను సులభతరం చేయాలని జీఎస్టీ మండలి నిర్ణయించింది. ఈ మేరకు సిద్ధమైన ప్రతిపాదనలపై సమావేశంలో చర్చించనున్నారు. అలాగే, ఏదైనా కొనుగోళ్లకు సంబంధించి డీలర్లకు వచ్చిన అడ్వాన్సులపై పన్ను వసూలు చేస్తున్నారు. సరఫరా పూర్తయిన తర్వాత ఇవ్వాల్సిన బ్యాలెన్స్‌పై కూడా పన్ను వేస్తున్నారు. ఇలా ఒకే కొనుగోలుపై రెండుసార్లు కాకుండా ఒకేసారి పన్ను వసూలు చేయాలని ప్రతిపాదనలు వచ్చాయి. ఈ సమావేశంలో చర్చల అనంతరం ఇచ్చే నివేదికపై జీఎస్టీ మండలి ఈనెల 18న తుది నిర్ణయం తీసుకోనుంది.



త్వరలో అందుబాటులోకి ఎగిరే రిక్షాలు

▸ కేంద్ర మంత్రి జయంత్ సిన్హా ప్రకటన

జంషెడ్‌పూర్, జనవరి 10: నగరాల్లో ట్రాఫిక్ సమస్యతో విసుగొస్తోందా? ఎక్కడికి వెళ్లాలన్నా గంటల తరబడి ట్రాఫిక్‌లో చిక్కుకుపోతున్నారా? అయితే అలాంటి సమస్యలను అధిగమించేందుకు భవిష్యత్తులో ఎగిరే రిక్షాలు అందుబాటులోకి వస్తాయని అంటున్నారు కేంద్ర మంత్రి జయంత్ సిన్హా. డ్రోన్ పరిజ్ఞానంతో సులువుగా ప్రయాణించేందుకు వీలుగా ఎగిరే రిక్షాలను అందుబాటులోకి తీసుకురావాలని ప్రభుత్వం ప్రయత్నిస్తోందన్నారు. జంషెడ్‌పూర్‌లో జరిగిన ఓ సమావేశంలో పాల్గొన్న ఆయన.. ఆటో రిక్షాలో ప్రయాణించేందుకు, ఆకాశంలో ప్రయాణించేందుకు అయ్యే ఖర్చు సమానమేనని తాజాగా నిర్వహించిన సర్వేలో తేలిందన్నారు. ఇప్పటికే యూఏఈ, జర్మనీలో డ్రోన్ టెక్నాలజీ సాయంతో ఎయిర్ సర్వీసులు నడుస్తున్నాయని, అదే తరహాలో భారత్‌లోనూ ప్రారంభించేందుకు గల అవకాశాలను పరిశీలిస్తున్నట్లు తెలిపారు. విమానయాన శాఖ ఈ దిశగా నిబంధనలు రూపొందిస్తోందన్నారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao, on behalf of Aamoda Publications Pvt. Ltd., at the Aamoda press at Gollapalli road.,Dharmaram(B)Village,Dichpally Mandal, Nizamabad- 503230. Editor: K. Srinivas, Ph. Nos. 08461-245301, 245306. Fax 245307, RNI NO: AP TEL /2004/12975 .Managing Director : Vemuri Radha Krishna, Founder: K.L.N.Prasad.

ఆంధ్రజ్యోతి నవ్య
కుటుంబ కదంబం

శ్రీ శక్తి



జుంకాలకు జై!

నగ ధగ

‘జుంకా గిరా రే! బరేలీ కె బాజార్ మే జుంకా గిరా రే!’ జుంకాలకున్న ప్రత్యేకత అంత గొప్పది కాబట్టే ఆ ఆభరణం గురించి ఏకంగా సినిమా పాటలే రాసేసి, పాడేశారు. చీరలు, చుడీదార్లు, లెహంగాలు...డ్రస్ ఏదైనా దానికి నిండుతనం రావాలంటే జుంకాలు అలంకరించు కోవలసిందే! ఇప్పుడు మార్కెట్లో ఎన్నో రకాల జుంకాలు అందుబాటులో ఉన్నాయి. వాటిని డ్రెస్సింగ్ స్టయిల్‌కి తగ్గట్టు ఎంచుకుంటే సెంటర్ ఆఫ్ అట్రాక్షన్ మీరే అవుతారు.



✤ **బంగారు జుంకాలు:** పగడం, ముత్యం, గోమేధికం, కుందన్‌లు పొదిగిన 22 క్యారెట్ల బంగారు జుంకాలు సంప్రదాయ వస్త్రధారణకు చక్కగా నప్పుతాయి. ఈ రకం జుంకాలు ప్రస్తుతం ఎన్నో రకాల ఆకారాల్లో అందంగా తయారవుతున్నాయి. పూలు, టెంపుల్, నెమలి... ఇలా రకరకాల డిజైన్లలో దొరికే జుంకాలలో మీకు నప్పే డిజైన్‌ను ఎంపిక చేసుకోవచ్చు.



✤ **సిల్వర్ ఆక్సిడ్ జుంకాలు:** వెండితో తయారుచేసి, ఆక్సిడైజ్ అయిన జుంకాలు సాధారణ వెండి జుంకాల కంటే ఆకర్షణీయంగా ఉంటాయి. వీటినే గుజరాతీ స్టయిల్ జుంకాలు అని కూడా అంటారు. వెండి జుంకాలను ప్రతిరోజూ పెట్టుకో లేకపోయినా ఆక్సిడైజ్ అయిన జుంకాలను ఫ్యాన్సీ డ్రస్‌లకు మ్యాచింగ్‌గా కూడా ధరించవచ్చు.

✤ **వజ్రాల జుంకాలు:** డిజైనర్ దుస్తులు వేసుకుంటే వాటికి వన్నె తేవటం కోసం వజ్రాల జుంకాలు ఎంచుకోవాలి. వీటితో గ్లామరస్‌గా, రెట్టింపు ఆకర్షణీయంగా కనిపిస్తారు.

✤ **కశ్మీర్ జుంకాలు:** పొడవాటి ముత్యాల చైన్ తగిలించి ఉండే ఈ రకం జుంకాలను రెండు రకాలుగా ధరించవచ్చు. చెవిని చుడుతూ, లేదా పైకి లాగి వెంట్రుకలకు తగిలించి...ఇలా రెండు రకాలుగానూ వీటిని అలంకరించుకోవచ్చు. గుంపులో ప్రత్యేకంగా కనిపించాలంటే మాత్రం ఈ జుంకాలు ధరించాలి.

‘ఐ లైనర్’ ఇలా!

ఐ లైనర్‌తో కళ్లు విప్పారినట్టు కనిపిస్తాయి. అలాంటి అందం సొంతమవాలంటే ఐ లైనర్ అప్లై చేసేటప్పుడు కొన్ని చిట్కాలు పాటించాలి.

మంచి ప్రొడక్ట్ ఎంచుకోవాలి

ఐ లైనర్ క్రీమీగా ఉంటే కనురెప్పల మీద మెత్తగా జరుగుతుంది. వేసుకోవటం తేలిక. ఇలాంటి క్రీమీ లైనర్‌లోనే స్మడ్జర్ కూడా కలిసి ఉంటే బ్లెండ్ చేయటం ఎంతో ఈజీ. కాబట్టి వాటర్‌ప్రూఫ్, బిల్ట్ ఇన్ స్మడ్జర్ క్రీమీ ఐలైనర్‌నే ఎంచుకోవాలి.

కూర్చుని వేయాలి

ఐ లైనర్ వేసుకోవటానికి ఉపయోగించే అద్దం ఫ్లాట్‌గా ఉండే ప్రదేశంలో మీరు కూర్చున్న ప్రదేశానికి తక్కువ ఎత్తులో ఉండాలి. ఇలా ఉంటే కళ్లను కిందకి దించి సులువుగా లైనర్ వేసుకోవచ్చు. లాష్ లైన్ కూడా స్పష్టంగా కనిపిస్తుంది కాబట్టి కనురెప్పలకు ఆనుకున్నట్టు లైన్ గీసుకోవచ్చు.

డాట్స్ కనెక్ట్ చేయాలి

లైన్ వంకర లేకుండా రావాలంటే కన్ను మొదలు నుంచి చివరివరకు కనురెప్పలకు కొద్దిగా పైన వరుసగా 3 చుక్కలు పెట్టాలి. తర్వాత లైనర్‌తో ఈ చుక్కల్ని కలుపుతూ లైన్ గీసుకుంటే వంకర లేకుండా ఉంటుంది.

ఐ లైనర్ సమంగా

ఐ లైనర్ మందంగా వేస్తే కళ్లు చిన్నవిగా, పలుచగా వేస్తే పెద్దవిగా కనిపిస్తాయి. కాబట్టి కంటి ఆకారాన్ని బట్టి లైనర్ ఎంత మందంగా వేసుకోవాలో తెలుసుకోవాలి.



స్కూల్లో చదువుతున్నప్పుడు సాయుధ బలగాల్లో చేరాలనుకున్నారామె. కానీ ఆమెకు ఎదురైన అనారోగ్య పరిస్థితి ఆ ఆలోచనను పూర్తిగా మార్చేసింది. ప్రాణం ఉన్నంత కాలం.. ఆ సమయాన్ని సమాజానికి ఉపయోగపడే పనులు చేసేందుకు వినియోగించాలనే ఆలోచనలకి బీజం వేసింది. ఆ దిశగా పడిన అడుగులే ఆమెకు స్విట్జర్లాండ్‌లోని దావోస్‌లో జరిగే ‘వరల్డ్ ఎకనామిక్ ఫోరమ్’ సదస్సులో పాల్గొనే అవకాశాన్ని కల్పించాయి. ఆమె ఒక సోషల్ ఎంట్రప్రెన్యూర్. పేరు దీపికా ప్రసాద్. ‘లకీర్’ అనే సంస్థకు సహవ్యవస్థాపకురాలైన దీపిక మాటల్లోనే ఆమె ప్రయాణం ....

దావోస్‌లో మన దీపిక

“మా స్వస్థలం నిజామాబాద్. నేను పుట్టింది మాత్రం కర్ణాటకలో! పెరిగింది... ఫలానా చోట అని చెప్పలేను. దేశమంతటా అనొచ్చు. అదేంటి! అని ఆశ్చర్యపోకండి... నాన్న పి.వి. దుర్గాప్రసాద్ సాయుధ బలగాల్లో పనిచేసేవారు. అందుకే ఏడు వేర్వేరు సిటీల్లో పెరిగాను. పదకొండు స్కూల్స్‌లో చదివాను. దాదాపుగా మన దేశంలోని అన్ని రాష్ట్రాలు చుట్టొచ్చా. ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సరంలో హైదరాబాద్ వచ్చేశా. అప్పట్నించీ ఇక్కడే ఉంటున్నా, కాకపోతే మధ్యలో ఒక ఏడాది ముంబయిలో, కొన్ని నెలలు నైరోబీలో ఉన్నాను.

ఆ భావనతోనే...

చిన్నప్పుడు నాక్కూడా నాన్నలా ఇండియన్ ఆర్మీలో చేరాలనిపించేది. కానీ... నా ఆలోచనను మార్చేసే విషయం ఒకటి నా జీవితంలో జరిగింది. నాకు పదిహేను సంవత్సరాలప్పుడు ప్రాణాంతకమైన ‘సెరిబ్రల్ మలేరియా’ బారిన పడ్డాను. దాని వల్ల నెలల తరబడి ఆసుపత్రిలో ఉండాల్సి వచ్చింది. అలా దాదాపు ఏడాది పాటు ఇంటికి, బెడ్‌కే పరిమితం. అప్పుడు నాకనిపించింది జీవితం అనేది ఎప్పుడు, ఎలా ముగుస్తుందో తెలియదని! అదీకాక నలుగురికీ ఉపయోగపడే పని ఏదీ చేయకుండానే జీవితం ముగించాల్సి వస్తుందనే భావన ఎంత దారుణంగా ఉంటుందో అర్థమైంది. అప్పట్నించీ నా లక్ష్యం ఒక్కటే - నేను భూమ్మీద ఉన్నంతవరకు నా దగ్గరున్న సమయాన్ని సద్వినియోగం చేయాలంతే!

> **ఆడవాళ్లే సక్సెస్‌ఫుల్**
>
> ప్రపంచవ్యాప్తంగా జరిగిన పరిశోధనల్లో ఎంట్రప్రెన్యూర్‌లుగా మగవాళ్ల కంటే ఆడవాళ్లే విజయం సాధిస్తారని వెల్లడైంది. 2013లో జెఎమ్‌జె కన్సల్టింగ్ నివేదిక ప్రకారం 25 శాతం మంది మహిళలు ఏంజిల్ ఫండింగ్ అందుకోగా, మగవాళ్లు మాత్రం 21 శాతమే ఉన్నారు.

వాస్తవ జీవితాలకి దూరంగా...

స్కూల్లో చదువుకునేటప్పుడు స్పోర్ట్స్‌లో, పలు కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనేదాన్ని. మా అమ్మ అరుంధతీ ప్రసాద్‌తో కలిసి ‘ఆర్మీ వైవ్స్ వెల్ఫేర్ అసోసియేషన్’కు పనిచేశాను కూడా! ఇంటర్మీడియెట్ చదివేటప్పుడు ఎన్‌సిసిలో చేరాను. అప్పుడు రిపబ్లిక్‌డే పెరేడ్‌లో రాష్ట్రానికి ప్రాతినిధ్యం వహించే అవకాశం, బ్రిటన్‌లో జరిగిన ‘ఇంటర్నేషనల్ యూత్ ఎక్స్ఛేంజ్ ప్రోగ్రామ్’లో పాల్గొనే అవకాశం వచ్చాయి.

కాలేజీలో ఉండగా మన చదువులు వాస్తవ ప్రపంచానికి దూరంగా ఉన్నాయనిపించేది. అందుకని ఒక పక్క ఇంజనీరింగ్ చేస్తూనే, మరో వైపు ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్స్ అయిన ‘కోర్సెరా, ఉడాసిటీ’ల్లో నూతన నైపుణ్యాలు నేర్చుకునేదాన్ని. వాటిని రియల్ లైఫ్ ప్రాజెక్ట్స్‌కు అమలుచేసేదాన్ని. గత ఏడాది కోర్సెరా ద్వారా ‘జాన్ హాప్‌కిన్స్ యూనివర్సిటీ’ నుంచి డేటా సైన్స్‌లో ‘ఎగ్జిక్యూటివ్ స్పెషలైజేషన్’ పూర్తి చేశాను. అక్కడ నేర్చుకున్నదాన్ని వాస్తవ జీవితానికి అమలుచేశాను. డేటా ప్లాట్‌ఫామ్ ద్వారా బెంగళూరులో ఏయే ప్రాంతాల్లో డయాబెటిస్, గుండె జబ్బులతో బాధపడుతున్న వారి సంఖ్య ఎక్కువగా ఉందనే సమాచారాన్ని సేకరించా.

అవి వెంటాడుతున్న టైంబాంబులు!

ఆ స్కిల్స్‌నే ఈ ఏడాది ‘లకీర్’ సంస్థ ద్వారా అమలు చేయబోతున్నా. ‘లకీర్’ గురించి చెప్పనే లేదు కదూ... ఈ సంస్థకు నేను సహవ్యవస్థాపకురాలిని. పట్టణాల్లో జనావాసాలను మెరుగు పరచడమే లక్ష్యంగా ఇది పనిచేస్తుంది.

మన దేశం ప్రస్తుతం భారీగా నగరీకరణ సంక్షోభ దిశగా అడుగులు వేస్తోంది. ప్రతీ గంటకు 1800 మంది భారతీయులు పట్టణాలకు వస్తున్నారు. ఇంత భారీ స్థాయిలో వస్తున్న ప్రజా ప్రవాహాన్ని తట్టుకునేందుకు సిద్ధంగా మన పట్టణాలు లేవు. నిజానికి పట్టణాలనేవి దేశానికి ఆర్థిక శక్తి కర్మాగారాలు. కానీ... అవే నేడు వెంటాడుతున్న టైంబాంబుల్లా తయారవుతున్నాయి. గత ఏడాది ముంబయిలోని ఎల్ఫిన్‌స్టోన్ బ్రిడ్జి ప్రమాదంలో 22 మంది మరణించడం, ఢిల్లీలో తీవ్రమైన వాయు కాలుష్యం వల్ల అత్యవసర స్థితి ప్రకటించడం, బెంగళూరులో తాగునీటి ఎద్దడి వంటివి... రానున్న అతి పెద్ద సమస్యలకు ముందు కనిపించే లక్షణాలు మాత్రమే! ఈ సమస్యల పరిష్కారంలో ప్రజల్ని చురుకుగా ఉంచేందుకు ‘లకీర్’ ఒక సాధనంగా పనిచేస్తుంది.

నైబర్‌హుడ్ గ్రూపుల ద్వారా...

పొరుగు వారిలో పరివర్తన తేవడం ద్వారా పూర్తి పట్టణంలో పరివర్తన తేవచ్చు. దానికోసమే ‘నైబర్‌హుడ్ గ్రూప్స్’ను ఏర్పాటుచేశాం. వీటిని సమన్వయం చేసేందుకు అంకితభావంతో పనిచేసే ‘సిటిజన్ ఛాంపియన్స్’ ఉంటారు. వీళ్లు తమ పొరుగు వారి భాగస్వామ్యంతో, ప్రభుత్వ ఏజెన్సీలతో కలిసి పనిచేస్తారు. మాస్ కమ్యూనికేషన్ టూల్ అయిన వాట్సాప్ ద్వారా ఆయా ప్రాంతాల ప్రజలను ఒక దగ్గర చేరుస్తున్నాం. ఈ మోడల్‌ను దేశంలోని ఇతర పట్టణాల్లో కూడా అమలు చేయనున్నాం.

పాశ్చాత్య దేశాల మీద ఆధారపడకుండా...

నేను ఇంటెల్లిక్యాప్‌లో పనిచేసిన ఏడు సంవత్సరాల ఉద్యోగ ప్రయాణంలో నేర్చుకున్నది ఎంతో ఉంది. దక్షిణాసియా, ఆగ్నేయాసియా, తూర్పు ఆఫ్రికాల్లో ‘వరల్డ్ బ్యాంక్, ఇంటర్నేషనల్ ఫైనాన్స్ కార్పొరేషన్, ది రాక్‌ఫెల్లర్ ఫౌండేషన్, బోష్, యునిలివర్, గిజ్, షెల్ ఫౌండేషన్, ప్రదాన్‌ల’తో కలిసి పనిచేశా. పలు కార్యక్రమాలను ప్రారంభించడం, నాయకత్వం వహించడం వంటి అవకాశాలు కలిగాయక్కడ. అలా చేసిందే ‘స్టార్టప్‌వేవ్’. ఇది మన దేశంలో మొట్టమొదటి ఇంక్యుబేషన్ ప్లాట్‌ఫామ్. దీనికి ‘వరల్డ్ ఎకనామిక్ ఫోరమ్’, ‘హార్వర్డ్ కెన్నెడీ స్కూల్’ల గుర్తింపు లభించింది. దక్షిణాసియా, తూర్పు ఆఫ్రికాల్లో పనిచేశానని చెప్పాను కదా ... అక్కడ కూడా మన దేశంలో ఎదుర్కొంటున్న పేదరికం, అభివృద్ధికి పరిమిత వనరులు ఉండడం వంటి అంశాలున్నాయి. వీటినుంచి బయటపడాలంటే నూతన నమూనాలతో బాధ్యతాయుతమైన పెట్టుబడిదారీ వ్యవస్థ ఉద్భవించాలి. ఒకేరకమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్న దేశాలు సామాజిక ఆవిష్కరణలను ఒక దేశం నుంచి మరో దేశానికి బదిలీ చేయాలి. అలా చేస్తే కనుక పాశ్చాత్య దేశాలు రూపొందించిన నమూనాలను డూప్లికేట్ చేసి వాడాల్సిన అవసరం ఉండదనిపించింది.”

> **ఆ తప్పులు చేయకూడదు!**
>
> మన దేశంలో జనావాసానికి అనుకూలంగా ఉన్న మెట్రో నగరాల్లో ప్రస్తుతానికి అనుకూలంగా ఉన్నది గ్రేటర్ హైదరాబాద్ ఒక్కటే. అయితే ఆర్థిక పెరుగుదల వేగంగా జరుగుతుండడంతో జనాభా కూడా అంతే వేగంగా పెరుగుతున్నారు. దాంతో దేశంలోని మిగతా మెట్రోల లాగా హైదరాబాద్ కూడా తయారయ్యే అవకాశం ఉంది. అలా కాకుండా ఉండేందుకు హైదరాబాద్ ముందు అద్భుతమైన అవకాశం ఉంది. మిగతా మెట్రో నగరాల నుంచి నేర్చుకోవాల్సిన పాఠాలెన్నో ఉన్నాయి. ఆయా మెట్రో సిటీలు చేసిన తప్పులను మనం చేయకూడదు.



ఉత్సాహంగా ఉన్నా!

దావోస్‌లో ఈ నెల 23 నుంచి 26వ తేదీ వరకు జరగనున్న ‘వరల్డ్ ఎకనామిక్ ఫోరమ్’ సమావేశంలో ‘లకీర్’ సంస్థ తరపున హాజరు కావడం చాలా ఉత్సాహంగా అనిపిస్తుంది. యువత గొంతును వినేందుకు గ్లోబల్ లీడర్స్ ఆసక్తి కనపర్చడం చాలా గొప్ప అంశం. ఈ సదస్సులో పౌరుల చర్యలు, సివిక్ టెక్ ద్వారా పట్టణాలను జనావాసాలుగా మార్చడం అనే అంశం మీద మాట్లాడబోతున్నాను. సదస్సుకు హాజరయ్యే దేశ, విదేశీ ప్రతినిధులు మేం చేస్తున్న పనికి మద్దతు పలికి, భాగస్వాములు అవుతారని ఆశిస్తున్నా.


• కిరణ్మయి

ముత్యాల ముగ్గు



భాగ్యలక్ష్మి
చెన్నై

17 చుక్కలు
5వరుసలు
5 వచ్చే వరకు





జి.అక్షిత
కాచిగూడ
హైదరాబాద్

21 చుక్కలు
మధ్యచుక్క
11 వచ్చే వరకు





ఎల్.స్వాతి ప్రత్యూష
మందపాడు
గుడివాడ

18 చుక్కలు
6 వరుసలు, 6 వచ్చే వరకు
సరిచుక్క





ఎస్.సుకన్య
నందమూరినగర్
మహబూబాబాద్

21 చుక్కలు
11 వచ్చే వరకు
సందుచుక్క



గిఫ్ట్ హ్యాంపర్ విజేత

ఎం.ధనమ్మ
ఎర్రపాలెం
ప్రకాశం జిల్లా

13 చుక్కలు
13 వరసలు

మా చిరునామా: నవ్య, ముత్యాలముగ్గు, ఆంధ్రజ్యోతి కార్యాలయం,
రోడ్ నెంబర్ 70, హుడా హైట్స్, జూబ్లీ హిల్స్, హైదరాబాద్-500033.
navya@andhrajyothy.com

ట్రై చేయండి

రక్కున ఆరిపోతాయి



ట్రిప్‌కు వెళ్లేటప్పుడు కచ్చితంగా బ్రష్ నుంచి టవల్ వరకూ అన్నీ సర్దుకోవడం సర్వసాధారణం. కానీ మామూలు టవల్స్‌తో చిన్న సమస్య ఉంది. ప్రయాణంలో ఉన్నప్పుడు రైల్లో లైదా ఏ హోటల్‌లోనో ఫ్రెష్ అయ్యాక టవల్ ఆరేసుకునే సమయం ఉండదు. ఒకవేళ తడి టవల్‌ను మిగతా దుస్తులతో కలిపి సర్దేస్తే అదో రకమైన వాసన వస్తుంది. అంతే కాకుండా మిగతా వాటికీ ఈ తడి అంటుకుంటుంది. అందుకే ఈ ఇబ్బందులకు సరైన సమాధానం ఈ మైక్రోఫైబర్ టవల్. మామూలుగా మనం ఇళ్లల్లో వాడే టవల్స్ అయితే ఆరడానికి చాలా సమయం తీసుకుంటాయి. కానీ ఈ మైక్రోఫైబర్ టవళ్లు తడిని చాలా తక్కువ సమయంలో పీల్చేస్తాయి. రక్కున ఆరిపోతాయి. అదే వీటిలో ఉన్న ప్రత్యేకత. వీటి ధర రూ. 500 నుంచి రూ.1000కి పైగా ఉంటుంది.

ట్రావెల్ గైడ్

సంక్రాంతి సెలవులు వచ్చేశాయి... నెలాఖర్లో సుదీర్ఘమైన వీకెండ్ కూడా ఉంది. సరదాగా ఏదైనా ట్రిప్ వేసి వచ్చేద్దామనిపిస్తోందా?... కనీవినీ ఎరుగని వీధి వంటకాల రుచులూ, సంగీత, నృత్య, సాహిత్యాల వైభవం, ఒంటెలు, గజరాజుల విన్యాసాలు... ఇలా మీ అభిరుచి ఏదైనా దానికి తగిన వేడుక ఒకటి సిద్ధంగా ఉంది. మరెందుకాలస్యం?

పండగ వచ్చింది! పట్నం పిలిచింది!!



బికనీర్ ఒంటెల పండుగ, రాజస్థాన్

ఎక్కడ?: రాజస్థాన్‌లోని బికనీర్‌లో
ఎప్పుడు?: ఈ నెల 13, 14 తేదీల్లో
ఎలా వెళ్లాలి?: హైదరాబాద్, విజయవాడ నగరాల నుంచి బికనీర్‌కు నేరుగా రైళ్ళున్నాయి. సమీప విమానాశ్రయం జోధ్‌పూర్ (సుమారు 250 కిలోమీటర్ల దూరంలో) ఉంది.
ప్రత్యేకతలేమిటి?: బికనీర్‌కూ, ఒంటెలకూ విడదీయరాని అనుబంధం ఉంది. ఈ నగరం ఏర్పడినప్పటి నుంచీ ఒంటెలకు పర్యాయపదంగా నిలిచిపోయింది. ప్రపంచ యుద్ధాలు, భారత్-పాక్ యుద్ధాల్లో ఇక్కడి 'ఒంటెల సేన'లు గణనీయమైన సేవలు అందించాయి. కఠోరమైన ఎడారి వాతావరణాల్లో మనుగడ సాగించే ఒంటెల ఘనతను చాటి చెప్పాలన్న రాజస్థాన్ పర్యాటక శాఖ ఆలోచన నుంచి ఈ పండుగ రూపుదిద్దుకుంది. ఘనచరిత్రకు గంభీర సాక్ష్యంగా నిలిచిన జునాగఢ్ కోట ఎదుట ప్రదర్శనతో ఉత్సవాలు మొదలవుతాయి. రంగురంగుల దుస్తులతో, సాంప్రదాయికమైన ఆభరణాలతో అలంకరించిన ఒంటెలు కనువిందు చేస్తాయి. ఒంటెల పరుగు పందాలు, ఆటలు, ఇతర సాంస్కృతిక కార్యక్రమాలు, రాజస్థానీ సాంప్రదాయిక, జానపద నృత్య, సంగీత ప్రదర్శనలు, ప్రత్యేకించి మంటల్లోంచీ దూకుతూ కళాకారులు చేసే విన్యాసాలూ చూసి తీరాల్సిందే!

నేషనల్ స్ట్రీట్ ఫుడ్ ఫెస్టివల్, ఢిల్లీ

ఎక్కడ?: ఢిల్లీలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియం కాంప్లెక్స్‌లో
ఎప్పుడు?: ఈ నెల 12 నుంచి 14 వరకూ
ఎలా వెళ్లాలి?: హైదరాబాద్, విజయవాడ, విశాఖపట్నం నగరాల నుంచి ఢిల్లీకి రైలు, విమాన సౌకర్యాలున్నాయి.
ప్రత్యేకతలేమిటి?: దేశంలోని వివిధ రకాల స్ట్రీట్ ఫుడ్ రుచి చూడాలంటే ఢిల్లీలో జరిగే నేషనల్ స్ట్రీట్ ఫుడ్ ఫెస్టివల్‌ను మించిన గమ్యం మరొకటి లేదు. దాదాపు తొమ్మిదేళ్ళ కిందట నేషనల్ అసోసియేషన్ ఆఫ్ స్ట్రీట్ వెండర్స్ ఆఫ్ ఇండియా (ఎన్ఎఎస్‌విఐ) ఆలోచనల్లోంచి రూపుదిద్దుకున్న పండుగ ఇది. దేశంలోని పాతిక రాష్ట్రాలకు చెందిన 636 వీధి వర్తకుల సంఘాలు దీనికి అనుసంధానంగా ఉన్నాయి. వాటిలో సుమారు 9 లక్షలమంది స్ట్రీట్ వెండర్స్ సభ్యులున్నారు. ప్రతి సంవత్సరం ఢిల్లీలో నిర్వహించే ఈ ఫుడ్ ఫెస్టివల్ ఆహార ప్రియులను 'అదరహో!' అనిపిస్తుంది. దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి సుమారు 500 అత్యుత్తమ స్ట్రీట్ ఫుడ్ వెండర్స్ ఇక్కడ స్టాల్స్ ఏర్పాటు చేస్తారు. వినోద, సంగీత కార్యక్రమాలు కూడా జరుగుతాయి.
ఈ ఏడాది ప్రత్యేక ఆకర్షణలు: భారతీయ పండుగల్లో చేసే వంటకాలు, ఆలయాల్లో చేసే వంటకాలు, ఆర్గానిక్ వంటకాలు
తెలుగు రాష్ట్రాల రుచుల్లో కొన్ని: చికెన్ హలీమ్, గోంగూర పచ్చడి, హైదరాబాద్ బిరియానీ, చేపల పులుసు, మిరపకాయ బజ్జీ, పులిహోర, రుమాలీ రోటీ, డబుల్ కా మీఠా



ముక్తేశ్వర్ నృత్యోత్సవం, ఒరిస్సా

ఎక్కడ?: ఒరిస్సాలోని భువనేశ్వర్‌లో
ఎప్పుడు?: ఈనెల 14 నుంచి 16 వరకూ
ఎలా వెళ్లాలి?: తెలుగు రాష్ట్రాల్లోని దాదాపు అన్ని ప్రాంతాల నుంచీ భువనేశ్వర్‌కు రైలు సౌకర్యం ఉంది. భువనేశ్వర్‌లో విమానాశ్రయం ఉంది. విశాఖపట్నం నుంచి బస్సు మీద కూడా చేరుకోవచ్చు.
ప్రత్యేకతలేమిటి?: కళింగ శిల్పకళా వైభవానికి మచ్చుతునకగా నిలిచిన ముక్తేశ్వర్ ఆలయం ఎదుట నిర్వహించే ఈ ఉత్సవం ఒడిస్సీ నృత్యానికి నీరాజనం. లబ్ధప్రతిష్ఠులతో పాటు అప్పుడే గజ్జె కట్టినవారి వరకూ ఉత్సాహంగా పాల్గొంటారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయిల్లో విఖ్యాత నర్తకులు తరలివస్తారు. ప్రతిరోజూ సోలో, డ్యూయెట్, గ్రూప్ విభాగాల్లో ఒడిస్సీ నృత్య ప్రదర్శనలుంటాయి.



జైపూర్ లిటరేచర్ ఫెస్టివల్, రాజస్థాన్

ఎక్కడ?: రాజస్థాన్‌లోని జైపూర్‌లో
ఎప్పుడు?: ఈనెల 24 నుంచి 29 వరకూ
ఎలా వెళ్లాలి?: హైదరాబాద్, విజయవాడ, విశాఖపట్నం నగరాల నుంచి జైపూర్‌కు రైలు సౌకర్యం ఉంది. జైపూర్‌లో విమానాశ్రయం ఉంది.
ప్రత్యేకతలేమిటి?: భూమి మీద అతి పెద్ద ఉచిత సాహిత్య వేడుకగా గుర్తింపు పొందిన జైపూర్ బుక్ ఫెస్టివల్‌ను ప్రతి సంవత్సరం కనీసం లక్ష మంది వరకూ సందర్శిస్తారు. ప్రపంచంలోని వివిధ దేశాల నుంచి, ముఖ్యంగా ఈశాన్య ఆసియా నుంచి రచయితలు, రచనారంగ మేధావులు, ప్రచురణకర్తలు, సాహిత్యాభిమానులు ఎంతగానో ఎదురుచూసే ఉత్సవం ఇది. నోబెల్ బహుమతి గ్రహీతల నుంచీ వర్ధమాన రచయితల వరకూ ఎలాంటి భేషజాలూ లేకుండా కలిసిపోతారు. సాహితీ ప్రసంగాలు, చర్చలు, రచనా పఠనాలు ఉత్సాహంగా, ఆలోచనలు రేకెత్తించేలా సాగుతాయి.

మొథేరా నృత్యోత్సవం, గుజరాత్

ఎక్కడ?: గుజరాత్‌లోని మొథేరాలో
ఎప్పుడు?: ఈనెల 19 నుంచి 21 వరకూ
ఎలా వెళ్లాలి?: హైదరాబాద్, విజయవాడ, విశాఖపట్నం నగరాల నుంచి అహ్మదాబాద్‌కు రైళ్ళున్నాయి. అక్కడి నుంచి నుంచి రోడ్డు మార్గంలో (సుమారు 98 కిలోమీటర్లు) మొథేరా చేరుకోవచ్చు. సమీప విమానాశ్రయం అహ్మదాబాద్‌లో ఉంది.
ప్రత్యేకతలేమిటి?: ప్రతియేటా ఉత్తరాయణం ప్రవేశించిన తరువాత సూర్యదేవుడికి ఆరాధనాపూర్వకంగా నిర్వహించే వేడుక మొథేరా నృత్యోత్సవం. మొథేరాలోని సోలంకీ సామ్రాజ్య కాలం నాటి పురాతన సూర్య దేవాలయం ఎదుట నృత్య ప్రదర్శనలు జరుగుతాయి. దేశంలోని వివిధ ప్రాంతాలకు చెందిన నృత్య, సంగీత కళాకారులు తమ కౌశలాన్ని ప్రదర్శిస్తారు. సమీప గ్రామాల ప్రజలతోపాటు దేశ, విదేశాలకు చెందిన కళా, నృత్యాభిమానులు వాటిని వీక్షించేందుకు తరలివస్తారు.

ఆదూర్ గజ మేళా, కేరళ

ఎక్కడ?: కేరళలోని ఆదూర్‌లో
ఎప్పుడు?: ఈనెల 27న
ఎలా వెళ్లాలి?: హైదరాబాద్, విజయవాడ, విశాఖపట్నం నగరాల నుంచి త్రివేండ్రానికి రైళ్ళున్నాయి. అక్కడి నుంచి సుమారు 86 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఆదూర్‌కు రోడ్డు మార్గంలో చేరుకోవచ్చు. సమీప విమానాశ్రయం త్రివేండ్రంలో ఉంది. హైదరాబాద్ నుంచి త్రివేండ్రానికి ప్రైవేట్ బస్సులు నడుస్తున్నాయి.
ప్రత్యేకతలేమిటి?: ఆదూర్‌లోని పార్థసారథి ఆలయంలో పదిరోజుల వార్షిక ఉత్సవాల ఆఖరి రోజున గజమేళా నిర్వహిస్తారు. ఈ సందర్భంగా జరిగే ఏనుగుల ఊరేగింపు చూసి తీరాల్సిందే. తొమ్మిది గజరాజులను అంబారీలతో అలంకరిస్తారు. పార్థసారథి ఆలయం నుంచి మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న చెన్నపట్టి ఆలయం వరకూ ఊరేగింపు సాగుతుంది. సంప్రదాయ నృత్య, కళా ప్రదర్శనలు కూడా ఈ ఉత్సవాల్లో ప్రధాన ఆకర్షణ. సమ్మోహనపరిచే గజ గమనాన్నీ, కళావైభవాన్నీ తిలకించడానికి వేలాదిమంది ఆదూర్‌కు తరలివస్తారు.








స్టార్ డెస్టినేషన్

'టైగర్' విహార సీమ



మూడు వందల కోట్ల వసూళ్ళు సాధించిన మూడు చిత్రాల హీరోగా రికార్డుల్ని తిరగరాసిన బాలీవుడ్ మోస్ట్ ఎలిజబుల్ బ్యాచిలర్ సల్మాన్ ఖాన్ షూటింగులు లేకపోతే ఎక్కువ సమయం పర్యటనల్లోనే గడుపుతాడు. మరి అతని మనసు దోచుకున్న ప్రదేశం ఏదో తెలుసా?
ఇష్టమైన ప్రదేశం: ముంబయికి రెండు గంటల ప్రయాణ దూరంలో ఉన్న పన్వేల్. కొకంణి ప్రాంతానికి అది ముఖద్వారం.
ఎందుకంటే?: పనిలో బాగా అలసిపోయినప్పుడు, విసుగెత్తినప్పుడు నాకు కావలసిన ప్రశాంతత, నూతనోత్తేజం అక్కడ లభిస్తాయి. అందుకే నా కుటుంబంతో కలిసి తరచుగా అక్కడికి వెళుతూ ఉంటాను. అక్కడ ఫామ్‌హౌస్ కూడా కొనుక్కున్నాను. అందులో కూరగాయలూ, పండ్లూ పెంచుతున్నాం. నా వృత్తి నేను ఊహించనంత దూర ప్రాంతాలకు తీసుకుపోతూ ఉంటుంది. అయితే నేను నా కోసం గడపాలనుకున్నప్పుడు స్వయంగా డ్రైవ్ చేసుకుంటూ పన్వేల్ చెక్కేస్తాను.
ప్రత్యేకతలేంటి?: ప్రకృతి సౌందర్యానికి నెలవు. ఆధునికత, సంప్రదాయం ఒకదానితో మరొకటి పెనవేసుకొని ఉంటాయి. అక్కడి పక్షుల అభయారణ్యం, జెనిత్ అనే జలపాతం చూసి తీరాల్సిన ఆకర్షణలు!
మరికొన్ని: 'బజరంగీ భాయీజాన్' సినిమా షూటింగ్ తరువాత అందాల కాశ్మీర్‌తో నా అనుబంధం బలపడింది. ఇప్పుడు నాకు మళ్ళీ మళ్ళీ వెళ్ళాలనిపించే ప్రదేశం అది. అలాగే విదేశాల్లో దుబాయ్ నగరం కూడా బాగా నచ్చుతుంది. అక్కడ కూడా నాకు సొంత ఇల్లుంది.
ఇదే రుజువు: విమాన ప్రయాణికులకు సేవలందించే ఒక సంస్థకు బ్రాండ్ అంబాసిడర్‌గా కిందటి ఏడాది వరకూ ఉన్నాను. అంతే కాదండోయ్! ఆ సంస్థలో నాకు చిన్న వాటా కూడా ఉంది. పర్యాటక రంగం పట్ల నాకున్న ఆసక్తికి ఇదే రుజువు!!

మన దగ్గరే

పద... పదవే... ఒయ్యారి గాలి పటమా!

ఏమిటి?: మూడవ తెలంగాణ అంతర్జాతీయ పతంగుల పండుగ
ఎక్కడ?: సికిందరాబాద్ పరేడ్ గ్రౌండ్స్
ఎప్పుడు?: ఈ నెల 13 నుంచి 15 వరకూ
ప్రత్యేకతలేమిటి?: దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచే కాకుండా దాదాపు ఇరవైకి పైగా దేశాల నుంచి వచ్చి గాలిపటాలు ఎగరేస్తూ ఈ ఉత్సవంలో పాల్గొంటారని అంచనా. ఈ ఏడాది రాత్రి వేళ కూడా పతంగులు ఎగరేసే ఈవెంట్ నిర్వహిస్తున్నారు.
ప్రత్యేక ఆకర్షణలు: కోలాటాలు, గంగిరెద్దులు, డప్పుల దరువులు, హరిదాసులు తదితర కళారూపాలు, జానపద, కూచిపూడి నృత్యాలు, భరతనాట్యం, ఆంధ్రనాట్యం, పేరిణి శివతాండవం లాంటి నృత్యాల ప్రదర్శనలు.



ఈ సీజనంతా స్వీటే!

ఏమిటి?: అంతర్జాతీయ మిఠాయిల పండుగ
ఎక్కడ?: సికిందరాబాద్ పరేడ్ గ్రౌండ్స్
ఎప్పుడు?: ఈ నెల 13 నుంచి 15 వరకూ
ప్రత్యేకతలేమిటి?: ఇటువంటి ఉత్సవం దేశంలో ఇదే మొదటిసారి. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ప్రాంతాల స్వీట్స్‌తోపాటు హైదరాబాద్‌లో నివసిస్తున్న వివిధ రాష్ట్రాల ప్రజల సంఘాల వారు తమ తమ ప్రాంతాలకు చెందిన మిఠాయిలను ఈ సందర్భంగా ప్రదర్శించనున్నారు. వెయ్యికి పైగా రకాలు ప్రదర్శనలో చోటు చేసుకుంటాయని అంచనా. వీటి విక్రయాల కోసం స్టాల్స్ ఏర్పాటు చేస్తున్నారు. ఈ ఉత్సవానికి తెచ్చే మిఠాయిలన్నీ ఇళ్ళ దగ్గరే తయారు చెయ్యాలన్నది నిబంధన.



కౌన్సెలింగ్

మందులు వేస్తున్నా మార్పులేదేమిటి?

మా బాబుకు 12 ఏళ్లు. దాదాపు నెల రోజులుగా, జలుబు, దగ్గు, ఆయాసంతో బాధపడుతున్నాడు. దీనికి తోడు 10 రోజులుగా మెడ నొప్పి, ఒంటి నొప్పులు, వాంతులు మొదలయ్యాయి. అప్పుడప్పుడు మూర్ఛలు కూడా వస్తున్నాయి. స్థానిక డాక్టర్ సూచించిన మందులేవో ఇస్తున్నాం. కానీ, పెద్ద మార్పేమీ కనిపించడం లేదు, బాబుకు ఉన్న అసలు సమస్య ఏమిటి? జబ్బు నుంచి పూర్తిగా బయటపడే మార్గం చెప్పండి.

- పి. వాసంతి, హిమాయత్ నగర్

నవ్య సకల

ఎవరికైనా పైపైన లక్షణాలకే చికిత్స చేస్తే వ్యాధి సమూలంగా తొలగిపోయే అవకాశం లేదు. మీరు రాసిన వివరాలను బట్టి మీ బాబుకు న్యూమోనియాతోపాటు బ్రెయిన్ ఇన్‌ఫెక్షన్ ఉన్నట్లు అనుమానం కలుగుతోంది. అయితే, ప్రస్తుతం మీ అబ్బాయి బాగా నీరసించి ఉన్నాడా? హుషారుగానే ఉన్నాడా? ఏమైనా తింటున్నాడా? లేదా? లూజ్ మోషన్ అవుతున్నాయా? ఆ వివరాలేమీ మీరు రాయలేదు. మీ కుటుంబీకుల్లో ఎవరికైనా మూర్ఛవ్యాధి గానీ, ఆస్తమా వ్యాధి గానీ ఉందా? ఆ వివరాలు కూడా వ్యాధినిర్ధారణకు అవసరమే. అంతకన్నా ముందు అతని గొంతు, ఛాతీ ఎలా ఉన్నాయో క్లినికల్‌గా పరీక్షించాలి. ప్రస్తుతానికి బాబుకు ఉన్న లక్షణాల ఆధారంగా వైద్య చికిత్సలు అందించాలి. అవసరమైతే అందుకు సంబంధించిన యాంటీ బయాటిక్స్ కూడా ఇవ్వాలి. ఈ మందులు ఇచ్చిన రెండు మూడు రోజుల్లో సమస్య అదుపులోకి రాకపోతే, సి.బి.పితో పాటు మలేరియా, డెంగ్యూ పరీక్షలు చేయించాలి. దగ్గు మరీ ఎక్కువగా ఉంటే ఛాతీ ఎక్స్‌రే చేయించాలి. మూత్ర పరీక్షలు కూడా అవసరమే. సాధారణ చికిత్సల తర్వాత కూడా జ్వరం, వాంతులు తగ్గకపోగా మెడ బిగుసుకుపోతున్నట్లుగా ఉంటే, ఆర్టరీ బ్లడ్ పరీక్షలు, సెరబ్రో స్పైనల్ ఫ్లూయిడ్ పరీక్షలు తప్పనిసరి. ఆ రిపోర్టుల ఆధారంగా వైద్య చికిత్సలు చేస్తే బాబు ఆరోగ్యం పూర్తిస్థాయిలో చక్కబడుతుంది.

● డాక్టర్ పి. వి సాయిప్రసాద రావు,
కన్సల్టెంట్ పీడియాట్రిషియన్, హైదరాబాద్

మీకు మీరే డాక్టర్

కీళ్ల వాతానికి పల్లేరు వైద్యం!



- పల్లేరు ఆకులను ఆముదంతో వెచ్చచేసి కడితే గడ్డలు హరించుకుపోతాయి.
- పల్లేరు కాయలు,. నువ్వు చెట్టుపూలు, తేనె, నేయి సమపాళ్లల్లో తీసుకుని ముద్దగా నూరి తలకు పట్టిస్తే, పేను కొరుకుడు వల్ల రాలిపోయిన వెంట్రుకలు తిరిగి మొలుస్తాయి.
- 10 గ్రాముల శొంఠి, 10 గ్రాముల పల్లేరు కాయలను దంచి, ఒక గ్లాసు నీటిలోవేసి, పావు గ్లాసు మిగిలేదాకా కాచి వడబోసి, గోరు వెచ్చగా ఉన్నప్పుడే ప్రతిరోజూ పరగడుపున, కొద్దికాలం నిరంతరం తాగితే వాపుతో కూడిన కీళ్ల వాతం, నడుము నొప్పి తగ్గుతాయి.
- 10 గ్రాముల పల్లేరు కాయల చూర్ణాన్ని, ఆవుపాలతో కలిపి ప్రతి రోజూ తాగుతూ ఉంటే లైంగిక శక్తి పెరుగుతుంది.
- మొత్తం పల్లేరు మొక్కను కషాయంగా కాచి 30 మి. లీ చొప్పున రోజుకు 2 సార్లు సేవిస్తే గుండెకు బలం చేకూరుతుంది.
- 30 గ్రాముల పల్లేరు కాయల చూర్ణాన్ని, పావు లీటరు పాలలో వేసి 1 లీటరు నీళ్లు కలిపి పాలు మాత్రమే మిగులు వరకు కాచి వడగట్టి అందులో చక్కెర కలిపి కొద్ది రోజుల పాటు తీసుకకుంటే మూత్రనాళంలోని మంట, చురుకు, పోటు తగ్గుతాయి.

అధ్యయనం

నిదానంగా తింటే ఎంతో మేలు!!

"మీకు వేగంగా తినే అలవాటు ఉంటే, వెంటనే మానేసి నిదానంగా తినడం అలవర్చుకోండి" అంటున్నారు, జపాన్ పరిశోధకులు. ఇటీవల జరిగిన ' అమెరికన్ హార్ట్ అసోసియేషన్ సైంటిఫిక్ సెషన్స్' లో ఈ పరిశోధకులు తమ అధ్యయన వివరాలు వెల్లడించారు. ప్రధానంగా, వేగంగా తినే వారిలో కొందరు, శరీర జీవక్రియలు అస్తవ్యస్తమయ్యే ' మెటబాలిక్ సిండ్రోమ్' వ్యాధికి గురయ్యే అవకాశాలు ఉంటాయని వారు తమ అధ్యయన పత్రాల్లో పేర్కొన్నారు. ఇదొక్కటే కాదు మరెన్నో వ్యాధులు వీరి ఆరోగ్యాన్ని దెబ్బ తీసే ప్రమాదం ఉందని కూడా వీరు హెచ్చరిస్తున్నారు. ముఖ్యంగా, వీరిలో ట్రైగ్లిసరైడ్స్ పెరిగిపోవడంతో పాటు, రక్తపోటు, రక్తంలో గ్లూకోజ్ నిలువలు పెరగడంతో పాటు మంచి కొలెస్ట్రాల్ (హెచ్‌డిఎల్) నిలువలు తగ్గిపోతాయని వారు వివరిస్తున్నారు. ఈ పరిణామాల వల్ల మధుమేహం రావడంతో పాటు గుండె జబ్బులకూ, పక్షవాతానికీ గురయ్యే పరిస్థితులు ఏర్పడతాయని వారంటున్నారు. నిదానంగా తినే వారితో పోలిస్తే, వేగంగా తినే వారిలో మెటబాలిక్ సిండ్రోమ్ వచ్చే అవకాశాలు రెట్టింపుగా ఉంటున్నట్లు వారు తమ అధ్యయనంలో కనుగొన్నారు. వేగంగా తినేవారికి కడుపు నిండిన తృప్తి కలగకపోవడం వల్ల ఎక్కువగా తినేస్తారని, ఇది వారు స్థూలకాయులు కావడానికి కారణమవుతుందని చెబుతున్నారు. అయితే అతిగా తినే ఈ అలవాటు వల్ల గ్లూకోజ్ నిలువలు తరుచూ హెచ్చు తగ్గులవుతూ అంతిమంగా ఇది శరీరంలో ఉత్పన్నమయ్యే ఇన్సులిన్ నిరుపయోగమయ్యే ' ఇన్సులిన్ రెసిస్టెన్స్' సమస్యకు దారి తీసే ప్రమాదం ఉందని వారు తమ అధ్యయనంలో వివరించారు.

వావ్!

మీ ఐస్‌క్రీమ్ 'బంగారం'గానూ!

ఐస్‌క్రీమ్ గుర్తుకురాగానే నోరూరిపోవడం ఖాయం. ప్రతి ప్రాంతంలోనూ రకరకాల ఐస్‌క్రీమ్ ఫ్లేవర్లు ఉంటాయి. ఏ దేశానికి వెళ్లినా ఏదో కొత్త రకం ఫ్లేవర్‌ను మాత్రం టచ్ చేయకుండా ఐస్‌క్రీమ్ ప్రియులు ఊరుకోరు. అలాంటి వాళ్లు

దుబాయ్ వెళ్లి ఒక్కసారి 'బ్లాక్‌డైమండ్ ఐస్‌క్రీమ్' రుచి చూడాల్సిందే.' ఏముంది సింపుల్ కదా! అంత దూరం వెళ్లినవారికి ఐస్‌క్రీమ్ ఓ లెక్కా!' అని మీరు అనుకోవచ్చు. అసలు సంగతి తెలిస్తే, ఆశ్చర్యపోవాల్సిందే. ఎందుకంటే, దీని ధర అక్షరాలా రూ. 52,300. 'అమ్మో! అంత ధరా? అందులో అంత స్పెషాలిటీ ఏంటబ్బా?' అని అనుకుంటున్నారా? ఈ ఐస్‌క్రీమ్‌ను అత్యంత ఖరీదైన ఇరానీ వెనీలా ఫ్లేవర్‌తో తయారు చేసి, 23 క్యారెట్ల గోల్డెన్ పౌడర్‌తో అలంకరిస్తారు. మీరు ఆర్డర్ చేస్తే అప్పటికప్పుడు తయారు చేసి, మీ ముందు ఉంచుతారు. ఇక, బంగారంతో తయారు చేసిన ఓ బౌల్‌లో, వెండి స్పూన్‌తో ఈ ఐస్‌క్రీమ్‌ను హాయిగా తినొచ్చు. వీలైతే, దుబాయ్ వెళ్లినప్పుడు ఒక్కసారి ట్రై చేయండి!



డైలీ సుడోకు - 75

3		4						7
	7				4			
6				7			2	
		5	2			1		
2		3		9		7		5
		9			8	4		
	9			3				1
			8				7	
1						5		6


ఎలా పూరించాలి?
ప్రతి బాక్స్‌లోనూ 9 గళ్లు ఉంటాయి.
నిలువుగానూ, అడ్డంగానూ ప్రతీ లైనులోనూ 1 నుంచి 9 వరకు అంకెలను పూరించాలి.
ఒకసారి పూరించిన అంకెను తిరిగి వాడకూడదు.

సుడోకు- 74 సమాధానం

[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]
[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]
[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]
[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]
[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]
[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]
[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]
[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]
[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]

పేరెంటింగ్

పసిపిల్లల ముందు అంతేసి శబ్దాలా!



ఒక్కోసారి గొంతు పెంచి మాట్లాడుతూ, ఆగ్రహంతో అరుస్తూ మన మానాన మనం వ్యవహరిస్తూ ఉంటాం. మరికొన్నిసార్లు వాల్యూమ్ బాగా పెంచేసి మ్యూజిక్ వింటూ ఉంటాం. కానీ, మన పక్కనో, తొట్టెల్లోనో ఉన్న పసిపిల్లల గురించి అసలు పట్టించుకోం. ఎక్కువ వాల్యూమ్‌తో వచ్చే శబ్దాలు పసిపిల్లల్ని తీవ్రమైన ఒత్తిడికి గురిచేస్తాయనే వాస్తవాన్ని చాలా సార్లు మరిచిపోతుంటాం. అలా పెద్దగా శబ్దాలు వచ్చినప్పుడు పిల్లలు హఠాత్తుగా ఏడుపు లంఘిస్తారు. ఆ స్థితిలో శ్వాస బిగబట్టినట్లయి వారి గుండె వేగంలో కూడా తేడా వస్తుంది. కొద్ది రోజుల క్రితమే పుట్టిన పిల్లల్లో అయితే మరికొన్ని పరిణామాలు చోటు చేసుకునే అవకాశం ఉంది. అయితే ఆ ఏడుపు వెనుక మరేదో కారణం ఉందనుకుని వేరే విధానాల్లో సముదాయించాలని చూస్తారు. అప్పటికీ వారు ఏడుపు మానుకోకపోతే తలిదండ్రులు మరింత చిరాకు పడతారు. మరికొంత మంద కొట్టడానికి కూడా వెనుకాడరు. కొంత మంది పిల్లలు హఠాత్తుగా వచ్చిన పెద్ద శబ్దానికి ఏడవకుండా దిగ్భ్రాంతికి గురై నిశ్శబ్దంగా ఉండిపోతారు. పిల్లలు అరవకుండా, ఏడవకుండా అలా ఉండిపోతే తల్లిదండ్రులు కుదురుగా తమ పనుల్లో తాము మునిగిపోతారే తప్ప పిల్లలు షాక్ గురయ్యారనే నిజాన్ని గుర్తించలేరు. మామూలుగా అయితే అల్లరి చేసే స్వభావంగల పిల్లలు హఠాత్తుగా అలా మౌనం వహించడాన్ని తలిదండ్రులు అనుమానిస్తే మంచిది. వెంటనే ఫ్యామిలీ ఫిజిషియన్‌ను సంప్రదించడం మరీ మంచిది. పిల్లలకు మ్యూజికల్ టాయ్స్ తెచ్చేటప్పుడు కూడా చాలా మృదువైన రాగం వచ్చేవి మాత్రమే ఎంచుకోవాలి. కాలక్రమంలో పిల్లలు ఒకవేళ పెద్ద శబ్దాలకు అలవాటు పడినా ఆ తర్వాత పిన్న వయసులోనే వారికి వినికిడి సమస్యలు తలెత్తే ప్రమాదం ఉంది. కొంత మంది పిల్లలు పెద్ద శబ్దాలు వచ్చినప్పుడు ఏడ్వకపోయినా మాటిమాటికీ కళ్లు మూసుకుంటూ ఉంటారు. ఆ లక్షణం ఆధారంగానైనా పిల్లలు పడుతున్న బాధేమిటో తలిదండ్రులు అర్థం చేసుకోవడం అవసరం. అందుకు భిన్నంగా అవసరమైన జాగ్రత్తలు తీసుకోవడం పిల్లలకు ఎంతో శ్రేయస్కరం.

తెలుగులో ప్రభాసే!


అనుష్క

మాయా లేదు... మంత్రం లేదు... అనుష్క నిజంగానే సన్నబడ్డారట! 'భాగమతి' ట్రైలర్ చూశారా? అందులో అనుష్క అంతకు ముందు కంటే సన్నగా కనిపించారు కదా! ఆ లుక్ వెనుక జిమ్మిక్కులు, గిమ్మిక్కులు లేవట. సీరియస్‌గా బరువు తగ్గానని స్వీటీ అలియాస్ అనుష్క చెప్పుకొస్తున్నారు. సినిమాల్లోని పాత్రల కోసం బరువు పెరగడానికి, తగ్గడానికి ఆమెకు స్ఫూర్తి ఎవరో తెలుసా? తెలుగులో ప్రభాస్, తమిళంలో విక్రమ్, మలయాళంలో మోహన్‌లాల్, హిందీలో ఆమిర్‌ఖాన్. 'బాహుబలి' కోసం ప్రభాస్ ఎంత కష్టపడ్డారో ప్రేక్షకులందరికీ తెలుసు. ఇక, 'అపరిచితుడు', 'ఐ' సినిమాల్లో విక్రమ్ కష్టాన్ని కళ్లారా చూశారు. హిందీలో ఆమిర్ కూడా అంతే. 'గజిని', 'దంగల్' సినిమాల కోసం బాడీని బాగా కష్టపెట్టేశారు. మోహన్‌లాల్ విషయానికి వస్తే... 56 ఏళ్ళ వయసులో 'ఒడియన్' సినిమా కోసం పడిన కష్టం, బరువు తగ్గిన తీరు సూపరంతే. "మోహన్‌లాల్‌గారు అమేజింగ్. 56 ఏళ్ళ వయసులో యువ హీరోలు చేసే రిస్కులు చేశారు. ఆయన్ను చూసి నేనెంతో ఇన్‌స్పైర్ అయ్యాను" అని అనుష్క పేర్కొన్నారు.

పెళ్లికొడుకు జంప్...


సందీప్ కిషన్, అమైరా దస్తూర్

కాసేపటిలో ముహూర్తం పెట్టుకుని పెళ్లికొడుకు జంప్! సాధారణంగా ఇటువంటి సందర్భాలలో అమ్మాయిలను ప్రేమించిన అబ్బాయిలు తీసుకుపోతారు కదా! జస్ట్... ఫర్ ఏ ఛేంజ్ ఇక్కడ అబ్బాయిని ఓ అమ్మాయి తీసుకెళ్తుంది. అదీ ఎవరో కాదు... మండపంలో అతడి చేత మూడుముళ్లు వేయించుకోబోయే అమ్మాయే! పెళ్లికొడుకు, పెళ్లికూతురు కలిసి ఎక్కడికి వెళ్లారు? అసలు, ఎందుకు లేచిపోయారు? తర్వాత ఏం జరిగింది? అనే కథతో రూపొందుతున్న చిత్రం 'మనసుకు నచ్చింది'. సందీప్ కిషన్, అమైరా దస్తూర్ జంటగా సంజయ్ స్వరూప్, పి. కిరణ్ నిర్మిస్తోన్న చిత్రమిది. ప్రముఖ నటుడు కృష్ణ తనయ, హీరో మహేశ్‌బాబు సోదరి మంజుల ఘట్టమనేని దర్శకురాలిగా పరిచయం అవుతున్న ఈ సినిమా ట్రైలర్‌ను మంగళవారం మహేశ్ విడుదల చేశారు. "ఇదొక రొమాంటిక్ డ్రామా. ఇటీవల విడుదలైన ట్రైలర్‌కి మంచి స్పందన లభిస్తోంది. ఈ నెల 26న చిత్రాన్ని విడుదల చేయాలనుకుంటున్నాం" అన్నారు నిర్మాతలు. త్రిధా చౌదరి, ప్రియదర్శి, పునర్నవి భూపాలం, నాజర్, అరుణ్ అదిత్ తదితరులు నటించిన ఈ చిత్రానికి మాటలు: సాయిమాధవ్ బుర్రా, సంగీతం: రధన్.

యాపిల్ బ్యూటీ టిప్స్!


సమంత

అమ్మాయిలందరికీ ఓ చిట్కా! మహిళలకు కూడా! నలుగురిలో మీ ముఖం మిలమిల మెరిసిపోవాలనుకుంటున్నారా? అందరిలో మీ అందమే హైలైట్ కావాలనుకుంటున్నారా? అయితే ఓ పని చేయండి! 'యాపిల్ సిడర్ వెనిగర్' బాటిల్ కొనుక్కుని ఇంటికి తెచ్చుకోండి. తర్వాత ఏం చేయాలి? అంటే... నెట్టింట్లోకి వెళ్లండి. గూగుల్‌లోని ప్రతి గల్లీలో బోల్డన్ని రెసిపీలున్నాయి. ముఖ్యంగా పరగడుపున 'యాపిల్ సిడర్ వెనిగర్' తాగితే... ఎంతో ప్రయోజనం ఉంటుందట! ఇంతకీ, ఈ చిట్కా చెప్పిందెవరో తెలుసా? సమంత! యస్... ఆమె బ్యూటీ సీక్రెట్ యాపిల్ సిడర్ వెనిగరే అట! "మిల మిల మెరిసిపోవాలని ఎవరు కోరుకోరు చెప్పండి? అలా మెరిసిపోవాలంటే... పరగడుపున (ప్రతి రోజూ ఉదయం ఖాళీ కడుపుతో) యాపిల్ సిడర్ వెనిగర్ తీసుకోండి. ఇంకా గూగుల్‌లో వెతకండి. ఎన్నో రెసిపీలున్నాయి. వీలైతే ఒకసారి ప్రయత్నించండి" అని సమంత పేర్కొన్నారు. ఇప్పుడు 'వాట్ టు డూ... వాట్ నాట్ టు డూ' అనేది అమ్మాయిల ఛాయిస్. బహుశా... సమంత బ్యూటీ సీక్రెట్ తెలిసే 'జనతా గ్యారేజ్'లో 'దివి నుంచి దిగి వచ్చావా యాపిల్ బ్యూటీ...' పాట రాసినట్టున్నారు రామజోగయ్య శాస్త్రి.



'ఇది జయ మార్క్ ఫిల్మ్' అనిపించుకోవాలని ఉంది!

- జయ.బి



"'వైశాఖం' దర్శకురాలిగా నాకు సంతృప్తినిచ్చింది. అపార్ట్‌మెంట్‌లలోనూ, సొసైటీలోనూ కలిసిన ప్రతి ఒక్కరూ నన్ను అప్రిషియేట్ చేస్తున్నారు. 'సిల్వర్ క్రౌన్' అవార్డునూ తెచ్చిపెట్టింది. కమర్షియల్‌గానూ దాని పరిధి మేరకు... మేం ఆశించినంత విజయాన్ని సాధించింది. ఈ జూన్ నుంచి 'లక్కీ ఫెలో' అనే సినిమాను ప్రారంభించబోతున్నాం. నా దర్శకత్వంలో 'లవ్లీ'ని మించిన చిత్రమవుతుందనే నమ్మకం ఉంది. వరుసగా సినిమాలు చేసి... 'ఇది జయమార్క్ చిత్రం' అని అందరి చేత అనిపించుకున్న తర్వాత సమాజానికి సేవ చేయడానికి వెళ్తాను" అని దర్శకురాలు జయ.బి. అన్నారు. గురువారం ఆమె పుట్టినరోజు. ఈ సందర్భంగా బుధవారం ఆమె విలేకరులతో మాట్లాడారు. "మనలో కొందరికి ఎదురుచూడని విధంగా అదృష్టం తలుపుతడుతుంది. అలాంటివారిని చూసినప్పుడు అరే లక్కీ ఫెలో అని అనుకుంటుంటాం. అలాంటి ఛాన్స్ మా హీరోకి వస్తే అతను దాన్ని సద్వినియోగం చేసుకున్నాడా? లేకపోతే మిస్ యూజ్ చేశాడా? అనేది 'లక్కీ ఫెలో' కథ. సమాజంలో చాలా చిన్న ఇబ్బందులు కొన్నిసార్లు మహిళల్ని అల్లకల్లోలం చేస్తుంటాయి. అలాంటి అంశాలను కూడా ఈ చిత్రంలో స్పృశిస్తాం. సమాజంలో జరిగే ఘోరాలు వేరు, మనసును మెలితిప్పే సూక్ష్మాంశాలు వేరన్న విషయాన్ని గ్రహించాలి. ఇందులో అంతర్లీనంగా సందేశం కూడా ఉంటుంది. హీరోయిన్ పాత్ర కూడా స్ట్రాంగ్‌గా ఉంటుంది. నటీనటుల్ని, సాంకేతిక నిపుణుల్ని త్వరలోనే ప్రకటిస్తాం. ప్రస్తుతం ప్రీ ప్రొడక్షన్ పనులు జరుగుతున్నాయి. 'చంటిగాడు' నుంచి నేను ప్రతి చిత్రంలోనూ వినోదాన్ని కీలకాంశంగానే తెరకెక్కిస్తున్నాను. మంచి ఆర్టిస్టులు దొరికి, కమర్షియల్‌గానూ వర్కవుట్ అవుతుందని అనిపించినప్పుడు సున్నితాంశాలతో చిత్రాలను తెరకెక్కిస్తాను" అని అన్నారు.

స్పేస్‌లో... 'టిక్ టిక్ టిక్'!


అడివి శేష్, లక్ష్మణ్

"ఇండియన్ సినిమాలో తొలి స్పేస్ చిత్రం 'టిక్ టిక్ టిక్'. నాకు ఇష్టమైన హీరో 'జయం' రవిగారు ఇందులో హీరోగా నటించారు. టీజర్ చూస్తుంటే హాలీవుడ్ మూవీ 'గ్రావిటీ'ని తలపిస్తోంది. ఇండియన్ స్క్రీన్ మీద ఇలాంటి సినిమా రావడం గొప్ప విషయం" అని అడివి శేష్ అన్నారు. 'జయం' రవి, నివేదా పెతురాజ్ జంటగా నటించిన 'టిక్ టిక్ టిక్' టీజర్‌ను ఆయన బుధవారం విడుదల చేశారు. చదలవాడ బ్రదర్స్ సమర్పణలో శ్రీ తిరుమల తిరుపతి వెంకటేశ్వర ఫిలిమ్స్ పతాకంపై పద్మావతి చదలవాడ తెలుగులో అందిస్తున్న చిత్రమిది. శక్తి సౌందర్‌రాజన్ దర్శకుడు. లక్ష్మణ్ మాట్లాడుతూ "మా సంస్థలో విడుదలైన 'బిచ్చగాడు', '16' చిత్రాలు ప్రేక్షకుల ఆదరణ పొందాయి. ఇప్పుడు 'టిక్ టిక్ టిక్'ను తెలుగులో విడుదల చేస్తున్నాం. ఇటీవల విడుదల చేసిన మోషన్ పోస్టర్‌కి మంచి స్పందన వచ్చింది. టీజర్ కూడా అద్భుతంగా ఉంది. ఇది మంచి టెక్నికల్ చిత్రమే కాదు, ఎమోషనల్ కంటెంట్ ఉన్న సినిమా. తొలి ఇండియన్ స్పేస్ చిత్రాన్ని తెలుగు ప్రేక్షకులకు మేం అందిస్తున్నందుకు గర్వంగా ఉంది. వి.ఎఫ్.ఎక్స్‌ను ఇలాంటి చిత్రాలకు సమకూర్చడం చాలా కష్టం. అలాంటిది టెక్నీషియన్స్ చాలా గొప్పగా తీర్చిదిద్దారు. ప్రేక్షకులను కొత్త అనుభూతికి లోను చేసే చిత్రమిది. నటీనటులు తెలుగువారికి సుపరిచితులే. త్వరలోనే చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తాం" అని చెప్పారు. ఈ చిత్రానికి మాటలు: రాజేశ్.ఎ.మూర్తి, పాటలు: వెన్నెలకంటి, రాకేందుమౌళి, సంగీతం: డి.ఇమాన్, కెమెరా: వెంకటేశ్.

సంక్రాంతి శుభాకాంక్షలతో... రేపే బ్రహ్మాండమైన విడుదల



దేవి
70 ఎ/సి - ఆర్.టి.సి. క్రాస్ రోడ్స్
11.00,2.15,5.45,9.15
Enjoy 4k Digital Projection & Dolby Atmos Sound System

భ్రమరాంబ - కూకట్‌పల్లి 11.30,2.45,6.30,9.45
సత్యం - అమీర్‌పేట 11.30,2.30,6.30,9.30
కోణార్క్ - దిల్‌సుఖ్‌నగర్ 11.15,2.15,6.15,9.15
ప్రశాంత్ - సికింద్రాబాద్ 11.00,2.00,6.00,9.00

ASIAN 10.10,1.15,4.20,7.25,10.30	PVR ఆర్.కె. కాంప్లెక్స్ - బంజారాహిల్స్	TIVOLI కాంప్లెక్స్ ఎ/సి - సికింద్రాబాద్
CINEPRIDE 11.15,2.15,6.15,9.15	PVR సెంట్రల్ మాల్ - పంజాగుట్ట	Cine Planet మల్టీప్లెక్స్ ఎ/సి - కొంపల్లి
CINEPRIDE శశికళ ఎ/సి - మూసాపేట్	PVR ఫోరం మాల్ - కూకట్‌పల్లి	మీరజ్ శాలిని శివాని - దిల్‌సుఖ్‌నగర్
ASIAN 10.00,1.05,4.10,7.15,10.10	INOX జి.వి.కె. మాల్ - బంజారాహిల్స్	తాళ్లూరి - ఇ.సి.ఐ.ఎల్ క్రాస్ రోడ్
ASIAN 10.10,1.15,4.20,7.25,10.30	INOX ఎం.పి మాల్ - కాచిగూడ	Cinetown 10.45,2.00,5.45,9.00
ASIAN RADHIKA 10.10,1.10,4.15,7.35,10.45	AMEERPET బిగ్‌సినిమాస్ - అమీర్‌పేట్	MULTIPLEX విజయలక్ష్మి - ఎల్.బి.నగర్
ASIAN దిల్‌సుఖ్‌నగర్ - 11.00,2.00,6.00,9.00	SHAMEERPET లియోనియో - శామీర్‌పేట్	ASIAN 10.10,1.15,4.20,7.25,10.30
ASIAN చింతల్ -11.30,2.45,6.30,9.45	Cinépolis మంజీరా మాల్ - కూకట్‌పల్లి	GEETHA ASIAN 10.15,1.20,4.25,7.30,10.35
PRASADS 8.45,8.45,12.15,3.30,6.45,10.10	Cinépolis CCPL ఎ/సి - మల్కాజ్‌గిరి	SVC ప్రతిమ ఎ/సి - కరీంనగర్
PVR ఇన్ ఆర్బిట్‌మాల్ - మాదాపూర్	Cinépolis మంత్రామాల్ - అత్తాపూర్	ఎస్2 సినిమాస్ - వరంగల్

రాఘవేంద్ర కాంప్లెక్స్ - మల్కాజ్‌గిరి 11.15,2.15,6.15,9.15
మెట్రో - బహదూర్‌పుర 11.30,2.30,6.00,9.00
విమల్ - బాలానగర్ 11.15,2.15,6.15,9.15
కుమార్ - కాచిగూడ 11.15,2.15,6.15,9.15
విష్ణు - వనస్థలిపురం 11.15,2.15,6.15,9.15
సంతోష్ - అబిడ్స్ 11.30,2.30,6.15,9.15
శ్రీదేవి - రామచంద్రాపురం 11.15,2.15,6.15,9.15
అంబ - మెహిదీపట్నం 11.30,2.30,6.30,9.30
రంగ 70 - జీడిమెట్ల 11.00,2.00,6.00,9.00
శారద - కాప్రా 11.00,2.00,6.00,9.00
రాజ్యలక్ష్మి - ఉప్పల్ 11.30,2.30,6.30,9.30
లక్ష్మీ కళా మందిర్ - అల్వాల్ 11.30,2.30,6.30,9.30
ఆరాధన - తార్నాక 11.00,2.00,6.00,9.00
సెన్సేషన్ ఇన్సోమ్నియా - ఖైరతాబాద్ 11.00,2.00,6.00,9.00
శ్రీరమణ కాంప్లెక్స్ - అంబర్‌పేట 11.30,2.30,6.30,9.30
శ్రీసాయిపూజ - సూరారం 11.00,2.00,6.00,9.00
SVC మహాలక్ష్మి కాంప్లెక్స్ - కొత్తపేట 11.00,2.00,6.00,9.00
శివరంజని - ఇస్నాపూర్ 11.00,2.00,6.00,9.00
నాగేంద్ర - కర్మన్‌ఘాట్ 12.00,3.00,7.00,10.00
రుక్మిణి - పటాన్‌చెరు 11.00,2.00,6.00,9.00
స్వప్న కాంప్లెక్స్ - కాటేదాన్ 11.00,2.15,5.45,9.00
లక్ష్మి - శంషాబాద్ 11.30,2.30,6.30,9.30

వరంగల్
జెమిని స్క్రీన్ -2 - వరంగల్
విజయ - హన్మకొండ
శాంభవి - కాజీపేట
అరవింద్ కెఎం - నర్సంపేట
ముకుంద్ - మహబూబాబాద్
ఆనంద్ - భూపాలపల్లి
కాకతీయ - పరకాల
స్వర్ణ కెఎం - జనగాం
వెంకటేశ్వర - మరిపెడ
అశ్విని కెఎం - తొర్రూర్

ఖమ్మం
శ్రీనివాస - ఖమ్మం
పరమేశ్వరి - కొత్తగూడెం
శాంతి - పాల్వంచ
విజయ్‌భాస్కర్ - భద్రాచలం
బాలాజి - సత్తుపల్లి
సీతారామ - ఇల్లందు
వెంకటదుర్గ - అశ్వారావుపేట
లక్ష్మీశ్రీనివాస - మధిర
సత్యభాస్కర్ - మణుగూరు

నరసింహ - ఎన్కూర్
బాలాజి - దమ్మపేట
శ్రీదేవి 70 ఎ/సి - చెర్ల

కరీంనగర్
వెంకటేశ్వర - కరీంనగర్
శ్రీనివాస - జగిత్యాల
ఊర్వశి - గోదావరిఖని
నటరాజ్ - సిరిసిల్ల
సాయికృష్ణ - మెట్‌పల్లి
అన్నపూర్ణ - జమ్మికుంట
శ్రీనివాస - పెద్దపల్లి
శివరామకృష్ణ - వేములవాడ
కిన్నెర 70 - కోరుట్ల
నటరాజ్ - హుజూరాబాద్
మహేశ్వరి - రాయికల్

నిజామాబాద్
నటరాజ్ - నిజామాబాద్
దర్శన్ - కామారెడ్డి
బృందావన్ - ఆర్మూర్
శ్రీనివాస - భీంగల్
వెంకటేశ్వర - బాన్సువాడ

మహబూబ్‌నగర్
వెంకటేశ్వర - మహబూబ్‌నగర్
సాయిరాజా - షాద్‌నగర్
వెంకటేశ్వర - వనపర్తి
వెంకటేశ్వర - గద్వాల్
రామకృష్ణ - నాగర్‌కర్నూల్
సత్యలక్ష్మి - అచ్చంపేట
మనోహర్ - నారాయణపేట
శ్రీదేవి - కొత్తకోట
రాఘవేంద్ర - జడ్చర్ల
వెంకటేశ్వర - ఆమనగల్
రాఘవేంద్ర - మక్తల్
సత్యసాయి - కొల్లాపూర్
పార్థసారథి - కల్వకుర్తి
భువనేశ్వరి - ఐజ

నల్గొండ
తిరుమల - నల్గొండ
శ్రీనివాస - మిర్యాలగూడ
సాయికృష్ణ - కోదాడ
కృష్ణప్రియ - కోదాడ
భద్రాద్రి - భువనగిరి
నవ్య - సూర్యాపేట

మనోజ్ - దేవరకొండ
రామకృష్ణ - నకిరేకల్
సాయిబాబా - హుజూర్‌నగర్
అంజిరెడ్డి - చౌటుప్పల్
వెంకటేశ్వర - తిరుమలగిరి

ఆదిలాబాద్
నటరాజ్ - ఆదిలాబాద్
లక్ష్మి - మంచిర్యాల
రామకృష్ణ - బెల్లంపల్లి
తిరుమల - నిర్మల్
కమల 70 - భైంసా
తిరుమల కాంప్లెక్స్ - సిసిసి శ్రీరాంపూర్

మెదక్
సాగర్ డీలక్స్ - మెదక్
మోహన్ - జహీరాబాద్
వెంకటేశ్వర - సిద్దిపేట
సితార - సంగారెడ్డి
శ్రీనివాస - నర్సాపూర్
జ్యోతి - సదాశివపేట
యాదగిరి - గజ్వేల్
వెంకటేశ్వర - నారాయణఖేడ్


సంతోష్ - రామాయంపేట

రంగారెడ్డి
లక్ష్మి 70 - తాండూర్
శైలజ - వికారాబాద్
సాయికృష్ణ - పరిగి
సాయిబాబా - శంకర్‌పల్లి
మణికంఠ - చేవెళ్ల

రాయచూర్
ఎస్ఎన్‌టి - రాయచూర్
సందీప్ - గంగావతి
అమర్ - గంగావతి
మంజునాథ - సింధనూర్
మల్లిఖార్జున - మాన్వి
లక్ష్మీ 70 - కొప్పల్
మారుతి - కుస్తిగి
పదావ్మతి - కర్తగి
హిమాలయ - కుకునూర్
నంది - కనకగిరి
శరణబసవేశ్వర - మస్కి
సంగం - తవర్గేరా

GLOBAL CINEMAS

సంక్రాంతి శుభాకాంక్షలు... నేడే చూడండి SUPER HIT...



సంధ్య
70 ఎంఎం ఎ/సి - ఆర్.టి.సి. క్రాస్ రోడ్స్
11.00,2.00,6.00,9.00

సంధ్య 35 - ఆర్.టి.సి. క్రాస్ రోడ్స్ 11.15,2.15,6.00,9.00 (ఒక్క రోజు మాత్రమే)
దేవి 70 - ఆర్.టి.సి. క్రాస్ రోడ్స్ 11.00,2.15,6.00,9.00
శాంతి 70 - నారాయణగూడ 11.15,2.15,6.00,9.15

SVC మహాలక్ష్మి 70 - కొత్తపేట 11.00,2.00,6.00,9.00
SVC సంగీత - ఆర్సీపురం 11.00,2.00,6.00,9.00
SVC మహాలక్ష్మి 35 - కొత్తపేట 11.00,2.00,6.00,9.00
SVC ఈశ్వర్ - అత్తాపూర్ 11.00,2.00,6.00,9.00

PRASADS 8.45,8.45,8.45,8.45,10.00,12.00,12.15,12.30,12.45,3.15, 3.30,3.45,4.00,4.30,6.30,6.45,7.00,7.15,7.45,9.45,10.15,10.30 బిగ్ స్క్రీన్: 8.45,12.45,3.30,7.00,10.15	Cinépolis మంజీరా మాల్ మల్టీప్లెక్స్ - కూకట్‌పల్లి	ASIAN 10.00,10.15,10.10,10.25,1.05,1.25,1.15,1.30,4.10, 4.30,4.20,4.35,7.15,7.35,7.25,7.40,10.20,10.40,10.30,10.45
PVR ఇన్ ఆర్బిట్‌మాల్ - మాదాపూర్	Cinépolis CCPL ఎ/సి మల్టీప్లెక్స్ - మల్కాజ్‌గిరి	ASIAN RADHIKA 10.00,10.10,10.20,1.15,1.05,1.25,4.20, 4.10,4.30,7.30,7.15,7.35,10.35,10.20,10.45
PVR ఆర్.కె. కాంప్లెక్స్ - బంజారాహిల్స్	Cinépolis మంత్రామాల్ మల్టీప్లెక్స్ - అత్తాపూర్	ASIAN 11.00,10.45,2.15,2.00,6.00,5.45,9.15,9.00
PVR సెంట్రల్ మాల్ - పంజాగుట్ట	TIVOLI 9.30,9.45,10.00,12.40,12.55,1.10,3.50, 4.05,4.20,7.10,7.25,7.40,10.20,10.35,10.50	Cinetown మియాపూర్ - 10.45,11.00,10.45,2.00, 2.15,2.15,5.45,6.00,5.45,9.00,9.15,9.15
PVR ఫోరం మాల్ ఎ/సి - కూకట్‌పల్లి	Cine Planet 9.50,10.05,10.20,1.05,1.15,1.25,1.30,4.10,4.20,4.30, 4.35,7.15,7.25,7.35,7.40,10.20,10.30,10.35,10.40	MULTIPLEX 8.00,10.30,10.45,10.55,1.30,1.45,1.50, 4.30,4.45,4.50,7.30,7.45,7.50,10.30,10.45,10.50
INOX 10.00,10.05,10.10,10.20,10.25,10.30,1.10,1.15, 1.20,1.30,1.40,4.20,4.30,4.50,7.05,7.15,7.30,7.40, 7.45,8.00,10.20,10.30,10.40,10.50,11.00,11.10	మీరజ్ శాలిని శివాని - దిల్‌సుఖ్‌నగర్	ASIAN 11.15,11.30,2.30,2.45,6.00,6.30,9.15,9.45
INOX 9.00,9.10,9.20,9.30,9.50,12.10,12.20,12.30,12.35,3.20, 3.40,3.50,6.30,6.40,6.50,7.00,9.40,9.50,10.00,10.10,10.20	T 11.00,11.15,2.00,2.15,6.00,6.15,9.00,9.15	ASIAN 10.00,10.10,10.20,1.05,1.15,1.25,4.20, 4.10,4.30,7.25,7.15,7.35,10.30,10.20,10.40
AMEERPET బిగ్‌సినిమాస్ మల్టీప్లెక్స్ ఎ/సి - అమీర్‌పేట్	ASIAN 9.55,10.10,10.20,10.30,10.40,1.40,1.35,1.25,1.15, 1.00,4.45,4.40,4.30,4.20,4.05,10.45,10.35,10.25,10.10	GEETHA ASIAN 10.00,10.25,10.15,1.05,1.30,1.20, 4.10,4.35,4.25,7.15,7.40,7.30,10.20,10.40,10.35
SHAMEERPET లియోనియో మల్టీప్లెక్స్ - శామీర్‌పేట్	CINEPRIDE 10.40,10.40,11.00,11.15,2.15,2.15,2.30, 2.45,6.15,6.15,6.30,6.45,9.15,9.15,9.30,9.45	
	ASIAN 10.00,10.10,10.20,1.15,1.05,1.25,4.20, 4.10,4.30,7.25,7.15,7.40,10.30,10.20,10.40	

శ్రీమయూరి - ఆర్టీసీ క్రాస్‌రోడ్స్ 11.00,2.00,6.00,9.00
తారకరామ - కాచిగూడ 11.00,2.00,6.00,9.00
వెంకటరామా - కాచిగూడ 11.15,2.15,6.15,9.15
పద్మావతి - కాచిగూడ 11.30,2.30,6.30,9.30
సాయిరాజా - ముషీరాబాద్ 1130,2.30,6.00,9.00
మంజు - సికింద్రాబాద్ 11.00,2.00,6.00,9.00
మల్లిఖార్జున - కూకట్‌పల్లి 11.30,2.30,6.30,9.30
విశ్వనాథ్ - కూకట్‌పల్లి 11.45,2.45,6.45,9.45
భ్రమరాంభ - కూకట్‌పల్లి 11.00,2.00,6.00,9.00
శివపార్వతి - కూకట్‌పల్లి 11.00,2.00,6.00,9.00
అర్జున్ - కూకట్‌పల్లి 11.30,2.30,6.30,9.30
రాజధాని 70 - దిల్‌సుఖ్‌నగర్ 11.00,2.00,6.00,9.00
రాజధాని డీలక్స్ - 11.00,2.00,6.00,9.00
కోణార్క్ - దిల్‌సుఖ్‌నగర్ 11.00,2.00,6.00,9.00
వెంకటాద్రి - దిల్‌సుఖ్‌నగర్ 11.00,2.00,6.00,9.00
మెగా - దిల్‌సుఖ్‌నగర్ 11.00,2.00,6.00,9.00
అంజలి - సికింద్రాబాద్ 11.00,2.00,6.00,9.00
శ్రీరాములు - మూసాపేట్ 11.00,2.00,6.00,9.00
శ్రీసాయిరాం - మల్కాజ్‌గిరి 11.00,2.00,6.00,9.00
రాఘవేంద్ర 70 - మల్కాజ్‌గిరి 11.15,2.15,6.15,9.15
రాఘవేంద్ర 35 - మల్కాజ్‌గిరి 11.15,2.15,6.15,9.15
రాఘవేంద్ర డీలక్స్ - మల్కాజ్‌గిరి 11.00,2.00,6.00,9.00
SVR శివశక్తి - కాప్రా 11.00,2.00,6.00,9.00
శారదా - కాప్రా 11.00,2.00,6.00,9.00
భుజంగ - జీడిమెట్ల 11.00,2.00,6.00,9.00
రంగ - జీడిమెట్ల 11.00,2.00,6.00,9.00
గోకుల్ - ఎర్రగడ్డ 11.15,2.15,6.15,9.15
శ్రీలక్ష్మి - కర్మన్‌ఘాట్ 12.00,3.00,7.00,10.00
నాగేంద్ర - కర్మన్‌ఘాట్ 12.00,3.00,7.00,10.00
ఇంద్ర - కర్మన్‌ఘాట్ 12.00,3.00,7.00,10.00
శ్రీలత - ఆర్.సి.పురం 11.00,2.00,6.00,9.00
జ్యోతి - ఆర్.సి.పురం 11.00,2.00,6.00,9.00
శ్రీదేవి - ఆర్.సి.పురం 11.15,2.15,6.15,9.15
శ్రీనివాస - ఉప్పల్ 11.15,2.15,6.15,9.15
శ్రీకృష్ణ - ఉప్పల్ 11.15,2.15,6.15,9.15
రాజ్యలక్ష్మి - ఉప్పల్ 11.00,2.00,6.00,9.00
నర్తకి - అల్వాల్ 11.30,2.30,6.30,9.30
లక్ష్మీ కళామందిర్ - అల్వాల్ 11.30,2.30,6.30,9.30
సెన్సేషన్ సన్‌షైన్ - ఖైరతాబాద్ 11.00,2.00,6.00,9.00
సెన్సేషన్ ఇన్‌సోమ్నియా - ఖైరతాబాద్ 11.00,2.00,6.00,9.00

శ్రీరమణ 70 - అంబర్‌పేట్ 11.00,2.00,6.00,9.00
శ్రీరమణ 35 - అంబర్‌పేట్ 11.00,2.00,6.00,9.00
సుష్మ - వనస్థలిపురం 11.00,2.00,6.00,9.00
సంపూర్ణ - వనస్థలిపురం 11.15,2.15,6.15,9.15
విష్ణు - వనస్థలిపురం 11.15,2.15,6.15,9.15
గెలాక్సి - టోలిచౌకి 11.00,2.00,6.00,9.00
వైజయంతి - నాచారం 11.00,2.00,6.00,9.00
సాయిరంగ - మియాపూర్ 11.00,2.00,6.00,9.00
అంబ - మెహిదీపట్నం 11.15,2.15,6.15,9.15
అలంకార్ ప్రతాప్ - లంగర్‌హౌజ్ 11.00,2.00,6.00,9.00
విజేత - బోరబండ 11.00,2.00,6.00,9.00
సత్యం - అమీర్‌పేట్ 11.00,2.00,6.00,9.00
BR హైటెక్ - మాదాపూర్ 11.00,2.00,6.00,9.00
సూపర్ - బాలాపూర్ 11.00,2.00,6.00,9.00
ఆరాధన - తార్నాక 11.00,2.00,6.00,9.00
విమల్ - బాలానగర్ 11.00,2.00,6.00,9.00
కళ్యాణి మూవీమ్యాక్స్ - బోయిన్‌పల్లి 11.00,2.00,6.00,9.00
రామకృష్ణ - అబిడ్స్ 11.30,2.30,6.30,9.30
యాకుత్ మహల్ - యాకుత్‌పుర 12.00,3.00,7.00,10.00
SV సినీస్క్వేర్ - పటాన్‌చెరు 11.00,2.00,6.00,9.00
రుక్మిణి - పటాన్‌చెరు 11.00,2.00,6.00,9.00
శ్రీరామా - బహదూర్‌పుర 11.00,2.00,6.00,9.00
యాదగిరి - సంతోష్‌నగర్ 11.30,2.30,6.00,9.00
శ్రీదేవి - చిలకలగూడ 11.30,2.30,6.30,9.30
ప్రియ - మల్లేపల్లి 1130,2.30,6.30,9.30
శ్రీప్రేమ - తుక్కుగూడ 11.00,2.00,6.00,9.00
కృష్ణ సినిమా - నాగారం 11.00,2.00,6.00,9.00
స్వప్న 70 - కాటేదాన్ 11.00,2.15,5.45,9.00
స్వప్న 35 - కాటేదాన్ 11.00,2.15,5.45,9.00
సంతోష్ - ఇబ్రహీంపట్నం 11.00,2.00,6.00,9.00
జగదాంబ - ఘట్‌కేసర్ 11.00,2.00,6.00,9.00
జ్యోతి - ఐడిఎబొల్లారం 11.00,2.00,6.00,9.00
సెలెక్ట్ - మచ్చబొల్లారం 11.00,2.00,6.00,9.00
కృష్ణ సినిమా - అలియాబాద్ 11.00,2.00,6.00,9.00
విజయలక్ష్మి - మహేశ్వరం 11.00,2.00,6.00,9.00
వెంకటసాయి - కీసర 11.00,2.00,6.00,9.00
గణేష్ - శంషాబాద్ 11.15,2.15,6.15,9.15
లక్ష్మి - శంషాబాద్ 11.30,2.30,6.30,9.30
వెంకటేశ్వర - మేడ్చల్ 11.00,2.00,6.00,9.00

రెండేళ్ల పోరాటం ఫలించింది!



సన్నీ డియోల్ నటించిన 'మోహల్లా అస్సీ' చిత్రానికి ఎట్టకేలకు మోక్షం లభించింది. ఈ సినిమా విడుదల కోసం గత రెండేళ్లుగా చేస్తున్న పోరాటం ఫలించింది. సెన్సార్ బోర్డ్ 'ఏ' సర్టిఫికెట్ ఇవ్వడంతో విడుదలకు మార్గం ఏర్పడింది. డాక్టర్ చంద్రకాంత్ ద్వివేది దర్శకత్వం వహించిన ఈ చిత్రం కాశీనాథ్ సింగ్ రాసిన 'కాశీ కా అస్సీ' హిందీ నవల ఆధారంగా రూపుదిద్దుకొంది. పుణ్యస్థలమైన వారణాశిని ఎలా వ్యాపారంగా మారుస్తున్నారో, విదేశీ టూరిస్టులను ఎలా దోచుకొంటున్నారో వ్యంగ్యంగా ఈ నవలలో వివరించారు రచయిత. 1989-90 మధ్య కాలంలో జరిగినట్లుగా చెప్పే సంఘటనలతో రూపుదిద్దుకొన్న ఈ చిత్రంలో రామజన్మభూమి, మండల్ కమిషన్ వంటి వివాదస్పద అంశాలు కూడా ఉన్నాయి.

ఈ సినిమాలో సన్నీ డియోల్ సంస్కృత టీచర్‌గా నటించారు. ఆయనకు ఇచ్చిన గెటప్ గుర్తు పట్టలేని విధంగా ఉంది. ఆయన భార్యగా సాక్షి తన్వర్ నటించారు. నిజానికి అ చిత్రం జూన్ 30 , 2015న విడుదల కావాల్సి ఉంది. అయితే ఈ సినిమా ట్రైలర్ టీవీల్లో టెలికాస్ట్ కావడం, అది చూసి హిందువుల మనోభావాలు దెబ్బతీసే విధంగా ఈ సినిమా ఉందని ఢిల్లీకి చెందిన గుల్షన్‌కుమార్ అనే వ్యక్తి కోర్టులో కేసు వేయడంతో, కోర్టు ఆ వాదనతో ఏకీభవించి, సినిమా విడుదలపై స్టే ఇచ్చింది. భజరంగ్‌దళ్ అయితే ఏకంగా సినిమాని నిషేధించాలని డిమాండ్ చేసింది. ఆ ట్రైలర్ లీక్ అయిందనీ, దాన్ని సెన్సార్ చేయలేదనీ తమ సినిమాలో అభ్యంతరకర సన్నివేశాలు ఏమీ లేవని దర్శకుడు డాక్టర్ చంద్రప్రకాశ్ ద్వివేది మొత్తుకొన్నా ఫలితం లేకపోయింది. ఈ సినిమాను సెన్సార్ కోసం పంపిస్తే ఎగ్జామినింగ్ కమిటీ, రివైజింగ్ కమిటీ కూడా సర్టిఫికెట్ ఇవ్వడానికి నిరాకరించాయి. ఒక పక్క కోర్టులో తన వాదనలు వినిపిస్తూనే మరో పక్క సెన్సార్‌తో పోరాటం ప్రారంభించారు చంద్రప్రకాశ్. ట్రిబ్యునల్‌కు వెళితే అప్పటి నుంచీ విడుదల కోసం ఆయన పోరాటం చేస్తూనే ఉన్నారు. చివరికి ఆ పోరాటం ఫలించి, సెన్సార్ సర్టిపికెట్ చేతికి వచ్చింది. త్వరలోనే చిత్రాన్ని విడుదల చేస్తామని దర్శకుడు చెప్పారు.